# ఉపనిషత్సర్వస్వము

డా॥ క్రోవి పార్థసారథి



శివకామేశ్వరి గ్రంథమాల

విజయవాడ - 13

# ఉపనిషత్సర్వస్వము

## ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక, కైవల్య ఉపనిషత్తుల వివరణ


గ్రంథకర్త :

కనకాభిషేక గ్రహీత, సువర్ణఘంటాకంకణ, శ్రీవిద్యా నిధి,

చక్రవిద, శ్రీవిద్యా రత్నాకర, శ్రీవిద్యా విశారద,

డా॥ క్రోవి పార్థసారథి



ప్రతులకు :

**శివకామేశ్వరి గ్రంథమాల**

41-22/4-36, భ్రమరాంబాపురం, కృష్ణలంక, విజయవాడ - 13.

ఫోన్ : 0866-522824

# ఉపనిషత్సర్వస్వము

గ్రంథకర్త : **డా॥ క్రోవి పార్థసారథి**
23-11/1-10/2, దేవీ నిలయం,
ఓగిరాలవారి వీధి,
సత్యనారాయణపురం,
విజయవాడ - 520 011.
ఫోన్ : 530672


ప్రథమ ముద్రణ : జనవరి 2001

హక్కులు : క్రోవి మంజూషవి

**వెల : రూ. 75-00**

ప్రతులకు :
**శివకామేశ్వరి గ్రంథమాల**
41-22/4-36, భ్రమరాంబాపురం,
కృష్ణలంక, విజయవాడ - 520 013.
ఫోన్ : 0866 - 522824

ముద్రణ
**నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్**
26-6-3, పాపయ్య వీధి,
గాంధీనగర్, విజయవాడ - 3.
ఫోన్ : 0866 - 574828




గ్రంథకర్త శ్రీ [illegible] సువర్ణ హస్త [illegible]కరిస్తున్న స్వామి 'వాసుదేవానందగిరి'

Phone : 2707 (Tenkasi)

HIS HOLINESS JAGADGURU

**SRI SIVA CHIDANANDA BHARATHI SWAMI**

Sri Siddheswari Peetadhipati

Courtallam - 627 802

(Via) Tenkasi - Tirunelveli Dist. ----- South India

With Narayanasmritis

---

# అభినందన

5-5-1997

దేవీ పూజలో కౌళ, సమయమతములు, శ్రీ చక్రాంతర్గత రహస్యములు.

భిన్న సంప్రదాయములలో పంచదశీమహామంత్రము, షట్చక్రభేదన-

దేవి సాక్షాత్కారము. మొదలైన విషయములు పామరులకు కూడా

అర్థమయ్యేరీతిలో

శ్రీ క్రోవి పార్థ సారధిగారు వ్రాసిన

## "శ్రీ విద్యాదర్శనము"

గ్రంథావిష్కరణ సమయమున వారిని అభినందిస్తూ

కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠ మహా సంస్థానామోదమున గ్రంథకర్తను

## " శ్రీ విద్యారత్నాకర"

అను బిరుదరాజముతో సన్మానించడమయినది.

ఇతి నారాయణస్మృతిః

# గ్రంథకర్త పరిచయం


పేరు : ఖ్రీవి పార్థసారథి

వృత్తి ఉద్యోగం : వాణిజ్యశాస్త్ర ఉపన్యాసకుడు, శాతవాహన కళాశాల, విజయవాడ


**ఇతర గ్రంథాలు :**

1. శ్రీవిద్యా దర్శనము
2. శ్రీవిద్యా దర్పణము (గౌడపాదుల సుభగోదయ స్తుతికి వ్యాఖ్య)
3. శ్రీవిద్యా రహస్యము
4. శ్రీవిద్యా సర్వస్వము
   (పుణ్యానందమునీంద్రుల కామకలా విలాసమునకు వ్యాఖ్య)
5. శ్రీవిద్యా హృదయము
   (యోగినీ హృదయానికి వ్యాఖ్య)
6. శ్రీవిద్యా పంచదశి
   (పంచదశీ మహామంత్రానికి వ్యాఖ్య)
7. శ్రీవిద్యా మహాయంత్రము
   (శ్రీ చక్రానికి విశేష వ్యాఖ్య)
8. దేవీకథాసుధ
9. భావనోపనిషత్తు
10. శ్రీచక్ర సర్వస్వము (ఆవిష్కరణకు సిద్ధము)
11. శ్రీచక్రవైభవము (ఆడియో క్యాసెట్లు)
12. పరమేశ్వరి - పరబ్రహ్మ స్వరూపము (ఆడియో క్యాసెట్లు)

**బిరుదులు :** శ్రీవిద్యా రత్నాకర, శ్రీవిద్యా విశారద, శ్రీవిద్యానిధి, చక్రవిద

**సన్మానాలు :** 1) కనకాభిషేకము 13-12-1999న 'శ్రీవిద్యా మహాయజ్ఞము' ముగింపు మరియు మూడు గ్రంథాల ఆవిష్కరణ సందర్భంగా ఆరుగురు స్వామిజీల సమక్షంలో

2) 1-8-98న సువర్ణఘంటాకంకణ ప్రదానము.

సత్కారములు :

1. శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి దత్తపీఠం, మైసూరు
2. శ్రీశ్రీశ్రీ శివచిదానందభారతీ స్వామి సిద్ధేశ్వరీ పీఠం, కుర్తాళం
3. శ్రీశ్రీశ్రీ చిదానంద భారతీస్వామి భువనేశ్వరీ పీఠం, గన్నవరం.
4. శ్రీశ్రీశ్రీ విద్యానంద నృశింహానంద భారతీస్వామి పుష్పగిరి పీఠం, పుష్పగిరి.
5. శ్రీశ్రీశ్రీ శివకళ్యాణానంద భారతీ మహాస్వామి శృంగేరి శ్రీ విరూపాక్ష పీఠం, గుంటూరు.
6. శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి శారదా పీఠం, చినముషివాడ, విశాఖపట్నం.
7. శ్రీశ్రీశ్రీ భైరవానందస్వామి మహాశాక్తేయ పీఠం, ఎండాడ, విశాఖపట్నం.
8. శ్రీశ్రీశ్రీ వాసుదేవానందగిరి స్వామి, విశ్వబంధు తపోవనం ట్రస్ట్ పెదపులిపాక, విజయవాడ.
9. శ్రీశ్రీశ్రీ మాతా శివచైతన్య చైతన్య తపోవనం ట్రస్ట్, తాడేపల్లి.
10. భగవాన్ బాలసాయి, కర్నూలు
11. విశ్వయోగి విశ్వంజీ మహారాజ్, గుంటూరు

ఇంకా అనేక చోట్ల అనేసార్లు.

# ప్రణతులు

ఇష్టప్రాప్తిని, అనిష్టపరిహారాన్ని సాధించటానికి అలౌకికమైన ఉపాయాన్ని చెప్పేదే వేదము.

వేదము నాలుగు భాగాలుగా ఉంటుంది.

1. సంహితలు, 2. బ్రాహ్మణాలు, 3. అరణ్యకాలు, 4. ఉపనిషత్తులు

వేదాలలో చివరి భాగం కాబట్టే ఉపనిషత్తులను 'వేదాంతము' అన్నారు.

ఉప - సమీపమునందు

ని - దిగువస్థానంలో

షద్ - కూర్చొనుట

గురువుగారి దగ్గర, ఆయనకన్న దిగువస్థానంలో కూర్చుని వారిచ్చే బ్రహ్మోపదేశాన్ని శ్రద్ధగా వినటం.

ఉపనిషత్తు అంటే బ్రహ్మవిద్య బ్రహ్మవిద్యా పరిశీలకులైన విద్వాంసులకు కర్మ, జన్మ లేకుండా చేసేది. ఆజన్మాది మరణాదికమైన దానిని నశింపచేసి, బ్రహ్మ పదార్థ లాభం కలుగచేసేది.

వేదాలలోని ఉపాసన, జ్ఞానకాండలనే ఉపనిషత్తు అంటారు. ఉపనిషత్తులన్నీ గురుశిష్య సంవాదంగానే ఉంటాయి. ప్రతి ఉపనిషత్తులోనూ ఒక గురువు తనశిష్యుల సందేహాలు తీర్చి వారికి బ్రహ్మోపదేశం చేస్తాడు. అయితే కొన్ని చోట్ల వారిపేర్లు తెలియవు. అందుకనే ఈ గ్రంథంలో ముందుగా రత్నాకరుడు' అనే గురువును నారాయణభట్టు కృష్ణశర్మ అనే ఇద్దరు శిష్యులను ప్రవేశపెట్టి వారి ముఖతఃనే ఈ గ్రంథం పూర్తిగా నడపటం జరిగింది. ఇది గ్రంథ రచనకు వీలుగా, పాఠకుల సౌలభ్యం కోసం చేసిన పని.

శ్రీవిద్యాపరమైన గ్రంథాలు వ్రాస్తున్నప్పుడు కొన్ని సూచనలు అందాయి. "ఉపనిషత్తులు చదవటానికి చాలా కష్టంగా ఉన్నాయి. అందులోని విషయం పూర్తిగా అర్థం కావటంలేదు. వాటిలోని విషయంతోబాటు భాషకూడా కఠినంగానే ఉన్నది. కాబట్టి సామాన్యుడికికూడా అర్థమయ్యేటట్లుగా, ఏ విషయము వదలకుండా, సులభశైలిలో మాకు అందిస్తే బాగుంటుంది." అనేదే ఆ సూచనల సారాంశం. మొత్తం ఉపనిషత్తులను వ్రాయటం కష్టమైన పని కాబట్టి వాటిలో

ముఖ్యమైన పది ఉపనిషత్తులను వ్రాయటం జరిగింది. అది చూసిన కొంతమంది 'కైవల్యోపనిషత్తు'ను కూడా వివరించమని అడగటంతో దాన్ని కూడా వీటితో కలిపి వేయటం జరిగింది. ఈ రకంగా పదకొండు ఉపనిషత్తులు ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి.

ఉపనిషత్తులను గురించి తెలుసుకోవాలంటే స్థూలసూక్ష్మ కారణశరీరాలు, పంచకోశాలవంటి పారిభాషిక పదాలను గురించి తెలుసుకోవటం ముఖ్యం. అందుచేతనే గ్రంథారంభంలో వాటిని గురించి వివరించటం జరిగింది.

శాస్త్రాధ్యయనంవల్ల, యోగసాధనవల్ల, కర్మానుష్ఠానంవల్ల ముక్తి లభించదు. చరాచర జగత్తంతా పరబ్రహ్మస్వరూపమే. ఆ పరమేశ్వరుడు నాలోనే ఉన్నాడు. "అహంబ్రహ్మాస్మి". అనే జ్ఞానసముపార్జన చేసినవాడే ముక్తికి అర్హుడు. ఐహికమైన భోగాలను వదలిపెట్టి, అరిషడ్వర్గాలను జయించి, నేను నాది అనే అహంకార మమకారాలను వీడి, సర్వం బ్రహ్మమయం అని మనసా వాచా కర్మణా నమ్మినవాడే సాయుజ్యం పొందగలుగుతాడు. ఈ గ్రంథపఠనంవల్ల మోక్షం రాదు. కాని సాధకులకు ముక్తి మార్గం చూపటానికి ఉపకరిస్తుందని భావిస్తూ .....

ఎందరో మహానుభావులు, పండితులు ఉన్నప్పటికీ, అంతగా పరిజ్ఞానం లేని నేను ఈ గ్రంథరచనకు చేసిన సాహసాన్ని మన్నించి నన్ను ఆశీర్వదిస్తారని భావిస్తూ ....

ఈ గ్రంథానికి శ్రీముఖము పంపిన దక్షిణామ్నాయ శ్రీశృంగేరి శారదా పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శంకరాచార్యులవారికి శతసహస్ర ప్రణామాలర్పిస్తూ .....

గ్రంథరచనకు నన్ను అన్ని విధాల ప్రోత్సహించిన నా భార్య 'రమాదేవి'కి కృతజ్ఞతలు తెలియజేస్తూ ....

గతంలోలాగానే ఈ గ్రంథాన్ని కూడా ఆదరిస్తారని భావిస్తూ ....

పూజ్యులు, జ్ఞానులు, పెద్దలు, పండితులు అందరికీ వినమ్రుడనై నమస్కరిస్తూ ....

విక్రమనామ సంవత్సర పుష్యశుద్ధ<br>ఏకాదశి (ముక్కోటి ఏకాదశి)<br>శనివారం 6-1-2001

బుధజనవిధేయుడు<br>**క్రోవి పార్థసారథి**

## Sri Sri Jagadguru Shankaracharya Mahasamsthanam
## Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri

Sahitya Mahopadhyaya
Dr. N S. Dakshina Murthy
M.A. (Hindi), M.A. (Sanskrit), Ph.D.
Personal Assistant to His Holiness
Sri Jagadguru Shankaracharya Mahasannidhanam

SRINGERI
Ref : D-1/9172
Date : 13/11/2000

శ్రీ క్రోవి పార్థసారథి గారికి,

మీరు ౨౩-౧౦-౨౦౦౦న వ్రాసిన పత్రము, దానితో పంపిన **ఉపనిషత్సర్వస్వము** అను గ్రంథము అందినది. శ్రీచరణుల సన్నిధిన సమర్పించితిని.

సరళ శైలిలో మీరు వ్రాసిన దశోపనిషత్తుల సారము ఈ గ్రంథము. దీనిని చూచి శ్రీచరణులు సంతసించినారు.

శ్రీ శారదా చంద్రమౌళీశ్వరుల అనుగ్రహమువలన మీ ప్రయత్నము సఫలమగుగాకయనియు మీకు, మీ కుటుంబ సభ్యులకు దీర్ఘాయురారోగ్యాది సకల శ్రేయస్సులు లభించుగాక యనియు శ్రీచరణులు ఆశీర్వదించినారు.

ఇట్లు

Encl : Prasadams

To

**SRI KROVI PARTHASARATHI**
23-11/1-10/2, Devi Nilayam,
Ogiralavari Street,
Satyanarayanapuram,
VIJAYAWADA - 11. (A.P.)

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | గురుశిష్యులు | 1 |
| 2. | సాధన చతుష్టయము | 3 |
| 3. | పంచకోశాలు | 6 |
| 4. | వేదాలు | 11 |
| 5. | ఉపనిషత్తులు | 16 |
| 6. | జీవాత్మ - పరమాత్మల ఏకీభావము (మాండూక్యోపనిషత్తు) | 19 |
| 7. | ఈశ్వరవచనము (ఈశావాశ్యోపనిషత్తు) | 24 |
| 8. | ఆత్మ చైతన్యము (కేనోపనిషత్తు-1) | 28 |
| 9. | ఉమాదేవి (కేనోపనిషత్తు - 2) | 30 |
| 10. | ప్రాణికోటి పుట్టుక (ప్రశ్నోపనిషత్తు, ప్రశ్న-1) | 33 |
| 11. | దేవతలెందరు ? (ప్రశ్నోపనిషత్తు, ప్రశ్న - 2) | 36 |
| 12. | ప్రాణం ఎక్కడ నుండి పుట్టింది ? (పశ్నోపనిషత్తు, ప్రశ్న - 3) | 38 |
| 13. | కలలు కనేదెవరు ? (పశ్నోపనిషత్తు, ప్రశ్న - 4) | 40 |
| 14. | ఓంకార ధ్యానము (పశ్నోపనిషత్తు, ప్రశ్న - 5) | 42 |
| 15. | షోడశకళా ప్రపూర్ణుడు (పశ్నోపనిషత్తు, ప్రశ్న, - 6) | 44 |
| 16. | నాచికేతాగ్నిచయనము (కఠోపనిషత్తు - 1) | 46 |
| 17. | నచికేతుడు (కఠోపనిషత్తు - 2) | 49 |
| 18. | సృష్టి (ఐతరేయోపనిషత్తు - 1) | 53 |
| 19. | ప్రజ్ఞానం బ్రహ్మ (ఐతరేయోపనిషత్తు - 2) | 56 |
| 20. | శిక్షావల్లి (తైత్తిరీయోపనిషత్తు - 1) | 58 |
| 21. | ఆనందవల్లి (తైత్తిరీయోపనిషత్తు - 2) | 68 |
| 22. | భృగువల్లి (తైత్తిరీయోపనిషత్తు - 3) | 75 |
| 23. | పరా - అపరావిద్యలు (ముండకోపనిషత్తు - 1) | 77 |

24. రజ్జుసర్ప భ్రాంతి (ముండకోపనిషత్తు - 2) 81
25. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు కూడా బ్రహ్మమే (ముండకోపనిషత్తు - 3) 84
26. ఓంకారోపాసన (ఛాందోగ్యోపనిషత్తు - 1) 86
27. ముగ్గురు మిత్రులు (ఛాందోగ్యోపనిషత్తు - 2) 91
28. ఉషస్తి (ఛాందోగ్యోపనిషత్తు - 3) 93
29. పంచవిధ సామోపాసన (ఛాందోగ్యోపనిషత్తు - 4) 96
30. సప్తవిధ సామోపాసన (ఛాందోగ్యోపనిషత్తు - 5) 99
31. మధువిద్య (ఛాందోగ్యోపనిషత్తు - 6) 101
32. గాయత్రిద్వారా బ్రహ్మోపాసన (ఛాందోగ్యోపనిషత్తు - 7) 104
33. శాండిల్యవిద్య (ఛాందోగ్యోపనిషత్తు - 8) 106
34. జానశ్రుతి - రైక్వుల గాథ (ఛాందోగ్యోపనిషత్తు - 9) 109
35. బ్రహ్మచారి (ఛాందోగ్యోపనిషత్తు - 10) 113
36. సత్యకామ జాబాలి (ఛాందోగ్యోపనిషత్తు - 11) 115
37. ఉపకోశలుడు (ఛాందోగ్యోపనిషత్తు - 12) 118
38. ఎవరు గొప్ప ? (ఛాందోగ్యోపనిషత్తు - 13) 121
39. పంచాగ్ని విద్య (ఛాందోగ్యోపనిషత్తు - 14) 124
40. వైశ్వానరాత్మ (ఛాందోగ్యోపనిషత్తు - 15) 128
41. ఆత్మజ్ఞానం (ఛాందోగ్యోపనిషత్తు - 16) 132
42. షోడశకళా ప్రపూర్ణుడు (ఛాందోగ్యోపనిషత్తు - 17) 137
43. సుషుప్తి (ఛాందోగ్యోపనిషత్తు - 18) 139
44. భూమావిద్య (ఛాందోగ్యోపనిషత్తు - 19) 140
45. హృత్పద్మం (ఛాందోగ్యోపనిషత్తు - 20) 145
46. ప్రజాపతి (ఛాందోగ్యోపనిషత్తు - 21) 147
47. అశ్వమేధము (బృహదారణ్యకోపనిషత్తు - 1) 151
48. ముఖ్యప్రాణోపాసన (బృహదారణ్యకోపనిషత్తు - 2) 156

| | | |
|---|---|---|
| 49. | హిరణ్య గర్భోపాసన (బృహదారణ్యకోపనిషత్తు - 3) | 159 |
| 50. | ఏడు విధాల అన్నాలు (బృహదారణ్యకోపనిషత్తు - 4) | 163 |
| 51. | బాలాకి (బృహదారణ్యకోపనిషత్తు - 5) | 166 |
| 52. | ప్రాణం (బృహదారణ్యకోపనిషత్తు - 6) | 169 |
| 53. | మూర్తము - అమూర్తము (బృహదారణ్యకోపనిషత్తు - 7) | 171 |
| 54. | మైత్రేయి (బృహదారణ్యకోపనిషత్తు - 8) | 173 |
| 55. | యాజ్ఞవల్క్యుడు (బృహదారణ్యకోపనిషత్తు - 9) | 178 |
| 56. | ఉభయులూ అభయులు (బృహదారణ్యకోపనిషత్తు - 10) | 194 |
| 57. | వెలుగులకు వెలుగు (బృహదారణ్యకోపనిషత్తు - 11) | 200 |
| 58. | బ్రహ్మవేత్త (బృహదారణ్యకోపనిషత్తు - 12) | 205 |
| 59. | 'థ'గాథ (బృహదారణ్యకోపనిషత్తు - 13) | 210 |
| 60. | బ్రహ్మోపాసన (బృహదారణ్యకోపనిషత్తు - 14) | 212 |
| 61. | గాయత్ర్యోపాసన (బృహదారణ్యకోపనిషత్తు - 15) | 215 |
| 62. | ప్రాణమే శ్రేష్ఠము (బృహదారణ్యకోపనిషత్తు - 16) | 217 |
| 63. | చతురోదుంబరకర్మ (బృహదారణ్యకోపనిషత్తు - 17) | 221 |
| 64. | తండ్రిని మించిన తనయుడు (బృహదారణ్యకోపనిషత్తు - 18) | 224 |
| 65. | కైవల్య ప్రాప్తి (కైవల్యోపనిషత్తు) | 227 |
| 66. | ఫలశృతి | 230 |

ఓం శ్రీ పరమాత్మనే నమః

# ఉపనిషత్సర్వస్వము

## 1. గురుశిష్యులు

కృష్ణానదీ తీరంలో విజయపురి అనే పట్టణం ఉన్నది. ఆ పట్టణంలో రత్నాకరుడనే పండితుడు నివసిస్తున్నాడు. ఒకరోజు సాయంసమయంలో రత్నాకరుడు ఏదో వ్రాసుకుంటున్నాడు. అతను తల ఎత్తేసరికి, ఎదురుగా ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉన్నారు. వెంటనే రత్నాకరుడు వారిని ఎవరు మీరు ? అన్నట్లు చూశాడు. దానికి మొదటి వ్యక్తి.

"ఆర్యా ! నా పేరు నారాయణభట్టు, ఇతని పేరు కృష్ణశర్మ, మీరు శ్రీవిద్యా రత్నాకరులని విని ఒక చిన్న కోరికతో మీ వద్దకు వచ్చాము. మీరు మా యందు దయ ఉంచి మాకు ఉపనిషత్తుల సారాంశము వివరించవలసినదిగా వేడుకుంటున్నాము" అన్నాడు.

'నారాయణ భట్టారకా ! దేశంలో అనేకమంది వేద పండితులున్నారు. వక్తలున్నారు. వేదాంతులున్నారు. వారెవరైనా మీ కోరిక తీర్చవచ్చును కదా ? నా దగ్గరకు రావటమెందుకు?' అన్నాడు రత్నాకరుడు.

"గురువరేణ్యా ! మీరు చెప్పినట్లుగా పండితులు, వేదాంతులు చాలామంది ఉన్నారు. కాని వారంతా వ్యాపార పద్ధతిలో ఉన్నారు. మీరు పరమేశ్వరునిపరంగా ఈ సేవ చేస్తున్నారని విని, మీ దగ్గరకు వచ్చాము. మమ్మల్ని కరుణించండి" అన్నాడు కృష్ణశర్మ.

"నాయనలారా ! ఎవరైనా వచ్చి సందేహ నివృత్తి చెయ్యమన్నప్పుడు, తెలిసికూడా చెప్పకపోవటం మహాపాపం. ఈ కాలంలో ఉపనిషత్తుల గురించి తెలుసుకోవాలనుకునే వారే అరుదు. అందుచేత మీ కోరిక నేను తప్పక తీరుస్తాను. ప్రతిరోజా సాయంత్రం కొంత సేపు ఉపనిషత్తులమీద చర్చిద్దాము. ఇవాల్టికి సెలవు తీసుకుని రేపు రండి" అన్నాడు రత్నాకరుడు. శిష్యులిద్దరు గురువుగారికి పాదాభివందనం చేసి ఆ రోజుకు సెలవు తీసుకున్నారు.

మర్నాడు సాయంత్రం శిష్యులు వచ్చేసరికి ఆశ్రమ ప్రాంగణంలో రావిచెట్టు క్రింద వ్యాఘ్రచర్మం మీద ఆసీనుడై ధ్యానంలో ఉన్నాడు రత్నాకరుడు. శిష్యులు గురువు గారికి పాదాభివందనం చేసి, వారి ఎదురుగా ఉన్న దర్భాసనాలమీద ఆసీనులైనారు. నెమ్మదిగా కళ్ళు తెరిచి శిష్యులను ఆశీర్వదించి గంభీర స్వరంతో ప్రారంభించాడు రత్నాకరుడు.

"నాయనలారా! ఉపనిషత్తుల గురించి తెలుసుకోవాలంటే ముందుగా కొన్ని విషయాలు తెలుసుకోవాలి. వాటిలో ముఖ్యమైనవి ఉపనిషత్తులలో ఎక్కువసార్లు చెప్పే పారిభాషిక పదాలు, ఆ తరువాత వేదాలు, ఉపనిషత్తుల గురించి కొంతవరకైనా తెలుసుకోవాలి. కాబట్టి ఆ విషయాలను ముందుగా మీకు వివరిస్తాను" అంటూ 'సాధన చతుష్టయాన్ని' వివరించటం ప్రారంభించాడు రత్నాకరుడు.



## 2. సాధనచతుష్టయము

జన్మలన్నింటిలోకీ మానవజన్మ దుర్లభమైనది. అందులోనూ బ్రాహ్మణజన్మ మరీ దుర్లభమైనది. బ్రాహ్మణులలో కూడ వైదికధర్మాలు, కర్మలనాచరించటము, పండితుడుగావటము, ఆత్మానాత్మ వివేచనం కలిగి ఉండటము అనేవి పూర్వ జన్మ పుణ్యఫలం వల్లనే కలుగుతాయి.

సృష్టిలోని ఇతర జీవులు పూర్వజన్మ కర్మఫలాన్ని అనుభవించటం తప్ప ఇంకేమీ చెయ్యలేవు. వాటికి వివేకము ఉండదు. ఆలోచనా శక్తి ఉండదు. యుక్తా యుక్త విచక్షణ అసలే ఉండదు. కాబట్టి అవి ధర్మాధర్మాల నాచరించలేవు.

దేవతలు అశరీరులు. వెనుకటి జన్మలో చేసిన పుణ్యఫలంగా వారు దైవత్వమనుభవిస్తారు. వారికి కర్మ చేసే అధికారంగాని, అవకాశంగాని లేవు. మానవులకు తాము చేసిన పాపపుణ్యాలు అనుభవించే అవకాశం ఉన్నది. పుణ్యకర్మలు చేసినవారు ఉత్తమమైన జన్మలెత్తుతారు. పాపకర్మలు చేసిన వారు పశువులు, పక్షులుగా జన్మిస్తారు. ఇంకా నీచమైన పనులు చేసినవారు క్రిమికీటకాలుగా పుట్టి కొద్దికాలానికే మరణించి మళ్ళీ పుడుతూ హేయమైన జన్మ లెత్తుతూ ఉంటారు.

సత్కర్మల ద్వారా తమ పాపాలను పోగొట్టుకోగల శక్తి మానవులకే ఉంది. పుణ్యకార్యాలు చేసి ఉత్తమ గతులు సంపాదించుకోగలరు. అందుకనే పశుపక్ష్యాదులకన్న, చివరకు దేవతలకన్న కూడా మానవ జన్మే ఉత్తమమైనది.

ఈ రకంగా దుర్లభమైన మానవ జన్మను పూర్వ జన్మ పుణ్యం వలన పొంది, శ్రుతి, సిద్ధాంత జ్ఞానం కలిగి కూడా మోక్షం కోసం ప్రయత్నించని వాడు మూర్ఖుడు. ఆత్మ హంతకుడు అనబడతాడు. అయితే మనుష్యత్వము, ముముక్షత్వము, సజ్జనసాంగత్యము అనేవి భగవత్కృపవల్ల మాత్రమే లభ్యమౌతాయి.

ఎన్ని శాస్త్రాలు చదివినా, యజ్ఞయాగాల వంటి కర్మలు ఎన్ని చేసినా, దేవతలను అర్చించినప్పటికి జీవాత్మ పరమాత్మల ఏకత్వం గురించి తెలియకపోతే ఉపయోగం లేదు. అటువంటివాడికి ఎన్ని కల్పాలు గడిచినా మోక్షంరాదు. ధనంవల్ల మోక్షం లభించదు. కర్మవల్ల మోక్షం లభించదు. కర్మల నాచరించటం వల్ల పుణ్యలోకాలు, ఉత్తమ జన్మలు మాత్రమే కలుగుతాయి. కేవలం జ్ఞానమే మోక్షానికి సాధనం.

అందుచేత విద్యాంసుడైనవాడు ఐహిక సుఖాలను వదలిపెట్టి మంచి గురువును శరణుజొచ్చి, ఆయన ఉపదేశించే విషయాలను శ్రద్ధగావింటూ, బ్రహ్మచర్య దీక్షను పాటిస్తూ మోక్షమార్గం కోసం ప్రయత్నించాలి. సద్వస్తువైన ఆత్మను దర్శించటంలో నిమగ్నుడై, యోగియై, సంసార సాగరంలో కొట్టుమిట్టాడుతున్న తన ఆత్మను ఉద్ధరించుకోవాలి.

ఈ విధంగా ఎల్లప్పుడూ ఆత్మదర్శనాభ్యాసతత్పరుడైన విద్వాంసుడు విముక్తి పొందటానికి ప్రయత్నించాలి. కర్మలు బంధహేతువులు. కాబట్టే కర్మ పరిత్యాగం చెయ్యాలి. కర్మలవల్ల చిత్తశుద్ధి జరుగుతుంది. అంతేతప్ప జ్ఞానంరాదు. కోట్లకొద్దీ కర్మలు చేసినా ప్రయోజనం ఏమీ ఉండదు. గురువు చేసిన హితబోధ వినటము, దాన్ని గురించి ఆలోచించటము వల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది. అంతేకాని ఎన్ని తీర్థాలు సేవించినా, దానాలు, కర్మలు చేసినా జ్ఞానం మాత్రం రాదు. కాబట్టి బ్రహ్మవేత్త, దయామయుడు అయిన గురువును మాత్రమే శరణు పొందాలి.

ఆత్మనిష్ఠ కలగాలంటే విద్వాంసుడికి నాలుగు లక్షణాలుండాలి. వాటినే సాధన చతుష్టయము అంటారు. ఇవే మోక్ష సాధనాలు.

**1. నిత్యానిత్య వివేకము** : ఏది సత్యము ? ఏది అసత్యము ? ఏది నిత్యము ? ఏది అనిత్యము ? అనే విషయ పరిజ్ఞానం. బ్రహ్మసత్యము. ఈ జగత్తు అంతామిధ్య. కనిపించే జగత్తు అంతా అశాశ్వతమైనది. బ్రహ్మ ఒక్కటే శాశ్వతమైనది.

**2. వైరాగ్యము** : ఈ లోకాలకు సంబంధించిన సుఖాలపట్ల విముఖత. శరీరం మొదలుకొని బ్రహ్మలోకం దాకా ఉండే భోగ్యపదార్థాలయందు అసహ్యాభావంతో ఉండటము.

**3. షట్సంపత్తి** : ఇవి మొత్తం ఆరు

**I) శమము** : అంతరింద్రియ నిగ్రహము. విషయ వాంఛల నుండి, అంతరింద్రియాల నుండి దోష దృష్టితో విరక్తి చెంది నిగ్రహించటం.

**II) దమము** : బాహ్యేంద్రియ నిగ్రహము. ఇంద్రియాలను వాటి వాటి విషయాల నుండి మళ్ళించి వాటి స్థానాలలో వాటిని నిలిపి వేయటం.

**III) ఉపరతి** : కర్మలను పరిత్యజించటము. బాహ్య విషయాలను చిత్త వృత్తులతో ఆశ్రయించకుండా ఉండటము. విహితకర్మలను విధి పూర్వకంగా పరిత్యజించటము.

**IV) తితిక్ష :** శీతోష్ణ సుఖ దుఃఖాలను సహించే శక్తి, చింత, దుఃఖము మొదలైనవి లేకుండా, ప్రతీకారము లేకుండా, సమస్త దుఃఖాలను, కష్టాలను సహించటం, ఎదుర్కొన గలిగినశక్తి, సామర్ధ్యం ఉండికూడా ఇతరులు చేసిన అపకారాలను సహించటం.

**V) శ్రద్ధ :** గురువు నందు, ఆయన చెప్పే విషయాల యందు విశ్వాసము. శాస్త్రాలు, వేదాలు, ఉపనిషత్తులు మొదలైన వాటి యందు, గురువు చెప్పిన విషయమందు నమ్మకము.

**VI) సమాధి :** దీనినే సమాధానము అని కూడా అంటారు. బుద్ధిని ఎప్పుడూ శుద్ధ బ్రహ్మమందే నిలిపి ఉంచటం.

**4. ముముక్షుత్వం :** మోక్షం పొందాలనే కోరిక. అహంకారం దగ్గర నుండి శరీరానికి ఉన్న సమస్తము అజ్ఞానముచేత కల్పించబడిన బంధనాలే. ఆత్మజ్ఞానం ద్వారా ఆబంధనాలను త్రెంచుకోవాలనే కోరిక. సాధకుడిలో ఈ కోరిక ఏమాత్రం ఉన్నా సరే, సద్గురువు వల్ల అది వృద్ధి చెందుతుంది.

కాబట్టి ముముక్షువు ముందుగా ఈ లక్షణాలను పెంపొందింపచేసుకుని స్థిత ప్రజ్ఞుడైన గురువును ఆశ్రయించాలి. ఆ గురువు వల్లనే సాంసారిక బంధనాల నుండి విముక్తి కలుగుతుంది. అంటూ సాధనచతుష్టయాన్ని వివరించాడు రత్నాకరుడు.



# 3. పంచకోశాలు

"శిష్యులారా ! ఉపనిషత్తులు పూర్తిగా ఆత్మజ్ఞానానికి సంబంధించినవి. అదే బ్రహ్మ విద్య. కాబట్టి ఉపనిషత్తుల గురించి తెలుసుకోబోయే ముందు వాటిలో తరచుగా చెప్పబడే మరికొన్ని విషయాల గురించి మీకు తెలియాలి. ఇప్పుడు వాటిని వివరిస్తాను. వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

పాంచ భౌతికమైనది ఈ దేహం. దీన్ని మూడు రకాలుగా చెబుతారు. 1) స్థూల శరీరము 2) సూక్ష్మ శరీరము 3) కారణ శరీరము.

**1) స్థూల శరీరము** : చర్మము, మాంసము, రక్తము, నరాలు, మేద, మజ్జ, ఎముకలు మొదలైన వాటితోను, మలమూత్రాలతోను కూడిన ఈ స్థూలదేహం అసహ్యాకరమైనది పూర్వకర్మల ననుసరించి, పంచభూతాల యొక్క కలయికచేత ఈ దేహము ఏర్పడింది. భోగాలు అనుభవించటానికి ఆధారము ఈ దేహమే. జీవుడు ఈ శరీరంతోనే సుఖదుఃఖాలు అనుభవిస్తాడు. స్థూలశరీరము ఎల్లప్పుడూ జాగ్రదావస్థలోనే అనుభవం పొందుతుంది. మిగిలిన అవస్థలు దానికి తెలియవు. కాబట్టి జాగ్రదావస్థలో ఈశరీరానికి ప్రాధాన్యత ఉంది. ఈ శరీరం గృహస్తుకు గృహంలాగా జీవాత్మకు ఆవాసమై ఉన్నది. మానవుడు చేసిన పాపపుణ్యాలు అన్నీ ఈ దేహం ద్వారానే ఈ లోకంలో అనుభవిస్తాడు. జననము, మరణము, రోగము, ముసలి తనము ఈ శరీరానివే. బాల్య, యవ్వన, కౌమారాది దశలు, వర్ణాశ్రమ ధర్మాలు, మానావమానాలు అన్ని ఈ దేహానికే చెందుతాయి.

**2) సూక్ష్మ శరీరము** : వాక్కు మొదలయిన కర్మేంద్రియాలు ఐదు, జ్ఞానేంద్రియాలు ఐదు, పంచప్రాణాలు, పంచభూతాలు, అంతఃకరణచతుష్టయం విద్య, కామము, కర్మఅనేవన్నీ కలిసి సూక్ష్మ శరీరము అనబడుతుంది. సూక్ష్మశరీరాన్నే లింగశరీరం అని కూడా అంటారు. ఇది పంచీకృతభూతాలవల్ల ఏర్పడి, వాసనలతో కూడినదై కర్మఫలాలు అనుభవిస్తూ ఉంటుంది. స్వప్నాన్ని ఈ సూక్ష్మశరీరమే అనుభవిస్తుంది. అంటే కలలో అనుభవించేది సూక్ష్మశరీరమే స్వప్నజగత్‌లో స్వయంప్రకాశమైన పరమాత్మ భిన్న, భిన్నరూపాలతో ప్రకాశిస్తుంది. బుద్ధి స్వప్నంలో జాగ్రదావస్థలోని అనేక రకాలయిన వాసనలతో కర్త మొదలైన భావాలు పొంది తానే స్వయంగా ప్రకాశిస్తుంది.

బుద్ధియే ఉపాధిగా కలిగినట్టి ఆ సర్వసాక్షి ఆ బుద్ధి చేసినట్టి కర్మలతో ఏమీ సంబంధం లేకుండా ఆకర్మలు ఏమాత్రమూ అంటకుండా ఉంటాడు. అందుకనే అతడికి కర్మలు అంటవు.

వడ్రంగివాడి చేతిలోని బాడిస అన్ని పనులకు అతనికి ఏ రకంగా ఉపయోగిస్తుందో, అదేవిధంగా ఈ లింగదేహం చిదాత్మ అయిన పురుషుని యొక్క సమస్తవ్యాపారాలకు అంటే అన్ని పనులకు ఉపయోగిస్తుంది.

**3) కారణ శరీరము** : గుణత్రయమే ఆత్మయొక్క కారణశరీరము. ఇది సుషుప్తావస్థలో ఉంటుంది. సుషుప్తిలో అన్నిరకాలైన జ్ఞానము శాంతిస్తుంది. బుద్ధి కేవలము బీజరూపంలో మాత్రమే ఉంటుంది. సామాన్యంగా 'నిద్రలో నాకేంతెలీదు' అంటాం. అదే సుషుప్తావస్త. ఆ స్థితిలో శరీరంలోని అన్ని అవయవాలు పూర్తిగా విశ్రమిస్తాయి. అప్పుడు ఉండేదే కారణ శరీరము.

అంటూ స్థూలసూక్ష్మ కారణ శరీరాలను వివరించాడు రత్నాకరుడు.

"గురువుగారూ! ఇందాక 'గుణత్రయము' అన్నారు కదా ! వాటిని పూర్తిగా వివరించండి.' అని అడిగాడు శిష్యుడైన కృష్ణశర్మ.

"గుణత్రయము అంటే సత్వరజస్తమోగుణాలు అని గతంలోచెప్పాను. వాటిలో....

**1) సత్వగుణము** : ఇది జలంలాగా శుద్ధంగా, స్వచ్ఛంగా ఉంటుంది. అయినప్పటికీ రజోగుణ, తమోగుణాలు దానిలో కలియటం వల్ల ఈ సత్వ గుణం సంసార బంధనానికి హేతువు అవుతుంది.

అయితే సత్వ గుణానికి కొని ధర్మాలున్నాయి. అవి గర్వం లేకుండా ఉండటం, శ్రద్ధ, భక్తి, ముముక్షుత్వం, యమనియమాదులు, సద్గుణాలు, ప్రసన్నత, ఆత్మానుభవం పరమశాంతం, తృప్తి, అత్యంత ఆనందం, పరమాత్మయందే దృష్టి. వీటివల్ల సాధకుడు నిత్యానందాన్ని పొందుతాడు.

**2) రజోగుణం** : కామము, క్రోధము, లోభము, దంభము, అసూయ, అభిమానం, ఈర్ష్య, మత్సరం మొదలైన ధర్మాలన్నీ రజోగుణ సంబంధమైనవి. వీటికారణంగానే జీవులు తమ కర్మలను చేస్తున్నాయి. ఈ రజోగుణమే జీవునికి బంధహేతువు. క్రియారూపం కలిగినట్టి అవిద్యాశక్తి రజోగుణ సంబంధమైనది. రజోగుణం వల్లనే పూర్వకాలం నుండి పనులన్నీ జరుగుతున్నాయి. దీనివల్లనే రాగము ద్వేషము మొదలైన మనోవికారాలు కలుగుతున్నాయి.

**3) తమోగుణము :** తమోగుణానికి ఉండే శక్తిని ఆవరణశక్తి అంటారు. ఈశక్తి వల్లనే ఒక విధంగా ఉన్న వస్తువు ఇంకొక రకంగా కనిపిస్తుంది. ఇదే పురుషుని యొక్క సంసారానికి మూలకారణం. తమోగుణం చేత కప్పబడినవాడు ఎంతటి బుద్ధిమంతుడైనా, విద్వాంసుడైనా, నేర్పరి అయినా, విషయాన్ని సరిగా గ్రహించలేడు. తమోగుణం ఒకరకమైన భ్రమ కలిగిస్తుంది. దానివల్ల తనకు కనిపించినదే నిజం అనుకుంటాడు. తను అనుకున్నదే నిజం అని నమ్ముతాడు. తమోగుణానికి నాలుగు రకాల శక్తులున్నాయి. అవి

1. **అభావన :** పరమాత్మలేడు అనే భావన

2. **విపరీతభావన :** నేను శరీరాన్ని అనుకోవటం.

3. **అసంభావన :** పని జరుగుతుందా ? లేదా ? అనే అనుమానం.

4. **విప్రతిపత్తి :** ఉన్నదా ? లేదా ? అవునా ? కాదా ? అనే అనుమానం.

తమోగుణ ప్రభావితుడైన వాడిని ఈ శక్తులు వదలవు. అజ్ఞానము, సోమరితనము, జడత్వము, నిద్ర, ఏమరుపాటు, మూఢత్వము మొదలైనవి తమోగుణలక్షణాలు. ఈ లక్షణాలు గలవాడు ఏదీ తెలుసుకోలేక ఒక స్తంభంలాగా కదలికలేకుండా ఉంటాడు.

అంటూ త్రిగుణాలను వివరించాడు రత్నాకరుడు. "గురువరేణ్యా! పంచకోశాలు అంటారు కదా ! వాటిని కూడా వివరించండి" అని అడిగాడు నారాయణ భట్టు.

కోశము అంటే కత్తివర అని అర్థం.శరీరంలో ఐదు కోశములున్నాయి. అవి వరుసగా 1) అన్నమయ 2) ప్రాణమయ, 3) మనోమయ 4) విజ్ఞానమయ 5) ఆనందమయ కోశములు.

**1) అన్నమయకోశము :** అన్నంతో ఉత్పన్నమైన శరీరాన్ని అన్నమయకోశము అంటారు. అది అన్నం ఉంటేనే బ్రతికి ఉంటుంది. లేకపోతే నశిస్తుంది. త్వగాది ధాతువులతో నిండి ఉన్న ఈ దేహము ఆత్మకాదు.

జననానికి ముందు ఈశరీరం లేదు. మరణానికి తరువాతకూడా ఉండదు. కేవలం క్షణికమైనది. అస్థిరభావం కలిగి ఉంటుంది. పంచభూతాలు, తన్మాత్రలు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఈ రకంగా కొన్ని తత్త్వాలతో కలిసి ఉన్నది. కంటికి కనిపిస్తుంది . ఇది ఒక ఎముకల గూడు, దానిపైన మాంసము, రక్తము, చర్మము అంటుకుని ఉంటాయి. సామాన్యులు ఈ శరీరాన్నే నేను అనుకుంటారు. విద్వాంసులు ఆత్మ, దేహాలను వేరుగా భావిస్తారు.

**2) ప్రాణమయకోశము** : కర్మేంద్రియాలతో కూడిన ప్రాణమే ప్రాణమయకోశము. ఈ ప్రాణంవల్లనే శరీరము ఆహారం తీసుకుని వృద్ధి చెందుతుంది. అందువల్లనే పనులన్నీ జరుగుతున్నాయి. కాని ఇది కూడా ఆత్మకాదు.

**3) మనోమయకోశం** : జ్ఞానేంద్రియాలు మనస్సు కలిపి 'మనోమయకోశం' అంటారు. నేను, నాది అనేటటువంటి వికల్పాలకు హేతువు ఇదే. ఇది చాలాబలమైనది. అన్నమయ, ప్రాణమయ కోశాలతో వ్యాప్తమై ఉంటుంది. పంచేంద్రియాలనే హోతలద్వారా విషయాలనే ఆహుతులతో పెంపొంది, వాసనలనే సమిధలతో ప్రజ్వలితమైన మనోమయాగ్ని దృశ్య ప్రపంచాన్నంతటినీ దగ్ధంచేస్తుంది. అంటే ఇంద్రియాలు వాసనలు అనే సమిధలను రగుల్కొల్పుతాయి. అప్పుడు మనోమయాగ్ని ప్రకటితమౌతుంది.

మనస్సునుమించిన అవిద్య ఇంకేదీ లేదు. ఇదే సంసారబంధనానికి హేతువు. మనస్సు నశిస్తే అన్నీ నశిస్తాయి. మనస్సు విజృంభిస్తే అన్నీవిజృంభిస్తాయి. మనస్సు మేల్కొంటే అన్నీ మేల్కొంటాయి. స్వప్నావస్థలో ఒక పదార్థమంటూ ఏదీ ఉండదు. కాని స్వప్నంలో కూడా మనస్సు తన శక్తివల్ల భోక్తను, భోగాన్ని సృష్టిస్తుంది. జాగ్రదావస్థలోకూడా కనిపించేదంతా మనస్సు యొక్క విలాసమే. కాని సుషుప్తి సమయంలో మనస్సు లీనమై పోతుంది. కాబట్టి ఏమీ ఉండదు. ఈ సంసారమంతా కూడా మనస్సు చేత కల్పించబడిందే. మనస్సు వల్లనే ఈ బంధనాలన్నీ వస్తున్నాయి. అది పోతే ఈ బంధనాలూ పోతాయి. బంధ మోక్షాలకు కారణం మనస్సు.

దేహాదులైన సమస్త విషయాలయందు రాగాన్నికల్పించి పురుషుణ్ణి బంధించేది మనస్సు. ఆ బంధనాల నుండి జీవుణ్ణి విముక్తుడుగా చేసేది మనస్సే. అంటే రాగ ద్వేషాలకు నిలయము ఈ మనస్సు.

**4) విజ్ఞానమయకోశము** : జ్ఞానేంద్రియాలతోను, వృత్తులతోను కూడినబుద్ధియే విజ్ఞానమయకోశము. ఇది పురుషుని జనన మరణ రూపమైన సంసారానికి కారణము. చిత్తాన్ని, ఇంద్రియాలను అనుసరించి పోతూ ఉండే చేతనంయొక్క ప్రతిబింబశక్తినే విజ్ఞానమంటారు. ఇది ప్రకృతియొక్క వికారము.

జాగ్రస్వప్నాది అవస్థలు, సుఖదుఃఖాది అనుభవాలు, దేహాదులకు సంబంధించిన ఆశ్రమధర్మాలు, కర్మలు, గుణాలు వీటికి సంబంధించిన అభిమానము, మమకారము అన్నీ విజ్ఞానమయకోశంలో ఉండేవే. ఈ కోశము ఆత్మకు మిక్కిలి సమీపంగా ఉంటుంది. అందుకనే ఎక్కువ ప్రకాశంవంతంగా ఉంటుంది.

**2) ప్రాణమయకోశము** : కర్మేంద్రియాలతో కూడిన ప్రాణమే ప్రాణమయకోశము. ఈ ప్రాణంవల్లనే శరీరము ఆహారం తీసుకుని వృద్ధి చెందుతుంది. అందువల్లనే పనులన్నీ జరుగుతున్నాయి. కాని ఇది కూడా ఆత్మకాదు.

**3) మనోమయకోశం** : జ్ఞానేంద్రియాలు మనస్సు కలిపి 'మనోమయకోశం' అంటారు. నేను, నాది అనేటటువంటి వికల్పాలకు హేతువు ఇదే. ఇది చాలాబలమైనది. అన్నమయ, ప్రాణమయ కోశాలతో వ్యాప్తమై ఉంటుంది. పంచేంద్రియాలనే హోతలద్వారా విషయాలనే ఆహుతులతో పెంపొంది, వాసనలనే సమిధలతో ప్రజ్వలితమైన మనోమయాగ్ని దృశ్య ప్రపంచాన్నంతటినీ దగ్ధంచేస్తుంది. అంటే ఇంద్రియాలు వాసనలు అనే సమిధలను రగుల్కొల్పుతాయి. అప్పుడు మనోమయాగ్ని ప్రకటితమౌతుంది.

మనస్సునుమించిన అవిద్య ఇంకేదీ లేదు. ఇదే సంసారబంధనానికి హేతువు. మనస్సు నశిస్తే అన్నీ నశిస్తాయి. మనస్సు విజృంభిస్తే అన్నీవిజృంభిస్తాయి. మనస్సు మేల్కొంటే అన్నీ మేల్కొంటాయి. స్వప్నావస్థలో ఒక పదార్థమంటూ ఏదీ ఉండదు. కాని స్వప్నంలో కూడా మనస్సు తన శక్తివల్ల భోక్తను, భోగాన్ని సృష్టిస్తుంది. జాగ్రదావస్థలోకూడా కనిపించేదంతా మనస్సు యొక్క విలాసమే. కాని సుషుప్తి సమయంలో మనస్సు లీనమై పోతుంది. కాబట్టి ఏమీ ఉండదు. ఈ సంసారమంతా కూడా మనస్సు చేత కల్పించబడిందే. మనస్సు వల్లనే ఈ బంధనాలన్నీ వస్తున్నాయి. అది పోతే ఈ బంధనాలూ పోతాయి. బంధ మోక్షాలకు కారణం మనస్సు.

దేహాదులైన సమస్త విషయాలయందు రాగాన్నికల్పించి పురుషుణ్ణి బంధించేది మనస్సు. ఆ బంధనాల నుండి జీవుణ్ణి విముక్తుడుగా చేసేది మనస్సే. అంటే రాగ ద్వేషాలకు నిలయము ఈ మనస్సు.

**4) విజ్ఞానమయకోశము** : జ్ఞానేంద్రియాలతోను, వృత్తులతోను కూడినబుద్ధియే విజ్ఞానమయకోశము. ఇది పురుషుని జనన మరణ రూపమైన సంసారానికి కారణము. చిత్తాన్ని, ఇంద్రియాలను అనుసరించి పోతూ ఉండే చేతనంయొక్క ప్రతిబింబశక్తినే విజ్ఞానమంటారు. ఇది ప్రకృతియొక్క వికారము.

జాగ్రస్వప్నాది అవస్థలు, సుఖదుఃఖాది అనుభవాలు, దేహాదులకు సంబంధించిన ఆశ్రమధర్మాలు, కర్మలు, గుణాలు వీటికి సంబంధించిన అభిమానము, మమకారము అన్నీ విజ్ఞానమయకోశంలో ఉండేవే. ఈ కోశము ఆత్మకు మిక్కిలి సమీపంగా ఉంటుంది. అందుకనే ఎక్కువ ప్రకాశంవంతంగా ఉంటుంది.

**5) ఆనందమయకోశము** : ఆనందస్వరూపమైన ఆత్మయొక్క ప్రతిబింబంచేత తాకబడినటువంటి, తమోగుణం వల్ల ప్రకటితమైనటు వంటి వృత్తిని ఆనందమయకోశము అంటారు. ఇది ప్రియము, మోదము, ప్రమోదము అనే మూడు గుణాలతో కలిసి ఉంటుంది. పుణ్యఫలంవల్ల సుఖం అనుభవించే సమయంలో అదృష్టవంతులకు ఆనందమయ కోశముయొక్క స్వరూపం గోచరిస్తుంది. దీని కారణంగానే జీవులు ఏవిధమైన ప్రయత్నం లేకుండానే ఆనందాన్ని పొందుతున్నారు.

ప్రియము - పుత్రాదులను చూసినప్పుడు కలిగేది.

మోదము - కోరుకున్నది దొరికినప్పుడు కలిగేది.

ప్రమోదము - మోదము ఎక్కువపాలులో కలగటం. ఆనందమయకోశము సుషుప్తిలో తెలియబడుతుంది.

పుణ్యకర్మలవల్ల సుఖం లభిస్తుంది. కాబట్టి శుభకర్మలకు ఇదిఫలం.

అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాలనడుమ, ఆనందమయ కోశంలో పరబ్రహ్మ ఉంటాడు. అంటూ పంచకోశాలను వివరించాడు రత్నాకరుడు.



# 4. వేదాలు

ఇష్టప్రాప్తినీ, అనిష్ట పరిహారాన్నీ సాధించటానికి అలౌకికమైన ఉపాయాన్ని చెప్పేదే వేదము. సకలదేవతలను, ధర్మాన్నీ, పరబ్రహ్మతత్త్వాన్నీ ప్రతిపాదిస్తుంది కనుక వేద సామ్రాజ్యం ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలకు మించి ఉన్నది.

మానవుడు పరిపూర్ణుడు కాడు. అతను చెప్పిన సూక్తులు పరమార్ధమని, భ్రాంతి రహితమని ఒప్పుకోలేము. అందుచేత, అతీంద్రియ సత్యాలకు సంబంధించినంతవరకూ స్వతఃసిద్ధమూ, స్వతః ప్రమాణము, నిత్యసిద్ధము, బ్రహ్మవాక్కు అయిన వేదాన్ని మాత్రమే నిర్దుష్టమైన అంత్య ప్రమాణంగా స్వీకరించగలం. భారతీయ సంస్కృతి ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ వికసిస్తుండటానికి వేదమే కారణము.

వేదాలు అపౌరుషేయాలు. సాక్షాత్తూ పరమేశ్వరుడే వాటిని బ్రహ్మదేవునికిచ్చాడు. వేదాలలో చెప్పిన లౌకిక, ఆధ్యాత్మిక సిద్ధాంతాలు శాశ్వతమైనవి. దివ్య ప్రజాపతులు, ఋషుల కలిసి పరమ పురుషుడే హవిస్సుగా చేసిన మానవ యజ్ఞం నుండి వేదాలు ఉద్భవించాయని పురుష సూక్తంలో చెప్పబడింది. పరమాత్మ బ్రహ్మను సృజించి అతనికి వేదాలు అనుగ్రహించాడు.

వేదం అనే మాటకు సాధారణ అర్థం "విద్య". వేదంలో పరా, అపరా అనే రెండు రకాల విద్యలున్నాయి. వేదంలో రెండు కాండలున్నాయి. 1) జ్ఞానకాండ 2) కర్మకాండ వీటిలో కర్మకాండ అపరావిద్యను అంటే కర్మలు, నియమాలు, విధులు, ఆచారాలు వివరించగా జ్ఞానకాండ ఆత్మ, పరమాత్మ, ప్రపంచము మొదలైన స్వరూపాలను గూర్చి వివరిస్తుంది. మొత్తం మీద నువ్వులలో నూనెలాగా వేదమంతటా వేదాంతం సుప్రతిష్ఠితమై ఉన్నది.

వేదానికి నిగమము, శ్రుతి, ఆమ్నాయము అని కూడా పేర్లున్నాయి. దాని అర్థమేమంటే ....

1. నిగమము - అనాదిగా వస్తున్న నిర్ధారితమైన మూలగ్రంథము.
2. శ్రుతి - గురువునుంచి శిష్యుడు వినే దివ్యవాణి.
3. ఆమ్నాయము - ఆవృత్తి లేదా మననం ద్వారా నేర్చుకోబడే విద్య.

కృతయుగంలో వేదం అంతా ఒకటిగానే ఉండేది. ద్వాపరయుగంలో బ్రహ్మదేవుడు 'అపాంతరతముడు' అనే మానసపుత్రుణ్ణి సృష్టించి వేదాలను భూలోకంలో బాగా ప్రచారం చేసి రమ్మన్నాడు. కలగా పులగంగా ఉన్న వేదాన్ని నాలుగు భాగాలుగా విభజించాడు

అపాంతరతముడు. దానికి సంతుష్టుడైన బ్రహ్మదేవుడు తన కుమారునికి ప్రతి మహాయుగంలోనూ వేదాన్ని విభజించమని చెప్పాడు. ఆ ప్రకారంగానే ప్రతి మహా యుగంలోనూ వేదం విభజించబడుతూనే ఉన్నది. వేదాలను విభజించిన వ్యక్తినే వేదవ్యాసుడు అంటారు. ప్రస్తుతము 28వ మహాయుగం జరుగుతున్నది. ఈ మహాయుగంలో కృష్ణద్వైపాయనుడు వేదాలను విభజించి వేదవ్యాసుడైనాడు. రాబోయే మహాయుగంలో ద్రోణాచార్యుని కుమారుడు అశ్వద్ధామ వేదవ్యాసుడౌతాడు.

వ్యాసుడు వేదాన్ని నాలుగు భాగాలుగా విభజించాడు. అవే 1) ఋగ్వేదము 2) యజుర్వేదము 3) సామవేదము 4) అధర్వణ వేదము. స్తుత్యర్థకమైన మంత్రానికి 'ఋక్కు' అని పేరు. యజ్ఞపరాలైన మంత్రాలకు 'యజస్సులు' అని పేరు. నియమ పూర్వకంగా గానంచేసే మంత్రాలకు "సామదములు" అని పేరు.

**1. ఋగ్వేదము** : వేదాలలో ముఖ్యమైనది ఋగ్వేదము. అన్ని వేదాలలోనూ ఎక్కువ భాగం దీనికి పునరుక్తిగానో, అనుసరణ గానో ఉంటుంది. దీనిలో 1028 దేవతాస్తుతులున్నాయి. వీటిలో అతి పెద్దది 52 శ్లోకాలుగలది. ఈ స్తోత్రాలన్నీ పది మండలాలుగా ఉన్నాయి. తత్త్వ, అలౌకిక విషయాలను వివరించటం వలన పదవమండలం విశేష ఆసక్తి కరమైనది. ఐతరేయ, కౌశీతకీ, పైంగి, సాంఖ్యాయన బ్రాహ్మణాలు ఈ వేదానికి సంబంధించినవి. ఐతరేయ, కౌశీతకీ అరణ్యకాలు ఆ బ్రాహ్మణాలకు పరిశిష్టాలుగాను, ఐతరేయ, కౌశీతకీ ఉపనిషత్తులు ఈ అరణ్యకాలకు అంతిమాంశాలుగాను ఉన్నాయి.

**2) యజుర్వేదము** : ఇది రెండు భాగాలుగా ఉన్నది. i) కృష్ణయజుర్వేదము ii) శుక్లయజుర్వేదము.

i) **కృష్ణయజుర్వేదము** : ఇది చాలా వరకు గద్యరూపంలో ఉంటుంది. దీనికి క్రియావిధులు ఉంటాయి. తైతిరీయ, భాల్లవ, కాత్యాయన, మైత్రాయణ, కఠ బ్రాహ్మణాలు ఈ వేదంలోనివే. వీటిలో ప్రసిద్ధమైనది తైత్తిరీయ బ్రాహ్మణము.

ii) **శుక్ల యజుర్వేదము** : ఇది 40 అధ్యాయాలు గల గ్రంథం. యజ్ఞాలకు సంబంధించిన విషయాలు ఇందులో క్రమబద్ధంగా ఉన్నాయి. ఈ వేదం ముఖ్యంగా మాధ్యందిన, కాణ్వ సంప్రదాయాలలో ఉన్నది. ప్రఖ్యాతమైన శతపథ బ్రాహ్మణము ఈ వేదానికి సంబంధించినదే. అంత్యంత ముఖ్యమైన అరణ్యకము, ఉపనిషత్తుకూడా అయిన బృహదారణ్యకముతో శతపథ బ్రాహ్మణము పూర్తవుతుంది.

**3. సామవేదం** : దీనిలో 75 మంత్రాలు తప్ప, మిగిలినవన్నీ ఋగ్వేదంలోని 8, 9 మండలాల నుంచే తీసుకోబడ్డాయి. ఉద్గాత విధులను వివరించే సామవిధాన, మంత్ర, ఆర్షేయ, వంశ, దైవతాధ్యాయ, తలవకార, తాండ్య, సంహితోపనిషత్తులనబడే ఎనిమిది బ్రాహ్మణాలు ఈ వేదానివే. ఛాందోగ్య, కేనోపనిషత్తులు ఈ వేదంలోవే. దీనికి అరణ్యాకాలు లేవు.

**4) అధర్వణ వేదం** : ఈ వేదంలో ముఖ్యంగా ప్రాపంచిక అభ్యుదయాన్ని తేగల మంత్రాలు, తంత్రాలు ఉన్నాయి. దీనికి ఏ అరణ్యకమూ లేదు. గోపథ బ్రాహ్మణము, ముండక, మాండూక్య, ప్రశ్నోపనిషత్తులు ఈ వేదానికి సంబంధించినవే.

కృష్ణద్వైపాయనుడు, వేద విభజన చేసిన తరువాత అతని నలుగురు శిష్యులు.

1. పైలుడు 3. జైమిని

2. వైశంపాయనుడు 4. సుమంతుడు.

అదే క్రమంలో వేదాలను బోధించారు. అయితే రానురాను గురుశిష్యుల సంఖ్య పెరిగి కాలక్రమంలో వేదాలకు అనేక శాఖలు వచ్చాయి. ఈ రకంగా

| | | |
|---|---|---|
| ఋగ్వేదానికి | - | 21 శాఖలు |
| కృష్ణ యజుర్వేదానికి | - | 94 శాఖలు |
| శుక్ల యజుర్వేదానికి | - | 15 శాఖలు |
| సామవేదానికి | - | 100 శాఖలు |
| అధర్వణ వేదానికి | - | 50 శాఖలు వచ్చాయి. |

వీటిలో చాలా వరకు ఇప్పుడు కనిపించటం లేదు.

“గురుదేవా। మిగిలిన 3 వేదాలకూ భాగాలు లేవుకదా. మరి యజుర్వేదము రెండు భాగాలుగా ఎందుకున్నది ?” అడిగాడు నారాయణ భట్టు.

“ద్వాపరయుగంలో వ్యాసభగవానుడు వేదవిభజన చేసిన తరువాత, తన శిష్యులైన జైమిని, వైశంపాయనుడు, పైలుడు, సుమంతులకు నాలుగు వేదాలు అప్పగించి వాటిని ప్రచారం చెయ్యమన్నాడు. ఇప్పుడు యజుర్వేద బాధ్యతను వైశంపాయనుండికి అప్పగించారు. వైశంపాయనుడు దాన్ని తన శిష్యులకు బోధించాడు. వైశంపాయనుడి శిష్యులలో యాజ్ఞవల్క్యుడు ముఖ్యమైనవాడు. అతను ఈ వేదాన్ని క్షుణ్ణంగా అభ్యసించాడు.

**3. సామవేదం :** దీనిలో 75 మంత్రాలు తప్ప, మిగిలినవన్నీ ఋగ్వేదంలోని 8, 9 మండలాల నుంచే తీసుకోబడ్డాయి. ఉద్గాత విధులను వివరించే సామవిధాన, మంత్ర, ఆర్షేయ, వంశ, దైవతాధ్యాయ, తలవకార, తాండ్య, సంహితోపనిషత్తులనబడే ఎనిమిది బ్రాహ్మణాలు ఈ వేదానివే. ఛాందోగ్య, కేనోపనిషత్తులు ఈ వేదంలోవే. దీనికి అరణ్యకాలు లేవు.

**4) అధర్వణ వేదం :** ఈ వేదంలో ముఖ్యంగా ప్రాపంచిక అభ్యుదయాన్ని తేగల మంత్రాలు, తంత్రాలు ఉన్నాయి. దీనికి ఏ అరణ్యకమూ లేదు. గోపథ బ్రాహ్మణము, ముండక, మాండూక్య, ప్రశ్నోపనిషత్తులు ఈ వేదానికి సంబంధించినవే.

కృష్ణద్వైపాయనుడు, వేద విభజన చేసిన తరువాత అతని నలుగురు శిష్యులు.

| | |
|---|---|
| 1. పైలుడు | 3. జైమిని |
| 2. వైశంపాయనుడు | 4. సుమంతుడు. |

అదే క్రమంలో వేదాలను బోధించారు. అయితే రానురాను గురుశిష్యుల సంఖ్య పెరిగి కాలక్రమంలో వేదాలకు అనేక శాఖలు వచ్చాయి. ఈ రకంగా

| | | |
|---|---|---|
| ఋగ్వేదానికి | - | 21 శాఖలు |
| కృష్ణ యజుర్వేదానికి | - | 94 శాఖలు |
| శుక్ల యజుర్వేదానికి | - | 15 శాఖలు |
| సామవేదానికి | - | 100 శాఖలు |
| అధర్వణ వేదానికి | - | 50 శాఖలు వచ్చాయి. |

వీటిలో చాలా వరకు ఇప్పుడు కనిపించటం లేదు.

"గురుదేవా । మిగిలిన 3 వేదాలకూ భాగాలు లేవుకదా. మరి యజుర్వేదము రెండు భాగాలుగా ఎందుకున్నది ?" అడిగాడు నారాయణ భట్టు.

"ద్వాపరయుగంలో వ్యాసభగవానుడు వేదవిభజన చేసిన తరువాత, తన శిష్యులైన జైమిని, వైశంపాయనుడు, పైలుడు, సుమంతులకు నాలుగు వేదాలు అప్పగించి వాటిని ప్రచారం చెయ్యమన్నాడు. ఇప్పుడు యజుర్వేద బాధ్యతను వైశంపాయనుండికి అప్పగించారు. వైశంపాయనుడు దాన్ని తన శిష్యులకు బోధించాడు. వైశంపాయనుడి శిష్యులలో యాజ్ఞవల్క్యుడు ముఖ్యమైనవాడు. అతను ఈ వేదాన్ని క్షుణ్ణంగా అభ్యసించాడు.

ఆకాలంలో ఒకనాడు మేరుపర్వతంమీద దేశంలోని మహర్షులందరూ సభ ఏర్పాటు చేసుకుని, దానికి ఋషులందరూ తప్పకరావాలని ఆంక్ష విధించారు. ఎవరైనా రాకపోతే వారికి బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంటుందని తీర్మానించారు. అనుకున్న ప్రకారం సభ ప్రారంభమైంది. కారణాంతరాల వల్ల దానికి వైశంపాయనుడు రాలేకపోయాడు. అందుచేత ఋషుల తీర్మానం ప్రకారం అతడికి బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంది. ఆ పాపం నుంచి నిష్కృతి కావాలంటే తపస్సుచేసి ధారపొయ్యాలి. ఆకారణంగా వైశంపాయనుని మిగిలిన శిష్యులందరూ తపస్సు చేస్తున్నారు. ఆ సమయంలో యాజ్ఞవల్క్యుడు తన గురువు దగ్గరకు వచ్చి సహాధ్యాయులు చేస్తున్న తపస్సు చూసి జరిగిన విషయం తెలుసుకుని వైశంపాయనుడితో "గురుదేవా ! వీళ్ళంతా అల్పజ్ఞులు. మీపాపపరిహారార్థం వీళ్ళేం తపస్సు చేస్తారు ? అనుజ్ఞ ఇవ్వండి. నేను మీకోసం ఘోరమైన తపస్సుచేస్తాను" అన్నాడు. సహాధ్యాయుల నవమానించిన యాజ్ఞవల్క్యుని చూసి వైశంపాయనుడు "సాటివారిని అవమానించే గర్విష్ఠితో నాకు పనిలేదు. నాకు శిష్యుడిగా ఉండే అర్హతకూడా నీకులేదు. నేనుచెప్పిన వేదవిద్యను ఇక్కడే వదిలేసి వెళ్ళు" అన్నాడు.

యాజ్ఞవల్క్యుడు నిజంగానే శక్తిసంపన్నుడు. స్వాభిమాని. గురువుగారన్నమాట అవమానంగా తోచి వెంటనే వైశంపాయనుడు చెప్పిన వేదవిద్య అంతా కక్కేశాడు. ఆ వేద భాగమే కృష్ణయజుర్వేదమయింది.

ఈ రకంగా వేదాన్ని వదిలేసిన యాజ్ఞవల్క్యుడు సూర్యభగవానుణ్ణి ఆరాధించి ఆయన దగ్గర వేదవిద్యనభ్యసించాడు. ఈ భాగమే శుక్లయజుర్వేదము. యాజ్ఞవల్క్యుడు ఈ వేదభాగాన్ని తనశిష్యులైన కణ్వ, మధ్యందినాదులకు బోధించాడు. ఈభాగమే "వాజసనేయ సంహిత" అని కూడా పిలువబడుతుంది, 'వాజః' అంటే అన్నము. 'సని' అంటే దానము 'వాజసని' అంటే అన్నదానము. యాజ్ఞవల్క్యుని తండ్రి నిరతాన్నదానం చేసేవాడు. అందుచేత అతనిని 'వాజసని' అనేవారు. వాజసని కుమారుడు కాబట్టి యాజ్ఞవల్క్యుడు 'వాజసనేయుడు' అనబడ్డాడు. అతడు చెప్పిన సంహిత 'వాజసనేయసంహిత' అయింది. ఇది మొత్తం 40 అధ్యాయాలు. దీనిలోని 39 అధ్యాయాలలో మంత్రాలు కర్మకాండ వివరించబడగా, 40వ అధ్యాయం జ్ఞానబోధకము.

ప్రత్యక్షంగా గాని, పరోక్షంగాగాని ఐహిక సంపత్తిని, మోక్షాన్ని సంపాదించిపెట్టేవి యజ్ఞాలు, యజ్ఞనిర్వహణ చాలా కష్టమైనది. దీనిని చాలా జాగ్రత్తగా పూర్తిచేయటమే వేదాల ప్రయోజనం. యజ్ఞనిర్వహణకు నలుగురు పురోహితులుంటారు. వారు

1. **హోత** : ఋగ్వేదంలోని స్తోత్రాలను క్రమంగా పఠించేవాడు.

2. **అధ్వర్యుడు** : యజుర్వేదంలో చెప్పిన ప్రకారము యజ్ఞకర్మలను యధావిధిగా నిర్వహించేవాడు.

3. **ఉద్గాత** : సామగీతాలు గానం చేసేవాడు.

4. **బ్రహ్మ** : అధర్వణవేదపండితుడు. యజ్ఞాన్ని మొదటి నుండి చివరి దాకా పర్యవేక్షించేవాడు. ఇతడు యజ్ఞకళకు, వేదసాహిత్యానికీ ప్రతీక.

ప్రతి వేదాన్నీ మళ్ళి నాలుగు భాగాలుగా విభజించారు.

| | |
|---|---|
| 1. సంహితలు | 3. అరణ్యకాలు |
| 2. బ్రాహ్మణాలు | 4. ఉపనిషత్తులు |

**1) సంహితలు :** ఇవి మంత్ర భాగం. ఇందులో స్తోత్రాలు, ఆవాహనలు ఉంటాయి. ఋగ్, యజు, సామ సంహితలు సూక్తాలుగా ఉంటాయి.

**2) బ్రాహ్మణాలు :** సంహితలోని విషయాన్ని వివరించేవి బ్రాహ్మణాలు. యజ్ఞ యాగాదులెలా చెయ్యాలి ? వాటి వెనుక రహస్యము. యజ్ఞాల విలువ, వాటి మహిమ చెప్పబడింది.

**3) అరణ్యకాలు :** ఇవి బ్రాహ్మణాలకూ, ఉపనిషత్తులకూ మధ్యస్థాయిలో ఉంటాయి. ఇవి కూడా బ్రాహ్మణాలలాగానే కర్మ విధులను ప్రతిపాదిస్తాయి. కాని వీటిలో కర్మల యొక్క భౌతిక భాగం ఉండదు. కర్మల వెనుక ఉన్న నిఘూఢమైన తత్త్వాల మీద ధ్యానానికి ప్రాముఖ్యత ఇవ్వబడింది. ఏకాంతవాసం స్వీకరించినవారు, అరణ్యాలలో నివసించే వారి కోసం ఇవి ఉద్దేశింపబడ్డాయి. విషయంలో అరణ్యకాలకు, ఉపనిషత్తులకు తేడా లేదు.

వేదాలకు అర్థం తెలుసుకోవటానికిగాను మనకు తెలిసినంత వరకు 25 మంది భాష్యం వ్రాశారు. విజయనగర సామ్రాజ్య స్థాపన చేసిన "మాధవ విద్యారణ్యులు" వేదాలకు భాష్యం వ్రాసి, వేదసాహిత్యానికి విశేషమైన సేవ చేసిన వారిలో మనకు అతి దగ్గరవాడు.

**4) ఉపనిషత్తులు :** ఉపనిషత్తులు అంటే బ్రహ్మవిద్య, జీవాత్మ, పరమాత్మ, జ్ఞానము, మోక్షముల గురించి వివరించేవి. నాలుగు వేదాలకు కలిపి 1180 ఉపనిషత్తులున్నాయి. కాని వీటిలో 108 మాత్రమే చదవదగ్గవి అని తేల్చారు. వీటికి 'ఉపనిషద్బ్రహ్మేంద్ర' అనే మహానుభావుడు వ్యాఖ్యవ్రాశాడు.

అంటూ వేదాలను గురించి శిష్యులకు క్లుప్తంగా వివరించి ఆపై ఉపనిషత్తుల గురించి వివరించటానికి ఉద్యుక్తుడౌతున్నాడు రత్నాకరుడు.

# 5. ఉపనిషత్తులు

"నాయనలారా ! ఉపనిషత్తులను వివరించబోయే ముందు మీకు అసలు ఉపనిషత్తుల గురించి చెబుతాను వినండి." అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఉప - సమీపమందు, ని - దిగువ స్థానంలో, షద్ - కూర్చునుట. గురువుగారి దగ్గర, ఆయనకన్న దిగువస్థానంలో కూర్చుని వారుచెప్పే బ్రహ్మోపదేశం శ్రద్ధగా వినటం. మనోవాక్కాయకర్మలలో ఎక్కడా కూడా గురువు తనకన్న తక్కువవాడు అనే భావం రాకూడదు. గురువు ఏ స్థితిలోఉన్నప్పటికీ తనకన్న అన్ని విధాల గొప్పవాడు అనే మాట మరచి పోకూడదు. ఆయనను భక్తి శ్రద్ధలతో పూజించాలి. వారు చేసే ఉపదేశాన్ని అత్యంత శ్రద్ధతో స్వీకరించాలి.

ఉపనిషత్తు అంటే బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్యా పరిశీలకులైన విద్వాంసులకు కర్మ, జన్మ, మరణాలను లేకుండా చేసేది. ఆజన్మాది మరణాదికమైన దానిని నశింపచేసేది. బ్రహ్మపదార్థ లాభం కలుగచేసేది.

వేదాలు మొత్తం మూడు కాండలుగా ఉంటాయి. అవి 1) కర్మ 2) ఉపాసన 3) జ్ఞానకాండలు. వీటిలో చివరిరెండు అంటే ఉపాసన, జ్ఞానకాండలను ఉపనిషత్తు అంటారు. ఈ ఉపనిషత్తులన్నీ గురుశిష్యుల సంవాదముగానే ఉంటాయి. బ్రహ్మశోధకుడైన శిష్యుడు బ్రహ్మజ్ఞాని అయిన గురువును సమీపించి, ఆయన దగ్గర నియమ నిష్ఠలతో కొంతకాలం గడిపి, గురువుగారి అనుగ్రహం సంపాదించాలి. గురువుగారు గనక ప్రసన్నుడైతే శిష్యుడికి బ్రహ్మోపదేశం చేస్తాడు. అప్పుడు శిష్యుడు తన అనుమానాలను అడుగుతుంటాడు. గురువుగారు వాటిని తీరుస్తుంటారు. అందుచేతనే ఉపనిషత్తులు గురుశిష్య సంవాదముగా ఉంటాయి. అయితే కొన్ని చోట్ల గురువు, శిష్యుల పేర్లు తెలియవు. నాలుగు వేదాలకు కలిపి ముఖ్యమైన ఉపనిషత్తులు మొత్తం 108. వాటిలో ప్రసిద్ధమైనవి పది. అవి ....

1. ఐతరేయోపనిషత్తు - ఋగ్వేదంలోనిది
2. కఠోపనిషత్తు - కృష్ణయజుర్వేదంలోనిది
3. తైత్తిరీయోపనిషత్తు - కృష్ణయజుర్వేదంలోనిది
4. ఈశావాశ్యోపనిషత్తు - శుక్లయజుర్వేదంలోనిది

| | | | |
|---|---|---|---|
| 5. | బృహదారణ్యకోపనిషత్తు | - | శుక్లయజుర్వేదంలోనిది. |
| 6. | కేనోపనిషత్తు | - | సామవేదంలోనిది |
| 7. | ఛాందోగ్యోపనిషత్తు | - | సామవేదంలోనిది |
| 8. | ప్రశ్నోపనిషత్తు | - | అధర్వవేదంలోనిది |
| 9. | ముండకోపనిషత్తు | - | అధర్వవేదంలోనిది |
| 10. | మాండూక్యోపనిషత్తు | - | అధర్వవేదంలోనిది |

కాగా మిగిలిన వాటిలో

| | | |
|---|---|---|
| యోగోపనిషత్తులు | - | 20 |
| వేదాంతోపనిషత్తులు | - | 24 |
| సన్యాసోపనిషత్తులు | - | 17 |
| శైవోపనిషత్తులు | - | 15 |
| వైష్ణవోపనిషత్తులు | - | 14 |
| దేవ్యుపనిషత్తులు | - | 8 |
| మొత్తం | - | 98 |

ప్రతిఉపనిషత్తూ ఏదో ఒక వేదానికి సంబంధించినదే. ఐతే ప్రస్తుతం వీటిలో కొన్ని మాత్రమే వేదానికి ప్రత్యక్షభాగాలుగా కనిపిస్తున్నాయి. మిగిలిన ఉపనిషత్తులు కూడా గతంలో ఏ సంహితలోనో, బ్రాహ్మణంలోనో భాగంగాఉండి, కాలక్రమేణా వాటినుండి విడిపోయాయి. ఉపనిషత్తులు నిజమైన విజ్ఞతకు సారము లేదా తాత్పర్యము.

వేదాల శాంతి పాఠాలే వాటికి సంబంధించిన ఉపనిషత్తులకు కుడా శాంతి పాఠాలు. ప్రసిద్ధిమైన పది ఉపనిషత్తులకు శంకర భగవత్పాదులవారు వ్యాఖ్య వ్రాశారు.

శాంతి పాఠంలో మూడు సార్లు 'శాంతి' అనే పదాన్ని వాడతారు. శాస్త్రపాఠాలు చదువుతున్నప్పుడు మూడు రకాల విఘ్నాలు పోవటానికి, విఘ్నాలు కలగకుండా ఉండటానికి శాంతి పాఠాలు చెబుతారు. విఘ్నాలు మూడు రకాలు.

1. **ఆదిదైవికము** : దైవముచే కలగ చేయబడేవి.

2. **ఆది భౌతికము** : అగ్ని, వరద, భూకంపాల వంటివి.

3. **అధ్యాత్మికము** : అలసత్వము, కపటము, అవిశ్వాసము, అశ్రద్ధ మొదలైనవి.

ఉపన్యాసము ప్రతిరోజూ శాంతి పాఠంతోనే మొదలుపెట్టాలి. అలాగే శాంతి పాఠంతోనే ముగించాలి.

ముందుగా నాగురుదేవులకు నమస్కరించి, శృంగేరి, కంచి, పుష్పగిరి, కుర్తాళం, హంపి, గన్నవరం, గుంటూరులలో ఉన్న పీఠాధిపతులకు, మైసూరు దత్తపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారికి, లలితా తపోవనం ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీ శ్రీ శ్రీ వాసుదేవానందగిరిస్వామి వారికి, బాలసాయికీ, మాతాశివచైతన్యకూ సాష్టాంగదండ ప్రణామాలాచరించి, హరితస గోత్రీకుడనైన క్రోవిపార్థసారధి అను నేను జ్ఞాన ముక్తి ప్రదాలని ప్రసిద్ధిచెందిన, పైన చెప్పిన పదిఉపనిషత్తులకూ కైవల్యోపనిషత్తు కూడా కలిపి, మొత్తం పదకొండు ఉపనిషత్తులు కూలంకుషంగా, అన్నీ కధల రూపంలో, సామాన్యుడికి కూడా అర్ధమయ్యేటట్లుగా సులభశైలిలో చెప్పటానికి ఉపక్రమిస్తున్నాను. అధ్యాత్మికచింతనా పరులు మహాజ్ఞానులు నన్నుఆశీర్వదించి, నా ఈ ప్రయత్నాన్ని మన్నింతురు గాక.

# 6. జీవాత్మ -పరమాత్మల ఏకీభావము (మాండూక్యోపనిషత్తు)

"ఈ ఉపనిషత్తు అధర్వణవేదం లోనిది. దీనిని దర్శించిన వాడు మండూకమహర్షి. అందుకే దీనికి ఆపేరు వచ్చింది. ఇది కేవలం పన్నెండు సూత్రాలతో ఉపనిషత్తులన్నింటిలోకీ అతిచిన్నదైన ఉపనిషత్తు. పరిమాణరీత్యా చిన్నదైనప్పటికీ, విషయపరిజ్ఞానంలో అన్ని ఉపనిషత్తులకన్నా మహత్తరమైనది. పన్నెండు సూత్రాలలో మానవచైతన్యపరిణామమంతా వివరించబడింది. జాగ్ర స్వప్న సుషుప్తులకు ఆధారము ఆత్మ అని చెప్పటమే ఈ ఉపనిషత్తు ప్రత్యేకత. దానిని గురించి వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

చరాచర జగత్తుకు ఆధారమైనది ఓంకారము. దానిలోని అకార ఉకార మకారాలే జాగ్ర స్వప్నసుషుప్తులు. ఇవే వ్యష్టిపరంగా విశ్వ తైజస ప్రాజ్ఞులు. సమిష్టిపరంగా విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరులు. వీటన్నిటికీ అతీతమైన బ్రహ్మను లేక ఆత్మను ఈ ఉపనిషత్తు దర్శింపచేస్తుంది. అందుచేతనే ముముక్షువులు విముక్తిపొందటానికి మాండూక్యమొక్కటి చాలు" అని ముక్తికోపనిషత్తు చెబుతున్నది.

అద్వైతసిద్ధాంత స్థాపనలో ఈఉపనిషత్తుకు అత్యున్నత స్థానమున్నది. **"అయమాత్మా బ్రహ్మ"** - నాలోని ప్రత్యగాత్మయే పరమాత్మ అగు బ్రహ్మ. అనే మహావాక్యము ఈ ఉపనిషత్తులోదే.

శంకర భగవత్పాదుల పరమగురువైన గౌడపాదాచార్యులవారు మాండూక్యోపనిషత్తుకు కారికలు వ్రాశారు. ఇవి మొత్తం 215 శ్లోకాలలో నాలుగు అధ్యాయాలుగా ఉంటాయి. అవి 1) ఆగమప్రకరణము 2) వైతధ్యప్రకరణము 3) అద్వైతప్రకరణము 4) అలాతశాంతి ప్రకరణము.

**1) ఆగమప్రకరణము :** ఇది పూర్తిగా ఉపనిషత్తు పైనే ఆధారపడి ఉన్నది. ఉపనిషత్తులోని 12 మంత్రాలనూ 29 శ్లోకాల (కారికల)లో వివరిస్తుంది. ఇందులో అవస్థా త్రయంలో ఉండే చైతన్యము ఒక్కటే అని చెప్పబడింది. ఈ మూడు అవస్థలలోనూ సాక్షిగా ఉండే ఆత్మయే తురీయము. తాను తురీయము అనే విషయం తెలియగానే సాధకుడు బంధనాల నుండి విముక్తిపొందుతాడు. ఆస్థితే ముక్తి.

**2. వైతథ్యప్రకరణము** : దీన్ని జగన్మిధ్యాప్రకరణము అంటారు. ఇందులో 38 శ్లోకాలలో జగత్తుఅంతామిధ్య అని నిరూపించబడుతుంది. ప్రపంచం అంతా మాయ. స్వరూపవిస్మృతి అంటే తననుతాను మరచిపోవటమే మాయ. మాయనుగనక ఛేదించగలిగితే ఆత్మసాక్షాత్కారమవుతుంది.

**3. అద్వైతప్రకరణము** : ఇందులో 48 శ్లోకాలలో యదార్ధ జ్ఞానానికి ప్రమాణాలైన ప్రత్యక్ష అనుమాన శబ్దాలు, అధ్యాత్మికానుభవం, అన్నింటి ద్వారా అద్వైతాన్ని నిరూపించటం జరిగింది.

**4. అలాత శాంతిప్రకరణము** : ఇది 100 శ్లోకాలలో ఉన్నది. అలాత మంటే మండేకట్టె. ఇందులో ఇతరమతాల వారి వాదనలు చెబుతూ, వారి వాదనలతోనే వారి సిద్ధాంతాలను ఖండిస్తారు. మండుతున్న కట్టెను గిరగిరా తిప్పినప్పుడు ఆమంట రకరకాల ఆకారాలలో కనిపిస్తుంది. తిప్పటంఆపివేయగానే ఆ ఆకారాలన్నీ మాయమైపోతాయి. ఆలోచిస్తే ఆ ఆకారాలు అసలులేవు. కట్టె కదలిక వల్ల అవిఉన్నట్టు భ్రాంతి కలిగింది. అలాగే ఈ ప్రపంచం కూడా మానసిక స్పందనవల్ల కనిపిస్తోంది. అంతేకాని దేనికి సృష్టిలేదు, లయమూ లేదు. ఈ భ్రాంతికి ఆధారం పరబ్రహ్మ.

ఈ రకంగా అద్వైత సిద్ధాంత స్థాపనలో మాండూక్యకారికలు చాలా ప్రసిద్ధి చెందాయి.

ఇక ఉపనిషత్తును చూస్తే .......... కంటికి కనిపించే ఈ జగత్తంతా ఓంకారమే ! భూత భవిష్యద్వర్తమానకాలములు ఓంకారమే ! అంతేకాదు ఆ మూడింటికీ అతీతమైనది కూడా ఓంకారమే. అంటే ఈ కాలముల సమిష్టి రూపం కూడా ఓంకారమే. అలాగే ఈ జగత్తుకు అతీతమైనదేదైనా ఉంటే అదికూడా ఓంకారమే. ఈ ప్రపంచాన్ని ఒక శబ్దం ద్వారా సూచించాలి అంటే ఆశబ్దము ఓంకారమే. ఏదైనా ఒక వస్తువును చెప్పదలచుకున్నప్పుడు, దాన్ని ఎంతవర్ణించినా ఒక్కొక్కసారి దాని స్వరూపం మనకర్థంకాదు. దాని పేరుగనక చెప్పినట్లైతే తేలికగా అర్థమవుతుంది. ఉదా ॥ ఆవు - దీన్ని వర్ణించి చెప్పేకన్న, దాని పేరు చెబితే తేలికగా తెలుస్తుంది. అలాగే ఈ జగత్తుకు అతీతమైనదాన్ని త్రికాలాతీతమైన దాన్ని గురించి తెలుసుకోవటానికి దానికిపెట్టినపేరే ఓంకారము. ఇది సమస్త కాలములకూ, జగత్తుకూ ప్రతీక. పరమేశ్వరుని దృశ్యరూపం ఈవిశ్వమయితే, శబ్దరూపం ఓంకారము. దీనితోనే పరమాత్మ దర్శనం కలుగుతుంది.

కనిపించే ఈ జగత్తంతా పరబ్రహ్మస్వరూపమే. అంటే పైకి కనిపించే విశ్వము మాత్రమే బ్రహ్మమని కాదు. కనిపించకుండా లోపల ఉండే ఆత్మకూడా బ్రహ్మమే. అంటే కంటికి కనిపించేదీ, కనిపించనిదీ కూడా బ్రహ్మమే. ఆత్మకు (బ్రహ్మనికి) నాలుగు పాదాలున్నాయి. ఇందులో మొదటి పాదం "వైశ్వానరుడు". వైశ్వానరుడు అంటే విశ్వంలోని నరులందరి లోనూ సమానంగా ఉండేవాడు. వారందరి ప్రతినిధి. జాగ్రదవస్థ ఇతని స్థానం. బాహ్య విషయాలను మాత్రమే ఇతడు గ్రహిస్తాడు. విశ్వము యొక్క వ్యష్టిరూపం వైశ్వానరుడైతే సమిష్టిరూపం విరాట్స్వరూపం. తేలికగా చెప్పాలంటే జీవాత్మే వైశ్వానరుడు. ఇతడికి ఏడు అంగములు, పందొనిమిది నోళ్ళూ ఉన్నాయి.

**సప్తాంగములు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. స్వరము | - | శిరస్సు | 5. జలం | - | మూత్రస్థానం |
| 2. సూర్యుడు | - | కన్ను | 6. భూమి | - | పాదాలు |
| 3. వాయువు | - | ప్రాణం | 7. ఆహవనీయాగ్ని | - | నోరు |
| 4. ఆకాశం | - | శరీరం | | | |

**పంథొనిమిది నోళ్ళు :**

| | | |
|---|---|---|
| 1. జ్ఞానేంద్రియాలు | - | 5 |
| 2. కర్మేంద్రియాలు | - | 5 |
| 3. పంచప్రాణాలు | - | 5 |
| 4. అంతఃకరణ చతుష్టయము | - | 4 |
| (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము) | | |
| మొత్తం | | 19 |

వీటి ద్వారానే ఇతడు బాహ్యజగత్తును అనుభవిస్తాడు. రెండవపాదం "తైజసుడు" దీన్నే తేజోవంతుడు లేదా మానసిక స్థితి అంటారు. స్వప్నావస్థ ఇతని సంచార స్థానం. కలలో చూచే విషయాలను గ్రహిస్తాడు కాబట్టే అంతర్ముఖమైన చేతన గలవాడు. ఇతనికి కూడా ఏడు అవయవాలు, పంథొనిమిది నోళ్ళు ఉన్నాయి. వీటితో వైశ్వానరుడు స్థూలవిషయాలను

అనుభవిస్తే, తైజసుడు సూక్ష్మవిషయాలను అనుభవిస్తాడు. విశ్వాత్మ యొక్క స్థూల సమిష్టి విరాడ్రూపం కాగా మానసిక స్థితి హిరణ్యా గర్భుడు.

నిద్రించినప్పుడు ఏ కోరికలూ లేని స్థితి సుషుప్తి. గాఢనిద్ర. సుషుప్తావస్థలో సంచరించే ప్రాజ్ఞుడే ఆత్మయొక్క మూడవ పాదం. అంటే ప్రాజ్ఞుడు సుషుప్తిలో ఉంటాడు. ఈ స్థితిలో భేదభావాలుండవు. జాగ్ర స్వప్నావస్థలలోని అనుభవాలు ఇక్కడ మిగలవు కరిగిపోతాయి. అన్ని అనుభవాలు ఏకమైపోతాయి. గ్రహణశక్తి నిలిచి పోతుంది. పరస్పర విరుద్ధభావాలు స్ఫురించవు. ఆ స్థితిలో ప్రాజ్ఞుడు ఆనందం అనుభవిస్తాడు. ఇది తమోగుణ ప్రధానమైన అవస్థ. ఇతడే అన్నిటికీ ప్రభువు. ఈశ్వరుడు సర్వమూ తెలిసినవాడు. అంతర్యామి. నియామకుడు. పరమేశ్వరుడు సమస్త జగత్తునూ సృష్టించినట్లే ప్రాజ్ఞుడు స్వప్నజగత్తును, జాగ్రదావస్థలోని జగత్తును సృష్టిస్తున్నాడు. ఇక నాల్గవపాదం తురీయ రూపం. ఇది అంతరమైన చేతన కాదు. బాహ్యమైన చేతన కూడాకాదు. కంటికి కనిపించదు.

తురీయస్థితికి ఇంకొక దానితో సంబంధం లేదు. మనసుచేత దీన్ని ఊహించలేము. అసలు ఊహించటానికే వీలుకానిది. వర్ణింపరానిది. గతంలో చెప్పిన ఆత్మతత్త్వపు వికారాలన్నీ దీనిలో కలిసిపోతాయి.

తురీయమే శాంతిస్వరూపం. అదే శివం. ఆనందమయం. అద్వైతం. అట్టి ఆత్మను గురించే తెలుసుకోవాలి. ఓంకారమే ఆత్మరూపం. ఆత్మ అక్షరాన్ని ఆశ్రయించింది. ఓం అనే ఆత్మను ఒక శబ్దంగా చెప్పినప్పుడు ఆత్మతోతాదాత్మ్యం పొందుతుంది. ఓంకారాన్ని గనక అకార ఉకార మకారాలుగా విభజిస్తే, అవే ఆత్మ యొక్క పాదాలు.

జాగ్రదావస్థ సంచారస్థానంగా గల వైశ్వానరుడు ఓంకారంలోని మొదటి అక్షరమైన అకారము. ఈ రెండూ సర్వత్రా వ్యాపించి ఉంటాయి. ఉచ్చరించటానికి నోరు తెరిస్తే ముందు వచ్చేది అకారము. అవస్థలలో జాగ్రదావస్థ మొదటిది. కాబట్టి ఈ రెంటికీ ఆదిమత్వం కూడా ఉన్నది. ఈ విషయం తెలుసుకున్న వాడి కోరికలన్నీ తీరతాయి. అందరిలోనూ మొదటివాడౌతాడు. స్వప్నావస్థ సంచారంగా గల తైజసుడు ఓంకారంలోని రెండవ అక్షరమైన ఉకారము. ఈ రెండూ శ్రేష్ఠమైనవి. మధ్యలో ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్నవాడికి జ్ఞానాభివృద్ధి జరుగుతుంది. అతడు అందరికీ సమానుడౌతాడు. అతని

వంశంలో బ్రహ్మజ్ఞానులేపుడతారు. గాఢనిద్ర సంచార స్థానంగా గల ప్రాజ్ఞుడు ఓంకారంలోని మూడవ అక్షరమైన మకారము. ఇవి మిగిలినవాటికి కొలత. వాటిని తమలో లీనం చేసుకుంటాయి. అకార ఉకారాలు మకరాంలోనూ, జాగ్రద్, స్వప్నావస్థలు సుషుప్తిలోనూ లీనమై పోతాయి. మళ్ళీ దాన్నుంచే పుడతాయి. ఈ విషయం తెలుసుకున్నవాడు తన జ్ఞానంతో అన్నిటినీ కొలిచిచూడగలడు. అన్నిటినీ తనలో లీనం చేసుకోగలడు. పైన చెప్పిన మూడు అంశలు లేనట్టి అనగా శబ్ద రహితమైనట్టి ఓంకారమే తురీయావస్థ. ఇది జాగ్రద్, స్వప్న, సుషుప్తులకు అతీతమైనది. అదే సర్వాతీతమైన ఆత్మ. నిర్వికారము, పరమానందము అయిన స్థితి. ఈరకంగా తురీయావస్థను పరమాత్మగా గుర్తించినవాడు తన ఆత్మను పరమాత్మలో లీనం చెయ్యగలుగుతాడు. అంటే అద్వైతస్థితి పొందుతాడు. ఇదే జీవాత్మ పరమాత్మల ఏకీభావము.

అంటూ మాండూక్యోపనిషత్తులోని అద్వైత సిద్ధాంతాన్నీ, జీవాత్మ-పరమాత్మల ఏకీభావాన్నీ వివరించాడు రత్నాకరుడు.

## 7. ఈశ్వరవచనము (ఈశావాశ్యోపనిషత్తు)

"ఇది శుక్ల యజుర్వేదానికి సంబంధించినది. ఉపనిషత్తులోని మొదటి మంత్రంలోని మాట వల్లనే దీనికాపేరువచ్చింది. మహత్తరమైన అధ్యాత్మికసత్యాలు ఇందులో ఉన్నాయి. సంహితలో అంతర్గతంగా ఉన్నది కాబట్టే ఈశావాస్యానికి 'సంహితోపనిషత్తు' అని పేరు వచ్చింది. ఇది మొత్తం మంత్ర రూపంలో ఉంటుంది కాబట్టి దీనికి 'మంత్రోపనిషత్తు' అని పేరు. మంత్రోపనిషత్తులలో కూడా ఈశావాశ్యము మకుటాయమానమైనది. ఆ ఉపనిషత్తును గురించి వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఇందులో మొత్తం పద్దెనిమిది మంత్రాలున్నాయి. ఆ మంత్రాలు ఆత్మయొక్క సత్యస్వరూపాన్ని వ్యక్తంచేస్తుంటాయి. ఇవి కర్మకాండకు ఉపయోగించవు. అజ్ఞానాన్ని తొలగించి ఆత్మసాక్షాత్కారాన్ని కలుగచేస్తాయి. జీవాత్మ పరమాత్మ రెండూ ఒక్కటే అనే అద్వైత సిద్ధాంతాన్ని ప్రబోధిస్తాయి. ఈ ఉపనిషత్తులో పూర్తిగా ఆత్మధ్యాన నిష్టనవలంభించటానికి అధికారియైన సన్యాసికి అతడు చేయవలసిన ధర్మాలు వివరించబడుతున్నాయి.

అనిత్యమైన ఈ ప్రపంచంలో పరివర్తనాశీలమైనది ఏదైతే ఉన్నదో, అదంతా పరమేశ్వరుడి చేతనే ఆవరించబడి ఉన్నది. మనకళ్ళకు కనిపించేదంతా ఆత్మస్వరూపము, పరమేశ్వరమయము. ఈ ఐశ్వర్యము నిత్యముకాదు. అశాశ్వతమైన వాటి మీద కోరికను వదలిపెట్టు. ప్రాపంచిక సుఖాలను పరిత్యజించు. ఇతరుల ధనాన్ని ఆశించకు. ఇతరుల మీద ఆధారపడకు. జీవాత్మ పరమాత్మ రెండూ ఒక్కటే అని తెలిసినప్పుడు సంసారబంధనాలుండవు. సృష్టిలోని వస్తువులన్నీ పరమాత్మస్వరూపమే అయినప్పటికీ నామరూపక్రియాదులచే వేరువేరుగా కనిపిస్తాయి. ధనేషణ దారేషణ పుత్రేషణ అనబడే ఈషణ త్రయాన్ని చంపుకో. సంపదల కోసం ప్రాకులాడకు. సిరిసంపదలు శాశ్వతం కాదు. సర్వమూ పరమేశ్వరమయం కాబట్టి నిష్కామ్యకర్మ చెయ్యి. దొరికిన దానితో తృప్తిపొందు. అందులోనే శాశ్వతమైన ఆనందాన్ని అన్వేషించు. అనుభవించటం వల్ల కోరికలు తీరవు.

సర్వసంఘపరిత్యాగం చేసినప్పటికీ ఆత్మధ్యానంలో లీనంకాలేని వారు, కర్మాధికారం కలవారు యజ్ఞయాగాదులైన ధర్మకర్మలు చేస్తూ చిత్తశుద్ధి సంపాదించుకోవాలి. లేకపోతే వారికి పతనం తప్పదు. నిస్వార్థకర్మలు, పుణ్యకర్మలు చేస్తేతప్ప పతనంనుంచి తప్పించుకోలేరు. పాపకర్మలు అంటుకోకుండా ఉండాలంటే ఇంతకు మించిన మార్గం మరొకటి లేదు.

నిష్కామకర్మ చేసే వాడికి కర్మఫలము అంటదు. ఆత్మస్వరూపం తెలుసుకోలేనివారు ఆత్మ ఘాతుకులు. అన్నిప్రాణులయందు ఆత్మఉన్నదని తెలుసుకోలేనివారు ఆత్మహత్య చేసుకునే వారితో సమానులు. వీరు అజ్ఞానాంధకారంలో మునిగిపోయి మరణానంతరము పాపలోకాలకు పోతారు. అజ్ఞానము ఆవరించి ఉండటం చేత వీరు మళ్ళీ మళ్ళీ పుడుతుంటారు. అజ్ఞానులు ఇంద్రియసుఖాలపట్ల ఆసక్తి కలిగిఉంటారు. అందుచేతనే వీరికి పునర్జన్మ తప్పదు. ఆత్మతత్త్వాన్ని సాక్షాత్కరింపచేసుకోవటంపట్ల నిర్లక్ష్యం ప్రదర్శించేవారు ఆధ్యాత్మికంగా ఆత్మహత్య చేసుకున్న వారే. ఇక ఆత్మను గురించి వినండి.

ఆత్మచలనంలేనిది·శాశ్వతమైన సత్యస్వరూపమే ఆత్మ. ఇది చాలా వేగంగా ప్రయాణం చేస్తుంది. శరీరంలోని ఇంద్రియాలకు అధిపతి మనస్సు. ఇది చాలా వేగంగా ప్రయాణిస్తుంది. కాని ఆత్మ మనస్సుకన్న చాలా వేగంగా ప్రయాణిస్తుంది. ఆత్మ సర్వవ్యాపి. ఇంద్రియాలు దీన్ని ఎరగవు. ఆత్మ అన్నిలోకాలలోనూ లోపలా బయటా కుడా ఉంటుంది. అందుచేతనే ఆత్మ తాను ఒకఅడుగైనా కదపకుండానే అన్నింటికన్నా ముందు ఉంటుంది. ఆత్మ ఉండటం వల్లనే అంతరిక్షంలోని వాయువు సమస్త ప్రాణులకు కర్మలు చెయ్యటానికి కదలిక ఇస్తాడు. అంటే ఆత్మయే ప్రాణశక్తిని వాయువునందుంచి అతని ద్వారా జీవకోటిని చైతన్యం చేస్తోంది. ఆత్మకు చలనమున్నది. చలనం లేదు. అనగా నిజమైన స్థితిలో ఆత్మ చలించదు. ఆత్మ నిశ్చలమైనప్పటికీ మనసుకు ఆధారంకావటంచేత చలించినట్లు కనిపిస్తుంది. ఆత్మ దూరంలోఉన్నది. దగ్గరగాఉన్నది. అంటే సర్వత్రా వ్యాపించిఉన్నది. అజ్ఞానులకు మాత్రం దూరంగా ఉన్నది. వాళ్ళు దానిని చేరుకోలేరు. జ్ఞానులకు మాత్రం చాలా దగ్గరలో ఉంటుంది. ఆత్మ లోపలా బయటా ఉన్నది. సృష్టికి అతీతమైనది. అది ఉపాధియుతము, ఉపాధిరహితము కూడా. అంచేత అంతటా వ్యాపించి ఉన్నది. అన్ని భూతాలనూ తనలో చూడగలిగినవాడు ఎవరినీ ద్వేషించడు. అతడిని సమదర్శి అంటారు. స్వార్థబుద్ధి వల్లనే ద్వేషం కలుగుతుంది. అన్ని జీవులయందు ఆత్మ ఒక్కటే అనే విషయం గ్రహించినప్పుడు ద్వేషానికి, అసహ్యానికీ తావుండదు. ఆత్మజ్ఞానం సంపాదించిన వానికి, లోకంలోని సమస్త భూతములు తన ఆత్మగానే కనిపిస్తాయి. తనకు మించిన వేరు వస్తువుండదు. అట్టి వాడికి సుఖ దుఃఖాలు ఉండవు. ఆత్మ ఆకాశంలాగా సర్వవ్యాపకమైనది. దీనికి స్థూల సూక్ష్మకారణ శరీరాలు లేవు. ఇది అన్నింటినీ చూస్తుంది. అన్నిటినీ చుట్టుకుని ఉంటుంది. ఆత్మపరిశుద్ధుడు, అశరీ గాయములు లేనివాడు (అవణుడు) అస్నాయువు. పాప రహితుడు. పరిపూర్ణుడు, స్వచ్ఛము,

సర్వదర్శి, సర్వవిదుడు, సర్వోత్తముడు. జీవుల కర్మలననుసరించి వారికి భోగ్యపదార్థాలు అందజేశాడు. సృష్టికర్తలను నియమించాడు. ప్రజాపతులకు వారి వారి విధులను అప్పగించాడు. అతని శాసనాలను ఎవరూ ఉల్లంఘించలేరు. ఇప్పుడు కర్మ, ఉపాసనల సమన్వయం వినండి.

అవిద్యను ఆరాధించేవారు అంటే ఆత్మజ్ఞానం లేకుండా యజ్ఞకర్మలను ఆరాధించేవారు గాఢాంధకారంలో పడిపోతారు. కర్మలను వదలి కేవలం ఉపాసనలో నిమగ్నమైనవారు ఇంకా అంధకారంలో పడిపోతారు. అందుచేతనే జ్ఞానరహితమైనఉపాసనవల్లగాని, ఉపాసనారహితమైన జ్ఞానంవల్లగాని సద్గతి కలుగదు. వీటిని విడివిడిగా అనుష్టించేవారు ఆత్మజ్ఞానానికి దూరమై తామసలోకాలకు పోతారు. ఆత్మజ్ఞానానికి కర్మాచరణ, ఉపాసన రెండూ ముఖ్యమే. అప్పుడే సత్ఫలితం ఉంటుంది. విద్యోపాసన (ఉపాసన) వల్ల దేవలోకము, అవిద్యోపాసన (కర్మల) వల్ల పితృలోకము వస్తాయి. వీటినే ఉత్తరాయణ, దక్షిణాయణాలు అంటారు. ఈ రెండూ తెలిసినవాడు అవిద్యచే మృత్యువును జయించి విద్యతో దైవత్వం పొందుతాడు. విద్య, అవిద్య రెండూ పరమేశ్వర స్వరూపాలే. ఈ రెంటినీ సమానంగానే ఉపాసించాలి. అవిద్య (కర్మాచరణ) వల్ల శరీరం వదిలి, విద్య (ఉపాసన)తో జన్మరాహిత్యం పొందాలి. జగత్తును దాటటానికి కర్మాచరణ, జన్మరాహిత్యానికి ఉపాసన రెండూ అవసరమే అని తెలిసి ఆచరించినవాడు కర్మవలన సంచిత కర్మను నాశనం చేసి, ఉపాసన వల్ల దైవత్వం పొందుతాడు. అసంభూతి (ప్రకృతి)ని ఉపాసించేవారు అంధకారంలో ప్రవేశిస్తారు. సంభూతి (సాకారబ్రహ్మ, హిరణ్య గర్భుడు)ని ఉపాసించేవారు అంతకన్నా ఘోరమైన చీకటి లోకాలలో ప్రవేశిస్తారు. ఈ రకంగా సంభూతిని ఉపాసించటం వల్ల ఒక ఫలితము, అసంభూతిని ఉపాసించటంవల్ల ఒక ఫలితము వస్తుంది. సంభూతిని ఉపాసించేవాడు అణిమాది అష్టసిద్ధులు పొందుతాడు. అవ్యక్తోపాసన చేసేవాడు ప్రకృతి నిలయిం చెయ్యగలుగుతాడు. ఈ రెంటినీ అర్చిస్తే ముందుగా మృత్యువును జయించి తరువాత అమృతత్వం పొందుతాడు.

సాధకుడు విద్య, అవిద్యల సత్యాన్ని తెలుసుకుని ఆత్మసాధనలో పురోగమించాడు. అజ్ఞానం తొలగిపోయింది. సత్యదర్శనమయింది. సూర్యుణ్ణి ప్రత్యక్షంగా చూస్తూ "ఓ సూర్యుడా ! ప్రజాపతిపుత్రుడా ! స్వర్గవీధిలోని బాటసారీ ! సర్వపోషకా ! నీకిరణాలను కాస్త తొలగించు, కాంతిని ఉపసంహరించుకో, నీ అనుగ్రహంతో నీరూపాన్ని చూడటానికి వీలుగా నీతేజస్సును ఉపసంహరించుకో. నేను దేహత్యాగం చేస్తున్నాను కాబట్టి నాప్రాణములు

అనంతవాయువులలో కలిసిపోవుగాక, శరీరం భస్మమైపోవుగాక. సంకల్ప వికల్పాత్మకమైన ఓ మనసా ! పూర్వకర్మలను గుర్తుతెచ్చుకో".

ఇంతవరకూ బంధనాలలో కూరుకుపోయిన సాధకుడు శరీరాన్ని, బంధనాలను త్యజిస్తూ "ఓ అగ్నిదేవా ! నేను చేసిన పుణ్యఫలము అనుభవించటానికి నన్ను సన్మార్గంలో తీసుకుపో. ఓదేవా ! నేను చేసిన కర్మలన్నీ నీకు తెలుసు. నాపాపాలన్నీ నశింపచెయ్యి, జనన మరణాలతో విసిగిపోయాను. తండ్రీ ! పునరావృత్తి రహితమైన లోకాలకు నన్ను తీసుకునిపో. నీకు అనేకవేలనమస్కారాలు." ఈ రకంగా సాధకుడు తనను ఉత్తరాయణ మార్గం (అర్చిరాది మార్గం)ద్వారా బ్రహ్మలోకానికి తీసుకుపొమ్మని, జన్మరాహిత్యం చెయ్యని పరమేశ్వరుణ్ణి అవసాన దశలో ప్రార్థిస్తున్నాడు". అని చెప్పి రత్నాకరుడు ఈశోపనిషత్తును ముగించాడు.



## 8. ఆత్మ చైతన్యము (కేనోపనిషత్తు - 1)

"సామవేదంలోని తలవకార బ్రాహ్మణంలో కేనోపనిషత్తు ఉన్నది. అందుచేతనే దీనిని 'తలవకారోపనిషత్తు' అంటారు. 'కేన' అనే పదంతో ప్రారంభమవటం చేత ఈ ఉపనిషత్తుకు 'కేనోపనిషత్తు' అని పేరువచ్చింది. దానిని గురించి వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

బ్రహ్మజిజ్ఞాసి అయిన శిష్యుడు గురువుగారిని అడుగుతున్నాడు."స్వామీ! నేలమీద రథము గాని, నీటి పైన పడవగాని చైతన్యవంతము కావాలంటే ఎవరిదైనా ప్రేరణ ఉండాలికదా ? అలాగే మనస్సు, ఇంద్రియాలు అన్నీ జడములు. ఇవి తమంత తాము వ్యవహరించలేవు. మనస్సును ఆదేశిస్తున్న ప్రభువెవరు? ప్రాణవాయువు ఎవరి ప్రేరణ వలన చరించుచున్నది ? వాక్కు ఎవరి ఆజ్ఞచే వర్తించుచున్నది ? అలాగే కనులు, చెవులు మొదలైనవన్నీ ఎవరి ప్రేరణచేత చరించుచున్నాయి ? ఆశక్తిని గూర్చి నాకు తెలియచేయండి!

శిష్యుడు అడిగిన ప్రశ్నకు గురువు చాలా సంతోషించి ఈ విధంగా చెప్పటం మొదలు పెట్టాడు. "ఇంద్రియాలు వేరు ఆత్మవేరు. ఇంద్రియాలే ఆత్మకాదు. చెవికి శబ్ద గ్రహణ శక్తిని, మనస్సుకు ఆలోచనా శక్తిని, వాక్కుకు సంభాషణా శక్తిని, కంటికి దృశ్యశక్తిని ప్రసాదించే చైతన్యమూర్తి 'ఆత్మ'. కాబట్టి ఇంద్రియాలే ఆత్మ అనే భ్రాంతిని వీడి వాటికి వసుడుకానివాడు అమరుడౌతాడు.

ఇంద్రియాలను ప్రేరేపించేది ఆత్మ. కాబట్టి వాటికి ఆత్మతత్త్వము ఏమిటో తెలియదు. ఆత్మ యొక్క శక్తి చేతనే కన్ను చూస్తోంది. చెవి వింటోంది. నోరు మాట్లాడుతోంది. మనస్సు ఆలోచిస్తోంది. ప్రాణం పనిచేస్తోంది. కాబట్టి వాటికి ఆత్మను గురించి తెలియదు. అటువంటి ఆత్మను ఇంద్రియాల నుండి వేరుచేసి, ఇంద్రియాలకు లోబడకుండా జీవించేవాడు మృత్యువుని జయిస్తాడు. ఇంద్రియాలన్నీ జడాలు. వాటికి చైతన్యంలేదు. కాని చైతన్యం ఉన్నట్టు కనిపిస్తాయి. ఆత్మశక్తి వాటి వెనుక ఉండి నడిపిస్తున్నది. అజ్ఞాని ఇంద్రియాలుచేతనాలు అనుకుంటాడు. జ్ఞాని ఆత్మస్వరూపం తెలుసుకుంటాడు. ఆత్మను గుర్తించటం ఎలా ? అంటే....

ఆత్మ ఎక్కడైతే ఉన్నదో అక్కడికి కన్నుగాని, మాటలుగాని పోలేవు. అందుచేత ఇంద్రియాలతో ఆత్మను గుర్తించ వీలుకాదు. ఇంద్రియాలను ప్రేరేపించేదే ఆత్మ కాబట్టి ఇంద్రియాలు తమను నడిపించే ఆత్మను చేరలేవు. ఆత్మ ఇంద్రియాలకే కనిపించనప్పుడు, వాటి ద్వారా ఆత్మను మనమెలా చూడగలం ? ఆత్మ అనేది మనకు తెలిసిన దానికన్న భిన్నమైనది. తెలియని దానికన్న అతీతమైనది. అంటే అవ్యక్తమైనది. దాన్ని అనుభవం ద్వారా

మాత్రమే తెలుసుకోవాలి. ఇది ప్రమాణాలకు , తర్కానికి అందదు. అందుచేత గురువు ద్వారామాత్రమే ఆత్మను గురించి తెలుసుకోవాలి.

మాటలు దేనిని ప్రకటించలేవో, దేనివల్ల మాటలు ప్రకాశితమౌతున్నాయో అదియే బ్రహ్మము, ఆత్మ. సామాన్య జనులుపాసించే దేవతాప్రతిమలు బ్రహ్మముకాదు. వాటి రూపంలో ప్రకాశించేమూలతత్త్వమే బ్రహ్మ. కనులు ఆత్మను చూడలేవు. కాని కనులకు చూసేశక్తిని ప్రసాదిస్తున్నదే ఆత్మ. మానవుడు చెవుల ద్వారా దేనిని వినలేడో, ఏది చెవులకు వినికిడి జ్ఞానం ప్రసాదిస్తున్నదో అది ఆత్మ. ముక్కు ఆత్మను వాసనచూడలేదు. కానీ ముక్కుకు వాసన చూసే శక్తిని ప్రసాదించేది ఆత్మ. ఈ రకంగా ఇంద్రియాలన్నీ పనిచేసే శక్తిని ఆత్మ ద్వారానే పొందుతాయి. ఇంద్రియాల కార్యకలాపాలకు సాక్షి, నియంత కూడా ఆత్మే. ఈరకంగా ఇంద్రియాలకు శక్తిని ప్రసాదించే బ్రహ్మమును గురించి ఇంద్రియాలు తెలుసుకోలేవు.

నాయానా ! 'పరబ్రహ్మ స్వరూపమును నేను తెలుసుకున్నాను' అని ఎవరైనా అంటే అది వట్టి అబద్ధము. అతని జ్ఞానము అత్యల్పమైనది. మానవులేకాదు, ఈమాట దేవతలు చెప్పినా అబద్ధమే. నేను బ్రహ్మమును బాగా తెలుసుకున్నాను అని అన్న వాడికి తెలిసింది చాలా తక్కువ. అతడు తెలుసుకోనవలసినది చాలా ఉన్నది." అన్నాడు.

గురువుగారి మాటలకు శిష్యుడు ఆలోచించి బ్రహ్మను సాక్షాత్కరింపచేసుకుని "గురువర్యా నేను బ్రహ్మము గూర్చి తెలుసుకున్నాను" అన్నాడు. దానికి గురువుగారు.

నాయనా ! నీవు తెలుసుకున్నది చాల తక్కువ బ్రహ్మ జ్ఞానం పొందినవాడు బ్రహ్మమే సర్వస్వము అంటాడు. బ్రహ్మము గురించి ఎవరికి తెలియదో అతనికి తెలుసు. ఎవరికి తెలుసో అతనికి తెలియదు. ఎందుచేతనంటే పండితులకు బ్రహ్మము తెలియదు. జ్ఞానులకు తెలుసు. బ్రహ్మము మానసిక భావాలకతీతమైనది. ఎవరైతే బ్రహ్మసాక్షాత్కారం పొందుతారో వారుమాత్రమే దాన్ని గురించి గ్రహిస్తారు. మానసికవికారం ద్వారా ఆత్మస్ఫూర్తిని గోచరింప చేసుకునే వాడు అమరత్వం పొందుతాడు. అమరత్వం పొందటమంటే ఆత్మయొక్క స్వభావాన్ని పొందటం. అజ్ఞానమనేది సంసారబంధనానికి కారణం మనోవికారాలన్నిటిలోనూ ఆత్మే కలిసి ఉంటుంది. ఆ వికారాలకు స్ఫూర్తినిచ్చేది ఆత్మ. ఆత్మసాక్షాత్కారం పొందినవాడు ప్రతివికారంలోనూ ఆత్మను చూడగలుగుతాడు.

జ్ఞానంవల్ల భేదదృష్టిపోయి కష్ట సుఖాలు, లాభ నష్టాలు అన్నీ ఒకటే అవుతాయి. దీపం వల్ల చీకటి తొలగిపోయినట్లుగా జ్ఞానం వల్ల అజ్ఞానం నశిస్తుంది. అజ్ఞానం నశించిన వాడికి ఆత్మసాక్షాత్కారమవుతుంది. అదే జీవన్ముక్తి." అంటూ కేనోపనిషత్తులోని ఆత్మ చైతన్యాన్ని గురించి శిష్యులకు వివరించాడు రత్నాకరుడు.

# 9. ఉమాదేవి (కేనోపనిషత్తు - 2)

"శిష్యులారా! జగత్తులో పరమేశ్వరతత్త్వాన్ని మించినది ఏదీ లేదు. గెలుపు ఓటములు, జయాపజయాలు, సుఖదుఃఖాలు అన్నీ పరమేశ్వరుని లీలలే. వీటికి ఎవరూ అతీతులుకారు. శతృసంహారము, విజయము అనేవి తమశక్తి సామర్ధ్యాల వల్లనే లభించాయని అనుకోరాదు. ఆ విధంగా ఊహించిన దేవతలకు కనువిప్పు కలిగించాడు పరమాత్మ. ఆ విషయాన్ని ఇప్పుడు మీకు వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఒకసారి దేవదానవ సంగ్రామం మహాభీకరంగా జరిగింది. అందులో దేవతలు విజయం సాధించారు. ఆ విజయం తమవల్లనే సాధించబడిందని, దానికి కారణం తామేనని దేవతలలో ప్రతివారూ గర్వంతో విర్రవీగిపోయారు. దీనికంతటికీ కారణమైన పరబ్రహ్మను మరచిపోయారు. విజయోత్సాహంతో దేవతలంతా సభతీర్చారు. అందులో ఎవరి ప్రతాపాన్ని వారు చెప్పుకోవటం మొదలుపెట్టారు. ముందుగా అగ్ని దేవుడు తను అగ్ని జ్వాలలు ప్రజ్వలింప చేస్తే, ఆ అగ్ని శిఖలలో రాక్షసులు మాడిపోతూ దిక్కు తోచక పలాయనం చిత్తగించారు. అంటూ తన శక్తిసామర్ధ్యాల గురించి గర్వంగా చెప్పాడు. తరువాత వాయువు లేచి తను చండప్రచండంగా గాలులు వీస్తుంటే వాటి తాకిడికి నిలవలేక రాక్షసులు పలాయనం చిత్తగించారు అన్నాడు. ఈ రకంగా దేవతలంతా తమ పరాక్రమాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారు.

బ్రహ్మతత్త్వం ఇదంతా గమనిస్తోంది. దేవతల అహంకారం పోగొట్టాలని నిర్ణయించుకుంది. అనుకున్నదే తడవుగా వారి ఎదుట భయంకరమైన యక్షరూపంలో ప్రత్యక్షమైంది. చూశారు దేవతలు. అదేమిటో వారికి అర్థం కాలేదు. ఆ రూపాన్ని చూసి భయపడ్డారు. ఏంచెయ్యాలో పాలుపోలేదు.

దేవాసుర సంగ్రామంలో రాక్షసులను భయంకరమైన అగ్ని కీలలతో కాల్చివేశానని చెప్పినవాడు అగ్ని దేవుడు. అందుకని దేవతలందరూ అగ్ని దేవుని సమీపించి "ఓ అగ్ని దేవా! ఏదో భయంకరమైన తత్త్వం ఇక్కడ ప్రత్యక్షమైంది. అదేమిటో మాబుద్ధికి అర్థం కావటం లేదు. కాబట్టి నీవు వెళ్ళి దాన్నిగురించి తెలుసుకుని రావలసినది" అన్నారు.

'సరే' అని బయలుదేరాడు అగ్ని దేవుడు. ఆతత్త్వాన్ని సమీపించాడు. భూతంలాటి ఆ తత్త్వం అగ్నిదేవుని చూసి అడిగింది "ఎవరు నువ్వు"?

"నేను అగ్ని దేవుడను. లోకంలో అందరూ నన్ను 'జాతవేదుడు' అంటారు.".

"అయితే నీశక్తి సామర్ధ్యాలేమిటి ?

"లోకంలోని ఏ వస్తువునైనా సరే క్షణంలో కాల్చి బూడిద చేస్తాను".

'అంత గొప్ప వాడినా'? అయితే ఈ గడ్డిపోచను దగ్ధంచెయ్యి' అంటూ ఒక గడ్డి పరకను అక్కడ ఉంచింది ఆ తత్త్వం.

ఆ గడ్డిపరకను చూచి చాలా తేలిక భావంతో మంటలు సృష్టించాడు అగ్ని దేవుడు. గడ్డిపరక కాలలేదు. భయంకరమైన అగ్ని శిఖలు సృష్టించాడు. లాభం లేకపోయింది. గడ్డి పోచ అలానే ఉంది. అగ్ని దేవుడు వెనుక్కు తిరిగి దేవతల వద్దకు వెళ్ళి "ఆతత్త్వం ఏమిటో నాకూ పాలుపోలేదు. దాన్ని అర్థం చేసుకోటానికి నాశక్తి చాలలేదు" అన్నాడు.

అప్పుడు దేవతలంతా వాయుదేవుని సమీపించి "దేవా ! నీవు చాలా గొప్ప వాడివి కదా! ఆ తత్త్వం ఏమిటో నువ్వైనా కనుక్కో" అన్నారు.

'సరే' అని బయలుదేరాడు వాయువు, ఆ తత్త్వాన్ని సమీపించాడు. పూర్వంలో లాగానే ఆతత్త్వం ప్రశ్నించింది.

"ఎవరు నువ్వు?"

'నేను వాయుదేవుడను. ఆకాశంలో సంచరిస్తుంటాను. కాబట్టి నన్ను 'మాతరిశ్వుడు' అని కూడా అంటారు."

"నీశక్తి ఏమిటి ?"

లోకంలో ఏ వస్తువునైనా సరే నాగాలులతో ఎగురగొట్టగలను".

"అయితే దీన్ని ఎగరగొట్టు" అంటూ ఇది వరకటి లాగానే గడ్డిపోచను అక్కడ ఉంచింది ఆ తత్త్వం. వాయుదేవుడు తన బలాన్ని కూడగట్టుకుని ముందుకు వెళ్ళాడు, భయంకరమైన గాలులు వీచాడు. గడ్డిపోచ కదలలేదు. వచ్చిన దారినే వెనక్కు వెళ్ళి దేవతలతో "ఆ తత్త్వం ఏమిటో నాకు అర్థం కాలేదు" అన్నాడు.

అప్పుడు దేవతలందరూ తమ ప్రభువైన ఇంద్రుని దగ్గరకు వెళ్ళి అతనికి జరిగిన సంగతంతా వివరించి "దేవేంద్రా! ఆ విచిత్రమైన తత్త్వం ఏమిటో నువ్వైనా కనుక్కోవలసినది" అన్నారు.

'సరే' అంటూ తన వజ్రాయుధం తీసుకుని ఆతత్త్వం దగ్గరకు వెళ్ళాడు దేవేంద్రుడు. వెంటనే ఆశక్తి మాయమై పోయింది. దాని స్థానంలో మహా సౌందర్యరాశియైన ఒక స్త్రీమూర్తి కనిపించింది. ఆమె హిమవంతుని కుమార్తె హైమవతి. ఆమెను ఉమాదేవి అని కూడా అంటారు.

ఆశ్చర్యంగా చూసిన ఇంద్రుడు ఉమాదేవిని ప్రశ్నించాడు "అమ్మా! దేవతలనందరినీ భయభ్రాంతులతో ముంచివేసిన ఆయక్షుడెవరు ? ఆ తత్త్వము ఏమిటి"?

"ఆశక్తి యే బ్రహ్మము" అని ఉమాదేవి సమాధాన మిచ్చింది. ఆ తరువాత ఇంద్రునితో "ఓ దేవేంద్రా ! బ్రహ్మము వల్లనే కదా మీరు విజయం పొందింది. మీ గొప్పదనానికి కారణము బ్రహ్మము. మీ అల్పబుద్ధివల్ల ఇప్పటి వరకు కనుపించిన తత్త్వమే బ్రహ్మమని గుర్తించలేక పోయారు. ఆ బ్రహ్మతత్త్వమే మీ శరీరంలో శక్తిని వ్యాపింప చేస్తోంది. దాని వల్లనే మీరంతా అసురులను సంహరించగలిగారు. దాని వల్లనే ఈ మహాత్మ్యము మీరు పొందగలిగారు. అంతే గాని అదంతా మీగొప్పదనం అని అహంకరించకండి" అని చెప్పి అదృశ్యమైపోయింది.

పరబ్రహ్మతత్త్వాన్ని చూసినందువల్లనే అగ్ని, వాయువు, ఇంద్రుడు మిగిలినదేవతల కన్న గొప్ప వారైనారు. బ్రహ్మాన్ని ముందుగా తెలుసుకున్నవారు వారే. ఆ శక్తియే బ్రహ్మమని ముందుగా తెలుసుకున్నవాడు ఇంద్రుడు. అందుకనే అతడు దేవతలలో శ్రేష్టుడైనాడు. దేవతలగొప్పదనానికి, వారి శక్తికి కారణము బ్రహ్మము. వారి ప్రాణమే బ్రహ్మము.

ఈ జగత్తులోని మెరుపు తీగ బ్రహ్మము. మానవుని రెప్పపాటుకూడా బ్రహ్మమే. దాని వల్లనే మనస్సు బాహ్య ప్రపంచాన్ని గురించి తెలుసుకుంటుంది. తెలుసుకున్న దాన్ని జ్ఞాపకం ఉంచుకుంటుంది. దానివల్ల ఇతరమైన వాటిని ఊహిస్తుంది.

మనస్సుకున్న శక్తులు మూడు.

1. విషయాన్ని గ్రహించటం 2. జ్ఞాపకముంచుకోవటం 3. ఊహించటం. వీటిన్నింటికీ కారణము బ్రహ్మమే.

అదే అన్నిజీవులకు ఆత్మ. అందుచేత పూజనీయమైనది. ఈ విషయం తెలిసిన వాడిని అన్ని జీవులూ ప్రేమిస్తాయి. అన్ని జీవులూ తమ ఆత్మగా భావిస్తాయి. అతడే పరమాత్మ స్వరూపుడు.

"తపస్సు, ఇంద్రియనిగ్రహము, యజ్ఞయాగాదులు బ్రహ్మజ్ఞానానికి ముఖ్యమైనవి. వేదాలు చదవటంవల్ల బ్రహ్మజ్ఞానం పొందటానికి అవసరమైన శక్తి వస్తుంది. శమ దమాదులు, కర్మలు దీనికి గోడలవంటివి. బ్రహ్మజ్ఞానాన్ని పొందినవాడు సాక్షాత్తు బ్రహ్మ స్వరూపుడు.' ' అంటూ కేనోపనిషత్తును ముగించాడు రత్నాకరుడు.

# 10. ప్రాణికోటి పుట్టుక (ప్రశ్నోపనిషత్తు. ప్రశ్న-1)

"బ్రహ్మజ్ఞాన జిజ్ఞాసుడైన శిష్యుడు మంచి గురువును ఎంచుకోవాలి. అటువంటి గురువు శిష్యుల యొక్క సందేహాలను తీర్చి, వారికి బ్రహ్మజ్ఞానము ఉపదేశిస్తాడు. పూర్వకాలంలో పిప్పలాదుడు తన శిష్యులకు చేసిన బ్రహ్మోపదేశము మీకు వివరిస్తాను వినండి" అంటూ ప్రశ్నోపనిషత్తును ప్రారంభించాడు రత్నాకరుడు.

ఈ ఉపనిషత్తు అథర్వవేదానికి సంబంధించినది.

పిప్పలాదమహర్షి మహాజ్ఞాని. బ్రహ్మవేత్త. ఒకరోజు భరద్వాజుని కుమారుడైన సుకేశుడు శిబి పుత్రుడైన సత్యకాముడు, సూర్యుని మనుమడైన గార్గ్యుడు, అశ్వలుని కుమారుడైన కౌశల్యుడు, విదర్భ దేశీయుడైన వైదర్భి, కత్యుని ముని మనుమడైన కబంధి అనే వారు పిప్పలాద మహర్షి దగ్గరకు వచ్చారు. వీరందరూ నియమనిష్ఠలతో జీవితం గడుపుతున్నవారు. వేదాలను అధ్యయనం చేసినవారు. సగుణ బ్రహ్మారాధనలో శ్రేష్టులు. ఇప్పుడు నిర్గుణ బ్రహ్మను తెలుసుకోవాలనే తలంపుతో సరి అయిన గురువు కోసం వెతకటం మొదలు పెట్టారు. ఆ కాలంలో పిప్పలాదుడు మహాజ్ఞాని, బ్రహ్మవేత్త. అందుచేత ఆయన దగ్గర బ్రహ్మజ్ఞాన సముపార్జన చెయ్యాలనే తలంపుతో ఆచార ప్రకారము సమిధలు చేతితో పట్టుకుని పిప్పలాదుణ్ణి దర్శించారు. వచ్చిన వారిని చూసి పిప్పలాదుడు "నాయనలారా ! మీరందరూ బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోవటం కోసం నా దగ్గరకు వచ్చారు. చాలా ఆనందంగా ఉంది. అయితే ఒక సంవత్సరం పాటు బ్రహ్మచర్యం పాటిస్తూ నియమనిష్ఠలతో, తపస్సుచేస్తూ ఆశ్రమప్రాంగణంలో కాలం గడపి ఆ తరువాత మీ ప్రశ్నలు అడగండి. నాకు తెలిసినంత వరకూ సమాధానం చెబుతాను" అన్నాడు. అలాగే అని మహర్షి చెప్పినట్లే సంవత్సరకాలం నియమనిష్ఠలతో పూర్తి చేశారు. ఆ తరువాత ఒకరోజు కత్యుని మునిమనుమడైన కబంధి పిప్పలాదుణ్ణి అడిగాడు" ఓ మహర్షీ ! జగత్తులోని ప్రాణి కోటి అంతా ఎక్కడ నుండి పుడుతున్నది ?" పిప్పలాదుడు కబంధుడికి ఈ రకంగా చెబుతున్నాడు. కబంధా! "ప్రజాపతి సంతానాన్ని పొందాలనే కోరిక గలవాడై తపస్సు చేశాడు. ఇక్కడ తపస్సు అంటే పూర్వకల్పంలో తాను చేసిన సృష్టిని ధ్యానించటం.

ఈ రకంగా తపస్సు చేసి 'రయి', 'ప్రాణము' అనే జంటను సృష్టించాడు.

'రయి' అంటే అన్నము, పదార్థము, చంద్రుడు అని అర్థం. చంద్రుని వల్లనే భూమి మీద ద్రవత్వము, రసము కలుగుతున్నాయి. చంద్రుడే ఓషధులకు, వనస్పతులకు కారకుడు. ఓషధులు, వనస్పతులే అన్నము. ఈ రకంగా పదార్థము అంటే చంద్రుడు, అన్నము. ఇక శక్తికి ప్రతీక సూర్యుడు. అతడు అగ్నితత్త్వాత్మకుడు. అగ్నే ప్రాణం. కాబట్టి అన్నము,ప్రాణము ద్వారానే జీవం వర్ధిల్లుతున్నది. ఈ రకంగా ప్రజాపతి సృష్టించిన జంటలు మూడు 1) చంద్రుడు - సూర్యుడు 2) పదార్థము -శక్తి 3) ప్రాణము - అన్నము.

ఆదిత్యుడే ప్రాణము, అతడే అగ్ని, అతడే భోక్త, అతడే సమస్త జీవరాసుల కార్యకలాపాలకు కారణం. అందుచేత అతడే సమిష్ఠి ప్రాణం, చంద్రుడే రయి. స్థూలము సూక్ష్మము. మూర్తామూర్తము అంతా పదార్థమే. పదార్థం, ప్రాణం రెండూ ఒక్కటే.

సూర్యుడు తూర్పు దిక్కున ఉదయించి అక్కడి ప్రాణులపై తన కిరణములు ప్రసరింప చేస్తున్నాడు. సూర్యకిరణాలలో ప్రాణమున్నది. ఆ కిరణాలు తూర్పు దిక్కంతా వ్యాపించి ఉంటాయి. కాబట్టి ఆ దిక్కున ఉన్న ప్రాణులన్నింటినీ తనలో లీనం చేసుకుంటున్నాడు. అలాగే దక్షిణము, పడమర, ఉత్తరము, ఊర్ధ్వలోకాలు, అధోలోకాలు ప్రవేశించి సర్వప్రాణులను తనకిరణాలతో ధరిస్తున్నాడు. ఈ రకంగా ఎక్కడైతే జీవము, ప్రాణము ఉన్నదో అదంతా సూర్యుని ప్రభావమే. అతడే సమస్త చరాచరములకు అగ్నికీ ఆత్మ. అతడే సర్వభోక్త. జ్ఞానసంపన్నుడు. కాంతిస్వరూపుడు. వేడిని ఇచ్చేవాడు. అద్వితీయుడు అయిన ఆ సూర్యుడే ఆత్మస్వరూపుడు. ప్రపంచంలోని ప్రాణులను రక్షించటానికి నిత్యమూ ఉదయిస్తుంటాడు.

సంవత్సర రూపంలో ఉండే కాలపురుషుడే ప్రజాపతి. ఇష్టా పూర్తములను కర్తవ్యము లాచరించేవారు చంద్రలోకం చేరతారు. ఇది దక్షిణాయనము, పితృలోకము. ఇష్టము అంటే అగ్ని హోత్రము, తపస్సు, సత్యము, అతిథిసత్కారము మొదలగునవి. పూర్తములంటే చెరువులు, బావులు త్రవ్వించుట, దేవాలయములు కట్టించుట, అన్నదానము మొదలగునవి. ఈ కర్మల నాచరించే వారు దక్షిణాయనము ద్వారా ప్రయాణించి చంద్రలోకంచేరి, పుణ్య ఫలము తీరగానే తిరిగి జన్మిస్తారు. తపస్సు, బ్రహ్మచర్యము, ఇంద్రియనిగ్రహము, గల విద్వాంసులు సూర్యుని ఆత్మగా ధ్యానించి ఉత్తరాయణ మార్గంలో పయనించి సూర్యలోకం

చేరతారు. ఇది సకల ప్రాణులకు ఆశ్రయము. నాశరహితము. దీనిలో ప్రవేశించినవారు తిరిగి జన్మించరు. ఈమార్గం ద్వారా బ్రహ్మలోకం ప్రవేశించి కల్పాంతమున బ్రహ్మలో లీనమైపోతారు. కాలస్వరూపుడైన సూర్యుడు స్వర్గలోకానికి పైన ఐదు ఋతువులతో (హేమంతము, శిశిరము కలిపి ఒకటి) పన్నెండు నెలలతో కలిసి వర్షాలు కురిపిస్తుంటాడు. ఆ సూర్యునిరథానికి చక్రాలు ఏడు. చక్రానికి ఆరు ఋతువులే ఆకులు. ఆ రథమెక్కి సూర్యుడు నిరంతరం ప్రయాణం చేస్తుంటాడు. మాసము కూడా ప్రజాపతి రూపమే. అతనికి కృష్ణపక్షము అన్నము, శుక్లపక్షము ప్రాణము. అందుచేతనే ప్రాజ్ఞులు శుక్లపక్షంలోనే క్రతువులు ఆచరిస్తారు. రాత్రింబవళ్ళు కూడా ప్రజాపతి స్వరూపమే. పగలు ప్రాణము, రాత్రి అన్నము. ప్రజాపతికి పగలు ప్రాణము కాబట్టి పగటి పూట స్త్రీ సంగమము నిషిద్ధము. రాత్రి వేళలందు భార్యా సంగమము బ్రహ్మ చర్యముతో సమానము. ప్రజాపతి వ్రతము ఆచరించేవారు అంటే ఋతుదినములందు మాత్రమే రాత్రులందు భార్యతో సంభోగము చేయువారు సత్సంతానము పొందుతారు" ఈ విధంగా పిప్పలాద మహర్షి జగత్తులో ప్రాణికోటి ఆవిర్భవిస్తుందని వివరించాడు అని రత్నాకరుడు తన శిష్యులకు ప్రశ్నోపనిషత్తులోని మొదటి ప్రశ్నను విశదీకరించాడు.



# 11. దేవతలెందరు ? (ప్రశ్నోపనిషత్తు-2)

భార్గవుడనే శిష్యుడు పిప్పలాద మహర్షిని అడుగుతున్నాడు. "స్వామీ ! ఈ శరీరాన్ని ఎందరు దేవతలు అధిష్టించి ఉన్నారు ? వారిలో ప్రధానమైన వారెవరు ?" దానికి పిప్పలాదుడు చెప్పిన సమాధానం మీకు వివరిస్తాను వినండి అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

శరీర నిర్మాణానికి పంచభూతాలు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు కారణాలు. ఇవన్నీ కూడా తమ గొప్పదనాన్ని ప్రకటిస్తూ మేడకు స్థంభములు ఆధారమన్నట్లుగా ఈశరీరానికి మేమే ఆధారమై ఉన్నామని, శరీరధారణకు తామే కారణమని చెప్పుకుంటున్నాయి. అప్పుడు ఆ అవయవాలలో శ్రేష్ఠమయిన ప్రాణం ఇలా అన్నది. 'ఓ అవయవములారా ! నేను నన్ను ఐదుభాగాలుగా చేసుకున్నాను. అవే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులు. ఈ రూపంగా శరీరానికి ఆశ్రయం ఇచ్చి యీ శరీరాన్ని ధరిస్తున్నాను. నేను గనక లేకపోతే ఈ శరీరం నిలవదు. అందుచేత ఈ శరీరానికి మీరే ముఖ్యమని, ఆధారమని పొరబడకండి". ప్రాణం చెప్పిన మాటలను అవయవాలు నమ్మలేదు. వాటి నిర్లక్ష్య వైఖరి చూసి ప్రాణమునకు కోపం వచ్చింది. వెంటనే ఈశరీరం వదలి వెళ్ళి పోవాలని నిర్ణయించుకున్నది. అప్పుడు మిగిలిన అవయవాల శక్తి క్షీణించి పోయింది. అవికుడా పైకి వెళ్ళి పోతున్నట్లయింది. ప్రాణం శరీరాన్ని వదలి వెళ్ళాలనే ఆలోచన మానివేసి స్థిర పడింది. అప్పుడు అవయవాలుకుడా స్థిరపడ్డాయి. తేనె తుట్టెలో రాణీ ఈగ ఉంటేనే మిగిలిన ఈగలు ఉంటాయి. అది ఎగిరిపోతే మిగిలిన ఈగలు కూడా ఎగిరి పోతాయి. అలాగే ఇంద్రియాలన్నీ ప్రాణాన్ని ఆధారం చేసుకుని ఉన్నట్లు తేలిపోయింది. అప్పుడు అవన్నీ కలిసి ప్రాణాన్ని స్తుతి చెయ్యటం మొదలుపెట్టాయి. ప్రాణశక్తే అగ్ని అయి దహిస్తాడు. సూర్యుడై ప్రకాశిస్తాడు. మేఘమై వర్షిస్తాడు. ఇంద్రుడై ప్రజాపాలన చేస్తాడు. రాక్షస సంహారం చేస్తాడు. అతడే వాయువు, భూమి, అతడే చంద్రుడై అన్నిటినీ పోషిస్తాడు. స్థూలము, సూక్ష్మము, అమృతము సమస్తమూ అతడే. రథచక్రం యొక్క ఇరుసుమీద ఆకులన్నీ ఆధారపడి ఉన్నట్లే అవయవాలు అన్నీ ప్రాణం మీద ఆధారపడి ఉన్నాయి. చతుర్వేదాలు, యజ్ఞాదిక్రతువులు, చాతుర్వర్ణాలు అంతా ప్రాణం మీదనే ఆధారపడి ఉన్నాయి. ప్రాణం లేకపోతే వేదగానం లేదు. యజ్ఞాలు లేవు! కాబట్టి అన్నిటికీ ప్రాణం ఆధారం.

"ఓ ప్రాణమా! ప్రజాపతి స్వరూపివి. గర్భంలో నీవే సంచరిస్తుంటావు. తల్లి తండ్రుల అభీష్టం మేరకు నీవే గర్భంలో ప్రవేశించి మళ్ళీ జన్మిస్తావు. ఇంద్రియాలలో ప్రవేశించి ఆయా జ్ఞానము కలిగిస్తావు. ప్రాణి లోకమంతా భోగ్యవస్తువులను నీకే సమర్పిస్తున్నది. ప్రాణమే అగ్ని. అగ్నిలో వేసిన ఆహుతులను అతడు దేవతలకు అందచేస్తాడు. ఈ రకంగా ప్రాణము దేవతలకు వాహకుడు. నాందీ ముఖంలో పితృదేవతలకర్పించే మొదటి పిండము. ప్రాణమే శరీరములోని అంగముల స్వరూపము. ప్రాణాన్ని గురించి తెలుసుకోవటానికే అంగిరసాది ఋషులు ప్రయత్నించారు.

ఓ ప్రాణమా ! నీవే ఇంద్రుడవు. లయకారకుడైన రుద్రుడవు. లోక రక్షకుడవు. అంతరిక్షంలో సంచరించే సూర్యుడవు. నీవు మేఘరూపంలో వర్షించేటప్పుడు తమకు కావలసిన ఆహారం పండబోతోందని ప్రజలు సంతసిస్తారు. నువ్వు అధర్వణాల్లో చెప్పబడ్డ ఏకర్షి అనే పేరుగల అగ్నివి. హవిస్సులన్నిటికీ భోక్తవు. విశ్వానికంతకీ ప్రభువువు, నీవే మా తండ్రివి. మేము నీకు ఆహారం అందిస్తాము. ఇంద్రియాలతో కూడిన ఈ శరీరాన్ని శుభప్రదం చెయ్యి. ఇక్కడ నుంచి వెళ్ళిపోవద్దు. ముల్లోకాలలోని సమస్తవైభవాలు నీ అధీనంలోనే ఉన్నాయి. తల్లి బిడ్డలను కాపాడినట్లు మమ్ములను రక్షించవలసినది. మాకు సద్బుద్ధి ప్రసాదించు" అని వేడుకున్నాయి. ఈ విధంగా శరీరాన్ని ఎందరు దేవతలు అధిష్టించి ఉన్నా, వాటిలో ముఖ్యమైనది ప్రాణమే అని పిప్పలాద మహర్షి భార్గవుడికి చెప్పాడు అంటూ ప్రశ్నోపనిషత్తులో రెండవ ప్రశ్నను వివరించాడు రత్నాకరుడు.

# 12 ప్రాణం ఎక్కడ నుంచి పుట్టింది (ప్రశ్నోపనిషత్తు-3)

కౌశల్యుడు అనేవాడు పిప్పలాద మహర్షిని అడుగుతున్నాడు "దేవా ! ప్రాణం ఎక్కడ నుండి పుట్టింది ? శరీరంలోకి ఏ విధంగా వచ్చింది? శరీరంలో నుంచి ఏ విధంగా బయటకు వెళ్ళిపోతున్నది? నాకు తెలియజేయవలసినది.". దానికి మహర్షి చాలా సంతోషించి, "నాయనా పరమోత్కృష్టమైన ప్రశ్న వేశావు. సమాధానం విను?" అంటూ మహర్షి చెప్పిన విషయాన్ని వివరించటం ప్రారంభించాడు రత్నాకరుడు.

ఆత్మ నుండి ప్రాణం పుడుతోంది. శరీరాన్ని ఆశ్రయించి నీడ ఉన్నట్లుగా ఆత్మ పైన ఇది విస్తరించి ఉన్నది. నీడకు స్వతంత్రమైన అస్థిత్వం లేనట్లే ప్రాణానికి కుడా స్వతంత్రమైన అస్థిత్వం లేదు. మనస్సులో పుట్టిన సంకల్పాలవల్లనే ఇది శరీరంలోకి వస్తుంది. రాజు దేశాలను పాలించటానికి అధికారులను ఏ విధంగా నియమిస్తాడో, అలాగే ముఖ్యప్రాణము మిగిలిన వాటిని వివిధ పనులలో నియోగిస్తుంది. వీటిలో పాయు ఉపస్థల యందు మలమూత్ర విసర్జన కోసం అపాన వాయువును నియమించింది. తాను కన్ను, చెవి, ముక్కు, నోరుల యందు ఉంటుంది. సమాన వాయువు మధ్యలో ఉండి మనం తీసుకున్న ఆహారాన్ని శరీరంలోని అన్ని భాగాలకు సమానంగా పంచి పెడుతుంది. దీనివల్లనే మనం తీసుకున్న ఆహారం జీర్ణమయి వంటబడుతుంది. దానినుంచే కళ్ళు, ముక్కులు, చెవులు, నోరు అనే ఏడు జ్వాలలు పుడుతున్నాయి. జీవాత్మ హృదయాకాశంలో ఉన్నది. హృదయంలో నూటఒక్క ప్రధాననాడులున్నాయి. ప్రతినాడికి వందచొప్పున శాఖలున్నాయి. వీటిలో ప్రతి దానికీ డెబ్బైరెండు చొప్పున ఉపశాఖలున్నాయి. ఈ రకంగా శరీరంలో డెబ్బై రెండు వేలనాడీ మండలమున్నది. వీటన్నింటిలోనూ వ్యానవాయువు సంచరిస్తుంది. నాడులన్నిటిలోనూ ప్రధానమైనది సుషుమ్నా నాడి. దీని ద్వారానే ఉదానవాయువు జీవులను వారి కర్మలననుసరించి పుణ్య పాపలోకాలకు, మిశ్రమ కర్మలు చేసిన వారిని మనుష్య లోకాలకు తీసుకొని పోతుంది. ప్రాణము యొక్క సూక్ష్మాంశమే ఉదానము. చనిపోయిన తరువాత ఆత్మ ఉండే సూక్ష్మశరీరాన్నికూడా ఇదే నియమిస్తుంది. సూర్యకిరణాలు కంటికి చూపునిస్తాయి కాబట్టి సూర్యుడే బహిప్రాణము. అపాన వాయువు భూమిని ఆశ్రయించి ఉంటుంది. భూమ్యాకాశాల మధ్యనుండేది సమానవాయువు. అంతటా వ్యాపించి ఉండేది వాయువు. తేజస్సే ఉదానవాయువు. తేజస్సు అంటే అగ్ని. అగ్నిలో వెలుతురూ వేడి రెండూ ఉంటాయి. ఈ

ఉదాన వాయువు తగ్గినట్లైతే జీవి ఈ శరీరాన్ని వదలిపెట్టటానికి సిద్ధంగా ఉన్నాడన్నమాట. మరణకాలం ఆసన్నమైనప్పుడు జీవుడు దేన్ని స్మరిస్తాడో, ఆ ఆలోచనతో సహా ముఖ్యప్రాణమందు లయమవుతాడు. ఆముఖ్య ప్రాణము ఉదాన వాయువుతో కలసి జీవాత్మను సంకల్పానుసారమైన లోకాలకు తీసుకుపోతుంది.

మానవుడికి స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలని మూడు రకాల శరీరాలుంటాయి. పంచకోశములు అంటే 1) అన్నమయ 2) ప్రాణమయ 3)మనోమయ, 4) విజ్ఞానమయ 5) ఆనందమయకోశములు. వీటిలో ....

1. అన్నమయ కోశము - స్థూల శరీరం
2. ప్రాణమయ, మనోమయ,
   విజ్ఞానమయకోశాలు - సూక్ష్మ శరీరం
3. ఆనందమయ కోశము - కారణ శరీరం

జీవించి ఉండటమంటే

ఆత్మ - కారణ శరీరంలో ఉంటుంది.

కారణ శరీరం - సూక్ష్మ శరీరంలో ఉంటుంది.

సూక్ష శరీరం - స్థూల శరీరంలోఉంటుంది.

మరణించటమంటే స్థూల శరీరం నుండి సూక్ష్మ, కారణ శరీరాలు విడిపోవటం. ఈ రకంగా వేరైన సూక్ష్మ శరీరమే వేరొక జన్మ కలగటానికి కారణము.

ఈ రకంగా ప్రాణాన్ని గురించిన విషయాలు తెలుసుకున్న మానవుడు అమరుడౌతాడు' ' అని కౌశల్యుడికి పిప్పిలాద మహర్షి ప్రాణము గురించి వివరించాడు అని రత్నాకరుడు తన శిష్యులకు చెప్పి ప్రశ్నోపనిషత్తులోని మూడవ ప్రశ్నను పూర్తిచేశాడు.

## 13. కలలుకనేది ఎవరు ? (ప్రశ్నోపనిషత్తు - ప్రశ్న - 4)

గార్గ్యుడు పిప్పలాదమహర్షితో "స్వామి ! మానవుడిలో నిద్రించే అవయవాలు ఏవి ? మేల్కొని ఉండేవి ఏవి ? నిద్రలో కలలు కనేది ఎవరు ? సుషుప్తిలో సుఖాన్ని పొందేది ఎవరు? నాకు తెలియజేయండి" అన్నాడు. దానికి పిప్పలాద మహర్షి చెప్పిన సమాధానం వినండి" అంటూ చెప్పటం మొదలు పెట్టాడు రత్నాకరుడు.

'సూర్యుడు అస్తమించేటప్పుడు అతని కాంతి పుంజము అతని మండలములో కలిసిపోతుంది. అలాగే ఉదయించేటప్పుడు ఆ కిరణములు సూర్యుని నుండి వెలుపడతాయి. అలాగే స్వప్నావస్థలో ఇంద్రియాలన్నీ తమ ప్రభువైన మనస్సులో లీనమై పోతాయి. అప్పుడు దేహంలో వాటి ప్రత్యేకత ఉండదు. అందుచేతనే నిద్రలో ఉన్నమానవుడు ఆహారం తీసుకోలేడు. రుచిచూడలేడు. వినలేడు. మాట్లాడలేడు. ఆ సమయంలో శరీరంలో ప్రాణాలనే అగ్నులు మేల్కొని ఉంటాయి.

| | | |
|---|---|---|
| అపాన వాయువు | - | గార్హపత్యాగ్ని |
| ప్రాణవాయువు | - | ఆహవనీయాగ్ని |
| వ్యానవాయువు | - | దక్షిణాగ్ని |
| సమానవాయువు | - | హోత |
| ఉదానవాయువు | - | యజ్ఞఫలము |
| ఉచ్ఛ్వాస నిశ్వాసలు | - | ఆహుతులు |
| మనస్సు | - | యజమాని |

ఉదానమే యజమానిని రోజూ బ్రహ్మవద్దకు తీసుకుపోతుంది. మానవచైతన్యానికి అవస్థలు మూడు అవి. 1) జాగ్రదవస్థ 2)స్వప్నావస్థ 3) సుషుప్త్యవస్థ

జాగ్రదవస్థలో ప్రపంచమంతా కంటికి కనిపిస్తూనే ఉంటుంది. స్వప్నావస్థలో కలలు కనిపిస్తాయి. సుషుప్తిలో ఆ రెండు అవస్థలలోని సంస్కారాలు పనిచేయవు. అప్పుడు మనస్సు కొంచెం తక్కువగా సమాధిస్థితిలో ఉంటుంది. దీనికి కారణం ఉదానవాయువు.

స్వప్నావస్థలో మనస్సు అన్నీ అనుభవిస్తుంది, జాగ్రదవస్థలో గతంలో చూసినవన్నీ మళ్ళీ చూస్తుంది. విన్నవే వింటుంది, అనుభవించినవే అనుభవిస్తుంది. ఈ స్థితిలో మనస్సు

ఈ జన్మలోగాని, ఇతర జన్మలలోగాని చూసినవి, చూడనివి, విన్నవి, విననివి అన్నింటినీ అనుభవిస్తుంది. అప్పుడు ఇచ్ఛాశక్తి, తార్కికశక్తి పనిచెయ్యవు. అందుకనే కనీవినీ ఎరగని విషయాలు కలలో వస్తుంటాయి. వీటన్నింటినీ ఇంద్రియ సహాయం లేకుండానే మనస్సు అనుభవిస్తుంది. మనస్సు తేజస్సుచే ఆక్రమించ బడినప్పుడు కలలురావు. దీనికి కారణము స్వప్నము చూసే ద్వారము తేజస్సుచేత అడ్డగించబడటమే. ఇదే నిద్రావస్థ. సుషుప్తి. ఈ దశలో జీవుడు స్వరూపానందము అనుభవిస్తాడు.

పంచభూతాలలక్షణాలు తన్మాత్రలు

| | భూతము | లక్షణము | ఇంద్రియము |
|---|---|---|---|
| 1. | ఆకాశము | శబ్దము | చెవి |
| 2. | వాయువు | స్పర్శ | చర్మము |
| 3. | అగ్ని | రూపము | కన్ను |
| 4. | జలము | రసము | నాలుక |
| 5. | పృథివి | గంధము | ముక్కు |

ఈ రకంగా జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు వాటి విషయాలు, మనస్సు, బుద్ధి అహంకారము గాఢనిద్రలో ఇవన్నీ జీవాత్మలో కలిసిపోతాయి. అప్పుడు జీవుడు కారణ దేహుడు. నీరు ఇంకినపుడు అందులోని ప్రతిబింబము బింబములో కలసిపోతుంది. అలాగే ఉపాధి నశించినప్పుడు జీవుడు పరమాత్మలో లీనమవుతాడు. చూసేది, వినేది, తాకేది, వాసన చూసేది, రుచిచూసేది, ఆలోచించేది అన్నీ జీవాత్మయే. అతడు నాశనం లేని ఆత్మయందు స్థిరంగా ఉంటాడు. ఈ రకంగా ఆత్మతత్త్వము తెలుసుకున్నవాడు సర్వజ్ఞుడై బ్రహ్మస్వరూపుడవుతాడు" అన్నాడు.

కాబట్టి ఓ శిష్యులారా !

మానవునిలో నిద్రించేది - అవయవాలు, ఇంద్రియాలు

మేల్కొని ఉండేవి - ప్రాణాలు

కలలుకనేది - మనస్సు

సుఖమెవరిది? - జీవాత్మది

వీరందరూ అక్షరమైన ఆత్మయందు ప్రతిష్ఠితమై ఉంటారు. అని ప్రశ్నోపనిషత్తులోని నాల్గవ ప్రశ్నను వివరించాడు రత్నాకరుడు.

## 14. ఓంకార ధ్యానము (ప్రశ్నోపనిషత్తు ప్రశ్న - 5)

సత్యకాముడు పిప్పలాద మహర్షికి నమస్కరించి ఈ విధంగా అడుగుతున్నాడు. "మహర్షీ ! మానవులలో ఎవరైనా చివరిదాకా అంటే చనిపోయే వరకూ ఓంకార ధ్యానము చేస్తే ఏ లోకానికి పోతాడో నాకు వివరించండి" "అది విన్న పిప్పలాదుడు చెప్పిన సమాధానం మీకు వివరిస్తాను". అంటూ మొదలు పెట్టాడు రత్నాకరుడు.

"సత్యకామా ! ఓంకారమనేది పరబ్రహ్మము. అపర బ్రహ్మముకూడా. పరబ్రహ్మము అంటే సర్వాతీత నిర్గుణబ్రహ్మము. అపరబ్రహ్మము అంటే సాకారము. వ్యక్తరూపం గల హిరణ్యగర్భుడు. అందుచేత పండితులు జ్ఞానులు ఓంకారాన్నే ఉపాసిస్తారు.

ఇదే నాదబ్రహ్మము. దీన్నే ప్రణవము అంటారు. దీన్నుంచే సమస్త శబ్దాలు, మంత్రాలు ఉత్పన్నమైనాయి. అందుకనే ఓంకారము సర్వమంత్రాలకూ హేతువు.

సగుణ బ్రహ్మన్ని ఓంకారంతో ఉపాసన చేయవచ్చు. అవ్యక్తమైన పరబ్రహ్మని శబ్దంతో సూచించటానికి ఓంకారమే గుర్తు. ఓంకారంలో అకార ఉకార మకారాలనే మూడు అక్షరాలున్నాయి. ఓంకారమనేది మూడు వేదాలకు ప్రతీక. ఇందులోని

అ కారము - ఋగ్వేదము

ఉ కారము - యజుర్వేదము

మ కారము - సామవేదము

దీనిలో ఒకఅక్షరాన్ని మాత్రమే ధ్యానించినట్లైతే సాధకుడు మరణానంతరము స్వర్గసుఖాలనుభవించి తరువాత భూలోకంలో మళ్ళీ జన్మిస్తాడు. ఒకవేళ రెండు అక్షరాలను కలిపి ధ్యానించినట్లైతే సాధకుడు సూక్ష్మ శరీరంతో చంద్రలోకానికి పోయి అక్కడ సుఖాలనుభవించి తిరిగి మానవలోకంలో జన్మిస్తాడు. మూడు అక్షరాల రూపమైన ఓంకారాన్ని కనుక ధ్యానిస్తే సాధకుడు తేజోవంతమైన సూర్యలోకానికి పోతాడు. పాము కుబుసాన్ని వదిలినట్లుగా తన శరీరానికి అంటుకున్న పాపాలు వదిలించుకుంటాడు.ఆ తరువాత సామవేద భావంచేత బ్రహ్మలోకానికి పోతాడు. కల్పాంతమువరకు అక్కడ ఉండి ఆ తరువాత పరబ్రహ్మలో లీనమవుతాడు. దీనినే క్రమముక్తి అంటారు.

ఓంకారము యొక్క మూడు మాత్రలను విడివిడిగా ధ్యానించేవాడు మృత్యుంజయుడు కాలేడు. మూడు మాత్రలను కలిపి ధ్యానించే వాడు అచంచలమైన ఆత్మనిష్ఠను పొందుతాడు. ఆత్మానుభూతి నుండి చలించడు.

ఓంకారోపాసకుడు ఋగ్దేవతలచే భూలోకము, యజుర్దేవతలచే చంద్రలోకము, సామదేవతలచే విద్వాంసులకు మాత్రమే తెలిసిన బ్రహ్మలోకము పొందుతాడు. ఓంకారం ద్వారానే జ్ఞాని అయినవాడు శాశ్వతమైన బ్రహ్మలోకాన్ని పొంది, కల్పాంతమున ఆ పరబ్రహ్మలో లీనమవుతాడు"?

ఈ రకంగా పిప్పలాదుడు ఓంకారాన్ని గురించి వివరించాడని తన శిష్యులకు చెప్పి ప్రశ్నోపనిషత్తులోని ఐదవ ప్రశ్నను పూర్తి చేశాడు రత్నాకరుడు.

## 15. షోడశ కళాప్రపూర్ణుడు (ప్రశ్నోపనిషత్తు ప్రశ్న - 6)

సుకేశుడు పిప్పలాద మహర్షితో "గురుదేవా ! ఒకసారి కోసలదేశ రాకుమారుడు 'హిరణ్యనాభుడు నాదగ్గరకు వచ్చి మహాత్మా ! నీకు షోడశ కళాప్రపూర్ణుడెవరో తెలుసా? అని అడిగాడు. నేను తెలియదని చెప్పాను. అతడు నా మాటలు నమ్మలేదు. అప్పుడు నేను "రాకుమారా! నాకు నిజంగానే తెలియదు. తెలిస్తే సద్గుణసంపన్నుడవైన నీకు ఎందుకు చెప్పను? నేను అబద్ధమాడలేదు". అన్నాను. ఆ మాటవిని అతడు అక్కడనించి వెళ్ళిపోయాడు. ఓ మహర్షీ! అప్పటి నుండీ దీన్ని గురించి నేను ఆలోచిస్తూనే ఉన్నాను. షోడశ కళాప్రపూర్ణుడెవరు ? అతనెక్కడ ఉంటాడు ? ఈ విషయాలు నాకు తెలియచేయవలసినది" అన్నాడు. దానికి పిప్పలాద మహర్షి ఈ విధంగా చెప్పాడు" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు

"సుకేశా! నువ్వడిగిన పదహారు కళలు గల పురుషుడు ఈ శరీరంలోనే ఉన్నాడు. నిజంగా అతనికి కళలులేవు. కాని శరీరమనే ఉపాధిని గ్రహించటంవల్ల కళలు ఉన్నట్లుగా కనిపిస్తాడు. ఈ పురుషుడు అందరి శరీరాలలోనూ దహరాకాశంలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. ఈ కళలన్నీ అతని నుండే పుడుతున్నాయి. అతనిలోనే లయమవుతున్నాయి. ఆ పురుషుడు 'ఈశరీరం నుంచి ఎవరు వెడితే నేను వెళ్ళిపోతాను? ఎవరు ఉంటే ఉంటాను? అని ఆలోచించాడు. ఈ రకంగా ఆలోచించినవాడై ఆ పురుషుడు ముందుగా శరీరానికి అవసరమైన ప్రాణాన్ని సృష్టించాడు. తరువాత దానినుండి శ్రద్ధ, ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి, ఇంద్రియాలు, మనస్సు, అన్నము సృష్టించాడు. అన్నం నుండి బలాన్ని, వేదమంత్రాలను, తపస్సును, కర్మలను, కర్మలకు ఫలమైన లోకాలను, అక్కడ ఉండే ప్రాణులకు పేర్లను సృష్టించాడు. శ్రద్ధ అంటే విశ్వాసము లేదా బుద్ధి.

| | | |
|---|---|---|
| అంతఃకరణశుద్ధికి సాధనం | - | తపస్సు |
| తపస్సుకు సాధనం | - | ఋగాది మంత్రాలు |
| మంత్రాల వల్ల | - | యజ్ఞకర్మలు |
| యజ్ఞ కర్మల వల్ల | - | లోకాలు చెప్పబడ్డాయి. |

షోడశ కళలు అంటే ....

1. ప్రాణము, 2. శ్రద్ధ, 3. ఆకాశం, 4. వాయువు, 5. అగ్ని, 6. జలం, 7. భూమి, 8. ఇంద్రియాలు, 9. మనస్సు, 10. అన్నం, 11. బలం, 12. తపస్సు, 13. వేదమంత్రాలు, 14. కర్మలు, 15. లోకాలు, 16. ప్రాణుల పేర్లు.

వర్షం కురిసినప్పుడు ఆ నీరంతా వాగులుగా ప్రవహించి నదులుగా ఏర్పడుతుంది. ఆ నదులకు ప్రత్యేకమైన పేర్లుంటాయి. ఈ నదులన్నీ సముద్రంలో కలుస్తాయి. అప్పుడు వాటికి ప్రత్యేకమైన పేర్లుండవు. అంతా సముద్రమే. అలాగే ఈ పదహారు కళలూ పరమేశ్వరుని యందే ఉంటాయి. అవి ఎప్పుడైతే అతన్ని చేరాయో అప్పుడు వాటికి నామరూపాలుండవు. దాన్ని పురుషుడని మాత్రమే అంటారు. సమాధి స్థితిలో ఉన్నప్పుడు ఈ కళలన్నీ ఆత్మలో లీనమవుతాయి. బండి చక్రానికి ఉండే ఆకులన్నీ దాని ఇరుసు మీద ఆధారపడి ఉన్నట్లుగానే ఈ కళలన్నీ పురుషుడి మీద ఆధారపడి ఉంటాయి. ఈ విషయం తెలుసుకున్నవాడికి మరణం సంభవించదు. పదహారు కళలు పురుషునిలో భాగాలుకావు. అతడు కల్పించినవి మాత్రమే. బ్రహ్మజిజ్ఞాసులారా ! నాకు తెలిసిన బ్రహ్మతత్త్వం అంతా మీకు చెప్పాను. ఇంతకు మించి మీరు తెలుసుకోవలసినది లేదు" అన్నాడు పిప్పలాదుడు.

ఆ మాటలు విన్న కబంధి మొదలైన శిష్యులందరూ తమకు బ్రహ్మతత్త్వాన్ని బోధించిన పిప్పలాద మహర్షిని పరిపరి విధాల పూజించి శలవు తీసుకున్నారు. అంటూ రత్నాకరుడు ప్రశ్నోపనిషత్తును పూర్తి చేశాడు.

# 16. నాచికేతాగ్నిచయనము (కఠోపనిషత్తు - 1)

"శిష్యులారా ! స్వర్గంలో మృత్యుభయముండదు. వార్ధక్యము ఉండదు. ఆకలి దప్పికలు ఉండవు. శోకం ఉండదు. అటువంటి స్వర్గాన్ని పొందటానికి "అగ్ని చయనము" అనే క్రతువు ఉన్నది. గౌతముని కుమారుడైన నచికేతుడికి యమధర్మరాజు ఆ క్రతువును బోధించి, ఇక నుంచి నీపేర అది 'నాచికేతాగ్ని చయనము' అని పిలువబడుతుందని వరమిచ్చాడు. ఆ విషయం వివరిస్తాను వినండి". అంటూ కఠోపనిషత్తును ప్రారభించాడు రత్నాకరుడు.

కఠోపనిషత్తు కృష్ణ యజుర్వేదంలోనిది. పూర్వకాలంలో 'గౌతముడు' అని గొప్ప పండితుండేవాడు. అతడు వేదవేదాంగవిదుడు. మహాతపస్వి. ఇతనికే 'వాజశ్రవశుడు' అని ఇంకో పేరుకూడా ఉంది. మరణానంతరము ఉత్తమలోకాలు పొందటం కోసము 'విశ్వజిత్' అనే యాగం చెయ్యాలనుకున్నాడు. ఈ యాగం చేసేవారు తమ సర్వస్వాన్ని దానం చెయ్యాలి. సన్యాసం తీసుకునేముందు గృహస్థుకుడా తన ఆస్తినంతా దానం చేస్తాడు. విశ్వజిద్ యాగము కూడా ఇంచుమించు ఇలాంటిదే.

వాజశ్రవుడు యాగము ప్రారంభించాడు. విశ్వజిద్యాగము నిర్విఘ్నంగా పూర్తయింది యాగంలో ఆఖరుదశ దానధర్మాలు. దానం తీసుకునేందుకు పండితులంతా వచ్చి ఉన్నారు. అంతా కోలాహలంగా ఉంది. వాజశ్రవుడు దానాలు చేస్తున్నాడు. పండితులు స్వీకరిస్తున్నారు. ధనదానము పూర్తి అయింది. ఇక గోదానము మొదలుకాబోతోంది. ఆ గోవులు తమ ఆఖరి గ్రుక్క నీటిని త్రాగేసినాయి. ఆఖరి గడ్డి పరకను తినేసినాయి. వాటికి ఇంకా నీరుత్రాగటానికి గాని, మేతమెయ్యటానికి గాని ఓపికలేదు. కదలలేని స్థితిలో ఉన్నాయి. ఇంతెందుకు ? చావుకు సిద్ధంగా ఉన్నాయి.

వాజశ్రవసుని కుమారుడు నచికేతుడు. వయసులో చిన్నవాడైనా మహాగుణశాలి. తండ్రి మీద భక్తిప్రపత్తులున్నవాడు. అతను ఆ ఆవులను చూసి ఈ విధంగా అనుకొంటున్నాడు. "ఈ ఆవులు నీరుత్రాగినాయి. గడ్డి తిన్నాయి. వాటికి పాలు పితికారు. ఇప్పుడివి శక్తి హీనములై ఉపయోగం లేకుండా పోయినాయి. ఇవి మళ్ళీ నీళ్ళు త్రాగుతాయని, మేతమేస్తాయని నమ్మకం లేదు. ఏ క్షణంలోనైనా చావటానికి సిద్ధంగా ఉన్నాయి. ఇటువంటి ఆవులను దానం

చేసినవాడు 'ఆనందము' అనబడే పాపలోకాలకు పోతాడు. నాతండ్రి స్వర్గం పొందాలనే కోరికతో నరకలోకాలు కొని తెచ్చుకుంటున్నాడు. ఏ విధంగానైనా తండ్రిని పాపలోకాల నుంచి రక్షించాలి" అనుకున్నవాడై తండ్రి దగ్గరకు వెళ్ళి "తండ్రీ ! ఈ యాగంలో మీకున్న సర్వసంపదా దానం చెయ్యాలికదా ! నేను మీసంపదలో ఒకడిని. మరి నన్ను ఎవరికి దానం చేస్తారు". అన్నాడు.

ఆ మాటలు వినికూడా వాజశ్రవుడు వెంటనే సమాధానమివ్వలేదు. నచికేతుడు మళ్ళీ అడిగాడు. ఎవరితోనో మాట్లాడుతున్నట్లుగా ప్రక్కకు తిరిగాడు తండ్రి. కుమారుడు వదల్లేదు. తండ్రిని నిర్బంధించాడు. దాంతో విసిగిపోయిన వాజశ్రవుడు "నిన్ను మృత్యుదేవత అయిన యముడికి దానమిస్తాను" అన్నాడు. తొందరలో మాట అయితే అన్నాడు కాని వెంటనే పశ్చాత్తాపం చెందాడు.

తండ్రి మాటలు విన్న నచికేతుడు చాలా దుఃఖించాడు. దూరంగా పోయి ఒంటరిగా కూచుని "నా తండ్రికి ఉన్న పుత్రులలో గాని, విద్యార్థులలో గాని నేను ఉత్తమశ్రేణిలోనే ఉన్నాను. అలా కాదనుకున్నా కనీసం మధ్యమశ్రేణి లోనైనా ఉంటాను. అంతే గాని అధమ శ్రేణిలో మాత్రం ఉండను. మరి తండ్రి నన్నెందుకు యముడికిస్తానన్నాడు? యముడి దగ్గరకు పోయి నేనేమిచెయ్యాలి ? ఏమైనాసరే. తండ్రిమాట జవదాటరాదు. ఆయనకు అసత్య దోషం అంటనీయకూడదు. యమపురికి వెళ్ళితీరాల్సిందే". అని నిశ్చయించుకుని తండ్రి దగ్గరకు వెళ్ళి "తండ్రీ ! మన పూర్వుల చరిత్రచూడు. ఎవరూ ఎప్పుడూ అబద్ధం ఆడలేదు. మరి నువు కూడా ఆ బాటలోనే నడవాలి. పొలములోని పైరులాగా మానవుడు పుడతాడు, నశిస్తాడు. ఈమాత్రం దానికి ఆలోచన ఎందుకు ? నేను యమపురికి బయలుదేరుతాను. నాకు శెలవిప్పించండి". అని ప్రార్థించి తండ్రి దగ్గర సెలవు తీసుకుని యమపురికి ప్రయాణం కట్టాడు.

ఆ సమయంలో యముడు బ్రహ్మదర్శనానికి వెళ్ళాడు. కాబట్టి నచికేతుడు యమపురి చేరేప్పటికి యముడు అక్కడలేడు. మృత్యుదేవుడు తిరిగి వచ్చే వరకు నచికేతుడు అక్కడే ఉన్నాడు. ఈ రకంగా యముని గృహంలో మూడు రోజుల గడిచినాయి. తిరిగివచ్చిన యముడికి భటులు బ్రహ్మతేజస్సుతో వెలుగొందుతున్న బాలుని వృత్తాంతం చెప్పి "ప్రభూ అగ్నిదేవుడే మనింట్లో అతిథి రూపంలో ప్రవేశించాడు. మీరు లేనప్పుడు అతిథిగా వచ్చాడు.

గృహస్థాశ్రమ ధర్మానుసారం అతణ్ణి సాదరంగా ఆహ్వానించండి. అలా కాకపోతే ఆ గృహస్థు పుణ్యఫలమంతా పోతుంది. ధర్మరతికి దూరుడౌతాడు. అతడికి పుత్రపౌత్రులుండరు, పాడిపంటలు కూడా కరవౌతాయి'' అన్నారు.

అప్పుడు యముడు నచికేతుని వద్దకు వచ్చి "ఓ విప్రుడా ! నీకు నమస్కారము. నీవు నాయింటికి అతిధిగా వచ్చి మూడురోజులు భోజనం లేకుండా ఉన్నావు. అందుచేత నీవు భోజనం చెయ్యని ఒక్కొక్క రాత్రికి ఒక్కొక్కటి చొప్పున మూడు వరాలిస్తాను కోరుకో'' అన్నాడు. ఆ మాట విన్న నచికేతుడు ఓదేవా ! నువు ఇస్తానన్న వరాల్లో మొదటిది అడుగుతున్నాను. నీ దగ్గర నుండి తిరిగి నేను ఇంటికి వెళ్ళేటప్పుడుటికి నా తండ్రి కోపం లేకుండా శాంతచిత్తముతో సాదరంగానన్ను అక్కున చేర్చుకోవాలి'' అన్నాడు.

"నచికేతా ! నువు ఇంటికి వెళ్ళగానే నీ తండ్రి కోపంఅంతాపోయి నిన్ను ప్రేమతో స్వీకరిస్తాడు. నిన్నుచూడగానే ఆయన ఆనందపరవసుడౌతాడు. ఆందోళనలన్నీపోయి సుఖంగా ఉంటాడు'' అన్నాడు యముడు. నచికేతుడు యముణ్ణి రెండోవరం అడిగాడు. "యమధర్మరాజా ! స్వర్గంలో మృత్యుభయంలేదు. ఇక్కడ వార్ధక్యము, ఆకలిదప్పికలు ఉండవు. శోకం ఉండదు. అటువంటి స్వర్గము పొందటానికి 'అగ్నిచయనము' అనే క్రతువున్నది. అది నీకు బాగా తెలుసు. నాకు దాన్ని ఉపదేశించు'' అన్నాడు.

యమధర్మరాజు అగ్నిచయనము క్రతువంతా ఉపదేశించాడు. నచికేతుడు దాన్ని పూర్తిగా గ్రహించాడు. తనకు ఆక్రతువు పూర్తిగా తెలిసింది అనటానికి నిదర్శనంగా తు.చ. తప్పకుండా తిరిగి యమునికి ఒప్పగించాడు. నచికేతుని మేధాశక్తికి అబ్బురపడ్డాడు యముడు. ఆ ఆనందంతో నీ బుద్ధి సూక్ష్మతకు సంతోషించాను. అదనంగా ఇంకో వరం ఇస్తున్నాను. బ్రాహ్మణకుమారా ! నీ జ్ఞాపకశక్తి అమోఘం, అద్భుతం. దానికి గుర్తుగా ఈవరం తీసుకో. స్వర్గప్రాప్తికి కారణమైన అగ్నిచయనము ఇక నుంచీ నీ పేరుమీద 'నాచికేతాగ్నిచయనం' అని పిలువబడుతుంది. నీపేరు చిరస్థాయిగా ఉంటుంది. ఈ క్రతువును తెలుసుకున్నవాడు 'త్రినాచికేతుడు' అని పిలువబడతాడు. అతడు జనన మరణాలనుంచి విముక్తుడౌతాడు. జ్ఞానకర్మలు అనుష్టించటం ద్వారా దేవేంద్ర పదవిపొందుతాడు. నాచికేతాగ్నిచయనం చేసిన వాడికి పాపం అంటదు. రాగద్వేషాలు ఉండవు. అతడు స్వర్గ సామ్రాజ్యంలో ఆనందిస్తాడు.' అన్నాడు యముడు.

ఈ విధంగా నాచికేతాగ్నిచయనము గురించి తన శిష్యులకు వివరించాడు రత్నాకరుడు.

# 17. నచికేతుడు (కఠోపనిషత్తు -2)

"శిష్యులారా ! 'అగ్ని చయనము' గురించి. తెలుసుకున్న తరువాత నచికేతుడు ఆత్మతత్త్వాన్ని వివరించమని యమధర్మరాజును ప్రార్థించాడు. అప్పుడు యమధర్మరాజు అతణ్ణి అనేక విధాలుగా పరీక్షించి, చివరకు ఆత్మతత్త్వాన్ని వివరించాడు. ఆ విషయమంతా మీకు వివరిస్తాను. వినవలసినది" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

"ఓ మృత్యు దేవతా ! మానవుడి మరణం మీద నాకు అనేక అనుమానాలున్నాయి. మరణించిన తరువాత ఇంద్రియాలు, అవయవాలు, మనస్సు మొదలైన వాటితో జీవాత్మకు సంబంధం ఉంటుందని కొందరు, ఉండదని కొందరు అంటారు. ఇందులో నిజం ఏది ? నాకు వివరంగా చెప్పవలసినది". అని అడిగాడు నచికేతుడు.

నచికేతుడు అడిగింది ఆత్మ జ్ఞానం గురించి. అది అర్హత ఉన్నవాళ్ళకు తప్ప ఇతరులకు చెప్పరాదు. మరి నచికేతుడికి ఆ అర్హత ఉన్నదా ? ముందుగా ఈ విషయం తెలియాలి. అందుకే "నచికేతా! ఈ విషయం మీద దేవతలకు కుడా సందేహం ఉన్నది. ఇది అంత తేలికగా అర్థంకాదు! అందుకని ఇంకేదైనా వరంకోరుకో" అన్నాడు యముడు. దానికి నచికేతుడు.

"ఆర్యా! దేవతలకు కూడా ఈ విషయం అర్థం కాకపోవచ్చు కాని దాన్ని వివరించి చెప్పగల సమర్థుడవు నీవే. అందుకని నాకు ఆ విషయం వివరించు" అన్నాడు. "నచికేతా! పుత్రులు, పౌత్రులు, ధనకనక వస్తు వాహనాలు ఏవైనా కోరుకో. సుఖజీవనం చెయ్యి. అంతే గాని ఈ విషయం మాత్రం వదిలెయ్యి" అన్నాడు యముడు. రాజా ! ఈభోగాలన్నీ నేడు ఉంటాయి, రేపు ఉండవు, ఇవి అనిత్యమైనవి. అశాశ్వతమైన భోగభాగ్యాలు నాకువద్దు ఇలాంటివి ఎన్ని ఉన్నా ఆత్మజ్ఞానానికి సాటియైనది ఏదీలేదు. అందుచేత నాకు ఆత్మజ్ఞానాన్ని గురించి వివరించవలసింది" అన్నాడు నచికేతుడు. నచికేతుని పట్టుదలకు సంతసించినవాడై యముడు అతనికి ఆత్మజ్ఞానాన్ని వివరించటం మొదలుపెట్టాడు.

"నచికేతా ! శ్రేయస్సు, ప్రేయస్సు అని రెండు విషయాలను శ్రుతులు చెబుతున్నాయి. ఇక్కడ శ్రేయస్సు అంటే విద్య. ప్రేయస్సు అంటే అవిద్య. పునరావృత్తి రహితమైన మోక్షమార్గమే శ్రేయస్సు. కాగా ఐహిక సుఖాలలో ఓలలాడించేది ప్రేయోమార్గము మానవుడు ఈ రెంటిలో ఏదో ఒక మార్గాన్ని అనుసరించి తీరాలి. ఈ రెండు మార్గాలు కలిసి

ఉన్నట్టుగానే కనిపిస్తాయి. విజ్ఞుడైనవాడు దీన్ని విభజించి శ్రేయో మార్గాన్నే ఎన్నుకుంటాడు. ఈ రెండూ విరుద్ధ స్వభావాలు గలవి. వీటిలో శ్రేయోమార్గము కాంతి కాగా ప్రేయస్సు చీకటి. అవిద్యలో మునిగినవాడు తనను తాను గొప్పపండితుడుగా భావించుకుంటాడు. ధనధాన్యాలు, దారాపుత్రులు ఇవే లోకమనుకుంటాడు. ఇలాంటివాడు జననమరణాలతో బాధపడుతుంటాడు.

ఆత్మజ్ఞానం అనే పదం వినటానికి కుడా చాలామందికి అర్హతఉండదు. అందుకే వాళ్ళు దాన్ని ఇష్టపడరు. కొందరికి విన్నా అది అర్థంకాదు. అసలు దీన్ని గురించి చెప్పే గురువు దొరకటం కుడా చాలా విశేషం. 'నేను బ్రహ్మని' అనేజ్ఞానం పొందిన గురువు ద్వారా ఈ విషయాన్ని తెలుసుకోవటం పూర్వజన్మ సుకృతం.

కర్మవల్ల లభించే ఫలితం అనిత్యము. దానివల్ల ఆ తత్త్వం లభించదు. కర్మలు అనిత్యం. ఆత్మ నిత్యం. ఈ విషయం తెలిసికుడా నేను అగ్నిచయనం చేశాను. దాని ఫలితంగా మృత్యుదేవతనయ్యాను. నచికేతా! మానవుడు ఆత్మను ఇంద్రియాల నుండి వేరు చేసి శాశ్వత ఆనందానిచ్చే ఆత్మతత్త్వాన్ని పొందుతాడు. నీవు దానికి పూర్తిగా అర్హుడవు.

వేదాలన్నీ ముక్తకంఠంతో దేన్ని గురించి చెబుతున్నాయో, తపస్సువల్ల దేన్ని పొందుతామో, బ్రహ్మచర్యాది నియమాలు, వ్రతాలు దేని కోసం ఆచరిస్తారో, అది 'ఓం' అనే పదం. ఇదే పరబ్రహ్మపేరు లేదా గుర్తు. శబ్దం కాబట్టి ఇది అపరబ్రహ్మ (హిరణ్యగర్భుడు.)

ఇదే పరబ్రహ్మ. ఓంకారాన్ని ఏ రూపంలో ఉపాసిస్తే ఆ సాధకుడు ఆ రూపాన్నే పొందుతాడు. బ్రహ్మప్రాప్తికి ఓంకారాన్ని ఆశ్రయించటమే మంచిది. ఆత్మకు చావుపుట్టుకలులేవు. ఆత్మ తనంత తానుగా పుట్టినది. స్వయంభువు. నాశరహితమైనది. శాశ్వతమైనది. శరీరం మరణించినా ఆత్మ మరణించదు. ఆత్మచంపేదీ కాదు, చంపబడేదీ కాదు. ఆత్మ సూక్ష్మమైనవాటికన్న సూక్ష్మమైనది. పెద్దవైనవాటి కన్న ఇంకాపెద్దది. ఇది జీవియొక్క హృదయ పద్మంలోనే ఉంటుంది. జితేంద్రియుడు ఆత్మగొప్పదనాన్ని గ్రహించి దుఃఖాల నుండి దూరమవుతాడు. ఇంద్రియలోలులు ఆత్మను గుర్తించలేరు. ఆత్మ కదలకుండా ఒకచోట కూర్చునే చాలా దూరం పోతుంది. నిద్రపోతూనే అన్ని ప్రదేశాలు తిరుగుతుంది. అనిత్యమైన శరీరాల మధ్యన శరీరం లేనిదిగా, అశాశ్వతమైన వాటి మధ్య శాశ్వతమైనదిగా ఉంటుంది. ఆత్మ నిత్యము, సత్యము, సర్వ వ్యాపకమైనది. అటువంటి ఆత్మను గుర్తించగలిగిన వాడికి దుఃఖం లేదు.

ఆత్మసాక్షాత్కారం వేదాలు వల్లించటం వల్ల, గ్రంథాలు చదవటం వల్ల, ధారణశక్తి వల్ల, వినటం, ఉపదేశం పొందటంవల్ల లభించదు. అది ఆత్మవల్ల మాత్రమే సాధ్యమవుతుంది. అర్హుడైన వ్యక్తికి ఆత్మ తన నిజస్వరూపం చూపుతుంది.

వేదాలలో చెప్పిన పాపకర్మలు వదలిపెట్టనివాడు ఇంద్రియలోలుడు, ఏకాగ్రతలేనివాడు, మనశ్శాంతి లేనివాడు బ్రహ్మజ్ఞానం పొందలేడు.

శరీరంలో పరబ్రహ్మ ఉండేచోట ఇద్దరున్నారు. వారిలో ఒకడు కర్మఫలం అనుభవించేవాడు. రెండవవాడు సంసారబంధనాలు లేనివాడు. ఈరకంగా ఆ ఇద్దరూ విలక్షణమైన తత్త్వాలు కలిగి ఉంటారు. వీరిద్దరే నీడ, వెలుగు.

ఈ శరీరం రథంవంటిది. కర్మఫలాన్ని అనుభవించే జీవాత్మ దాని యజమాని. బుద్ధే సారధి. మనస్సే కళ్ళెం. ఇంద్రియాలే గుర్రాలు. విషయమే మార్గం. కాబట్టి ఇంద్రియాలను నడిపే సారధి నేర్పరి కాకపోతే, గుర్రాలు అదుపులో ఉండవు. అందుకనే

| | | |
|---|---|---|
| ఇంద్రియాలు | - | మనస్సు అధీనంలోనూ |
| మనస్సు | - | బుద్ధి అధీనంలోనూ |
| బుద్ధి | - | యజమాని అధీనంలోనూ ఉండాలి. |

విజ్ఞానహీనుడు మనసును అదుపులో ఉంచుకోలేడు. తాను చేరవలసిన గమ్యం చేరలేడు. మోక్షాన్ని పొందలేడు. వివేకవంతమైన బుద్ధిని కలిగినవాడు, మనస్సును అదుపులో ఉంచగలినవాడు, పరమపదాన్ని చేరతాడు.

| | | |
|---|---|---|
| ఇంద్రియాలకన్న | - | వాటి విషయాలు (లక్షణాలు) శ్రేష్ఠమైనవి |
| విషయాలకన్న | - | మనస్సు శ్రేష్ఠమైనది |
| మనస్సుకన్న | - | బుద్ధి శ్రేష్ఠమైనది |
| బుద్ధికన్న | - | మహత్తత్త్వం శ్రేష్ఠమైనది. |
| మహత్తత్త్వముకన్న | - | అవ్యాకృత ప్రకృతి గొప్పది |
| ప్రకృతికన్న | - | సూక్ష్మరూపి అయిన పురుషుడు గొప్పవాడు. |

అంతకు మించినది ఇంకేమీలేదు, ఇదే పరాకాష్ఠ .అతణ్ణి చేరిన తరువాత తిరిగి రావటం లేదు.

ఆత్మ అనేది సూక్ష్మమైన బుద్ధిచేత మాత్రమే గ్రహించబడుతుంది. ఆత్మ సర్వవస్తుజాలమందూ ఉన్నది. కాని పైకి కనపడదు. సూక్ష్మబుద్ధి గలవారు మాత్రమే దాన్ని గుర్తించగలరు. వివేకవంతుడు.

| | | |
|---|---|---|
| ఇంద్రియాలను | - | మనస్సులో లీనం చెయ్యాలి. |
| మనస్సును | - | బుద్ధిలో లీనం చెయ్యాలి |
| బుద్ధిని | - | మహత్తత్త్వంలో లీనం చెయ్యాలి. |
| మహత్తత్త్వాన్ని | - | ఆత్మలో లీనం చెయ్యాలి. |

శబ్దము, రూపము, రసము, వాసన, నాశనము లేనిది, నిత్యము, అనాది అయినది. ఆత్మ సర్వభూతసాక్షియైన మహత్తత్త్వము కన్న శ్రేష్ఠమైనది. నిశ్చలమైనది; ఆత్మతత్త్వాన్ని తెలుసుకున్నవాడు మృత్యువు వాతపడడు. అతడికి అమరత్వం సిద్ధిస్తుంది". అంటూ నచికేతునికి ఆత్మతత్త్వాన్ని వివరించాడు యముడు.

ఈ రకంగా నచికేతుడు మృత్యుదేవత అయిన యముని దగ్గర ఆత్మతత్త్వాన్ని తెలుసుకున్నాడు అని రత్నాకరుడు కఠోపనిషత్తును ముగించాడు.


మాండుక్యోపనిషత్తు గౌడపాదీయకారికలకు శ్రీ నోరి శ్రీనాథ వేంకట సోమయాజులుగారి వ్యాఖ్యానముతో గ్రంథము మావద్ద లభ్యమగును.

**శివకామేశ్వరి గ్రంథమాల**

**41-22/4-36, భ్రమరాంబాపురం, కృష్ణలంక, విజయవాడ - 13. ఫోన్ : 522824**

# 18. సృష్టి (ఐతరేయోపనిషత్తు - 1)

"శిష్యులారా! పరమేశ్వరుడు ఈ జగత్తును ఏవిధంగా సృష్టించాడు ? ఇంద్రియాలు ఎలా సృష్టించబడినాయి ? ఇంద్రియాల అధిష్టాన దేవతలెవరు ? మొదలైన విషయాలన్నీ 'ఐతరేయోపనిషత్తు'లో చెప్పబడ్డాయి. వాటిని మీకు వివరిస్తాను వినండి'' అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఈ ఉపనిషత్తు ఋగ్వేదానికి సంబంధించినది.

జీవాత్మ, పరమాత్మ రెండూ ఒక్కటే. మరణానంతరము మానవుని జీవాత్మ పరమాత్మలో లీనమైపోతుంది. ఆత్మయే ఆలోచనా పూర్వకంగా ఈ లోకాలను సృష్టించింది. సృష్టి జరగటానికి ముందు ఈ జగత్తు అంతా బ్రహ్మమయంగానే ఉండేది. దానికి భిన్నమైన పదార్థం ఏమీలేదు. దాన్నే ఆత్మ అనికూడా అంటారు. ఆ ఆత్మయే లోకాలను సృష్టించాలనుకుంది. కొంతకాలానికి ఆత్మ అంభస్సు, మరీచి, ఆపః, మర అనే పేర్లు గల లోకాలను సృష్టించింది. ద్యులోకానికి అవతల ఉన్నది అంభస్సు, దానికి ఆశ్రయము స్వర్గము. అదే సువర్లోకము. దానికింద భువర్లోకమున్నది. దాని కింద భూలోకమున్నది. ఇది మరము అంటే మరణము గుణముగా గలది. ఇక్కడ పుట్టిన ప్రతిప్రాణీ మరణిస్తుంది. భూలోకానికి క్రింద జలలోకమున్నది. అది క్రిందనున్న లోకాలచే పొందబడుచున్నది కాబట్టి అపోలోకమనబడుతుంది. ఈ లోకాలన్నీ పంచభూతాలచే నిర్మించబడ్డాయి.

లోకాలను సృష్టించిన తరువాత "ఈలోకాలను రక్షించే వాళ్ళు లేకపోతే అవి నాశనమయిపోతాయి. కాబట్టి లోకపాలకులను సృష్టించాలి'' అని ఆలోచించి, పంచభూతాలలోనూ ప్రధానమైనదైన జలాన్ని తీసుకుని దానితో అవయవాలు గల ఒక మానవాకారాన్ని సృష్టించిది. ఆ ఆకారమే "విరాట్స్వరూపము''. ఇక ఇంద్రియాధిష్టానదేవతా సృష్టి ఏ విధంగా జరిగింది అంటే........

పరమాత్మ ఈ విరాట్స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని తీవ్రమైన ఆలోచన చేశాడు. అదే తపస్సు. దాని ఫలితంగా విరాట్స్వరూపానికి నోరు వచ్చింది. ఆనోటి నుండి మాట, మాట నుండి వాణికి అభిమాన దేవత అయిన అగ్ని ఉత్పన్నమైనాయి. తరువాత ముక్కు రంధ్రాలు వచ్చాయి. వాటి నుండి ప్రాణం ఉత్పన్నమైంది. అనగా వాసన చూసే శక్తి పుట్టింది. ఆ ఘ్రాణశక్తి నుండి వాయువు పుట్టింది. తరువాత నేత్రాలు ఏర్పడ్డాయి! వాటి నుండి సూర్యుడు ఉద్భవించాడు.

తరువాత చెవులు, వాటి నుండి దిక్కులు ఏర్పడ్డాయి. ఆ తరువాత చర్మం, దాని నుండి స్పర్శకు కారణమైన రోమాలు ఏర్పడ్డాయి. చర్మమునుండే ఓషధులు, వనస్పతులు పుట్టినాయి. ఆ తరువాత హృదయం, దాని నుండి మనస్సు, దాని నుండి చంద్రుడు పుట్టారు. తరువాత నాభి, దాని నుండి అపానము, దాని నుండి మృత్యువు ఉద్భవించాయి. ఆ తరువాత పురుష జననేంద్రియము దాని నుంచి వీర్యము, దానికి అధిష్ఠానమైన జలము పుట్టాయి. ఈ రకంగా విరాట్స్వరూపుని  అవయవాల నుండి ఇంద్రియాలు వాటి నుండి అభిమాన దేవతలుపుట్టారు.

ఈ విధంగా పరమేశ్వరునిచే లోకపాలకులుగా సృష్టించబడ్డ అగ్ని మొదలైన ఇంద్రియాభిమానులైన దేవతలు అవిద్యతోకూడిన మహాసముద్రంలోపడ్డారు, దానికి అంతం లేదు. అది ఇంద్రియాలవల్ల కలిగే క్షణిక సుఖాలతో కూడి ఉంటుంది.

పరమేశ్వరుడు ఆ విరాట్స్వరూపానికి ఆకలి దప్పికలు కలిగేలా చేశాడు. అప్పుడు దేవతలందరూ "మేముకూర్చుని భుజించేటందుకు వీలుగా, మాకు తగిన స్థానాన్ని ప్రసాదించమని వేడుకున్నారు." ఆకలి తీరాలంటే ఆహారంకావాలి.  అన్ని ఇంద్రియాలకూ ఆహారం అన్నమేకాదు. వాటి ఆహారము వేరువేరుగా ఉంటుంది.

అప్పుడు దేవతల కోసం పరమేశ్వరుడు ఆవును సృష్టించాడు. దేవతలు ఇది మాకు సరిపోదు అన్నారు.  గుఱ్ఱాన్ని సృష్టించాడు. అదీ చాలదన్నారు. అప్పుడు విరాట్ స్వరూపాన్ని పోలిన పురుష శరీరాన్ని సృష్టించాడు. దాన్ని చూసిన దేవతలు ఇది చాలాబాగుంది అని సంతసించారు. భగవంతుని ఆజ్ఞానుసారం దేవతలంతా వారి వారి స్థానాల్లో ప్రవేశించారు. అంటే అగ్ని వాగ్రూపం ధరించి ఆపురుషుని నోటిలో ప్రవేశించాడు. వాయువు ప్రాణంరూపంతో ముక్కునందు, సూర్యుడు దృష్టి రూపంతో నేత్రాలలో, దిక్కులు చెవులయందు, ఓషధులు, వనస్పతులు చర్మమునందు, చంద్రుడు మనోరూపం దాల్చి హృదయంలోను, మృత్యువు అపాన రూపం దాల్చి నాభియందు, జలం వీర్యరూపం దాల్చి జననేంద్రియమందు ప్రవేశించాయి. ఈ రకంగా దేవతలందరూ వెళ్ళి పోగా ఇంకా మిగిలినవి ఆకలి దప్పికలు. వీరిద్దరినీ పరమేశ్వరుడు దేవతలందరిలోనూ భాగస్వాములుగా చేశాడు. దీనివల్ల ఏదేవతకు హవిస్సు ఇచ్చినా వాటిలోఆకలి దప్పికలకు కూడా భాగం కలుగుతుంది. కంటికి ఆకలి దప్పికలంటే చూడాలనే కోరిక, చెవులకు వినాలనేకోరిక.

ఈ రకంగా ఇంద్రియాలను, వాటి అధిష్ఠాన దేవతలను సృష్టించిన తరువాత అన్నము సృష్టించవలసిన అవసరం వచ్చింది. అప్పుడు జలం నుంచి ఆహారం సృష్టించాడు. అదే అన్నము.

ఆ విధంగా దేవతల కోసము సృష్టించబడ్డ అన్నము దేవతలను చూసి వారు తన పాలిట మృత్యుదేవతలని తలపోసి పారిపోసాగింది. అప్పుడు ఆ ఆదిపురుషుడు అన్నాన్ని తన ఇంద్రియాలైన వాక్కు, చక్షువు మొదలైన వాటితో పట్టుకోవాలనుకున్నాడు. కాని వీలుకాలేదు. చివరకు అన్నాన్ని అపానంతో గ్రహించగలిగాడు. నోటితో లోపలికి పీల్చబడే వాయువే అపానము. ఇదే అన్నాన్ని గ్రహిస్తుంది.

ఇప్పుడు పరమేశ్వరుడు ఇంద్రియాలతో కూడిన మానవ శరీరంలో ప్రవేశించాలనుకున్నాడు. దానికి రెండు మార్గాలున్నాయి. 1. పాదాల చివర నుంచి 2. శిరస్సు నుంచి సృష్టికర్త అయిన పరమేశ్వరుడు శిరస్సులోని బ్రహ్మరంధ్రం ద్వారా మానవదేహంలో ప్రవేశించాడు. ఈ మార్గం ద్వారానే పరమేశ్వర దర్శనం కూడా కలుగుతుంది. అందుకే ఇది ఆనందకరమైనది.

ఈ విధంగా జీవభావంతో ఈ శరీరంలో ప్రవేశించిన పరమేశ్వరుడు పంచభూతాలను తాదాత్మ్యభావంతో గ్రహించాడు. నేను నాది అనే మమకారాన్ని పెంచుకున్నాడు. అనగా పరమేశ్వరుడు సాకారుడైనాడు. గురువు యొక్క దయవల్ల ఈ విధంగా అహంకార మమకారాలు వీడిన తరువాత పరమాత్మ వేరు నేను వేరు అనే భేదభావం పోయి అద్వైతసిద్ధి కలుగుతుంది. అంటూ రత్నాకరుడు ఐతరేయోపనిషత్తులోని మొదటి అధ్యాయాన్ని ముగించాడు.

# 19. ప్రజ్ఞానంబ్రహ్మ (ఐతరేయోపనిషత్తు - 2)

"సృష్టిరహస్యము చెప్పిన తరువాత, మానవుని యొక్క జన్మవృత్తాంతము, అండజాలు, జారజాలు, స్వేదజాలు, మొదలైన వాటి గురించి ఈ ఉపనిషత్తులో ఏంచెప్పారో మీకు చెబుతాను వినండి'' అంటూ తనశిష్యులకు చెప్పటం మొదలు పెట్టాడు రత్నాకరుడు.

లోకంలో పురుషుని యొక్క జన్మవృత్తాంతాన్ని వివరిస్తున్నారు. పురుషుడికి మూడు రకాల జన్మలున్నాయి. ముందుగా జీవులు శుక్లరూపంలో పురుష శరీరంలోనే గర్భరూపాన్ని దాలుస్తారు. వీర్యమనేది మానవుడి అన్ని అవయవాల నుండి ఉత్పత్తి అయిన తేజోరూపము. ఆ విధంగా పురుషుడు తన రూపాన్ని తనలోనే పోషిస్తున్నాడు. తరువాత తనలో ఉన్న ఈ వీర్యాన్ని స్త్రీలో ప్రవేశపెడుతున్నాడు. అనగా తనలాటి పురుషుణ్ణి ఇంకొకడిని ఉత్పత్తి చేస్తున్నాడు. ఈ రకంగా శుక్లరూపంలో తనలోఉన్న రూపము బయటకి వచ్చి స్త్రీలో ప్రవేశించటం పురుషునికి మొదటి జన్మ. ఈ వీర్యంకూడా స్త్రీ పురుషుల అంటే తల్లి తండ్రుల అవయవాలను పోలిన అవయవాలే కలిగి ఉంటుంది. అందుకనే గర్భధారణ స్త్రీకి బాధాజనకంకాదు. ఈ రకంగా తన గర్భంలో ప్రవేశించిన భర్త యొక్కఆత్మను భార్య పోషిస్తుంది. ఇది పురుషుడి మొదటి జన్మ.

భర్త ఆత్మను పోషించే స్త్రీని భర్త పోషిస్తుంటాడు. ప్రసవించే వరకు ఈ విధంగా ఆమె గర్భాన్ని పోషిస్తుంది. ప్రసవించిన తరువాత తండ్రి కుమారుడికి జాతకకర్మలు చేస్తాడు. ఈ కర్మలు ప్రతి తండ్రి తన కుమారుడికి చేస్తూనే ఉంటాడు కాబట్టి ఇది పరంపరగా సాగుతుంది. ఈ రకంగా పుత్రపౌత్రాదులతో వంశం వృద్ధి చెందుతుంది. ఇలా స్త్రీ గర్భం నుంచి జన్మించి సంస్కారాలు పొందటం పురుషునికి రెండవ జన్మ.

తండ్రియొక్క ఆత్మయే పుత్రరూపంలో పుట్టింది. పుత్రుడికి సంస్కారాలన్నీ జరిగినాయి. ఇప్పుడు శాస్త్రోక్తమైన పుణ్యకర్మల సంపాదనకోసం పుత్రుడు తండ్రికి ప్రతినిధిగా తయారయ్యాడు. పెరిగి పెద్దవాడయితరువాత కర్మఫలాన్ని అనుభవించటానికి మరొకజన్మ పొందుతున్నాడు. ఇది మూడవజన్మ.

శిష్యులు గురువుగారిని అడుగుతున్నారు. "స్వామీ! ఏ ఆత్మను మనం ఉపాసిస్తున్నామో, ఉపాసించాలనుకుంటున్నామో, ఆ ఆత్మ ఏది ?''

గురువు వివరిస్తున్నాడు. శరీరంలో రెండు ఆత్మలు కనిపిస్తున్నాయి.

1. **సాధనము** - ఇదే ఇంద్రియాల రూపంలో ఉంది.

2. **ద్రష్ట** - ఇంద్రియాల ద్వారా చూస్తున్నది. చూచిన దాన్ని గుర్తు పెట్టుకొనేది ఆత్మ.

దేనిద్వారా చూస్తున్నామో అది ఆత్మకాదు. ఇంద్రియాల ద్వారా చూసేదే ఆత్మ. ఇంద్రియాల ద్వారా చూసేది మనంకదా. ఆత్మ ఏమిటి ? అని అనుమానం రావచ్చు. మనం కళ్ళతో చూడగలుగుతున్నాం. మరిగ్రుడ్డివాడు చూడలేడుకదా. కాబట్టి చూసేది మనంకాదు. మనమే చూస్తుంటే గ్రుడ్డివాడు కూడా చూడగలగాలి. కాబట్టి చూడటానికి సాధనాలైన ఇంద్రియాలు ఆత్మకాదు. దానిని గుర్తించిన ద్రష్టయే ఆత్మ. శరీరంలో తేజోరూపమైన హృదయమే మనస్సు. అదే ప్రభుత, విజ్ఞానం, ప్రజ్ఞానం, మేధ, దృష్టి, బాధ, స్మృతి, సంకల్పం, క్రతువు. ఇవన్నీ ప్రజ్ఞానికి పేర్లు.

ప్రజ్ఞాన రూపమైన ఆత్మయే బ్రహ్మ. హిరణ్యగర్భుడు, ప్రజాపతి, ఇంద్రియాలకు అధిష్ఠాన దేవతలు అన్నీ దీనినుంచే పుట్టాయి. ఈ ఆత్మయే అగ్ని మొదలైన దేవతలు, పంచభూతాలు, క్షుద్రజీవులు,

| | | |
|---|---|---|
| అండజాలు | - | గ్రుడ్డు నుంచి పుట్టినవి |
| జారజాలు | - | స్త్రీ జననేంద్రియం నుంచి పుట్టినవి |
| స్వేదజాలు | - | బురద లేక చమట నుంచి పుట్టినవి |
| ఉద్భిజాలు | - | భూమి నుంచి పుట్టినవి. |

అంటే పశువులు, పక్షులు, మృగాలు, వృక్షాలు ఈ రకంగా ప్రాణులన్నీ ఆత్మనుంచే ఉద్భవించాయి. లోక మంతా ప్రజ్ఞా నేత్రమే. ప్రజ్ఞానమే బ్రహ్మ.

ఈ విధంగా రెండు, మూడు అధ్యాయాలు వివరించి ఐతరీయోపనిషత్తును పూర్తి చేశాడు రత్నాకరుడు.

## 20. శిక్షావల్లి (తైత్తిరీయోపనిషత్తు-1)

"తైత్తిరీయోపనిషత్తు కృష్ణయజుర్వేదానికి సంబంధించినది. ఈ ఉపనిషత్తు మూడు భాగాలుగా ఉంటుంది. 1) శిక్షావల్లి 2) ఆనందవల్లి 3) భృగువల్లి. శిక్షావల్లినే "సాంహిత్యుపనిషత్తు" అంటారు. దీనిలో అక్షరాల ఉచ్చారణ గురించి చెప్పబడింది. ఇందులో బ్రహ్మవిద్యాప్రాప్తికి ఉపాయంగానూ,సాధనంగానూ ఉపయోగించే ఉపాసనలను వివరించారు. చదువు పూర్తైన తరువాత గురువుగారు శిష్యులకి చేసే హితబోధ- ఈ ప్రపంచంలో ఎలా జీవించాలి? ఏ ధర్మాలు ఆచరించాలి? అనేవి చెప్పబడ్డాయి. ఇది దగ్గర దగ్గరగా మన స్నాతకోపన్యాసములాటిది. ఇప్పుడు దాన్ని గురించి వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఇందులో మొత్తము పన్నెండు అనువాకములున్నాయి. మొదటి అనువాకము ప్రార్థన. ఇందులో మిత్రుడు, వరుణుడు, ఆర్యముడు, ఇంద్రుడు, బృహస్పతి, విష్ణువు మాకు సుఖము కలుగజేయుగాక. వాయురూపుడైన బ్రహ్మకు నమస్కారము. వాయు దేవునకు నమస్కారము. నీవే ప్రత్యక్షంగా కనిపించే బ్రహ్మవు. నీవే ఋతమువు. అంటే యజ్ఞ యాగాదులైన కర్మవు. నీవే సత్యానివి. వాయుస్వరూపమైన ఓ బ్రహ్మ ! నన్ను, నాగురువును, రక్షించు. అధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆది దైవిక తాపములు చల్లారుగాక. ఇది ప్రార్థన. విద్యాభ్యాసము చక్కగా జరగాలని శిష్యుడు చేసిన ప్రార్థన; ముందుగా చెప్పిన మిత్రుడు, వరుణుడు మొదలగు వారంతా శరీరంలోని అవయవాలు చక్కగా పనిచెయ్యటానికి కారణ భూతులైన దేవతలు. వీరిలో.....

| | | |
|---|---|---|
| మిత్రుడు | - | ప్రాణానికి. |
| వరుణుడు | - | అపానానికి |
| ఆర్యముడు | - | కనులకు |
| ఇంద్రుడు | - | బలానికి |
| బృహస్పతి | - | బుద్ధికి |
| విష్ణువు | - | శక్తికి |

దేవతలు శరీరంలో ఈ భాగాలన్నీ బాగా పనిచేస్తేనే విద్యాభ్యాసం బాగా జరుగుతుంది. అందుకే ముందుగా ఈ దేవతలను ప్రార్థించటం.

ఇందులో వాయువును బ్రహ్మగా చెప్పటం జరుగుతోంది. పరబ్రహ్మ కంటికి కనుపించనిది. కాని వాయువు ప్రత్యక్ష బ్రహ్మ. అది లేకపోతే జీవం ఉండదు. అందుచేత సగుణ బ్రహ్మద్వారా నిర్గుణ బ్రహ్మోపాసన చెప్పబడుతోంది. వాయువు ఐదు విధాలుగా ఉన్నది.

1. **ప్రాణవాయువు** - ముక్కుతో పీల్చివదిలేది.
2. **అపానవాయువు** - బరువును క్రిందికి లాగేది. ఇదే భూమిని ఆశ్రయించి ఉంటుంది.
3. **వ్యాన వాయువు** - శరీరమంతటా వ్యాపించి ఉంటుంది.
4. **ఉదాన వాయువు** - పైకి వ్యాపించే స్వభావం గలది.
5. **సమాన వాయువు** - ఆకాశంలో వ్యాపించి ఉన్నది.

ప్రార్థన చివరలో శాంతి మూడుసార్లు చెప్పటం జరిగింది. అది మూడు రకాల తాపాలు ఉపశమించాలని కోరటం.

1. **అధ్యాత్మిక తాపం** - శరీరానికి సంబంధించిన రోగాలు.
2. **ఆది భౌతికము** - దొంగలు మొ॥ వారివల్ల కలిగే బాధలు, ప్రమాదాలు.
3. **ఆది దైవికము** - దైవవశం వల్ల కలిగేవి, యక్షరాక్షసుల వలన కలిగే బాధలు, ప్రమాదాలు.

రెండవ అనువాకంలో ఉపనిషత్తులు పఠించేటప్పుడు అర్థం పూర్తిగా తెలియాలి. అంటే చదవటంలో దోషాలు ఉండకూడదు. చదివేటప్పుడు శ్రద్ధగా చదవాలి. ఇక్కడ వర్ణములు, స్వరములు, మాత్రలు, బలము, సామము, సంతానము అనే ఆరు విషయాలను జాగ్రత్తగా గమనించి చదవాలి.

1. **వర్ణములు** - అ నుంచి క్ష వరకు ఉండే అక్షరాలు వీటిని చక్కగా ఉచ్చరించాలి.
2. **స్వరములు** - వేదానికి నాలుగు రకాల స్వరాలున్నాయి.
   1. అనుదాత్తము - క్రిందికి నొక్కి పలకటం.
   2. ఉదాత్తము - సమాన స్థాయిలో పలకటం
   3. స్వరితము - పై స్థాయిలో పలికేది.
   4. దీర్ఘ స్వరితము - పై స్థాయిలో దీర్ఘముగా పలికేది.

వీటిని గురుముఖతః నేర్చుకోవాలి. అక్షరము యొక్క హెచ్చు తగ్గులను అంటే ఉచ్చారణ బట్టి దాని అర్థం మారుతుంది.

**3. మాత్రలు** - మాత్ర అంటే 1/6 వంతు సెకను కాలము. ఇవి మూడు రకాలుగా లెక్కపెట్టబడతాయి. అవి

హ్రస్వము - మాత్రాకాలము. అ, ఇ, ఉ మొదలైన అక్షరాలకు పట్టే ఉచ్చారణ కాలము.

దీర్ఘము - రెండు మాత్రల కాలము.

ప్లుతము - మూడు అంతకన్న ఎక్కువ మాత్రల కాలం.

**4. బలము** - ఆయా అక్షరాలను ఉచ్చరించేటప్పుడు చేయవలసిన ప్రయత్నం. దీన్నే ఊతము అంటారు.

**5. సామము** - సమానత్వము. మరీ వేగము, మరీ నెమ్మది కాకుండా ఉచ్చరించటము.

**6. సంతానము** - సంహిత అర్థాన్ని అనుసరించి కలిపిచదవటం

ఈ విషయాలు గమనించి చదవకపోతే అర్థభేదం వస్తుంది. అది జ్ఞానానికి ప్రతి బంధకము. అటువంటి పొరపాట్లు జరగరాదనే ఆ విషయాలను ఇక్కడ వివరించటం జరిగింది. ఈ విధంగా ఉచ్చారణ శాస్త్రం శిక్షించటం (బోధించటం) వల్లనే దీనిని శిక్షావల్లి అన్నారు.

మూడవ అనువాకం దగ్గర నుండి సంహితోపనిషత్తు ప్రారంభమవుతుంది. ఈ సంహితోపనిషత్తు ఐదు భాగాలుగా ఉంటుంది.

**1. లోక సంహిత :** దీని మొదటి రూపం భూమి. ఉత్తర రూపం స్వర్గము. ఈ రెంటికి సంధి ఆకాశము. ఈ రెంటినీ కలిపేది వాయువు. ఈ రకంగా భావించి ఈ సంహితను ఉపాసించాలి.

**2. జ్యోతిస్సంహిత :** దీని మొదటి రూపం అగ్ని. ఉత్తర రూపం సూర్యుడు. ఈ రెండూ కలిసే సంధి జలము. ఈ రెంటినీ కలిపేది మెరుపు.

**3. విద్యా సంహిత :** దీని మొదటి వర్ణము ఆచార్యుడు. రెండవ వర్ణము శిష్యుడు. విద్య అనేది ఈ రెంటికీ సంధి. ఈ రెంటినీ కలిపేది విద్యా బోధన.

**4. ప్రజా సంహిత :** ప్రజ అంటే సంతానము. ఈ సంహితకు పూర్వవర్ణము తల్లి. ఉత్తర వర్ణము తండ్రి. సంతానమే ఈ రెంటికీ సంధి. ఈ రెంటినీ కలిపేది సంతానం కనటం.

**5. అధ్యాత్మిక సంహిత :** ఆత్మ అంటే దేహము. దేహానికి సంబంధించిన అవయవాలను గూర్చి చెప్పే విషయాలు అధ్యాత్మ విషయాలు. ఈ సంహితకు మొదటి వర్ణము క్రింద పెదవి. రెండవ వర్ణము పైపెదవి. ఈ రెండు వర్ణములకు సంధి వాక్కు. ఈ రెండు వర్ణములను కలిపేది నాలుక.

ఈ విషయాలను తెలుసుకుని ఈసంహితను ఉపాసించాలి.

నాల్గవ అనువాకంలో మేధస్సు (బుద్ధి)ని కోరే సాధకుడు జపించవలసిన మంత్రాలను, సంపదను కోరేవాడు జపించవలసిన మంత్రాలను చెబుతున్నారు. ఈ అనువాకంలో ఓంకారము యొక్క మహత్వం చెప్పబడింది. ముందుగా మేధస్సు కోరేవాడు జపించవలసిన మంత్రాలు. ఓంకారమనేది అన్ని వేదాలకు మూలమైనది. వేదసారమంతా ఓంకారంలోనే ఉన్నది. ఇది అమృతస్వరూపము. శాశ్వతము. పరమేశ్వర స్వరూపమైన ఓంకారమే నాకు ప్రజ్ఞను అనగా మేధస్సును, బుద్ధిని ఇచ్చుగాక. అమృత స్వరూపమైన బ్రహ్మజ్ఞానం పొందే శక్తి నాకు లభించుగాక.

బ్రహ్మజ్ఞాన సముపార్జనకు కావలసిన శక్తి నాశరీరానికి కలుగుగాక. పరుషమైన మాటలు నానోటి నుండి రాకుండు గాక. గురూపదేశాన్ని చక్కగా వినగలిగేశక్తి నాకు కలుగుగాక. ఓంకారమా ! నీవు బ్రహ్మకు ఒర (కోశము) వంటి దానవు. నీలోనే పరబ్రహ్మ దాగి ఉన్నాడు. నా ఆత్మజ్ఞానాన్ని రక్షించు. రాగద్వేషాలవల్ల నాబుద్ధి శీలము చెడకుండా కాపాడు. పరుష వాక్కులు నానోటినుండి రానీయకు. నన్ను బ్రహ్మజ్ఞానం పొందదగిన వాడిగా చెయ్యి. ఇవి మేధస్సు కోరేవాడు జపించవలసిన మంత్రాలు.

సంపదను కోరేవాడు చేయవలసినవి.

ఓంకారమా ! మేధస్సును, శరీర పాటవాన్ని ఇచ్చిన తరువాత సంపదను ఇవ్వవలసినది. ఇక్కడ సంపద అంటే అన్న వస్త్రాలు, గోవులు మొదలైనవి. అవి చిరకాలము సమృద్ధిగా ఉండేటట్లు చెయ్యవలసినది. లౌకిక, మోక్ష విద్యను కోరినవారు, సద్బుద్ధి, ఇంద్రియ నిగ్రహము గల విద్యార్థులు అన్ని దిక్కుల నుండి శాంతి చిత్తులై నాదగ్గరకు వత్తురుగాక. వీరందరినీ మంచి విద్యార్థులుగా తీర్చిదిద్ది, లోకంలో అత్యంత ధనికులు పొందే గౌరవం కన్న

మిక్కిలి గౌరవము నేను పొందుదును గాక. ఇక బ్రహ్మతో ఐక్యము పొందాలని కోరుతున్నాడు. ఓంకారమా ! బ్రహ్మకు నీవువర (కోశము) వంటి దానవు. నీవు నాలో ప్రవేశించు. అప్పుడు నేను కుడా ప్రణవ స్వరూపుడనే అవుతాను. ఇక నీకూ నాకూ భేదం ఉండదు. ఓ ప్రణవమా! నీవే దేవతారూపము. నిన్ను స్మరించి నాపాపాలు పోగొట్టుకుంటాను. నీవు అనేక రూపాలు పొంది అనేక దేవతలుగా కనిపిస్తున్నావు. నువ్వు నాకు ఆత్మ స్వరూపం తెలిసేటట్లు చెయ్యి నన్ను కూడా నీలో లీనమొనర్చుకో.

ఈ అనువాకంలో సంపదకోసం కొన్ని మంత్రాలున్నాయి. ఉపనిషత్తు అంటే జ్ఞాన ప్రకరణం కదా ! మరి ఇక్కడ సంపదదేనికి ? అనే అనుమానం రావచ్చు. అజ్ఞానికి ధనం పాపహేతువు. జ్ఞానికి వచ్చిన సంపద సద్వినియోగమవుతుంది. యజ్ఞ యాగాది క్రతువులు చెయ్యటానికి సంపదకావాలి కదా !. అందుకని ఈ ప్రకరణంలో ముందుగా జ్ఞానమడిగి తరువాత సంపదనడుగుతున్నాడు.

ఐదవ అనువాకంలో పరబ్రహ్మకు అంగభూతాలయిన వ్యాహృతుల ఉపాసన చెప్పబడుతోంది. వ్యాహృతులు అంటే కర్మలలో ఉపయోగించేవి అని అర్థం. భూః, భువః, సువః అనేవి మూడు వ్యాహృతులు, మహాచమస్యుడనే మహర్షి తపస్సు చేసి 'మహః' అనే నాల్గవ వాహృతిని కనిపెట్టాడు. మహః అనే వ్యాహృతే బ్రహ్మము, ఆత్మ. మహః అనేది (అంగి) శరీరమైతే భూః భువః సువః అనేవి అంగాలకు ఉనికి లభించినట్లుగా 'మహః' వల్ల మిగిలిన వాటికి ఉనికి లభిస్తోంది. వ్యాహృతులు బ్రహ్మకు అంగాలు కాబట్టి ఈ అంగముల (వ్యాహృతుల) ఉపాసన చెప్పబడింది. ఆ ఉపాసన నాలుగు రకాలు.

**1. లోక దృష్టితో ఉపాసన :**

| | | |
|---|---|---|
| భూః | - | భూలోకాన్ని దృష్టిలో ఉంచుకుని |
| భువః | - | అంతరిక్షాన్ని దృష్టిలో ఉంచుకుని |
| సువః | - | స్వర్గలోకాన్ని దృష్టిలో ఉంచుకుని |
| మహః | - | ఆదిత్యలోకాన్ని దృష్టిలో ఉంచుకొని |

ఉపాసన చెయ్యాలి. ఈ లోకాలన్నీ సూర్యుని వెలుగుతో ప్రకాశమవుతాయి. అందుకే ఈ ఉపాసన.

**2. దేవదృష్టితో ఉపాసన :**

| | | |
|---|---|---|
| భూః | - | అగ్ని దృష్టితో |
| భువః | - | వాయుదృష్టితో |
| సువః | - | ఆదిత్య దృష్టితో |
| మహః | - | చంద్రుని దృష్టితో |

ఉపాసన చెయ్యాలి. అన్ని తేజస్సులు చంద్రునిచే పూజ్యములు.

**3. వేద దృష్టితో ఉపాసన :**

| | | |
|---|---|---|
| భూః | - | ఋగ్వేదము |
| భువః | - | సామవేదము |
| సువః | - | యజుర్వేదము |
| మహః | - | ఓంకారము |

ఓంకారాన్ని మొదట, చివర చేర్చటంవల్లనే వేదాలు పూజనీయమవుతున్నాయి.

**4. ప్రాణ దృష్టితో ఉపాసన :**

| | | |
|---|---|---|
| భూః | - | ప్రాణవాయువు |
| భువః | - | అపాన వాయువు |
| సువః | - | వ్యానవాయువు |
| మహః | - | అన్నము |

గా భావించి ఉపాసన చెయ్యాలి. లోకంలో ప్రాణులన్నీ అన్నం చేతనే వృద్ధి పొందుతున్నాయి. ఈ రకంగా వ్యాహృతులు లోక **4**, దేవ **4**, వేద **4**, ప్రాణ **4**, మొత్తం 16 హిరణ్యగర్భునికి ఇవి అంగాలు. వీటిని తెలుసుకోగలిగినవాడే బ్రహ్మను తెలుసుకోగలుగుతాడు. అతడిని దేవతలు కూడా పూజిస్తారు.

పదహారు వ్యాహృతుల్ని సర్వాంగ పూరితమైన బ్రహ్మగా భావించి ఉపాసించటము అంటే మన దృష్టికి, బుద్ధికి గోచరించే విశ్వమంతా భగవంతుని రూపమే. అని భావన చెయ్యటము.

బ్రహ్మను పొందటానికి తగిన స్థానాలు ఆరవ అనువాకంలో చెప్పబడ్డాయి.

పద్మము వంటి ఆకారం గల హృదయాకాశంలో ఆ పరబ్రహ్మ ఉన్నాడు. అతడు మనోమయుడు (జ్ఞానమే ప్రధానముగా గలవాడు), అమృతుడు, హిరణ్మయుడు (ప్రకాశం గలవాడు)

శరీరంలో హృదయ భాగం నుండి సుషుమ్నానాడి ఉంది. రెండు దవడలమధ్యన కొండ నాలుక ఉన్నది. దాని మధ్యభాగం నుండి కపాలాన్ని ఛేదించుకుని బయటకు పోవటమే పరమాత్మను చేరటానికి మార్గము. ప్రాణాన్ని కపాలం ద్వారా బయటకు పంపగలిగినవాడు ఋగ్వేదానికి, ప్రాణవాయువుకు అధిష్ఠానమైన భూః అనే వ్యాహృతి రూపంలో ఉండే అగ్నిలాగా ఈ లోకమంతా వ్యాపిస్తాడు. అంటే బయటకు వచ్చి అగ్నిలో కలసి లోకమంతా వ్యాపిస్తాడు.

అలాగే భువః అనే వ్యాహృతి రూపంలో ఉండే వాయువుతో కలిసి అంతరిక్షమంతా వ్యాపిస్తాడు.

సువః అనే వ్యాహృతి రూపంలో ఉండే ఆదిత్యునితో కలిసి స్వర్గలోకమంతా వ్యాపిస్తాడు.

మహః అనే వ్యాహృతి రూపంలో ఉండే చంద్రునితో కలిసి ఆదిత్య లోకమంతా వ్యాపిస్తాడు.

ఈ రకంగా వ్యాహృతుల రూపంలో ఉండే బ్రహ్మలో కలసిపోతాడు.

ఈ రకంగా బ్రహ్మభావం పొంది అంటే తానుకూడా బ్రహ్మయై అందరి మనస్సులకు అధిపతి అవుతాడు. ఆకాశమే శరీరంగా కలవాడు, సూక్ష్మ శరీరం కలవాడు, కనిపించే లక్షణాలు కలవాడు, కనిపించని లక్షణాలు కలవాడు, సత్యమైన స్వభావం కలవాడు, సమస్త ప్రాణులందు సంచరించేవాడు, ఆనందము మాత్రమే పొందేవాడు, సమాధి ద్వారా పరిపూర్ణానందము పొందేవాడు శాశ్వతుడు అవుతాడు.

ఏడవ అనువాకంలో బ్రహ్మను భూమి మొదలైన ఐదు పాంక్త రూపాలలో ఉపాసించటం చెప్పబడుతోంది.

1. బాహ్యపాంక్తము 2. అధ్యాత్మపాంక్తము.

1. **బాహ్య పాంక్తము** - ఇది మళ్ళీ మూడు విధాలు.

1. లోకపాంక్తము - పృథ్వి, అంతరిక్షము, ద్యులోకము (స్వర్గము) దిక్కులు, మూలలు.

2 దేవతాపాంక్తము - అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు.

3. భూతపాంక్తము - జలము, ఓషధులు, వనస్పతులు, ఆకాశము, ఆత్మ అంటే విరాడ్రూపము.

2. **అధ్యాత్మపాంక్తము** - ఇది మళ్ళీ మూడు విధాలు.

1. వాయుపాంక్తము - ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులు

2. ఇంద్రియ పాంక్తము - కనులు, చెవులు, మనస్సు, వాక్కు, చర్మము.

3. ధాతుపాంక్తము - చర్మము, మాంసము, నరాలు, ఎముకలు, మజ్జ.

ఈ సృష్టిలో ఈ పాంక్తములకు మించినది లేదు. సృష్టి అంతా వీటితోనే జరిగింది. కాబట్టి పాంక్తముల సమిష్టి రూపమే బ్రహ్మ అని ఉపాసన చేయాలి.

జగత్తే బ్రహ్మ అని ఉపాసించేవాడు విరాడ్రూపుడు అవుతాడు. అధ్యాత్మ పాంక్త త్రయంతో కూడినవాడు జీవుడు. బాహ్యాపాంక్తముతో కూడినది జగత్తు. ఈ రెండూ పాంక్తములే. అంటే జీవుని స్వరూపం జగత్తు స్వరూపం ఒక్కటే అని విదాట్స్వరూపుని ఉపాసించేవాడు తానుకూడా విరాడ్రూపుడు అవుతాడు.

ఎనిమిదవ అనువాకంలో ఓంకారాన్ని ఉపాసించటం చెప్పబడుతోంది. ఓంకారము పరబ్రహ్మస్వరూపం. ఈ కనపడే సమస్త జగత్తూ ఓంకారమే. ఓంకారము నుండే వేదాలు శాస్త్రాలు పురాణాలు అన్నీ వచ్చినాయి. ఓంకారంలో బ్రహ్మ భావం ఉంచి ఉపాసన చేస్తే ఫలము ఉంటుంది. ఓం అనేది అనుకరణాన్ని సూచిస్తుంది. అంగీకారాన్ని తెలుపుతుంది.

వేదాలను ఓంకారంతోనే ప్రారంభించాలి. ఈ రకంగా ఓంకారంతో చేసే పనులన్నీ మంచి ఫలితాలిస్తాయి. అందుకే ఓంకారమే బ్రహ్మ అనే భావంతో ఉపాసన చెయ్యాలి. తొమ్మిదవ అను వాకంలో ఉపాసనకు సహాయకారిగా ఉండే స్మార్తకర్మలు తప్పకుండా ఆచరించాలి అని చెబుతున్నారు.

ఋతము - శ్రౌత, స్మార్త కర్మలు.

స్వాధ్యాయము - తాను చదవటం

ప్రవచనము - శిష్యులకు బోధించటం

ఇవి తప్పక ఆచరించాలి.

సత్యము, స్వాధ్యాయము, ప్రవచనము.

తపస్సు, స్వాధ్యాయము, ప్రవచనము

దమము, స్వాధ్యాయము, ప్రవచనము

దమము, బాహ్యేంద్రియ విగ్రహము

శమము, స్వాధ్యాయము, ప్రవచనము

శమము - అంతరింద్రియ నిగ్రహము

అగ్నులు స్వాధ్యాయము, ప్రవచనము.

అతిథి పూజ, బంధుమిత్రుల సత్కారము, సంతానము పొందుట, స్వస్త్రీ సంగమము, కుమారుని వివాహము. ఇవన్నీ తప్పక ఆచరించాలి. వీటిలో స్వాధ్యాయము, ప్రవచనము ప్రతిసారీ చెప్పబడింది. అంటే అవి అత్యంత ముఖ్యమైనవన్న మాట.

స్వాధ్యాయం వల్ల - అర్థం తెలుస్తుంది.

దీనిలో కొంతమంది ఆచార్యులు కొన్నిటిని ముఖ్యంగా చెప్పారు.

సత్యవచనుడు - సత్యానికి ప్రాధాన్యత

తపోనిత్యుడు - చాంద్రాయణాదివ్రతాలకు

మౌద్గల్యుడు - స్వాధ్యాయము, ప్రవచనము

అంటే మిగిలినవి వద్దనిమాత్రం కాదు.

పదవ అనువాకంలో త్రిశంకుడనే బ్రహ్మర్షి ఈ విధంగా అంటున్నాడు.

"సంసారమనే వృక్షానికి ప్రేరకుడనునేనే. పర్వత శిఖరం లాగా నాకీర్తి ఉన్నతమైనది. సూర్యుని లాగానే నాలోకూడా అమృతత్వమున్నది. కాబట్టి నేనే ప్రకాశించేవాడిని. పవిత్రుడను, ఉన్నతుడను, పరమాత్మను. ఆత్మపదార్థమే అమృతం. నేను మరణం లేనివాడను. కాంతివంతమైనవాడను. సర్వజ్ఞుడను. చావులేనివాడను. మార్పులు లేనివాడను. అంటే నేను పరబ్రహ్మను అని అర్థం.

పదకొండవ అనువాకంలో విధులను వివరించటం జరుగుతున్నది.

వేదాన్ని అభ్యసించిన తరువాత గురువుగారు శిష్యునికి ఈ (విషయం చెబుతున్నారు). అనుశాసనం చేస్తున్నారు.

సత్యాన్ని పలుకు, ధర్మాన్ని ఆచరించు, అధ్యయనం చెయ్యటం మరచి పోవద్దు, గురువు కోరిన ధనాన్ని ఇచ్చి సంతోషపెట్టు. వివాహం చేసుకుని సంతానం పొందు అసత్యము పలుకవద్దు. ధర్మాచరణలో పొరపాటు చేయకు. శరీర ఆరోగ్యంలో శ్రద్ధ వహించు. ధర్మంగా ధనార్జన చేయి. వేదాధ్యదయనము, ప్రవచనము రెండూ నియమంగా ఆచరించు.

దేవకార్యాలు, పితృకార్యాలు నియమంగా చెయ్యి. తల్లి తండ్రులను, గురువులను పూజించు. అతిధులను ఆదరించు. అనింద్యములైన పనులు మాత్రమే చెయ్యి. మీ పెద్దలు నింద్య కర్మలు చేసినా నువుమాత్రం చెయ్యవద్దు. మంచి కార్యాలు ఆచరించు. దురాచారాలు వద్దు. గురువు చెప్పిన వాటిలో శాస్త్ర విరుద్ధమైనవి ఉంటే వాటిని వదిలెయ్యి. యోగ్యులైన బ్రాహ్మణులను సత్కరించి వారు చెప్పేది విను. దానం చేసేటప్పుడు శ్రద్ధాభక్తులతో చెయ్యి అశ్రద్ధతో దానం చెయ్యకు. నీ సంపదకు తగ్గట్టుగా దానం చెయ్యి. ఇంతకన్న ఎక్కువ ఇవ్వలేక పోయానే అని సిగ్గుపడుతూ దానం చెయ్యి. పరలోక భయంతోదానం చెయ్యి. బంధుమిత్రులను సత్కరించు. ఈ విషయాలలో ఏవైనా అనుమానం వస్తే నీ సమీపంలో ఉండే పండితులను అడిగి తెలుసుకో.

పాపులతో వ్యవహరించకు. వారు పాపులా ? కాదా ? అని సందేహం వచ్చినప్పుడు ధర్మాభిలాష గల పండితులు ఎలా చేస్తారో చూసి అలా చెయ్యి. ఇదే గురువు శిష్యునకిచ్చే ఆదేశము.

పన్నెండవ అనువాకంలో మొదట చెప్పినదే మళ్ళీ చెప్పబడింది. అంటూ తైత్తిరీయోపనిషత్తులోని శిక్షావల్లిని పూర్తి చేశాడు రత్నాకరుడు.

శాంతిపాఠమ్

# 21. ఆనందవల్లి (తైత్తిరీయోపనిషత్తు - 2)

"శిష్యులారా" తైత్తిరీయంలో రెండవ భాగము 'ఆనందవల్లి'. దీనిలో అంతా పరబ్రహ్మ గురించి చెప్పబడింది. అందుకనే దీన్ని 'బ్రహ్మవల్లి' అన్నారు. ఇందులో మొత్తం తొమ్మిది అనువాకాలున్నాయి. శిక్షావల్లిలో సగుణ బ్రహ్మను, కర్మకాండను గురించి కుడా చెప్పారు. ఆనందవల్లిలో కేవలం నిర్గుణోపాసన మాత్రమే చెబుతున్నారు. ఆ విషయం చెబుతాను వినండి" అంటూ మొదలు పెట్టాడు రత్నాకరుడు.

అవిద్య నశించటమే బ్రహ్మవిద్య ప్రయోజనం. అవిద్య ఎప్పుడైతే నశించిందో అప్పుడు ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. కంటికి కనిపించని దాన్ని గురించి ఒక్కసారిగా చెప్పేకన్న కనిపించేదాన్నుంచి కనిపించని దానికి తీసుకుపోవటం తేలిక. అందుచేతనే సాధకుడికి రూపమున్న సగుణబ్రహ్మను గురించి ముందు చెప్పి తరువాత అతడికి రూపంలేని నిర్గుణబ్రహ్మ గురించి వివరించటం జరుగుతోంది. దీనికి ముందుగా అవిద్య నాశనం కావాలి.

బ్రహ్మను తెలుసుకున్నవాడు మోక్షాన్ని పొందుతాడు. అంటే తానే పరబ్రహ్మ అవుతాడు. "సత్యంజ్ఞాన మనంతం బ్రహ్మ" దహరాకాశంలో ఉన్న పరబ్రహ్మను తెలుసుకొన్న వాడికి బ్రహ్మ జ్ఞానంతో బాటు ఇష్టకామ్యార్థసిద్ధి కలుగుతుంది. సృష్టికి మూలము బ్రహ్మము. దానినుంచే ఆకాశం పుట్టింది. అంటే ఆకాశం కూడా బ్రహ్మయే.

| | | |
|---|---|---|
| బ్రహ్మ నుండి | - | ఆకాశము |
| ఆకాశము నుండి | - | వాయువు |
| వాయువు నుండి | - | అగ్ని |
| అగ్ని నుండి | - | జలము |
| జలము నుండి | - | భూమి |

ఈ రకంగా పంచభూతాలు ఉద్భవించినాయి.

| | | |
|---|---|---|
| ఆకాశం లక్షణం | - | శబ్దము |
| వాయువు లక్షణం | - | స్పర్శ |
| అగ్ని లక్షణం | - | రూపము |
| జల లక్షణం | - | రసము |
| భూమి లక్షణం | - | గంధము |

ఈ లక్షణాలే తన్మాత్రలు పంచభూతాలు, తన్మాత్రలుకుడా పంచకీకరణ చెందాయి. అప్పుడు మొత్తం పదిహేను భాగాలవుతున్నాయి. అందులో ....

| | | |
|---|---|---|
| ఆకాశం | - | 5 భాగాలు |
| వాయువు | - | 4 భాగాలు |
| అగ్ని | - | 3 భాగాలు |
| జలము | - | 2 భాగాలు |
| భూమి | - | 1 భాగము |
| మొత్తం | - | 15 భాగాలు |

ఈ విధంగానే తన్మాత్రలు కుడా పంచకీకరణ చెందాయి. అప్పుడు.

| | | |
|---|---|---|
| శబ్దము | - | 5 భాగాలు |
| స్పర్శ | - | 4 భాగాలు |
| రూపం | - | 3 భాగాలు |
| రసము | - | 2 భాగాలు |
| గంధము | - | 1 భాగము |
| మొత్తం | - | 15 భాగాలు |

ఇవన్నీ బ్రహ్మ నుంచే ఉద్భంచాయి కాబట్టి బ్రహ్మరూపాలే. భూమి నుండి ఓషధులు, వనస్పతులు పుట్టినాయి. ఓషధులు అంటే చెట్లు చేమలు. వీటినుంచే అన్నం పుట్టింది. అన్నమే రేతస్సుగామారి కాళ్ళు చేతులు మొ॥ అవయవాలతో పురుషుడయినాడు. లోకంలోని జీవరాసి అంతా ఈ రకంగా ఉద్భవించిందే. పంచభూతాలతోనే శరీరం ఉద్భవించింది. అందుకే దీనిని పాంచ భౌతిక శరీరమంటారు. శరీరంలో మిగిలిన భూతాలు, వాటి లక్షణాల కనుగుణమైన జ్ఞానాన్నిచ్చే అవయవాలు కూడా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| శబ్దము (వాక్కు) | - | ఆకాశం |
| స్పర్శ | - | చర్మము |
| రూపం | - | కళ్ళు |
| రసము | - | నాలుక |
| గంధము | - | ముక్కు |

పంచభూతాలు, ఓషధులు, అన్నం తరువాత క్రమంగా పురుషుడు ఏర్పడ్డాడు.

గర్భంలో ఉండే శిశువుకు మొదట శిరస్సు, కుడిచేయి, ఎడమ చేయి. (మొండెం తోకవంటి భాగము) మాత్రమే ఉంటాయి. ఈ రకంగా అది పక్షి ఆకారంలో ఉంటుంది. అంచేతనే పురుషుని వర్ణించేటప్పుడు ఆయన అవయవాలు మాత్రమే చెప్పటం జరుగుతుంది.

బ్రహ్మవేత్త మోక్షం పొందుతాడు. లేదా తాను పరబ్రహ్మలో లీనమవుతాడు. అంటే సాధకుడు వేరు, బ్రహ్మవేరు అనికాదు. సాధకుడు తనను తాను పరమేశ్వర రూపంగా భావిస్తాడు.

సాధకుడి శరీరంలోనే పరబ్రహ్మ ఉంటాడు. ఇక్కడ అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాలనడుమ ఆనందమయ కోశమందు పరబ్రహ్మ ఉంటాడు.

జీవికి మూడు శరీరాలుంటాయి. అవి.

1. **స్థూల శరీరం** : అన్నమయ కోశము, ఇంద్రియాలతో కూడినది.
2. **సూక్ష్మ శరీరం** : ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాల సముదాయము.
3. **కారణ శరీరం** : స్థూల సూక్ష్మ శరీరాలకు కారణమైనది. ఆనందమయ కోశము.

సృష్టిలోని ప్రాణులన్నీ అన్నం వలన పుట్టినవే. అంతే కాకుండా భూమిని ఆశ్రయించినవన్నీ అన్నంవల్ల పుట్టినవే. అవన్నీ అన్నంతోనే జీవిస్తాయి. మరణానంతరము అన్నంలో లీనమైపోతాయి. అంటే పంచభూతాలలో కలిసిపోతాయి. ప్రాణులన్నింటి కన్న అన్నమేముందు పుట్టింది. ప్రజలందరూ అన్నంవల్లనే పుట్టారు. వారికి జీవము, మృత్యువు కుడా అన్నమే. వీరికి అన్నమే ఆకలి, దాహం మొ॥ బాధలు తీరుస్తుంది. ఈ విషయాన్ని తెలుసుకుని అన్నాన్ని బ్రహ్మగా తలచి ఉపాసన చెయ్యటమే అన్నబ్రహ్మోపాసన.

అన్నమయమైన ఈశరీరం లోపల ప్రాణమయమైన ఆత్మ ఉన్నది. ఆ ప్రాణమయమైన ఆ ఆత్మతో ఈ అన్నమయం నింపబడుతోంది. ప్రాణమయ ఆత్మ తల, చేతులు, మొండెము కలిగి పురుషాకారంగానే ఉంటుందని భావించాలి. ప్రాణమయ శరీరానికి.

ప్రాణమే - శిరస్సు
వ్యానవాయువు - దక్షిణ పక్షము
అపానవాయువు - ఉత్తర పక్షము
ఆకాశమే - ఆత్మ
భూమి - పుచ్ఛము (తోక)

ఉపాసనకోసం ఈ రకంగా అన్ని కోశాలకు రూపం కల్పించబడింది. ఇదికాదు, ఇదికాదు అని ఈ కోశాలన్నీ వదలుతూపోతే చివరకు బ్రహ్మ సాక్షాత్కారమవుతుంది.

ప్రాణము వల్లనే శరీరంలోని ఇంద్రియాలన్నీ పనిచేస్తున్నాయి. ప్రాణులన్నింటిలోనూ ఇదే జరుగుతోంది. ఈ ప్రాణవాయువే జీవులన్నింటికి ఆయువు. ప్రాణం లేదంటే మరణమే. అందుచేతనే అన్నమయ కోశంలో ఉన్న ప్రాణమయకోశాన్ని ఉపాసించే వారికి పూర్ణాయువు కలుగుతుంది.

అంటే బ్రహ్మను ఏ గుణం గలవాడుగా ఉపాసిస్తే సాధకుడికి అది లభిస్తుంది.

ప్రాణమయ ఆత్మలోపల మనోమయ ఆత్మ ఉన్నది. మనోమయుడు సంకల్ప వికల్పాలతో కూడినవాడు. అతనికి (మనోమయునికి)

యజుర్వేదము - శిరస్సు

ఋగ్వేదము - దక్షిణ పక్షము

సామవేదము - ఉత్తర పక్షము

అధర్వ వేదము - పుచ్ఛము

మనస్సు, వాక్కు మొదలైనవి బ్రహ్మను చేరలేవు. వాటికి ఆశక్తిలేదు. ఆనందమయ స్వరూపుడైన బ్రహ్మను పాసించినవాడికి భయముండదు. ప్రాణమయ శరీరం లోపల మనోమయ శరీరమున్నది. దీని లోపల విజ్ఞానమయ శరీరమున్నది. నిశ్చయజ్ఞానం కలవానికి తాను చేయవలసిన పనియందు కలిగే శ్రద్ధయే విజ్ఞానాత్మకు శిరస్సు.

సత్యము - ఉత్తర పక్షము

ఋతము - దక్షిణ పక్షము

యోగము - ఆత్మ

మహత్తత్త్వము - పుచ్ఛము

విజ్ఞానమే యజ్ఞం చేయిస్తుంది. కర్మలు చేయిస్తుంది. విజ్ఞానవంతుడే యజ్ఞకర్మలు, లౌకిక కర్మలు చేస్తాడు. విజ్ఞానమయుడైనవాడే ఆత్మ. అంటే విజ్ఞానబ్రహ్మ. దేవతలంతా దీన్నే ఉపాసిస్తారు. అందుకే వారు విజ్ఞానధనులు, విజ్ఞానబ్రహ్మను ఉపాసించేప్పుడు ఏ రకమైన పొరపాటు రాకూడదు. అంటే అన్నమయాది కోశాలలో ఆత్మ ఉన్నదన్న భావన

రాకూడదు. వాటిని వదలి వేయాలి. ఈ రకంగా విజ్ఞాన బ్రహ్మయందే బ్రహ్మ భావం ఉంచి ఉపాసన చేసినవారికి సమస్త పాపాలూ నశిస్తాయి. సమస్త కోరికలూ తీరి తానే బ్రహ్మవేత్త అవుతాడు.

విజ్ఞానమయకోశము. లోపల ఆనందమయ కోశమున్నది. ఇక్కడ ఆనందమయుడున్నాడు. అతడికి

ప్రియము (తన వారిని చూచినప్పుడు కలిగే సంతోషము) - శిరస్సు

మోదము (కోరుకున్నది లభించినపుడు కలిగే సంతసము) - దక్షిణ పక్షము

ప్రమోదము (మోదము ఎక్కువ అయినప్పుడు కలిగేది) - ఉత్తర పక్షము

ఆనందము (అన్నిటికీ మించిన సంతోషము) - ఆత్మ

బ్రహ్మము లేదన్నవాడు వేదాలను అంగీకరించడు కాబట్టి నాస్తికుడు. బ్రహ్మమున్న దన్నవాడే ఆస్తికుడు. సన్మార్గ పరుడు.

ఆనందమయుడే విజ్ఞాన మయునికి ఆత్మ. జ్ఞానమయుని లోపల ఆనందమయుడున్నాడు. చరాచర జగత్తంతా బ్రహ్మమే. ఆకాశానికి కారణం బ్రహ్మ. సృష్టికి ముందు అంతా శూన్యంగా ఉండేది. ఆ శూన్యంలో పరబ్రహ్మ ఒక్కడే ఉండేవాడు. అతడే ఈ నామ రూపాత్మకమైన జగత్తు సృష్టించాడు. ఆ స్వయంభువు ఆనందకారకుడు. అతన్ని సాక్షాత్కరింప చేసుకున్నవాడు ఆనందం పొందుతున్నాడు. దహరాకాశంలో గనక ఆ పురుషుడు లేకపోతే ఊపిరిపీల్చేదెవరు ? కాబట్టి హృదయ పద్మంలోనే పరమేశ్వరుడున్నాడు. సాధకుడు తానే పరబ్రహ్మ అని తెలుసుంటే భయాలుండవు. బ్రహ్మకు తనకు బేధభావం కలిగితే భయం కలుగుతుంది. బేధ దృష్టి గల విద్వాంసుడికి కూడా భయముంటుంది. సృష్టినాశనానికి కారణం ఎవరో ఉన్నాడనే భావమే భయానికి కారణం. తాను వేరు బ్రహ్మవేరు అనే భావం తొలగిపోతేనే సాధకుడికి ముక్తి లభిస్తుంది. అజ్ఞానికి మోక్షం రాదు.

పరబ్రహ్మను గూర్చిన భయంతోనే గాలి వీస్తోంది. సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఇంద్రాదిదేవతలు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారు. దేవతలు కూడా సక్రమంగా తమ విధులు నిర్వర్తించటానికి కారణం బ్రహ్మ ఉండటమే. ఈ రకంగా భయానికి కారణమైన బ్రహ్మమే ఆనందము. ఇది క్షణికానందం కాదు. శాశ్వతానందం. విషయ

వాంఛలవల్ల కలిగేది లౌకికానందం. ఇది క్షణికం. అనుభవించగానే ఆ ఆనందం తగ్గిపోతుంది. అవిద్య అంటే అజ్ఞానము, విషయ వాంఛలు తగ్గిన కొద్దీ ఆ ఆనందం పెరుగుతుంది. అదే మానవుల, మనుష్య గంధర్వుల, దేవగంధర్వుల ఆనందంగా అభివృద్ధి చెంది స్వాభావికమైన పరిపూర్ణానందంగా మారుతుంది. అదే అద్వైతానందం.

ఈ ఆనందం శ్రోత్రియుడు, (వేద కర్మలనాచరించువాడు) సదాచార సంపన్నుడు, నిష్కాముడు అయిన బ్రహ్మవేత్తయే అనుభవించతగ్గది. ఈ మూడు గుణాలు లేనివాడికి ఆనందం లభించదు.

ఈ లోకంలోని సంపద అంతా యువకుడు, సదాచార సంపన్నుడు, వేదాధ్యాయి, బలమైనవాడు అనుభవించటానికే ఉన్నది. దీన్ని అనుభవించటం వల్ల కలిగే ఆనందము మానుషానందము. మానుషానందునికి నూర్రెట్లు మనుష్య గంధర్వానందము. మనుష్య గంధర్వులంటే మానవులై ఉండి పుణ్యకర్మలచేత గంధర్వత్వం పొందినవారు.

మనుష్య గంధర్వానందానికి నూరురెట్లు దేవగంధర్వానందం. సృష్టికాలంలో దేవలోకంలో గంధర్వుడుగా పుట్టినవాడు దేవగంధర్వుడు. దేవగంధర్వానందానికి నూరురెట్లు చిరలోక పిత్రానందము. చిరకాలం ఉండే లోకంలో ఉన్న పితృదేవతలు చిరలోక పితరులు.

దానికి నూరు రెట్లు అజానజదేవానందము. ఈ లోకము దేవలోకానికి పైన ఉన్నది. అక్కడి వారు అజానజ దేవతలు, దానికి నూరురెట్లు కర్మ దేవానందము. వైదిక కర్మలు చేసినవారు కర్మ దేవతలు.

దానికి నూరురెట్లు దేవానందము. యజ్ఞంలో హవిర్భాగము తీసుకునే 33 మంది దేవతలు.

దానికి నూరు రెట్లు ఇంద్రానందము.

దానికి నూరురెట్లు బృహస్పతి ఆనందము.

దానికి నూరురెట్లు ప్రజాపతి ఆనందము (విరాట్పురుషుడు)

దానికి నూరు రెట్లు బ్రహ్మానందం. అతడే మానవులందరిలోనూ ఉన్నాడు.

ఎవరైతే సత్యము, జ్ఞానము, అనంతము అయిన బ్రహ్మ తానే అని తలుస్తాడో, అతడు మరణానంతరము అన్నమయాత్మను పొందుతాడు. తరువాత పంచకోశములను ఒక్కొక్కటిగా దాటుకుంటూ ఆనందమయ కోశములోని పరబ్రహ్మను చేరతాడు.

ఆనంద స్వరూపుడైన బ్రహ్మను మన వాక్కుతో తెలుసుకోలేము. వాక్కుకు అర్థం పరిమితము. కాబట్టి పరిమిత వాక్కులతో అపరిమిత బ్రహ్మను వ్యక్తం చెయ్యలేము. అలాగే మనస్సుకు కూడా బ్రహ్మను పొందే శక్తి లేదు. మనస్సు, వాక్కులకు అతీతమైన బ్రహ్మ జ్ఞానంతో తెలుసుకోవాలి. పరబ్రహ్మను తెలుసుకున్నవారికి ఏమీ అంటవు. అతన్ని ఏమీ బాధించవు·అతనికి అజ్ఞానము, బేదబుద్ధి ఉండవు. అందుచేతనే బాధలుండవు.

అతడికి మంచి చెడులతో సంబంధముండదు. కాబట్టి పాప పుణ్యాలుండవు. నరక భయముండదు.

బ్రహ్మజ్ఞాని పాప పుణ్యాలకు, సుఖ దుఃఖాలకు అతీతుడు. కాబట్టి నిప్పులో కాలిపోయిన విత్తనం ఏ రకంగా మొలకెత్తదో, ఆ విధంగా అతని దృష్టిలో పుణ్య పాపాలు శక్తి లేనివై పోతాయి. జన్మరాహిత్యం కలుగుతుంది.

ఈ రకంగా పరబ్రహ్మ తత్త్వాన్ని ఈ భాగంలో వివరించారు అంటూ తైత్తిరీయోపనిషత్తులోని రెండవ భాగమైన 'ఆనందవల్లి'ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 22.భృగువల్లి (తైత్తిరీయోపనిషత్తు 3)

"తైత్తిరీయోపనిషత్తులో మూడవ భాగం భృగువల్లి. ఇందులో వరుణమహర్షి తన కుమారుడైన భృగుమహర్షికి బ్రహ్మజ్ఞానాన్ని వివరిస్తాడు. ఆ కథ చెబుతాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

వరుణమహర్షి కుమారుడు భృగుమహర్షి. విద్యాభ్యాసం పూర్తిచేసి బ్రహ్మజ్ఞానం పొందాలనే కోరికతో తండ్రి దగ్గరకు వెళ్ళి బ్రహ్మతత్త్వాన్ని ఉపదేశం చెయ్యమని అడిగాడు. దానికి తండ్రి "కుమారా ! అన్నము, ప్రాణము, నేత్రము, శ్రోత్రము, మనస్సు, వాక్కు మొదలైనవన్నీ పరబ్రహ్మసాధనకు మార్గాలే. వీటన్నింటిలోనూ బ్రహ్మతత్త్వము ఇమిడి ఉంది. అది దేనిలోనించి ఉత్పన్నమైనదో, దేనితో పోషింపబడుతున్నదో, దేనియందు లయమవుతున్నదో, అన్నిటికీ మూలవస్తువు ఏదో తెలుసుకోవాలి. దాన్ని తపస్సు ద్వారానే సాధించాలి. కాబట్టి వెళ్ళి తపస్సు చెయ్యి" అన్నాడు.

తండ్రి ఉపదేశాన్ని అనుసరించి దీక్ష తీసుకుని నియమనిష్ఠలతో తపస్సుచెయ్యటం మొదలుపెట్టాడు భృగుమహర్షి. ఇలా కొంతకాలం జరిగింది. ఆ తరువాత అన్నమే పరబ్రహ్మ స్వరూపము అని తెలిసింది. అన్నం మూలంగానే అన్ని ప్రాణులూ ఉత్పత్తి అవుతున్నాయి. పుట్టిన ప్రాణాలన్నీ అన్నంవల్లనే పోషింపబడుతున్నాయి. అన్నం భూమినుంచే ఉత్పత్తి అవుతోంది. మరణించిన తరువాతకూడా ప్రాణాలన్నీ ఈ భూమిలోనే కలిసి పోతున్నాయి. కాబట్టి అన్నమే పరబ్రహ్మస్వరూపం. ఈవిషయాన్ని తండ్రికి తెలియచేశాడు భృగువు. దానికి వరుణ మహర్షి "నాయనా ! బ్రహ్మతత్త్వసాధనలో నీవు మొదటిమెట్టు మీదనే ఉన్నావు. ఇంకా సాధన చెయ్యాలి" అన్నాడు. మళ్ళీ తపస్సుచెయ్యటం మొదలుపెట్టాడు భృగువు. ఇంకొంత కాలం గడిచింది. ప్రాణమేబ్రహ్మ అనే విషయాన్ని అర్థం చేసుకున్నాడు. లోకంలోని సమస్త జీవరాసులు ప్రాణం వల్లనే జీవిస్తున్నాయి. ఇవన్నీ ప్రాణం వల్లనే రక్షించబడుతున్నాయి. ప్రాణంపోయినప్పుడు మృత్యువులో లయమైపోతున్నాయి. అందుచేత ప్రాణమే సర్వసృష్టికి మూలాధారము అని భావించాడు. ఇదేవిషయాన్ని తండ్రికి వివరించాడు.

"నాయనా ! ఇదివరకటి కన్న కొంచెం ముందుకు వెళ్ళావు. అంతేకాని ప్రాణమే బ్రహ్మకాదు. ఇంకా తపస్సుచెయ్యి వెళ్ళు" అన్నాడు వరుణ మహర్షి.

భృగువు మళ్ళీ తపస్సుచెయ్యటం ఆరంభించాడు. కొంతకాలం జరిగింది. మనస్సు వల్లనే ప్రాణులు ఉత్పన్నమవుతున్నాయి. స్త్రీ పురుషులు మనసు చేతనే ఆకర్షితులౌతున్నారు. అందువల్లనే ప్రాణులుఉద్భవిస్తున్నాయి. జన్మించిన తరువాతకుడా ఇంద్రియాల సాయంతోనే జీవనం సాగుతున్నది. అదేవిధంగా చనిపోయిన తరువాత కుడా ఇంద్రియాలకు జ్ఞానం ప్రసాదించే శక్తి పోతుంది. అవన్నీ మనస్సులోలీనమవుతాయి. కాబట్టి మనస్సే బ్రహ్మ అనుకున్నాడు భృగువు. అదే విషయాన్ని తండ్రికి తెలియ చేశాడు. కాదన్నాడు తండ్రి. ఇంకా తపస్సు చెయ్యమన్నాడు.

మళ్ళీ కొంతకాలం తపస్సు చేశాడు భృగువు. ఇప్పుడు అతడికి అర్థమయింది విజ్ఞానమే బ్రహ్మస్వరూపమని. తండ్రికి తెలియచేశాడు. కాదన్నాడు తండ్రి. మళ్ళీ కొంతకాలం తపస్సు చేశాడు భృగువు. అప్పుడు తెలిసిందతడికి ఆనందమే పరబ్రహ్మస్వరూపము అని. సర్వమూ ఆనందం నుంచే జనిస్తుంది. ఆనందంలోనే లయంఅవుతుంది. ఈ విషయం తండ్రికి తెలియచేశాడు. మహదానందంచెందాడు వరుణమహర్షి. అప్పుడు చెప్పాడు. "కుమారా ! అన్నింటికన్నా ఉత్తమంగా పరమాత్మతత్త్వాన్ని స్పష్టం చేసే తత్త్వం ఆనందం. అన్నము, ప్రాణము, మనస్సు, విజ్ఞానము కూడా బ్రహ్మస్వరూపాలే. కాని ఇవి ఒకదాని కన్న మరొకటి ఇంకా సూక్ష్మమైనవి. అన్నిటినీ మించినది ఆనందము. ఈ ఆనందము క్షణికమైనది కాదు. శాశ్వతమైనది. పరబ్రహ్మోపాసన క్రమంగాజరగాలి. అంటే ఒక్కొక్కమెట్టు పైకి వెళ్ళాలి. అందుకే అన్నాన్ని ఎప్పుడూ నిందించరాదు. ప్రాణము, మనస్సు అన్నీ అన్నం మీదనే ఆధారపడి ఉన్నాయి. అందుకే అన్నాన్ని నిర్లక్ష్యం చెయ్యరాదు. అయితే మానవుడు తినటం కోసమే జీవించరాదు. జీవించటం కోసం మాత్రమే తినాలి. అన్నాన్ని నియమ ప్రకారమే స్వీకరించాలి. అన్నాన్ని పూజిస్తే తరువాతవన్నీ లభిస్తాయి. అందుకని ఆహారాన్ని వదలకుండా, ప్రాణాన్ని నిలుపుకుంటూ, మనస్సును వికసింప చేసుకుని, విజ్ఞానానుభవం నుండి బ్రహ్మానందం పొందాలి." అని బ్రహ్మతత్త్వాన్ని ఉపదేశించాడు. అని చెప్పి 'తైత్తిరీయోపనిషత్తు' ను ముగించాడు రత్నాకరుడు.

# 23. పరా-అపరా విద్యలు (ముండకోపనిషత్తు-1)

"శిష్యులారా! విద్య రెండు రకాలు 1) అపరా విద్య. ఇది లౌకిక ప్రయోజనోపకారి. 2) పరావిద్య. ఇది మోక్ష విద్య. ఈ రెండు రకాల విద్యల గురించి ముండకోపనిషత్తులో చెప్పారు. వాటిని మీకు వివరిస్తాను. వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఈ ఉపనిషత్తు అధర్వ శాఖకు సంబంధించినది. ఇది మొత్తం మూడు భాగాలుగా ఉంటుంది. ప్రథమ ముండకంలో ముందుగా ఆచార్య పరంపరను వర్ణించటం జరిగింది.

ఈ ఉపనిషత్తుకు గురుపరంపర చెబుతున్నారు. దేవతలందరిలోకి ముందువాడు, జ్ఞాన వైరాగ్యాలు కలిగినవాడు అయిన బ్రహ్మదేవుడు బ్రహ్మవిద్యను మొదటగా అధర్వునికి ఉపదేశించాడు. అని తైత్తయోపనిషత్తును పూర్తి చేశాడు రత్నాకరుడు.

| | | |
|---|---|---|
| అధర్వుడు | - | అంగి అనే ఋషికి |
| అంగి | - | సత్యవహునికి |
| సత్యవహుడు | - | అంగిరసునికి |
| అంగిరసుడు | - | శౌనకునకు బ్రహ్మవిద్యను ఉపదేశించారు. |

పూర్వకాలంలో పాంచాల దేశంలో త్రిగర్త అనే పల్లె ఉండేది. అందులో శునకుడు అనే పండితుడుండేవాడు. ఆయన దగ్గర పాండిత్యంతో పాటుగా ధనధాన్యాలు కూడా సమృద్ధిగా ఉండేవి. ఆ గ్రామంలో చాలామంది శునకుని వద్దనే ఉంటూ విద్యా జ్ఞానం చేసిన వారే. అందుచేత అతని కీర్తిచంద్రికలు పాంచాల దేశమంతా వ్యాపించాయి. శునకునికి ధనంతో బాటుగా దయాగుణం కూడా బాగా ఉండేది. అతిధి సత్కారం నిరంతరం సాగుతూనే ఉండేది. అందుచేతనే ఆదర్శ గృహస్థుగా పేరుపొందాడు శునకుడు.

శునకుని పెద్దకుమారుడు శౌనకుడు. కఠోర నియమాలతో బ్రహ్మచర్యం పాటించి విద్యాభ్యాసం పూర్తిచేశాడు. అతడు మంచి మేధావి. అతని తెలివితేటలను గురుకులంలో అందరూ మెచ్చుకునేవారు. విద్యార్థిగా గురువుగారికి, గురుపత్నికి కూడా నిరంతరం సేవలు చేసేవాడు. విద్యాభ్యాసం పూర్తయింది. బ్రహ్మచర్య దీక్ష విరమించి ఇక గృహస్థాశ్రమం స్వీకరించాలి. ఆదశలో ఒకనాడు అంగిరసుడికి నమస్కరించి ఈ విధంగా అడిగాడు.

"గురువర్యా ! ఓ అంగిరస మహర్షి ! దేన్ని గురించి తెలుసుకుంటే సర్వమూ తెలుస్తాయో దాన్ని దయచేసి నాకు వివరించండి" అన్నాడు. దానికి అంగిరసుడు....

"లోకంలో మనం తెలుసుకోవలసిన విద్యలు రెండు ఉన్నాయి. 1) పరావిద్య 2) అపరావిద్య. పరమేశ్వరుడికి సంబంధించిన విద్య పరావిద్య. ధర్మములు, కర్మలు వాటి సాధన మొదలైన విషయాలకు సంబంధించిది అపరావిద్య.

చతుర్వేదాలు, శిక్ష, వ్యారణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిష్యము అనేవన్నీ అపరావిద్య. ఆత్మతత్త్వాన్ని బోధించేది పరావిద్య. ముందుగా పరావిద్యను గూర్చి వినవలసినది. జ్ఞానేంద్రియాలకు లొంగనిది, కర్మేంద్రియాల విషయం కానిది గోత్రము, వర్ణము, నేత్రములు, శ్రోత్రములు, కాళ్ళు చేతులులేనిది, నిత్యమైఅన్నిటి యందు ఉన్నది, సూక్ష్మాతి సూక్ష్మమైనది, అవ్యయమైనది, పంచభూతాలకు కారణమైనది పరబ్రహ్మతత్త్వము. అటువంటి తత్వాన్ని జ్ఞానియైనవాడు సర్వత్ర చూడగలడు.

సాలెపురుగు ఏ సహాయం లేకుండానే తన శరీరం నుంచి ధారాలను తయారు చేసి, వాటిని మళ్ళీ తానే మ్రింగేస్తుంటుంది. భూమి నుండి ఓషధులు పుడుతున్నట్లుగా, మానవ దేహం మీద రోమములు పుడుతున్నట్లుగా అక్షర పరబ్రహ్మ నుండి ఈ జగత్తుపుడుతున్నది. కుమారుడు పుట్టాలని తండ్రి కోరుకున్నట్లుగానే ఆ పరబ్రహ్మ జ్ఞానరూపమైన తపస్సు ద్వారా స్థూలభావాన్ని పొందుతాడు. ఆ తరువాత పరబ్రహ్మ నుండి ప్రాణులకు అవసరమైన అన్నం పుడుతోంది. అన్నం నుంచి ప్రాణం, మనస్సు, మనస్సు నుంచి పంచభూతాలు, వాటి నుండి లోకాలు, వారికోసం కర్మలు, కర్మ నుండి ఫలము పుడుతున్నాయి. పరమేశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వవేత్త, జ్ఞాని, తపస్వి. ఆయన నుండి హిరణ్యగర్భ రూపుడైన బ్రహ్మ, అతని నుండి నామరూపాత్మకమైన జగత్తు ఆవిర్భవించింది.

**అపరావిద్య** : ఇది లౌకిక ప్రయోజనాలకుపకరిస్తుంది. బుద్ధి సంపన్నులైన మహర్షులు వేదాలలో స్వర్గ సాధనాలయిన యజ్ఞకర్మలను కనుక్కున్నారు. కర్మాచరణ పరాయణులు, కర్మవాధులు అందరూ ఆ కర్మలనాచరించి సత్ఫలితాలు కూడా పొందారు. కాబట్టి కర్మఫలాన్ని కోరితే అగ్ని హోత్రాది కర్మాలనాచరించు. సమిధలతో జ్వాల మండుతున్న అగ్నిలో 'స్వాహా' కారంతో ఆహుతులు సమర్పించాలి. అగ్నిహోత్రాది కర్మలు విధిగా జీవితాంతం చెయ్యాలి. యజ్ఞం అమావాస్యనాడు చేస్తే ధర్మము, పౌర్ణమినాడు చేస్తే పూర్ణము.

అగ్నిహోత్రాది కర్మలు, చాతుర్మాస్యము, అతిధిపూజ, వైశ్య దేవము మొదలైన కర్మలు చేయనివాడు ఏడు తరాల వారిని నాశనం చేస్తున్నాడు. ఆహుతులను మింగటానికి అగ్ని హోత్రునికి ఏడు నాల్కలున్నాయి. అందుకే అగ్నికి సప్తజిహ్వుడు అని పేరు. అవి ....

1. కాళి - నల్లనిది
2. కరాళి - భయంకరమైనది
3. మనోజవ - మనస్సు వంటి వేగము గలది
4. సులోహిత - ఎర్రని రంగుగలది
5. సుధూమ్ర వర్ణ - దట్టమైన పొగ రంగుగలది.
6. విస్ఫులింగిని - రవ్వలు ఎగజిమ్మునది
7. దేవి - అనేక కిరణాలు కలది.

ఆహుతులు దేవతలకు చేరినట్లుగానే, అగ్నిహోత్రాలు చేసే యజమానిని కూడా ఇంద్రుడు ఉండే చోటికి తీసుకుపోతారు. అంటే అగ్నిహోత్రము చేసిన వాడికి ఫలితము స్వర్గము. ఈ ఆహుతులు యజమానిని ప్రియమైన మాటలతో స్తుతిస్తూ, పూజిస్తూ స్వర్గానికి చేరుస్తాయి. అనగా కర్మ ఫలితము స్వర్గము. కర్మలు చేసిన వారికి ధనధాన్యాలు, సిరిసంపదలూ, వస్తు వాహనాలూ, ఉన్నత పదవులు, కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. మోక్షం మాత్రంకాదు. యజ్ఞసాధనాలు మొత్తం పద్దెనిమిది. అవి పదహారు మంది ఋత్విక్కులు, యజమాని. అతని భార్య.

జ్ఞానరహితమైనవి యజ్ఞాలు. యజ్ఞసాధనాలు అస్థిరమైనవి. అశాశ్వతమైనవి. ఈ కర్మలే మోక్షసాధనాలనిభావించే అజ్ఞానులు మాటిమాటికీ మృత్యువును పొందుతూనే ఉంటారు. అంటే యజ్ఞం వలన స్వర్గం వస్తుంది. అక్కడ తన పుణ్యఫలము అనుభవించి, తరువాత మళ్ళీ భూలోకంలో పుడతాడు. అందుచేత ఈ కర్మలు శాశ్వత ఫలితాన్ని ఇవ్వవు. కర్మలవల్ల శాశ్వతమైన మోక్షంరాదు.

అజ్ఞానులు తమను తామే గౌరవనీయులుగా, పండితులుగా ఊహించుకొని విర్రవీగుతుంటారు. కృతార్థులమైనామని గర్విస్తుంటారు. కర్మిష్టులు ఫలాపేక్షతోనే ఉంటారు. కాని తత్త్వాన్ని తెలుసుకోరు. కర్మఫలం పూర్తికాగానే వీరు మళ్ళీ జన్మిస్తారు.

ఇష్టాపూర్తి కర్మలే సర్వోత్తమసాధనాలని భావించేవారు మూఢులు. వారు ఇతరమైనవి శ్రేయోసాధనాలుగా భావించరు. అందుకనే వారు కర్మఫలాన్ని అనుభవించి, కర్మశేషాన్ని అనుభవించటానికి మళ్ళీ జన్మిస్తారు.

శాంత స్వభావులు, సన్యాసులు అడవులలో ఉంటూ భిక్షుకులుగా జీవిస్తూ, తపస్సు చేస్తూ ఉంటారు. వీరు పుణ్య పాపాల నుండి విడివడి ఉత్తరాయణ మార్గం ద్వారా సత్య లోకం చేరతారు. ప్రజాపతి, హిరణ్యగర్భుడు అంతా సాకారులే. కాబట్టి వీరికి పరబ్రహ్మ ప్రాప్తి లేదు.

కాబట్టి మోక్షవాది వైరాగ్యియై బ్రహ్మనిష్ఠుడైన గురువు వద్దకు వెళ్ళాలి. అప్పుడు బ్రహ్మవేత్త అయిన ఆ గురువు శిష్యునకు పరావిద్యనుపదేశిస్తాడు. దానివల్ల శిష్యునకు పరబ్రహ్మను గూర్చిన జ్ఞానం కలుగుతుంది. తానే పరబ్రహ్మ, జగత్తంతా తనలోనే ఉన్నదనే భావం కలుగుతుంది. అట్టివాడు మరణానంతరము బ్రహ్మలోకం చేరి, కల్పాంతమున పరబ్రహ్మలో లీనమవుతాడు". అని అంగిరసుడు శౌనకునకు ఉపదేశించాడు" అంటూ ముండకోపనిషత్తులోని పరా, అపరావిద్యలను పూర్తి చేశాడు రత్నాకరుడు.

## 24. రజ్జు సర్పభ్రాంతి (ముండకోపనిషత్తు - 2)

"శిష్యులారా! ద్వితీయ ముండకంలో బ్రహ్మతత్త్వాన్ని వివరించారు. ఆ తత్త్వాన్ని మీకు వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

శౌనక ! ప్రజ్వరిల్లిన అగ్నినుండి అదే విధమైన ఆకారము, గుణము కల వేలకొలది నిప్పురవ్వలు వెలువడుతున్నట్లే, పరబ్రహ్మ నుండి అనేకమైన శరీరాలు,-రూపాలు వెలువడి మళ్ళీ అందులోనే లీనమైపోతున్నాయి. పరబ్రహ్మ స్వయం ప్రకాశం కలవాడు. నిరాకారుడు. బాహ్యాభ్యంతరాల్లో ఉండేవాడు. పుట్టుక, ప్రాణము, మనస్సు, లేనివాడు. పరిశుద్ధమైనవాడు. మాయకు అతీతుడు. అతడి నుండే ప్రాణము, మనస్సు, సమస్త ఇంద్రియాలు, పంచభూతాలు పుడుతున్నాయి. ఈ పరబ్రహ్మకు అగ్ని శిరస్సు, సూర్యచంద్రులు నేత్రాలు, దిక్కులే చెవులు, వేదాలు వాక్కు, వాయువు ప్రాణం, జగత్తే అతని హృదయం. అతని పాదాల నుండి భూమిపుట్టింది. అతడే సమస్త భూతాల్లోనూ ఉండే అంతరాత్మ. ఆ పరబ్రహ్మ నుంచే అగ్నిపుడుతోంది. ఆ అగ్నికి సూర్యుడు సమిధ. చంద్రునివల్ల మేఘాలు, మేఘాలవల్ల ఓషధులు, అన్నం పుడుతున్నాయి. అన్నంవల్ల పుట్టిన వీర్యాన్ని పురుషుడు స్త్రీలో ఉంచుతున్నాడు. ఈ విధంగా విశ్వమంతా ఆ పరమేశ్వరునినుంచే పుడుతోంది.

ఆ పరమేశ్వరుని నుంచే చతుర్వేద మంత్రాలు పుట్టినవి. మౌంజీబంధనాది దీక్షలు, అగ్నిహోత్రాది యజ్ఞాలు, దక్షిణలు, యజ్ఞాలకు కాలప్రమాణము, సూర్యచంద్రలోకాలు, ఉత్తరాయణ, దక్షిణాయన మార్గాలు పుట్టాయి. అష్టవసువులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు పుట్టారు. కర్మాధికారంగల మానవులు పుట్టారు. పశువులు, పక్షులు, ఉచ్ఛ్వాసనిశ్వాసలు, ధాన్యాలు, పురుషార్థాలు సాధించటానికి వీలైన తపస్సు, శ్రద్ధ, మిత భాషణ, హితభాషణ, అష్టవిధ మైధునాలను త్యజించటం ద్వారా ఆచరించే బ్రహ్మచర్యం పుట్టాయి.

పరబ్రహ్మ నుండే సప్త ప్రాణాలు (కళ్ళు - 2, ముక్కులు - 2, చెవులు - 2, నోరు - 1) పుట్టినాయి. శరీరంలో సంచరిస్తూ వాటికి విషయాలైన ఏడు జ్వాలలు, ఇంద్రియ విషయాల రూపంలో ఉండే ఏడు సమిధలు, విషయ జ్ఞాన స్వరూపమైన ఏడు ఆహుతులు, ఏడు ప్రాణాలు సంచరించే స్థానాలు, ఇవన్నీ పరమేశ్వరుని నుంచే పుట్టాయి. సప్తసముద్రాలు, పర్వతాలు, నదులు, వివిధ రకాల ధాన్యాలు, షడ్రుచులు పుట్టాయి.

సమస్త ప్రపంచము, అగ్ని హోత్రాది కర్మలు, జ్ఞాన రూపమైన తపస్సు, అన్నీ అతని రూపమే. వీటన్నింటిలోనూ పరమేశ్వరుడున్నాడు. సమస్త ప్రాణుల హృదయాల్లోనూ ఉన్నాడు. సూర్యాది గ్రహాలను ప్రకాశింపచేసేది ఆ పరబ్రహ్మమే. అదే ప్రాణం, అదే వాక్కు, అదే మనస్సు, అదే సత్యము, నిత్యము, అమృత మయమై ఉన్నది. ఈ విషయం తెలుసుకున్న వాడు బ్రతికి ఉండగానే అజ్ఞానపు ముడులను త్రెంచుకొని ముక్తుడౌతాడు.

స్వయం ప్రకాశం గల పరబ్రహ్మ అందరి హృదయాల్లోనూ ఉన్నాడు. పరబ్రహ్మ బుద్ధి అనే గుహలో బంధించబడి ఉన్నాడు. అందుకే అతణ్ణి 'గుహుడు' అంటారు. అన్నిటికంటే గొప్పవాడు కాబట్టి 'మహత్' అంటారు. పశువులు, పక్షులు, సమస్త జీవులూ అతని యందే ఉన్నాయి. శ్రేష్ఠమైన వాటన్నింటి కంటె పరబ్రహ్మ శ్రేష్టమైనవాడు. సూర్యాది గ్రహాలను ప్రకాశింపచేసేది, సూక్ష్మాతి సూక్ష్మమైనది, సమస్తలోకాలు జీవరాసులతో కూడినది, అందరికి ఆశ్రయమైనది కూడా ఆ పరబ్రహ్మమే. శౌనకా ! అదే ప్రాణము, అదే వాక్కు, అదే మనస్సు. అన్ని వేళలయందు ఒకే విధంగా ఉండేది. సత్యము నిత్యమైనది ఆ పరబ్రహ్మమే.

ఉపనిషత్తులలో ప్రతిపాదించబడిన ఓంకారమనే ధనుస్సుతో మనస్సు అనే బాణాన్ని సంధించి, బ్రహ్మభావాను గతమైన చిత్తంతో, లక్ష్యమైన పరబ్రహ్మను 'వేధనం' చెయ్యాలి. అంటే లక్ష్యాన్ని కొట్టాలి. దీన్నే 'ఉపనిషద్వేధ' అంటారు.

ఇక్కడ ఓంకారమే ధనుస్సు, ఆత్మయే బాణం. పరబ్రహ్మయే దాని లక్ష్యం. లక్ష్య వేధనం చేసిన తరువాత ఆ బాణం లక్ష్యానికి గుచ్చుకొని దానితో కలిసిపోతుంది. అంటే ఆత్మ పరబ్రహ్మతో కలిసి ఏకమై పోతుంది.

అక్షర పురుషుడుగా చెప్పబడే ఆ పరబ్రహ్మలో ద్యులోకము, భూమి, అంతరిక్షము, ఇంద్రియాలు, మనస్సు, కలిసి ఉన్నాయి. అదే అద్వితీయమైన ఆత్మ. బండి చక్రము యొక్క ఇరుసులో దాని ఆకులన్నీ కలిసి ఉన్నట్లుగా, నాడులన్నీ హృదయంలో కలుస్తాయి. ఆ హృదయంలోనే బుద్ధి ప్రవృత్తులుంటాయి. బుద్ధి వ్యాపారాలన్నింటికీ సాక్షీభూతుడుగా ఉన్న ఆత్మను ఓంకార రూపంలో ధ్యానం చెయ్యాలి. ఈ విధంగా చేస్తే మోక్షప్రాప్తికి ఆటంకాలుండవు.

సర్వజ్ఞుడు, సర్వవేత్త అయిన పరబ్రహ్మ విశ్వమంతా వ్యాపించి ఉన్నాడు. అటువంటి ఆత్మ తామర మొగ్గ ఆకారంలో హృదయంలో ఉంటుంది. అతడు సూక్ష్మదేహాన్ని ఒక శరీరం నుంచి వేరొక శరీరానికి మారుస్తూ ఉంటాడు. ఆ మనోమయుడు అన్నమయ శరీరంతో ఈ హృదయంలోనే ఉన్నాడు. ఈ విషయం తెలిసిన జ్ఞానులు ఆత్మతత్త్వాన్ని సాక్షాత్కరించుకో గలుగుతారు.

పరాపరతత్త్వ సాక్షాత్కారమయిన తరువాత ఆ జీవి యొక్క ఆత్మానాత్మ అధ్యాస రూపమైన హృదయ గ్రంథులు విడిపోతాయి. అంటే అజ్ఞానంతో కూడిన కోరికలు విడిపోతాయి. సందేహాలన్నీ నశిస్తాయి. ప్రారంభంకాని కర్మలు నశిస్తాయి. ఆరబద్ధకర్మలు ఈ జన్మలోఅనుభవించటం వల్ల నశిస్తాయి. ఈ రకంగా పూర్తిగా కర్మక్షయమవుతుంది.

అజ్ఞానాది కళంకాలు లేనివాడు, స్వయం ప్రకాశము గలవాడు, జోతిస్సులకు జ్యోతిస్సు అయిన పరబ్రహ్మ హిరణ్మయ కోశమనే హృదయ పద్మంలో ఉన్నాడు. ఆత్మజ్ఞానం పొందిన వారు మాత్రమే అతణ్ణి దర్శించగలుగుతారు.

మన అందరి ఎదుట ఉన్నది సర్వవ్యాపి అయిన పరబ్రహ్మమే. ఈ జగత్తు మొత్తము ఆ పరబ్రహ్మ స్వరూపమే. రజ్జు సర్ప భ్రాంతితో ఈ జగత్తు మనకు కనిపిస్తోంది. రజ్జువు యదార్థము. సర్పము భ్రాంతి. ఈ భ్రాంతి అజ్ఞానం వల్ల కలుగుతుంది. అజ్ఞానం పోగానే భ్రాంతి తొలగిపోయి, సత్యం గోచరిస్తుంది. అంటూ ద్వితీయ ముండకం పూర్తి చేశాడు రత్నాకరుడు.



## 25. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు కూడా బ్రహ్మమే (ముండకోపనిషత్తు - 3)

"శిష్యులారా ! బ్రహ్మజ్ఞాన సంపన్నుడు కూడా బ్రహ్మమే. బ్రహ్మవిదుని వంశంలో బ్రహ్మ జ్ఞాన రహితుడు జన్మించాడు. ఈ విషయాలు అంగిరసుడు శౌనకునికి వివరించాడు. ఆ విషయాలు మీకు చెబుతాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఒకే పేరు, ఒకే రూపము గల పక్షులు రెండు ప్రపంచమనే వృక్షాన్ని ఆశ్రయించి ఉన్నాయి. అందులో ఒకటి జీవి. ఇది తన కర్మలవల్ల వచ్చిన ఫలితాలను అనుభవిస్తోంది. రెండవది పరమాత్మ. కర్మఫలం ఏమి లేకుండా చూస్తూ కూర్చుంది. శరీరమే ఆ వృక్షము. ఆ పక్షులే క్షేత్రజ్ఞ పరమాత్మలు. వారిద్దరూ వేరుకాదు. ఈ రెండూ కలిసి ఒకే చోట ఉన్నప్పటికీ జీవుడు మోహానికి వసుడై శోకాన్ని అనుభవిస్తూ ఉంటాడు. అజ్ఞానం వల్ల అనేక బాధలు పడుతుంటాడు.

కాని అతడే యోగీశ్వరులచేత సేవించబడేవాడు అని తెలిసినప్పుడు అంటే మోహం నశించినప్పుడు శోకం నుండి విముక్తుడౌతాడు. ఈ జీవుడు ఎప్పుడైతే చైతన్య రూపుడు, స్వయంప్రకాశి, జగన్నిర్మాత అయిన పరమాత్మను దర్శించగలుగుతాడో అప్పుడు భేదభావాలు వీడి అద్వైత భావం పొందుతాడు.

సమస్త జీవుల యందూ ఉంటూ భిన్నంగా కనిపించేదే పరమాత్మ. అతడు వేరువేరు జీవుల్లో వేరువేరుగా కనిపిస్తాడు. ఈ విషయం తెలిసిన జ్ఞాని వాదాలకు, వాదనలకు పోడు. ఎందుకంటే తనతో తాను వాదించుకున్నట్లే, ఈ రకంగా ఆత్మలోనే క్రీడిస్తూ, ఆత్మలోనే సంతోషిస్తూ, ఆత్మలోనేరమిస్తూ ఉన్నవాడు బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడు. అతడే సర్వోత్తముడు.

మిథ్యాభాషణలను వదలి పెట్టటమే సత్యం. ఇంద్రియాలను వశం చేసుకుని ఏకాగ్రత సాధించటమే తపస్సు. అటువంటి సత్యము, తపస్సు, బ్రహ్మచర్యము, సమ్యజ్ఞానము (అజ్ఞానము లేకపోవటం) ఉన్నవాడే ఆత్మను గురించి తెలుసుకోగలుగుతాడు.

సత్యవాది - విజయం పొందుతాడు.

అసత్యం చెప్పేవాడు - విజయం పొందడు. సత్యవాది దేవయానంలో ఉన్నతికి పోతాడు. ఆ మార్గంలో పయనించే ఋషులు పరమపదాన్ని పొందుతారు.

ఆ పరబ్రహ్మ దివ్యుడు, అచింత్యుడు. సూక్ష్మాతి సూక్ష్మమైనవాడు. అజ్ఞానులకు దూరంగానూ, జ్ఞానులకు దగ్గరగానూ ఉంటాడు. ఆత్మకు రూపంలేదు-అందుచేత కంటికి

కనిపించదు. మాటలలో వర్ణించి చెప్పలేము. ఇంద్రియాలతోగాని, తపస్సుతో గాని, కర్మకాండల వల్లగాని దీన్ని గ్రహించలేము. స్వచ్ఛమైన బుద్ధి, విశుద్ధమైన అంతఃకరణ ద్వారానే దీన్ని పొందగలము.

ఆత్మ సూక్ష్మరూపంలో మన శరీరంలోనే ఉంది. ఆత్మసాక్షాత్కారానికి చిత్తశుద్ధి అవసరం. విశుద్ధమైన అంతఃకరణ గల ఆత్మజ్ఞాని కోరుకున్నవి పొందగలుగుతాడు. వారికి పునర్జన్మ ఉండదు.

ఈ ఆత్మ వేదాధ్యయనం చేతగాని, శాస్త్రజ్ఞానం చేతగాని తెలియబడదు. ఆత్మసాక్షాత్కారమునందు అకుంఠిత దీక్షలేని వారికి గోచరించదు. ఐహిక బంధనాలలో కూరుకుపోయిన వాడికి, కర్మ పరిత్యాగము చేయని వాడికి సాక్షాత్కరించదు. బ్రహ్మనిష్ఠా గరిష్ఠులైన సన్యాసులకే ఇది గోచరిస్తుంది. జ్ఞాన తృప్తులైన మహర్షులు హృదయాకాశమున దర్శించిన ఆత్మనే పరమాత్మగా తెలుసుకుంటారు. ఉపనిషత్సార ప్రతిపాదితమైన బ్రహ్మ జ్ఞానమే తమధ్యేయముగా నిశ్చయించి సన్యసించిన యతీశ్వరులు బ్రహ్మలోకము ప్రవేశించి పునరావృత్తి లేని ముక్తి పొందుతారు.

జీవుడు మోక్షము పొందేటప్పుడు శరీరంలోని ప్రాణము, శ్రద్ధ, ఆకాశము మొదలైన పదహారు కళలు, తను కారణములందు, ఇంద్రియాలు తమ అధిదేవతలందు, సంచితకర్మ పరమాత్మయందు లయమవుతాయి. ప్రవహించేటప్పుడు నదుల పేర్లు వేరుగా ఉన్నప్పటికీ, సముద్రంలో కలిసినప్పుడు తమ నామరూపాలు కోల్పోతాయి. అలాగే జ్ఞాని తన నామరూపాలు విడిచి పరమాత్మలో లీనమవుతాడు.

బ్రహ్మజ్ఞాన సంపన్నుడు బ్రహ్మయే. బ్రహ్మవిదుని వంశంలో బ్రహ్మజ్ఞాన రహితుడు జన్మించడు.

వర్ణాశ్రమ ధర్మపరాయణులు, వేదాధ్యయన సంపన్నులు, జ్ఞానులు, పరబ్రహ్మోపాసకులు, శిరోవ్రతాచారణాశీలురు మాత్రమే బ్రహ్మవిద్యకు అర్హులు. శిరోవ్రతమునునుష్ఠించనివారు బ్రహ్మవిద్య ఉపదేశానికి అర్హులుకారు అని అంగిరసుడు శౌనకునికి వివరించాడు అంటూ ముండకోపనిషత్తును పూర్తిచేశాడు రత్నాకరుడు.

# 26. ఓంకారోపాసన (ఛాందోగ్యం-1)

"ఛాందోగ్యోపనిషత్తు సామవేదానికి సంబంధించిన తలపకార బ్రాహ్మణంలోనిది. దీనిలో నిత్య జీవితంలో ఆచరణ యోగ్యమైన ఉపాసనకు ప్రాధాన్యత ఇవ్వబడింది. దేవతా స్వరూపాన్ని గాని, దానికి సమానమైనదాన్ని గాని లక్ష్యంగా పెట్టుకుని, ఆగమ్యం చేరటం కోసం ఏకాగ్రతతో నిరంతర సాధన చెయ్యటమే ఉపాసన. ఓంకారోపాసన, అన్నోపాసన, ప్రాణోపాసన ఇలా ఉపాసన అనేకరకాలు. ఉపాస్య దేవతతోతాదాత్మ్యం చెందిన ఉపాకుడికి ఆ దేవతకుండే శక్తులన్నీ వస్తాయి. అజ్ఞానాన్ని నిర్మూలన చెయ్యటానికి ఉపాసన సహకరిస్తుంది. అందుకే ఛాందోగ్యంలో ఉపాసనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. అలా అని ఈ ఉపనిషత్తంతా ఉపాసననే కాదు. పరబ్రహ్మను లక్ష్యంగా తీసుకుని సగుణోపాసన నుండి నిర్గుణోపాసనకు తీసుకుపోబడింది.

మిగిలిన ఉపనిషత్తులలా కాకుండా ఇది చాలా పెద్ద ఉపనిషత్తు. ఇందులో మొత్తం ఎనిమిది అధ్యాయాలున్నాయి. వీటిలో అనేకరకాల ఉపాసనలు, కథలుకుడా ఉన్నాయి. వీటిలో ముఖ్యమైన వాటిని వివరిస్తాను. మొదటగా ఓంకారోపాసన గురించి చెబుతాను సావధానంగా వినండి" అంటూ చెప్పటానికి ఉపక్రమించాడు రత్నాకరుడు.

**"ఓమిత్యేత దక్షర ముద్గీథముపాసీత."**

ఓంకారాన్ని ఉద్గీథ దృష్టితో ఉపాసించాలి. యజ్ఞము చేసేటప్పుడు సామగీతాలను గానం చేసేవాడు 'ఉద్గాత'. అతడు గానం చేసే సామగాన భాగాన్ని 'ఉద్గీథ' అంటారు. ఓంకారాన్ని ఉద్గీథ దృష్టితో ఉపాసించాలి. అంటే ఓంకారము, ఉద్గీథ రెండూ ఒకటే అని భావించి ఉపాసన చెయ్యాలి. ఓంకారము పరబ్రహ్మకు శబ్దప్రతీక. ఇది కేవలం ఉపాసనకోసం ఏర్పరచుకున్న చిహ్నం. ఉపాసన అంటే ఒకే శబ్దాన్ని జపించటం మాత్రమే కాదు. మనస్సును పూర్తిగా దానిమీద లగ్నంచేసి, ఆ శబ్దాన్ని నిరంతరం ధ్యానం చెయ్యటమే ఉపాసన. కర్మకాండలోఒక భాగంగా, పరబ్రహ్మకు శబ్ద ప్రతీకగా ఓంకారము ఉపయోగించబడుతుంది.

జగత్తులో ప్రాణుల యొక్క పుట్టుక, స్థితి, లయాలకు స్థానం భూమి కాబట్టి జీవరాసులన్నిటికీ ఆధారము భూమి. అలాగే.

| | | |
|---|---|---|
| భూమికి ఆధారం | - | జలం |
| జలానికి ఆధారం | - | ఓషధులు |
| ఓషధులకు ఆధారం | - | పురుషుడు |

| | | |
|---|---|---|
| పురుషునికి ఆధారం | - | వాక్కు |
| వాక్కుకు ఆధారం | - | ఋక్కు |
| ఋక్కుకు ఆధారం | - | సామం |
| సామానికి ఆధారం | - | ఉద్గీథం |

ఉద్గీథ అంటే ఓంకారము అని గతంలోచెప్పటం జరిగింది. ఓషధులవల్ల, అన్నం వల్ల శరీరం కలుగుతోంది. శరీరంలోని అవయవాలన్నింటిలోకీ ముఖ్యమైనది వాక్కు. ఈ రకంగా పృథివ్యాది భూతాలు ఒకదానికన్న ఇంకొకటి శ్రేష్ఠమైనవి. వీటన్నింటిలోకి ఉద్గీథం అంటే ఓంకారము శ్రేష్ఠమైనది. ఓంకారము పరమాత్మకు ప్రతీక. అందుచేత ఓంకారాన్ని పరమాత్మగానే భావించాలి. పృథివ్యాది రసాల్లో ఓంకారము ఎనిమిదవది. పైన చెప్పినట్లుగా

| | | |
|---|---|---|
| భూమి కన్న | - | జలము |
| జలముకన్న | - | ఓషధులు |
| ఓషధులకన్న | - | పురుషుడు |
| పురుషునికన్న | - | వాక్కు |
| వాక్కుకన్న | - | ఋక్కు |
| ఋక్కుకన్న | - | సామం |
| సామంకన్న | - | ఉద్గీథ (ఓంకారము) |

శ్రేష్ఠమైనవి. వీటిలో వాక్కే ఋక్కు, ప్రాణమే సామం, ఓంకారమే ఉద్గీథం. ఈ విధంగా వాక్ప్రాణాలు, ఋక్సామాలు అని మిథునాలు అవుతున్నాయి. ఈ రకంగా ఋక్సామాలను గ్రహించటంవల్ల ఋక్సామాల వల్ల నిర్వర్తించబడే కర్మలన్నీ వాక్ప్రాణాలవల్ల నిర్వర్తించినట్లే అని గ్రహించాలి.

ఈ మిథునము ఓంకారంతో కలుస్తుంది. మిథునం అంటే జంట (దంపతులు). మిథునంలోని అవయవాలు ఒకదానితో ఒకటి కలిసినప్పుడు, ఒక దాని కోరిక ఇంకొకటి తీరుస్తుంది. ఇది ధర్మం. ఓంకారానికి సమస్త కోరికలు తీర్చేశక్తి ఉన్నది. ఈ మిథునం ఓంకారంతో కలవటం వల్ల, ఓంకారానికున్న శక్తి దీనికి కుడా వస్తుంది. అంటే అన్ని కోరికలు తీర్చే శక్తి ఈ మిథునానికి వస్తున్నది. ఇంకా విపులంగా చెప్పాలంటే ఋక్సామాలు లేదా

వా(క్ప్రా)ణాలు ఓంకారంతోచేరినప్పుడు ఓంకారానికి గల సర్వకామాప్తిత్వగుణం అనగా అన్ని కోరికలు తీర్చేశక్తి ఆ మిధునానికి వస్తోంది. కాబట్టి ఉపాసకుడు ఓంకారాన్ని ఉపాసించినట్లైతే అతని సమస్త కోరికలు తీరతాయి. ఓంకారమనేది అనుమతి తెలియజేయ్యటానికి ఉపయోగిస్తుంది. ఈ విషయం తెలుసుకుని ఓంకారోపాసన చేసినట్లైతే సాధకుని కోరికలు తప్పనిసరిగా తీరతాయి.

ఈ ఓంకారంతోనే త్రయీ విద్యలో చెప్పబడినటువంటి వైదిక కర్మలన్నీ ప్రారంభించ బడతాయి. త్రయీవిద్య అంటే ఋగ్యజుస్సామవేదాలు. ముందుగా ఓంకారాన్ని ఉచ్చరించే దేవతాస్తుతిగాని, కర్మ ప్రారంభంగాని జరుగుతుంది. వేదోక్తమైన కర్మ అంతా ఓంకారాన్ని పూజించటానికే జరుగుతుంది. ఓంకారము పరబ్రహ్మ స్వరూపము కాబట్టి ఆ పరబ్రహ్మను అర్చించటానికే ఈ కర్మకాండ అంతా జరుగుతుంది. ఓంకారము యొక్క మహిమ వల్ల, ఓంకారసారం వల్లనే వైదిక కర్మలు నిర్వహించబడుతున్నాయి. యజ్ఞమనేది ప్రాణము, అన్నములతో నిర్వహించబడుతోంది. ప్రాణము, అన్నముకూడా ఓంకారమే. కాబట్టి యజ్ఞము కుడా ఓంకారమే. దీని ఫలితంగానే సూర్యుని ద్వారా వర్షం కురుస్తుంది. వర్షం ద్వారా అన్న ప్రాణాలు ఉత్పత్తి అవుతున్నాయి.

ఓంకారమనే అక్షరాన్ని ఈ విధంగా తెలుసుకున్నవాడు, తెలుసుకోనివాడు ఇద్దరూ ఓంకారం ద్వారా కర్మ చేస్తూనే ఉన్నారు. కాని ఈ విషయం తెలియకుండా కర్మ చేసేకన్న తెలుసుకుని కర్మనాచరిస్తే ఫలితము కొన్నిరెట్లు అధికంగా ఉంటుంది.

అనాదిగా దేవాసురుల మధ్య యుద్ధం జరుగుతూనే ఉన్నది. ఆ యుద్ధంలో రాక్షసుల చేతిలో దేవతలు పరాజయం పొందుతూనే ఉన్నారు. అందుచేత దేవతలంతా సమావేశమయి ఉద్గీథం ద్వారా రాక్షసులను జయించాలి అనుకున్నారు.

ముందుగా దేవతలు ముక్కులో ఉండే ఘ్రాణశక్తిని ఉద్గీథరూపంలో ఉపాసించారు. అసురులు దాన్ని అధర్మము, ఆసక్తి అనే వాటితో ఘ్రాణాన్ని వేధించారు. దాంతో అది కాస్తా శక్తిహీనమయి పోయింది. అందువల్లనే నాసిక సుగంధాన్ని, దుర్గంధాన్ని కుడా ఆఘ్రాణిస్తోంది. తరువాత దేవతలు వాక్కును ఉద్గీథగా ఉపాసించారు. అసురులు పాపంతో వాక్కును వేధించారు. అందుచేత వాక్కు శక్తిహీనమైపోయింది. ఆ కారణంగానే వాక్కు సత్యము, అసత్యము కూడా పలుకుతున్నది.

దేవతలు నేత్రాన్ని ఉద్గీథ రూపంలో ఉపాసించారు. రాక్షసులు విషయాశక్తితో నేత్రాలను వేధించారు. అందుచేతనే నేత్రము శక్తిహీనమైపోయింది. కాబట్టే ఈనాడు కనులు యోగ్యము, అయోగ్యము అయినవన్నీ చూస్తున్నాయి. కొంతకాలం తరువాత దేవతలు చెవులను ఉద్గీథ రూపంలో ఉపాసించటం మొదలుపెట్టారు. అది తెలిసిన రాక్షసులు శ్రోత్రాన్ని వేధించారు. అప్పుడు శ్రోత్రము తన శక్తిని కోల్పోయింది. ఆ కారణంగానే ఈనాడు చెవుల ద్వారా యోగ్యము, అయోగ్యము అయినవన్నీ వింటున్నాము.

ఆ తరువాత దేవతలు మనస్సును ఉద్గీథ రూపంలో ఉపాసించటం మొదలు పెట్టారు. రాక్షసులు మనస్సును కూడా పాపంతో వేధించారు. దాంతో మనస్సు తన శక్తిని కోల్పోయింది. అందుకనే ఈనాడు సంకల్పానికి యోగ్యమయినవి, యోగ్యము కానివి అన్ని విషయాలను గురించి మనస్సు ఆలోచిస్తున్నది. తరువాత దేవతలు నోటిలో ఉండే ముఖ్యప్రాణాన్ని ఉద్గీథగా భావించి ఉపాసించారు. అసురులు ముఖ్య ప్రాణాన్ని కూడా బాధించాలని చూశారు కాని దానివద్దకు పోలేకపోయారు. అందుచేత ముఖ్యప్రాణము పాపనిబద్ధం కాలేదు. అందువల్ల ఈ ముఖ్య ప్రాణం వల్లనే అసురులు ఓడిపోయారు. ఈ విధంగా ప్రాణోపాసనను తెలుసుకొన్న ఉపాసకునికి హాని తలపెట్టినవాడు రాతిని తాకిన మట్టి బెడ్డలాగా చూర్ణమైపోతాడు.

ప్రాణం ద్వారా వాసన చూడలేము, అలాగే వినటము, కనటము కూడా చెయ్యలేము. దీనికి కారణము ప్రాణము పాపంచేత బాధించబడలేదు. ప్రాణం తనశక్తితో ఇంద్రియాలను పోషిస్తుంది. లేకపోతే ఇంద్రియాలకు మనుగడ లేదు. మరణకాలంలో ముఖ్యప్రాణాన్ని పొందలేకనే కన్ను, ముక్కు మొదలైన ఇంద్రియాలన్నీ శరీరాన్ని విడిచి పోతున్నాయి.

పూర్వకాలంలో అనేకమంది ప్రాణాన్ని ఉద్గీథ రూపంలో ఉపాసన చేశారు. మొదటగా అంగిరుడనే ఋషి దీన్ని ఉపాసన చేశాడు. తరువాత బృహస్పతి, ఆయాసుడు, దల్భుని కుమారుడు బకుడు మొదలైన వారంతా ప్రాణోపాసన చేసి తరించారు.

మండుతున్న సూర్యుని కూడా ఉద్గీథ అనే భావనతోనే ఉపాసన చెయ్యాలి. సూర్యుడు ఉదయించి అంధకారాన్ని పోగొడతాడు. అన్నాన్ని ఉత్పత్తి చేస్తాడు. అందుచేత సూర్యుని ఉద్గీథ భావంతో ఉపాసించేవాడు జనన మరణాది భయాలకు కారణమైన అజ్ఞానాన్ని దూరం చెయ్యగలుగుతాడు. గుణాల దృష్టితో ఆలోచిస్తే సూర్యుడు, ప్రాణము రెండూ ఒకటే. రెండూ వేడిగానే ఉంటాయి. ప్రాణాన్ని స్వరం అంటే కదిలేది అంటారు. అలాగే సూర్యుని స్వరమని, ప్రత్యా స్వరమని అంటారు. అంటే ముందుకు వెడుతూ, వెనక్కు వస్తూ ఉంటాడు. అందుచేత ప్రాణము, సూర్యుడు రెండూ ఓంకార స్వరూపాలే.

ఉద్గీథాన్ని వ్యాన దృష్టితో ఉపాసించాలి. ముక్కుతోగాని, నోటితో గాని మనం పీల్చేది అపానము, విడిచేది ప్రాణము. ఈ రెండింటికీ మధ్య సంధి వ్యానము. గాలి పీల్చకుండా వదలకుండా ఉండే స్థితి. ఆవ్యానమే వాక్కు. మాట్లాడేటప్పుడు ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుండవు. వ్యానస్థితిలో వెలువడే వాక్కే ఋక్కు. ఆ ఋక్కే సామము. ఈ విధంగా ప్రాణాపాన క్రియలు జరగకుండా సామాన్ని గానం చేస్తారు. సామగాన విశేషమే ఉద్గీథ. అదే ఓంకారము. ఈ రకంగా వాక్కు - ఋక్కు, సామము - ఉద్గీథలకు సమానత్వం ఉన్నది. అధికశ్రమతో, కష్టసాధ్యమైన పనులన్నీ వ్యానస్థితిలోనే జరుగుతాయి. ఉదా : బరువు లెత్తటం, బాణము సంధించటంవంటివి. అందుచేత వ్యాన దృష్టితోనే ఉద్గీతోపాసన చెయ్యాలి. అంటూ వివరించాడు. రత్నాకరుడు.

## 27. ముగ్గురు మిత్రులు (ఛాందోగ్యోపనిషత్తు-2)

"శిష్యులారా! ఇప్పుడు 'ఉద్గీథాన్ని' గురించి వివరిస్తాను, వినండి". అంటూ ప్రారంభించాడు. రత్నాకరుడు.

శలావతుని కుమారుడు శిలకుడు, చికితాయనుని కుమారుడు దాల్భ్యుడు, జీవలుని కుమారుడు ప్రవాహణుడు. ఈ ముగ్గురు మిత్రులు ఉద్గీథ విజ్ఞానంలో మంచి నేర్పరులు. ఒకరోజు వారు ఉద్గీథ మీద వాదోపవాదాలు సాగిద్దామనుకున్నారు. అప్పుడు ప్రవాహణుడు మిగిలిన ఇద్దరిలోనూ "మీరు బ్రాహ్మణులు, పూజనీయులు. అందుచేత మీరిద్దరు చర్చించండి. నేను వింటాను" అన్నాడు. చర్చ ప్రారంభమైంది. ముందుగా శిలకుడు ప్రశ్నవేస్తున్నాడు.

"ఉద్గీథ రూపంలో ఉండే సామానికి ఆశ్రయం ఏది ?

'స్వరమే సామానికి ఆశ్రయం'.

'స్వరానికి ఆధారం ఏది ?'

'స్వరానికి ప్రాణమే ఆధారం.' (ప్రాణం వల్లనే స్వరంపుడుతోంది.)

'ప్రాణానికి ఆధారం ఏది ?'

'అన్నం'

'అన్నానికి ఆధారం ఏది ?'

'జలం'.

'జలానికి ఆధారం ఏది ?'

'ఆ లోకం (స్వర్గం) ఎందుకంటే అక్కడ నుంచే వర్షం కురుస్తుంది.'

'ఆలోకానికి ఆధారం ఏది '?

దానికి దాల్భ్యుడు "మనం స్వర్గాన్ని మించి మాట్లాడరాదు. సామమే స్వర్గమని స్తుతించబడింది కదా! మనం సామాన్ని గురించే చర్చిద్దాము అని అనుకున్నాము." అన్నాడు. అప్పుడు శిలకుడు 'నువ్వు చెప్పినట్లుగా సామం అత్యంత శ్రేష్ఠమైనది. సామానికి ఆధారం లేదు. అటువంటప్పుడు సామానికి ఆధారమున్నదని ఎవరైనా అంటే, వాడి తల తెగిపడుతుంది' అన్నాడు. ఇప్పుడు దాల్భ్యుడు అగుతున్నాడు,

"ఆలోకానికి (స్వర్గలోకానికి) ఆధారం ఏమిటి ?"

"ఈ లోకం. ఇక్కడ చేసే యజ్ఞయాగాది కర్మల ద్వారానే స్వర్గలోకం పోషింపబడుతున్నది.

"మరి ఈ లోకానికి ఆధారమేది?"

"సమస్త ప్రాణులు ఈ లోకానికి ఆధారం. ప్రత్యక్షంగా కనిపించే ఈ లోకాన్ని సామం అతిక్రమించకూడదు. సామాన్ని ఈ లోకంలోనే చక్కగా ప్రతిష్ఠిస్తున్నాము". అన్నాడు దాల్భ్యుడు. ఇప్పుడు శిలకుడు అడుగుతున్నాడు.

"ఈ లోకానికి ఆశ్రయం ఏది?".

ప్రవాహణుడు సమాధానం చెబుతున్నాడు.

"స్వరాభిన్నమైన ఆకాశమే ఈ లోకానికి ఆశ్రయం. ఆకాశం అంతటా ఆవరించి ఉంది అంటే పరబ్రహ్మ అని గుర్తించాలి. సమస్త లోకాలు, జీవకోటి అంతాకూడా ఆకాశరూపమైన పరబ్రహ్మనుండే ఉద్భవించి, అందులోనే లీనమవుతున్నాయి. కాబట్టి ఈ లోకానికి ఆకాశమే ఆధారం అటువంటి ఈ ఉద్గీథమే - ఆకాశమే అన్నింటిలోకి శ్రేష్ఠమైనది. కాబట్టి ఉద్గీథాన్ని అనంతమైనదిగా, పరమాత్మ స్వరూపంగా భావించి ఉపాసించేవాడు బ్రహ్మకాశపర్యంతము ఉన్న లోకాలన్నింటిని జయిస్తాడు.

ఉద్గీథను గురించి బాగా తెలుసుకున్నవాడు ఇతరుల కన్న ఉన్నతమైన జీవనం సాగిస్తాడు. చివరకు ఉత్తమ లోకాలు పొందుతాడు. అని శునకుని కుమారుడైన అధిధన్వుడు తన శిష్యుడైన శాండిల్యునికి వివరించాడు. అంటూ రత్నాకరుడు ఉద్గీథోపాసన గురించి తన శిష్యులకు వివరించాడు.

## 28. ఉషస్తి (ఛాందోగ్యో పనిషత్తు - 3)

"శిష్యులారా ! నియమ నిష్ఠలతో కాలం వెళ్ళబుచ్చేవాడు ప్రాణం నిలువుకోటానికి ఎవరేమి ఇచ్చినా తీసుకుని తినవచ్చు. అది నిలిచిన తరువాత మాత్రం అలా చేయరాదు. అలాగే ప్రతి కార్యానికి ఒక అధిష్ఠాన దేవత ఉంటుంది. మంత్రము యొక్క అర్థము, అధిష్టాన దేవత తెలియకుండా చేసిన కర్మ నిరర్థకము. పాపహేతువుకూడా అవుతుంది. ఈ విషయాలు తెలియటానికి మీకు 'ఉషస్తి' ఉదంతం వివరిస్తాను. వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

కురుదేశంలో ఇభ్య అనే పల్లె ఉన్నది. ఆ పల్లెలో ఉషస్తి అనే ఋషి ఉండేవాడు. అతని భార్య పేరు ఆటకి. ఉషస్తి వేదవేదాంగ విదుడు, పండితుడు.

ఒకసారి కురుదేశంలో భయంకరమైన కరువు వచ్చింది. పంటలు పండలేదు. కాటకం విలయతాండవం చేస్తోంది. తినటానికి ఎక్కడా ఏమీ దొరకలేదు. తిండిలేక ప్రజలు మలమల మాడిపోతున్నారు.

ఆరోజుల్లో ఉషస్తి ఆహారం లేక బాధపడతూ ఒక మావటి వాడి దగ్గరకు వెళ్ళి తినటానికి ఏమైనా పెట్టమని అడిగాడు. అప్పుడా మావటీడు భయపడుతూ "బ్రాహ్మణోత్తమా ! నావద్ద మినుములు తప్ప ఏమీలేవు. అవి కూడా నేను ఎంగిలి చేసినవి. కాబట్టి నేను మీకు ఏమి ఇవ్వగలను?" అన్నాడు. దానికి ఉషస్తి.

"ఫరవాలేదు. ఆ ఎంగిలి చేసినవే నాకు కొద్దిగాపెట్టు" అన్నాడు. మావటివాడు ఆ ఎంగిలి మినుములు కొన్ని ఉషస్తికి దానం చేసి, తాగటానికి నీరు కుడా ఇచ్చాడు.

ఉషస్తి మినుములను మాత్రం తిని నీరు వద్దన్నాడు. ఆ మాటలకు ఆశ్చర్యపోయిన మావటి "బ్రాహ్మణోత్తమా ! ఎంగిలి మినుములు తిన్నావు కదా ! మరి ఎంగిలి నీరు త్రాగటానికి అభ్యంతరం ఏమిటి ?" అన్నాడు.

దానికి ఉషస్తి 'మిత్రమా ! ప్రాణము నిలుపుకోటానికి ఎక్కడి ఆహారమైనా తినవచ్చు. అందులో దోషం లేదు. ఇప్పుడు నాకు ఓపిక వచ్చింది. కాబట్టి నీవిచ్చే నీళ్ళు అవసరం లేదు' అన్నాడు.

ఉషస్తి తను తినగా మిగిలిన మినుములను భార్యకోసం తీసుకువెళ్ళాడు. ఆమె వాటిలో కొంత భాగం మరునాటికి దాచి పెట్టింది.

మరునాడు ఉషస్తి భార్యతో "నాకు చాలా ఆకలిగా ఉన్నది. ఏమైనా పెడితే తిని రాజుగారి దగ్గరకు వెడతాను. రాజు ఏదో యజ్ఞం చేస్తున్నాడట అన్నాడు. అప్పుడు అతని భార్య క్రితం రోజు దాచి ఉంచిన మినుములు తెచ్చి ఇచ్చింది. వాటిని తిని రాజాస్థానానికి బయలుదేరాడు ఉషస్తి.

యజ్ఞం చాలా ఆర్భాటంగా జరుగుతోంది. అనేక మంది ఋత్విక్కులు యాగకలాపాలు నడిపిస్తున్నారు. ఉషస్తి సరాసరి ముగ్గురు ప్రధాన ఋత్విక్కుల దగ్గరకు వెళ్ళి వారిని నిలదీసి అడిగాడు. "ఋత్విక్కులారా ! మీరు చేస్తున్న కార్యకలాపాలాకు అధిష్ఠాన దేవత లెవరో మీకు తెలుసా ? ఒకవేళ తెలియకుండా యాంత్రికంగా కలాపం జరిపిస్తే మీతలతెగి క్రిందపడుతుంది. జాగ్రత్త"

ఋత్విక్కులకు నిజంగానే అధిష్ఠాన దేవతలెవరో తెలియదు. ఆ మాటలు విన్నరాజు "స్వామీ ! తమరెవరో నాకు తెలియచేయండి" అన్నాడు.

'రాజా ! చక్రుని కుమారుడను, నన్ను ఉషస్తి, చాక్రాయణుడంటారు.'

"ఓ మహాత్మా ! మేము మీ కోసమే అన్వేషించాము. యజ్ఞానికి ఆచార్య స్థానం మీరేవహించాలనుకున్నాం. కాని మీరెక్కడున్నారో మాకు తెలియలేదు. అయినా సమయానికి విచ్చేశారు. యజ్ఞ నిర్వహణ భారం మీరే వహించండి అన్నాడు రాజు. ఉషస్తి యజ్ఞానికి ఆధ్వర్యం వహించి అక్కడ ఉన్న ఋత్విక్కులను పిలిచి వారిని యజ్ఞాన్ని గురించి ప్రశ్నించాడు. వారికి యజ్ఞం గురించి, అదిష్ఠాన దేవతల గురించి ఏమీ తెలియదు. అప్పుడు మొదటి ఋత్విక్కుతో "మీరు చేసే కార్యకలాపాలకు అదిష్ఠాన దైవం ప్రాణం. అన్ని జీవరాశులు ప్రాణంలో ప్రవేశిస్తాయి. ప్రాణంతోనే జీవిస్తాయి. ఇది తెలుసుకోకుండా యజ్ఞం చేస్తే కీడుమూడుతుంది." తరువాత రెండవ వానితో, "మీరు చేసే కార్యకలాపాలకు అధిష్ఠాన దేవత ఆదిత్యుడు. అన్ని జీవరాశులకు అతడే ఆధారం. ఇది తెలుసుకోకుండా యజ్ఞం చేస్తే హాని జరుగుతుంది." తరువాత మూడవ ఋత్విక్కుతో "మీరు చేసే కార్యకలాపాలకు అధిష్ఠానం అన్నం. జీవరాశులన్నీ అన్నం వల్లనే జీవిస్తున్నాయి. ఇది తెలుసుకోకుండా యజ్ఞం చేస్తే ప్రమాదం సంభవిస్తుంది". అన్నాడు. తరువాత ఋత్విక్కులు ముగ్గురినీ చూసి ఈ విధంగా చెప్పాడు.

"మహానుభావులారా ! మానవుడికి జీవనాధారం ప్రాణం. అన్నం లేకపోతే జీవించ లేరు. అన్నం కావాలంటే ఆహార పదార్థాల ఉత్పత్తి సూర్యుని మీద ఆధారపడి ఉన్నది. ఈ లోకంలో

సూర్యుడికి సమానమైనవాడు అగ్ని, కాబట్టి అగ్నిని తృప్తిపరచినట్లైతే మానవుడికి కావలసినవి అన్నీ లభిస్తాయి.

ప్రతికార్యానికి ఒక అధిష్టాన దేవత ఉంటుంది. మంత్రార్థము, అధిష్ఠానదేవత తెలియకుండా చేసిన కర్మ నిరర్థకము, పాపహేతువు కుడా అవుతుంది". అని వివరించాడని రత్నాకరుడు తన శిష్యులకు చెబుతూ ఉషస్తి ఉదంతాన్ని ముగించాడు.

## 29. పంచవిధసామోపాసన (ఛాందోగ్యోపనిషత్తు - 4)

"సామము సాధువైనది. ఉత్తమమైనది. శుభప్రదమైనది. సామోపాసన గురించి తెలుసుకున్నవాడు లోకంలో ఐదు విధాలయిన సామాలను ఆరోపించుకుని ఉపాసన చేస్తాడు. ఇప్పుడు మీకు పంచవిధాలయిన సామోపాసనల గురించి వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఛాందోగ్యోపనిషత్తులోని రెండవ అధ్యాయంలో మొదటగా సమస్త అవయవములతో కూడిన సామాన్ని ఉపాసన చెయ్యటం వివరిస్తున్నారు.

ఓంకారోపాసన ఎక్కువ ప్రయోజనాలనిస్తుంది. కాబట్టి సామోపాసన ఉత్తమమైనది. సాధువైనది సామము. అసాధువైంది సామంకాదు. అలాగే ....

సామ రూపము అంటే - ఉత్తమ రూపము

అసామ రూపము అంటే - అశుభ రూపము

సామం కలిగింది అంటే - శుభం కలిగింది

అసామం కలిగింది అంటే - కీడు కలిగింది అని అర్థం.

ఈ విషయాన్ని తెలుసుకుని ఉపాసన చేసే వాడికి శాస్త్ర సమ్మతమైన సాధుధర్మం శీఘ్రంగా వస్తుంది. మంచి ధర్మాలు, గుణాలు అతనికి లభిస్తాయి.

లోక దృష్టితో ఐదు విధాలయిన సామాలను ఉపాసించాలి

1. భూమి - హింకారము
2. అగ్ని - ప్రస్తావం
3. అంతరిక్షం - ఉద్గీథం
4. ఆదిత్యలోకం - ప్రతిహారం
5. ద్యులోకం - నిధనం

ఈ రకంగా ఐదు విధాలైన సామాన్ని ఐదు లోకాలుగా భావించి ఉపాసించాలి. అలాగే అధోలోకాల సారూప్యంతో సామోపాసన చెప్పబడుతోంది. పై నుంచి క్రింది లోకాలకు.

1. ద్యులోకం - హింకారము
2. ఆదిత్య లోకం - ప్రస్తావం

3. అంతరిక్షం - ఉద్గీథం

4. అగ్ని - ప్రతిహారం

5. భూమి - నిధనం

ఇది జీవులు పై నుంచి క్రిందికి దిగివచ్చే క్రమము.

ఈ విధమైన ఉపాసన తెలుసుకున్నవాడు లోకంలో ఐదు విధాలసామాలను ఆరోపించుకుని ఉపాసన చేస్తాడు. ముందుగా పంచవిధ సామాన్ని వానలో ఆరోపించటం.

1. వానకు ముందువీచే గాలి - హింకారము

2. పెద్ద మేఘమే - ప్రస్తావం

3. మేఘం వర్షించటం - ఉద్గీథం

4. ఉరుములు, మెరుపుల ధ్వని - ప్రతిహారం

5. వర్షపు నీరు మనంగ్రహించటమే - నిధనం

ఈ విధంగా ఉపాసన చేసిన వాడు స్వయంగా వాన కురిపించుకోగలుగుతాడు.

రెండవది అన్ని రకాల జలాలలోనూ పంచవిధ సామాన్ని ఉపాసించటం.

1. మేఘం ఘనీభవించటం - హింకారము

2. అది వర్షించటం - ప్రస్తావం

3. నదులు తూర్పు దిక్కుగా ప్రవహించటం - ఉద్గీథం

4. పడమటి దిక్కుగా ప్రవహించటం - ప్రతిహారం

5. నదులు సముద్రంలో కలవటం - నిధనం.

ఈ రకంగా ఉపాసన చేసినవాడు అతను కావాలనుకుంటే తప్ప, నీటిలో మరణించడు. అతడికి నీటి కరువు ఉండదు.

మూడవది ఋతువులలో పంచవిధ సామాన్ని ఉపాసించటం.

1. వసంత ఋతువు - హింకారము

2. గ్రీష్మ ఋతువు - ప్రస్తావం

3. వర్ష ఋతువు - ఉద్గీథం

4. శరదృతువు - ప్రతిహారం
5. హేమంత, శిశిర ఋతువులు- నిధనం

ఈ రకంగా ఉపాసన చేసినవాడు ఆ ఋతువులలో అన్ని భోగాలు అనుభవించ గలుగుతాడు.

నాల్గవది పశువుల్లో పంచవిధ సామాన్ని ఉపాసించటం.

1. మేకలు - హింకారము
2. గొర్రెలు - ప్రస్తానం
3. ఆవులు - ఉద్గీథం
4. గుర్రాలు - ప్రతిహారం
5. వీటన్నిటికీ ఆశ్రయమైన మానవుడు - నిధనం

ఈ రకంగా ఉపాసన చేసిన వాడికి పశు సంపద లభిస్తుంది.

ఐదవది ప్రాణాలలో పంచవిధ సామాన్ని ఉపాసించటం, ఇక్కడ ప్రాణాలు అంటే ఇంద్రియాలు

1 ఘ్రాణేంద్రియము - హింకారము
2. వాక్కు - ప్రస్తావం
3. చక్షువులు - ఉద్గీథం
4. శ్రోత్రం - ప్రతిహారం
5. మనస్సు - నిధనం

ఈ విధంగా ఉపాసన చేసినవాడి జీవితం శ్రేష్ఠమైనది అవుతుంది. అంటూ పంచ విధసామోపాసనను పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 30. సప్తవిధ సామోపాసన (ఛాందోగ్యోపనిషత్తు - 5)

సామాన్ని ఏడు రకాలుగా ఉపాసిస్తారు. అదే సప్తవిధ సామోపాసన. సప్తవిధ సామాన్ని ఆదిత్య దృష్టితో ఉపాసించేవాడు మంచి సంపన్నుడు, భోక్త అవుతాడు. కాబట్టి సప్తవిధ సామోపాసన గురించి వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

1. హింకారము
2. ప్రస్తానము
3. ఆది
4. ఉద్గీథం
5. ప్రతిహారం
6. ఉపద్రవము
7. నిధనం

వీటిని సప్తసామాలు అంటారు. ఈ సప్తవిధ సామాన్ని వాక్ దృష్టితో ఉపాసించాలి. అంటే సప్తవిధ సామమే వాక్కు అని భావించాలి. వాక్కులో ఉండే

| | | |
|---|---|---|
| 'హు'కారమే | - | సామంలోని 'హిం'కారము |
| 'ప్ర' అనేశబ్దమే | - | సామంలోని 'ప్రస్తానము' |
| 'ఆ' అనే శబ్దమే | - | సామంలోని 'ఆది' (ఓంకారము) |
| 'ఉత్' అనే శబ్దమే | - | సామంలోని 'ఉద్గీథం' |
| 'ప్రతి' అనే శబ్దమే | - | సామంలోని ప్రతిహారము' |
| 'ఉప' అనే శబ్దమే | - | సామంలోని 'ఉపద్రవము' |
| 'ని' అనే శబ్దమే | - | సామంలోని 'నిధనం' |

ఈ విషయం తెలిసి ఎవరైతే సప్తవిధ సామాన్ని ఉపాసిస్తాడో, అతడు సంపన్నుడు, మంచి భోక్త అవుతాడు.

సప్త విధసామాన్ని ఆదిత్య దృష్టితో ఉపాసించాలి. ఆదిత్యుడికి వృద్ధి క్షయాలుండవు. కాబట్టి ఎప్పుడూ సమంగానే ఉంటాడు. అలా సమంగా ఉండటమే సామం. ఆదిత్యుడు లోకంలోని ప్రతి వ్యక్తికీ సమానంగానే కనిపిస్తుంటాడు'. ఆదిత్యునిలోనే సమస్త భూతాలూ అనుగతమై ఉన్నాయి. అంటే అంతకు ముందునుంచీ ఉన్నాయన్న మాట.

ఆదిత్యుడు ఉదయించటానికి ముందు ఉండే ధర్మ స్వరూపమే 'హిం'కారము. పశుగణమంతా ఈ 'హిం'కారాన్నే అనుగమిస్తుంది. సూర్యోదయానికి ముందు పశువులన్నీ హింకారం చేస్తూ ఆదిత్యోపాసన చేస్తాయి.

ఆదిత్యుడు ప్రప్రథమంగా ఉదయించే సమయంలో ఉండే రూపమే 'ప్రస్తానం' మానవులంతా ఈ రూపాన్ని ఉపాసన చేస్తారు.

సూర్యుడు తన కిరణాలను ప్రసరింపచేసే సమయం (అంటే సూర్యోదయానికి మూడు ముహూర్తముల తరువాత)లో ఉండే రూపమే 'ఆది' (ఓంకారము). ఆదిత్యుని ఈ రూపాన్ని పక్షులు సేవిస్తున్నాయి కాబట్టే అవి కుడా సూర్యునిలాగా ఆకాశంలో తిరుగగలుగుతున్నాయి.

మధ్యాహ్న సమయంలో మండుతూ ఉండే ఆదిత్యుని రూపమే 'ఉద్గీథం', దీన్ని దేవతలు సేవిస్తారు.

అపరాహ్ణం ముందు ఆదిత్యుని మండుతూ ఉండే రూపమే 'ప్రతిహారం'. ఈ రూపాన్ని గర్భంలో ఉండే పిండాలు సేవిస్తాయి.

సూర్యాస్తమయానికి ముందుండే ఆదిత్య రూపమే 'ఉపద్రవము'. అడవి జంతువులు ఈ రూపాన్ని సేవిస్తాయి. అందుకే ఇవి మానవుల్ని చూసి భయపడి గుహల్లోకి పారిపోతాయి.

సూర్యాస్తమయానికి పూర్వం ఉండే ఆదిత్య రూపమే 'నిధనం'. పితృ దేవతలు ఈ రూపాన్ని సేవిస్తారు.

ఈ రకంగా ఆదిత్య రూపంలో సప్త విధసామాన్ని ఉపాసించేవాడు ఆదిత్య రూపాన్ని పొందుతాడు. అదే విధంగా గాయత్రి సంజ్ఞ కలిగిన సామాన్ని ప్రాణంతో ప్రతిష్ఠితమై ఉన్నట్లు తెలుసుకున్నవాడు ఇంద్రియ నిగ్రహము, పూర్ణాయువు గలవాడౌతాడు. రథంతర సామం అగ్నిలో వ్యాప్తమై ఉన్నట్లు తెలుసుకున్నవాడు బ్రహ్మ తేజస్సు కలవాడౌతాడు. వామదేవసామం దంపతులందు ప్రతిష్టితమై ఉన్నట్లు గ్రహించిన వాడు ఎన్నడూ భార్య లేనివాడు కాడు. పూర్ణాయుష్షు పొందుతాడు.

అంటూ సప్తవిధసామోపాసన గురించి శిష్యులకు వివరించాడు రత్నాకరుడు.

# 31. మధువిద్య (ఛాందోగ్యోపనిషత్తు-6)

ఈ ఉపనిషత్తులోని మూడవ అధ్యాయంలో మధు విజ్ఞానం చెప్పబడింది. ఆదిత్యుని యందు మధువును ఆరోపించి, ఆ విధంగా ఆదిత్యుణ్ణి ఉపాసించటమే మధువిద్య. ఈ విద్యను మొదటగా హిరణ్యగర్భుడు ప్రజాపతికి చెప్పాడు. తరువాత ప్రజాపతి మనువుకు, మనువు ఇక్ష్వాకునికి తద్వారా అతని సంతతికి చెప్పబడింది. అరుణిని జ్యేష్ట పుత్రుడైన ఉద్దాలకుడికి అతని తండ్రి ఈ బ్రహ్మ విజ్ఞానాన్ని చెప్పాడు. విద్వాంసులైన వారు ఈ విద్యను తమ జ్యేష్ఠపుత్రుడికి గాని, యోగ్యుడైన శిష్యుడికి గాని బోధించాలి. ఇతరులకు బోధించరాదు, అని శ్రుతి చెబుతోంది. మీరు నాకు యోగ్యులైన శిష్యులు కాబట్టి ఆ మధువిద్యను మీకు వివరిస్తున్నాను సావధానంగా వినండి'' అంటూ రత్నాకరుడు 'మధు విద్య'ను ప్రారంభించాడు.

దూరంగా ఆకాశంలో మనకు కనిపించేవాడే సూర్యుడు. అతడే దేవతలను తృప్తిపరచేవాడు. అందుచేతనే అతడు దేవతలకు మధువు వంటివాడు. స్వర్గలోకం తేనెపట్టు పట్టేటందుకు వీలైన కర్రలాంటిది. అంతరిక్షం తేనెపట్టులా వ్రేలాడుతోంది. ఆదిత్యుని నుండి వచ్చే కిరణాలు తేనెపట్టులో ఉండే తేనెటీగల పిల్లలు. ఆదిత్యరూపమైన మధువుకు తూర్పు దిక్కున ఉండే కిరణాలే అంతరిక్ష రూపమైన తేనెతుట్టెలోని గదులు. ఋక్కులే తేనెటీగలు. ఋగ్వేదమే పుష్పం. తేనెటీగల్లాగా ఋక్కులే కర్మలనే పూలలోనించి అమృతమనే మధువును తయారు చేస్తున్నాయి. అగ్నిలో దాగి ఉండే సోమరసం అనబడే అమృతమే జలం. అగ్నిలో హోమం చేయబడే నెయ్యి, పాలు మొదలైనవి వేడెక్కి ఆవిరై జలరూపందాల్చి అమృతంగా ఆ కిరణాలలో నిక్షిప్తమై ఉంటుంది. తేనెటీగలు తేనెను గ్రహించినట్లుగా హోమం చేసినప్పుడు ఋగ్వేదమంత్రాలు ఈ అమృతాన్ని గ్రహిస్తాయి. ఇక్కడ అమృతము అంటే హోమం చెయ్యటం వల్ల కలిగినటువంటి కనుపించని ఫలితము. దశలవారీగా అమృతత్వానికి అంటే మోక్షానికి కారణమౌతుంది.

దక్షిణ దిక్కున ఉండే కిరణాలే ఆదిత్య రూపమైన మధువు యొక్క దక్షిణ దిక్కులో ఉన్న తేనెతుట్టెలోని గదులు. యజుర్వేదమంత్రాలే తేనెటీగలు. యజుర్వేద విహితమైన కర్మయే పుష్పం. అగ్నిలో హోమం చెయ్యబడిన నెయ్యి మొదలైనవే అమృత జలం.

ఈ యజుర్వేదమంత్రాలు, యజుర్వేద విహితమైన కర్మలకు వేడి కలిగించగా, దాని నుండి యశస్సు, తేజస్సు, ఇంద్రియాలు, బలము, అన్నము ఉత్పన్నమైనాయి. ఇవన్నీ ఆదిత్యుని దక్షిణ భాగాన్ని ఆశ్రయించి తెల్లని రూపంలో ఉంటాయి.

పశ్చిమ దిక్కున ఉండే కిరణాలే సూర్యుడనే పడమటి దిక్కున ఉండే తేనెతుట్టెలోని గదులు. సామవేద మంత్రాలే తేనెటీగలు. సామవేద కర్మయే పుష్పం. సోమాది రూపమైన అమృతమే జలం. ఈ సామవేదమంత్రాలు సామవేద విహితమైన కర్మలకు వేడి కలిగించగా, దానినుండి యశస్సు, తేజస్సు, ఇంద్రియాలు, వీర్యం, తినటానికి వీలైన అన్నరూపరసం ఉత్పన్నమైనాయి. ఆ రసమే సూర్యుని పశ్చిమ భాగాన ఆశ్రయించి ఉండే నల్లని తేజస్సు.

ఉత్తరదిక్కున ఉండే కిరణాలే తేనె తుట్టెలోని గదులు. అధర్వ, అంగిరస మంత్రాలే తేనెటీగలు. ఇతిహాసాలు, పురాణాలు, పుష్పాలు. అగ్నిలో హోమం చెయ్యబడిన సోమాది రూపమైనదే అమృతజలం. అధర్వణ వేదమంత్రాలు ఇతిహాస, పురాణాలనే పూలను వేడెక్కించగా, వాటి నుండి యశము, తేజస్సు, ఇంద్రియాలు, వీర్యము, అన్న రూపమైన రసము ఉద్భవించాయి. ఈ రసమే సూర్యుని ఉత్తర భాగాన ఆశ్రయించి ఉండే మిక్కిలి నల్లనైన రూపము.

ఆదిత్యుని పైకి వ్యాపించే కిరణాలే ఊర్ధ్వ దిక్కులో ఉన్న తేనెతుట్టెలోని గదులు. లోక ద్వారాలు తెరువవలసినదిగా చేసే ప్రార్ధనలే తేనెటీగలు. ఓంకారమనే బ్రహ్మయే పుష్పం, సోమరసాది రూపమైన అమృతమే జలం. ప్రార్ధనలనే తేనె టీగలు ఓంకారమనే పుష్పాన్ని అభితప్తం చేస్తాయి. అంటే వేడెక్కిస్తాయి. అప్పుడు ఆ పుష్పం నుండి యశము, తేజస్సు, ఇంద్రియాలు, వీర్యం, అన్న రూపమైన రసముపుట్టి సూర్యుని పై భాగాన్ని ఆశ్రయించాయి. ఆదిత్యుని మధ్యలో చలిస్తున్నట్లు కనుపించే ఆ భాగమే మధువు.

ఈ రకంగా లోహితాది రూపాలే రసాలకు, రసలోకాలకు సారభూతం కాబట్టి వేదాలే రసాలు. ఈ వర్ణాలు రసానికి రసంలాంటివి. అమృతానికి అమృతంలాంటివి. వేదాలే అమృతాలు. లోహితాది రూపాలు వాటికన్న కూడా అమృతాలు - నాశనం లేనివి.

వీటిలో లోహిత వర్ణం గల మొదటి అమృతాన్ని అగ్ని దేవుని ద్వారా వసువులు అనుభవిస్తారు. ఇందులో దేవతలు తినేది, త్రాగేది ఏమీ ఉండదు. వారు ఆదిత్యుని తూర్పు

భాగంలో ఎర్రని రంగు గల అమృతాన్ని చూస్తూ - దాన్ని ఇంద్రియాలతో అనుభవిస్తూ తృప్తి పడతారు. వసుదేవతా గణం కూడా ఈ అమృతాన్ని చూసి తృప్తులౌతారు.

ఇక రెండవ అమృతం ఇంద్రుడు ప్రధానుడుగా రుద్రగణం చేత అనుభవింప బడుతుంది. దేవతలు తినటము, త్రాగటము చెయ్యరు. కనులతో చూచి తృప్తి చెందుతారు. ఈ విషయం తెలిసినవాడు సూర్యుడు దక్షిణ దిక్కున ఉదయించి ఉత్తర దిక్కున అస్తమించినంత కాలము రుద్రుల వంటి ఆధిపత్యం, స్వరాజ్యం పొందుతాడు.

మూడవ అమృతం, వరుణుడు ప్రధానుడుగా ఆదిత్య గణం చేత అనుభవించ బడుతుంది. ఈ అమృతాన్ని గురించి తెలుసుకున్నవాడు సూర్యుడు పశ్చిమాన ఉదయించి తూర్పున అస్తమించినంత కాలము ఆదిత్యుల ఆధిపత్యాన్ని, సామ్రాజ్యాన్ని పొందుతాడు.

నాల్గవ అమృతం సోముడు ప్రధానుడుగా మరుద్గణం చేత అనుభవించబడుతోంది. ఈ అమృతాన్ని గురించి తెలుసుకున్నవాడు సూర్యుడు ఉత్తరాన ఉదయించి దక్షిణాన అస్తమించినంతకాలము మరుద్గణాల ఆధిపత్యాన్ని, సామ్రాజ్యాన్ని పొందుతాడు.

ఐదవ అమృతం బ్రహ్మ ప్రధానుడుగా సాధ్యులచేత అనుభవింపబడుతుంది. ఈ అమృతాన్ని గురించి తెలుసుకున్నవాడు సూర్యుడు ఊర్ధ్వ దిక్కున ఉదయించి అధోదిక్కున అస్తమించినంతకాలము సాధ్యుల ఆధిపత్యాన్ని స్వారాజ్యాన్ని పొందుతాడు.

నిజానికి సూర్యునికి ఉదయాస్తమయాలు లేవు. ఆయన కనుపించినప్పుడే ఉదయం. కనుపించక పోవటమే అస్తమయంకాబట్టి ఏ దిక్కున కనిపించినప్పుడు, అక్కడి వారికి సూర్యోదయం అయిందని గ్రహించాలి. ఈ రకంగా ఉదయాస్తమయాల ద్వారా జీవులు వాటి కర్మఫలాన్ని అందిస్తూ, ఆ కర్మలు క్షయం అయిన తరువాత వాటిని తనలో లీనం చేసుకుంటాడు. జ్ఞానులైనవారు పైన చెప్పిన వసు, రుద్ర, ఆదిత్య, మరుద్గణాలు లాగా అమృతాన్ని అనుభవించి సూర్యునితో అభేదాన్ని పొందుతారు. అంటూ మధు విద్యను పూర్తిచేశాడు రత్నాకరుడు.

# 32. గాయత్రి ద్వారా బ్రహ్మోపాసన (ఛాందోగ్యోపనిషత్తు - 7)

మధు విజ్ఞానాన్ని తన శిష్యులకు వివరించిన తరువాత రత్నాకరుడు వారితో "నాయనలారా ! బ్రహ్మను గూర్చిన జ్ఞానం అన్నింటికన్నా గొప్ప ఫలితాన్ని ఇస్తుంది. ఆదృష్టితోనే గాయత్రి ద్వారా బ్రహ్మోపాసన వివరించబడింది. 'నేతి, నేతి' అనే మహావాక్యం ద్వారా తెలుసుకోదగినటువంటి పరబ్రహ్మకుండే లక్షణాలన్నీ గాయత్రికున్నాయి. అందుచేతనే గాయత్రి ద్వారా బ్రహ్మోపాసన ఏవిధంగా చెయ్యాలో ఛాందోగ్యోపనిషత్తులోని మూడవ అధ్యాయంలోని 12, 13 ఖండాలలో వివరించబడింది. దాన్ని గురించి వివరిస్తాను" అంటూ ఉపక్రమించాడు రత్నాకరుడు.

ఛందస్సులు అనేక రకాలున్నాయి. కాని బ్రహ్మజ్ఞానానికి ద్వారం గాయత్రి ఛందస్సు. ఆ గాయత్రియే సోమరసాన్ని తెచ్చి దేవతలకిచ్చింది.

ఒకసారి దేవతలంతా గాయత్రి, త్రిష్టప్, జగతి ఛందస్సులను సోమాన్ని తీసుకురమ్మని పంపారు. వీటిలో త్రిష్టప్, జగతి ఛందస్సులు సోమాన్ని చేరలేక తిరిగి వచ్చేశాయి. అంతేకాకుండా వస్తూ త్రోవలో అలసట కారణంగా తమలోని కొన్ని అక్షరాలను వదలి వేశాయి. గాయత్రి మాత్రం సోమం దగ్గరకు వెళ్ళి, దాన్ని రక్షించే వారందర్నీ ఓడించి సోమాన్ని తెచ్చి దేవతలకిచ్చింది. తిరిగి వచ్చేటప్పుడు త్రోవలో జగతి ఛందస్సు వదలిన ఒక అక్షరాన్ని, త్రిష్టప్ ఛందస్సు వదలిన మూడు అక్షరాలను కూడా తనతో కలుపుకుని వచ్చింది. ఆ కారణంగా గాయత్రి అన్నింటికి మించినది అయింది. పైగా ప్రాతః, మధ్యాహ్న, సాయంకాలాలు మూడింటిలోనూ వ్యాప్తమై ఉన్నది. బ్రాహ్మణునికి అత్యంతావశ్యక మవటంతో దాని గౌరవం ఇనుమడించింది. అందుచేతనే గాయత్రిని ఉపేక్షించినవాడు దేన్నీ పొందలేడు.

గాయత్రీ ఛందస్సులో 24 అక్షరాలు ఒక్కొక్క పాదానికి ఆరు చొప్పున, నాలుగు పాదాలుగా ఉన్నాయి. ఇతర ఛందస్సులలో ఇంకా ఎక్కువ అక్షరాలుంటాయి. కాని వాటిన్నింటిలోకి గాయత్రియే శ్రేష్టమైనది. స్థావర జంగమాత్మకమైన ప్రాణి సమూహమంతా గాయత్రియే. వాక్కే గాయత్రి, సమస్తప్రాణులూ గాయత్రి. వాగ్రూపమైన గాయత్రి అందరి పేర్లనూ ఉచ్చరిస్తోంది కాబట్టి గాయత్రి అందరి పేర్లలోనూ ఉన్నది. ఈ రకంగా ప్రాణిజాతమంతా గాయత్రీ స్వరూపమే. గాయత్రి అనే శబ్దానికి ప్రాణులను గురించి పాడుతున్నది, ప్రాణులను రక్షిస్తున్నది అని అర్థం. ఈ లక్షణాలు గల గాయత్రి ఈ పృథ్వి

తప్ప వేరుకాదు. చరాచరాలన్నీ భూమిలోనే ఉన్నాయి. అందుచే చరాచర జగత్తునంతటినీ గానం చేస్తూ - పాడుతూ, త్రాణం చేస్తూ కాపాడుతూ ఉండే గాయత్రియే ఈ భూమి.

పృధ్వీరూపమైన గాయత్రి, శరీరంలో ఉండే పంచభూతాలు, ఇంద్రియాల సమూహమూ ఒకటే. పురుషుని శరీరరూపమైన గాయత్రి, పురుషుని హృదయకమలంలో ఉండే పురుషుడు ఒకటే. ఆ పురుషునిలోనే అంటే గాయత్రిలోనే ప్రాణాలు ప్రతిష్టితమై ఉన్నాయి. ఇంతవరకు గాయత్రి పేరుతో బ్రహ్మను గూర్చి అతని మహిమను గూర్చి వివరించాను. ఇది కార్యబ్రహ్మ విభూతి. ఇక శుద్ధ బ్రహ్మ మహత్వం వివరిస్తాను.

శుద్ధబ్రహ్మ కార్యబ్రహ్మ కన్న గొప్పది. పాంచభౌతికమైన జగత్తంతా శుద్ధ బ్రహ్మ యొక్క ఒక పాదమే. మిగిలిన మూడు పాదాలు ఆ పరబ్రహ్మలోనే ఉన్నాయి. గాయత్రి ద్వారా ప్రతిపాదించబడి, మూడు పాదములుగల అమృత స్వరూపమైన బ్రహ్మము ఇదే. ఆ పురుషునికి బయట లోపలా కూడా ఉన్న ఆకాశము ఒకటే. అదే విధంగా హృదయం లోపలా, బయటా ఉన్న ఆకాశము, ఆత్మకూడా. ఈ రకంగా బ్రహ్మాన్ని గురించి తెలుసుకున్నవాడు బ్రతికి ఉండగానే బ్రహ్మ స్వరూపాన్ని పొందుతాడు.

అంటూ గాయత్రి ద్వారా బ్రహ్మోపాసనను వివరించాడు రత్నాకరుడు.



# 33. శాండిల్యవిద్య (ఛాందోగ్యోపనిషత్తు - 8)

"శాండిల్యుడు' అనే మహర్షి బ్రహ్మ విద్యను తన శిష్యులకు వివరించాడు. శాండిల్యుడు చెప్పాడు కాబట్టి దీన్ని శాండిల్యవిద్య అన్నారు. ఇప్పుడు ఆ శాండిల్య విద్యను మీకు వివరిస్తాను" అంటూ శాండిల్యవిద్యను గురించి తన శిష్యులకు చెప్పటం ప్రారంభించాడు రత్నాకరుడు.

నామరూపాత్మకమైన జగత్తు అంతా పరబ్రహ్మ స్వరూపమే. ప్రపంచమంతా పరబ్రహ్మనుంచే ఉత్పన్నమై చివరకు పరబ్రహ్మలోనే లీనమవుతుంది. సృష్టి స్థితి లయాలు అన్నీ కూడా బ్రహ్మమయమే కాబట్టి ఉపాసకుడు రాగద్వేషాలను విడిచి పెట్టి జితేంద్రియుడు కావాలి. పరబ్రహ్మను నిశ్చయాత్మక బుద్ధితో ఉపాసించాలి. పరబ్రహ్మ మనోమయుడుగా కనిపిస్తాడు. అదే విధంగా స్థూల సూక్ష్మ శరీరాలు కలవాడు, చైతన్య స్వరూపుడు, సత్యసంకల్పుడు. అతడు ఆకాశాత్మ. అంటే ఆకాశానికి ఉండే సర్వవ్యాపకత్వము, సూక్ష్మత్వము, రూపం లేక పోవటము, అనేవి ఆకాశ లక్షణాలు. ఈ లక్షణాలు కలవాడవటం చేత ఆకాశాత్మ అనబడుతున్నాడు. సమస్తకర్మలు స్వరూపంగా కలవాడు, సర్వకాముడు - సమస్తమైన సత్కామములు కలవాడు. సర్వకాముడు - సమస్తమైన సత్కారములు గలవాడు. సుఖ ప్రదమైన సమస్త గంధములు, సమస్త రసములు కలవాడు - అన్ని వైపుల నుండి జగత్తును వ్యాపించి ఉండేవాడు. కోరికలు లేనివాడు.

ఆత్మ అనేది సూక్ష్మాతి సూక్ష్మమైనది. అలాగే మహత్తరమైనది. ఈ హృదయపద్మంలో గల ఆత్మ వరిగింజకన్న, బార్లీ గింజకన్న, ఆవగింజ కన్న కూడా చాలా సూక్ష్మమైనది. అలాగే ఆ ఆత్మ ఈ భూమికన్న, స్వర్గలోకం కన్న, సమస్తలోకాలకన్నా కూడా పెద్దది. హృదయకమలంలో నివశించే ఆత్మ, పరబ్రహ్మ రెండూ ఒకటే.

హృదయ పద్మంలో ఉండే ఆత్మయే సమస్త కర్మలను నిర్వర్తిస్తుంది. సమస్తమైన మంచి కోరికలు కలిగి ఉంటుంది. సమస్త సుగంధాలు, రసాలు, కలిగి ఈ ప్రపంచాన్ని అన్ని వైపుల నుండి వ్యాపించి ఉంటుంది. ఆత్మను గురించి మాటలతో చెప్పలేము. దానికి ఏ విధమైన కోరికలు ఉండవు. ప్రాణుల కోరికలన్నీ అదే తీరుస్తుంది. ఈవిధంగా హృదయ పద్మంలోని ఆత్మయే పరబ్రహ్మ స్వరూపము. ఈ రెంటికీ భేదంలేదు. ఈ శరీరం నుంచి వేరైనప్పుడు అంటే సాధకుని శరీరం మరణించినప్పుడు, అందులోని జీవాత్మ ఆ పరమాత్మలో మరణానంతరము తప్పక పరబ్రహ్మలో లీనమవుతాడు. దీనినే శాండిల్య విద్య అంటారు.

అంగీరస గోత్రంలో పుట్టిన ఘోరమహర్షి దేవకీపుత్రుడైన శ్రీకృష్ణునికి ఆత్మయజ్ఞోపాసన గురించి వివరించాడు. ఈ విద్యను అభ్యసించినవాడికి ఇతర విద్యలయందు కోరికలుండవు.

మానవుడు లౌకికమైన కోరికలు తీర్చుకోటానికి యజ్ఞకర్మలు చేస్తాడు. అలాగే పారలౌకికమైన అసంతృప్తితో, తీవ్రమైన కాంక్షతో ఆత్మయజ్ఞం చేస్తాడు. ఆత్మ యజ్ఞాన్ని చేసినవాడు మరణానంతరము బ్రహ్మలోకాలు పొందుతాడు.

శిష్యులారా ! సంకల్ప వికల్పాలకు కారణమైనది మనస్సు. కాబట్టి మనస్సే బ్రహ్మగా ఉపాసించాలి. ఇది ఆత్మ విషయక దర్శనం. తరువాత దేవతా సంబంధమైన ఆకాశాన్ని బ్రహ్మగా ఉపాసించాలి. ఆకాశము, మనస్సు రెండూ సూక్ష్మమైనవే, సర్వవ్యాపకమైనవే, అంతులేనివి కాబట్టే వీటికి బ్రహ్మత్వం ఆపాదించబడింది.

మనస్సు అనే బ్రహ్మకు నాలుగు పాదాలున్నాయి. వీటిలో .....

మొదటి పాదం - వాక్కు

రెండవ పాదం - ప్రాణం

మూడవ పాదం - నేత్రం

నాల్గవ పాదం - శ్రోత్రం

ఇది అధ్యాత్మిక దృష్టి. ఆదిదైవ దృష్టితో చూసినట్లైతే

మొదటి పాదం - అగ్ని

రెండవ పాదం - వాయువు

మూడవ పాదం - ఆదిత్యుడు

నాల్గవ పాదం - దిక్కులు

ఈ విధంగా అధ్యాత్మ, ఆదిదేవత దృష్టితో నాల్గు పాదాలు గల బ్రహ్మోపాసన చెయ్యవచ్చు.

ఈ రెండు విధాలను కలిపికూడా ఉపాసించవచ్చు. మనస్సు, ఆకాశం రెండూ ఒక్కటే కదా ! అటువంటి మనో ఆకాశ బ్రహ్మకు.

మొదటి పాదం - వాక్కు, అగ్ని

రెండవ పాదం - ప్రాణము, వాయువులు

మూడవ పాదం - నేత్రము, ఆదిత్యులు

నాల్గవ పాదం - దిక్కులు, శ్రోత్రము.

ఈ విషయం తెలుసుకుని మనస్సును, ఆకాశాన్ని, బ్రహ్మగా ఉపాసించేవాడు యశస్సుతోను, బ్రహ్మతేజస్సుతోను ప్రకాశిస్తాడు.

'ఆదిత్యుడు బ్రహ్మ' మొట్టమొదటి ప్రపంచమంతా సత్తుగా అంటే నామరూపాత్మకం లేకుండా ఉంది. ఈ విధంగా నామరూపాత్మకంగాని అసత్తు కార్యోన్ముక్తమైంది. అది క్రమంగా స్థూలరూపాన్ని పొందుతూ, నీటిలో కలిసి అండంగా తయారైంది. నీటిలో పంచభూతాలు ఉన్నాయి. కాబట్టి పంచభూతాలతో కలిసి అండంగా అయిందన్నమాట. కొంత కాలానికి ఈ అండం పగిలి రెండు ముక్కలయింది. ఆముక్కలే వెండి, బంగారాలు. ఇందులో వెండిలాగా కనుపించేది క్రింద ఉండే భూలోకము. బంగారు రంగులో కనిపించేది పైన ఉండే ద్యులోకము. ఈ గ్రుడ్డును కప్పి ఉండే పొర పర్వత సమూహాలు-నదులే నాడులు.

ఆగర్భంలో పుట్టినవాడే ఆదిత్యుడు. ఆదిత్యునితో బాటే దూరప్రాంతాలకు వినిపించే ధ్వనులు, సమస్త జగత్తు, బ్రతకటానికి కావలసిన అన్న వస్త్రాలు పుట్టినాయి. ఇప్పటికీ సూర్యోదయం వల్ల, అస్తమించటంవల్ల సమస్త భూతాలు భోగ విషయాలు ఘోషశబ్దంతో పుడుతున్నాయి.

ఇట్టి మహిమాన్వితుడైన ఆదిత్యుని తెలుసుకొని అతనిని బ్రహ్మగా భావించి పూజించేవారు లేక ఆరాధించేవారు స్వయంగా ఆదిత్యుడే అవుతాడు. సుఖజీవనం సాగిస్తాడు. అతని వద్దకు సంతోషకరమైన శబ్దాలు శీఘ్రంగా చేరతాయి.

అంటూ ఛాందోగ్యోపనిషత్తులోని శాండిల్యవిద్య, ఆత్మయజ్ఞోపాసన, మొదలైన విషయాలను వివరించి మూడవ అధ్యాయాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 34. జానశ్రుతి రైక్వులగాథ (ఛాందోగ్యోపనిషత్తు - 9)

"ప్రియశిష్యులారా! కేవలం దాన ధర్మాలు చేసినంత మాత్రం చేత మోక్షంరాదు. దాన ధర్మాలు చేయటము, సత్రాలు మొదలైనవి కట్టించటము వల్ల ఆత్మ జ్ఞానము సమకూరదు. కీర్తి ప్రతిష్టల మీద కోరిక గల వాడికి ఆత్మజ్ఞానం లభించదు. నిగర్వి, నిర్మల మనస్కునకు మాత్రమే అది లభిస్తుంది. దీనికి నిదర్శనంగా ఒక కథ చెబుతాను వినండి" అంటూ మొదలుపెట్టాడు రత్నాకరుడు.

పూర్వకాలంలో జానశ్రుతి అనే మహారాజు మహావృషసామ్రాజ్యాన్ని పాలిస్తూ ఉండేవాడు. ఆ రాజు గొప్ప పండితుడు, వేదవిదుడు, దయార్ద్రహృదయుడు. దాన ధర్మలు చెయ్యటంలో అతనికి అతడే సాటి. తన రాజ్యంలో ఎన్నో ధర్మసత్రాలు, అన్న సత్రాలు, విశ్రాంతి గృహాలు కట్టించాడు. బాటసారులకు పేదవారికి నిరతాన్నదానం చేస్తుండేవాడు. వాటిలో అన్నార్తులకు అన్ని వేళలా అన్నదానం జరుగుతూనే ఉండేది. ఇదంతా చేస్తున్న జానశ్రుతి మహారాజు జీవితంలో ఎంతో సాధించాను అనుకునేవాడు. అందువల్ల అతనికి దర్పం, గర్వం ఆవరించాయి. వితరణ వల్ల పూర్తిగా పుణ్యాన్ని పొందగలనని, అదే మనశ్శాంతికి, మోక్షానికి మార్గమని భావించేవాడు. తనను మించినవాడు గాని, తనతో సమానమైనవాడు గాని ధర్మాత్ముడు ఈ లోకంలో ఇంకొకడు లేడు అనుకునేవాడు. ప్రతిరోజూ తాను చేసిన దాన ధర్మాలు లెక్కవేసుకుని పొంగి పోతుండేవాడు.

ఒకరోజు రాత్రిపూట, పౌర్ణమి రోజున అంతఃపుర పైభాగమున ఆరుబయట చల్లని ప్రదేశంలో హాయిగా విశ్రమించాడు మహారాజు. తను ఇంతవరకూ చేసిన దాన ధర్మాలు తలచుకుంటూ, లోకంలో తన యశశ్చంద్రికలు ఏవిధంగా వ్యాపించి ఉన్నాయో ఊహించుకుంటున్నాడు. ఈ ఆలోచనతో అతనికి నిద్రపట్టలేదు. తల్పం మీద అటూ ఇటూ దొర్లుతున్నాడు. ఇంతలో ఏవో మాటలు వినిపించాయి. 'ఈ నిశాసమయంలో ఎవరివీ మాటలు ?' అని కళ్ళు తెరిచి చూశాడు. చుట్టు ప్రక్కల ఎవరూలేదు. పైన ఆకాశం వంక చూశాడు. సరిగ్గా తాను విశ్రమించిన మిద్దెకు పై భాగాన ఆకాశంలో రెండు హంసలు ఎగురుతున్నాయి. అవి అలా ఎగురుతుండగా ఒకటి కొంచెం ముందుగా వెడుతోంది.

ఆ విధంగా ముందువెడుతున్న హంసతో వెనుక వున్న హంస అంటోంది. "ఓభల్లాక్షా! మందగించిన చూపు గలవాడా ! జానశ్రుతి మహారాజు యొక్క కీర్తి చంద్రికలు ఇక్కడ

అంతటా వ్యాపించి ఉంటాయి. మరీ క్రిందగా ఎగరకు. అతడి తేజస్సు తాకి భస్మమైపోతావు. జాగ్రత్త ! అతడు దానధర్మాలు చెయ్యటంలో చాలా గొప్పవాడు.

ఆ మాటలు విన్న ముందున్న హంస "మనం ఎల్లకాలము ఆకాశంలోనే విహరిస్తుంటాము. కాబట్టి ప్రపంచంలో మనకు తెలియని విషయాలు ఏవీ ఉండవు. జానశ్రుతి మహారాజును అంతగా పొగడుతున్నావు. బండితోలుకుని జీవిస్తున్న ఆత్మజ్ఞాని రైక్వుని కన్న ఇతడు ఏమైనా గొప్పవాడా ? కేవలం కీర్తికాంక్షతోనే ఈ రాజు ఈ విధంగా దానధర్మాలు చేస్తున్నాడు. ఇతని కర్మలు అన్నీ కీర్తికామదోష దూషితాలు. రైక్వుడు ఉన్నచోటనే ఉండి అన్నీ సాధించుకుంటున్నాడు. అతడికి గతాన్ని గురించి గాని, భవిష్యత్తును గురించి గాని ఆలోచనేలేదు. ఆత్మానుభవంతో విరాజిల్లుతున్నాడు" అన్నది.

ఈ రకంగా మాట్లాడుకుంటూ ఆహంసలు రాజప్రాసాదము దాటి వెళ్ళిపోయినాయి. ఆ సంభాషణ అంతావిన్నాడు మహారాజు. అర్ధరాత్రి దాటింది. దేశం అంతా నిద్రపోయింది. కాని జానశ్రుతికి నిద్రరాలేదు. హంసల సంభాషణే అతడి చెవులలో హోరెత్తుతోంది. ఇంతకాలం తానే గొప్పవాడిని అనుకున్నాడు. కాని కాదు. రైక్వుడు అనే మహానుభావుడు తనకన్న గొప్పవాడు. ఎవరాయన? ఎక్కడ ఉంటాడు ? ఈ రకమైన ఆలోచనలతో రాత్రంతా గడచిపోయింది.

ఉదయాన్నే లేచాడు మహారాజు. వైతాళికులు సుప్రభాతాలు మొదలుపెట్టారు. ఆచార ప్రకారం చేసే ఆపొగడ్తలు అతన్నేమాత్రం తృప్తి పరచలేదు. వైతాళికులంటున్నారు. "దానం చెయ్యటంలో నీకు నువ్వేసాటి మహారాజా ! మేలుకో ! ఒక్క చేతినే వందచేతులుగా చేసి దానంచేసే మహారాజువు నువ్వేనయ్యా ! నీకు సాటి ఇంకొకరులేరు. మహారాజా ! నీదగ్గర దానాలు తీసుకోవటానికి ఆర్తులు వచ్చే వేళయింది మేలుకో. తూర్పున సూర్యభగవానుడు ఉదయిస్తున్నాడు. ప్రపంచం నాలుగు మూలల నుండి దానం స్వీకరించటానికి జనం వస్తున్నారు. మేలుకో మహారాజా ! మేలుకో!"

ఈ పొగడ్తలేవీ మహారాజుకు ఆనందాన్ని కలిగించలేదు. వైతాళికులారా ! ఆపండి. నన్ను ఊరికే పొగడుతూ ఆపదాలకున్న విలువను పోగొట్టకండి. నాకన్నా గొప్పవాడు ఈ లోకంలో ఇంకొకడున్నాడు. ఎక్కడోకాదు. ఈ రాజ్యంలోనే ఉన్నాడు. రాజభటులారా ! తక్షణం మీరు వెళ్ళి ఆ మహానుభావుడు ఎక్కడ ఉన్నా సరే వెదికి అతని దర్శన భాగ్యం నాకు కలిగించండి" అన్నాడు.

ఆ మాటలు విని భటులు ఆశ్చర్యం పొందారు. రైక్వుడు అనే బండితోలే మహాత్ముడు. ఎక్కడున్నాడు ? ఎక్కడని వెదకటం ? రాజాజ్ఞపాటించి వెదకటానికి బయలులేరారు భటులు. ఆ మహానుభావుడెవరో వారికి అంతు చిక్కలేదు. తిరిగి వచ్చి మహారాజుకు అదే మాట విన్నవించారు. ఇంకా విచారించాడు రాజు. మరికొంతమంది భటులను పిలిచి దేశం అంతా గాలించి ఆ మహానుభావుని జాడకనుక్కోండి. సాధుపుంగవులు, బ్రహ్మజ్ఞానులు నివసించే ప్రాంతాలలో కూడా వెతకండి అన్నాడు.

విషయం పూర్తిగా అర్ధమయింది భటులకు, ఆ మహానుభావుడెవరోకాని అతణ్ణి చూసే వరకూ రాజు విశ్రమించడు. కాబట్టి అతని జాడ తెలుసుకుని రావల్సిందే అనుకుంటూ బయలుదేరారు. రాజ్యమంతా తిరిగారు. పల్లెపల్లె గాలించారు. చివరకు ఒక మారు మూలగ్రామంలో ఉన్నాడని తెలిసింది. అక్కడ ఒక బండి క్రింద విశ్రమించి ఉన్నాడా మహానుభావుడు. భటులు ఆయన దగ్గరకు పోయి 'స్వామీ! బండితోలే రైక్వుడు అంటే మీరేనా ?' అన్నారు. 'అవును నేనే'' అన్నాడు రైక్వుడు.

బండి తోలుకుంటూ కాలక్షేపంచేసే నిర్లిప్తజీవి. ప్రశాంత చిత్తుడు. ఆ రైక్వుని దర్శనం చేసుకోవటానికి ఉవ్విళ్ళూరుతున్నాడు మహారాజు. వెంటనే ప్రయాణం కట్టాడు. ఆయన కోసం వెలలేని కానుకలు తీసుకుని రాజపరివారము కూడా వెంట బయలుదేరారు. రాజపరివారాన్ని చూసి ఆశ్చర్యపోయాడు రైక్వుడు. రాజు ఎందుకువస్తున్నాడో తెలియ లేదు. మొదట ఆలోచించి చూస్తే మహారాజు అధ్యాత్మికానుభూతి పొంది మనోనిశ్చలతను సాధించటానికి వచ్చాడని అర్ధమయింది.

రైక్వుణ్ణి చేరటంతోనే మహారాజు రెండు చేతులూ జోడించి వినమ్రుడై, తాను అందించే కానుకలు స్వీకరించమన్నాడు. ఆనందానికి హేతువైన తత్వాన్ని బోధించమన్నాడు. ఆత్మజ్ఞానియైన రైక్వుణ్ణి ఈ కానుకలు ప్రలోభపెట్టలేక పోయినాయి. అతడు వాటిని స్వీకరించలేదు సరికదా "రాజా ! వెలలేని వస్తువులు నాకిచ్చి, తద్వారా నానుండి ఆత్మ జ్ఞానం పొందుదామనుకోవటం అవివేకం. కానుకలతోనూ రాజ్యాలతోనూ ఆత్మజ్ఞానాన్ని కొనలేవు. ఆత్మజ్ఞానమంటే బజారులో అమ్మేవస్తువుకాదు. నువు తెచ్చినకానుకలు నీవెంట తీసుకుని వెళ్ళు, వీటికి ఇక్కడ విలువలేదు'' అన్నాడు.

ఆ మాటలు విన్న రాజుమనస్సు చివుక్కుమంది. భౌతిక సంపదకు లొంగని రైక్వుని తలచుకుంటే అతని మీద గౌరవం మరీ పెరిగిపోయింది. రాజుకు అసంతృప్తి ఎక్కువైపోయింది. వేదనా తప్త హృదయంతో తిరుగు ముఖం పట్టాడు రాజు. రైక్వుని దగ్గరకు వెళ్ళి వచ్చినవాళ్ళని

ఎంతో మందిని కలిశాడు. వారంతా అశాంత చిత్తంతో రైక్వుని దగ్గరకు వెళ్ళి ప్రశాంత చిత్తంతో తిరిగి వచ్చారు. ఈ విషయం తెలిసిన దగ్గర నుంచీ తన దౌర్భాగ్యాన్ని తలచుకుని చింతించసాగాడు.

ఈ రకంగా కొన్ని రోజులు గడిచాయి. రైక్వుని దర్శించటానికి మహారాజు మళ్ళీ వెళ్ళాడు. ఈసారి రాజభటులులేరు. కానుకలు లేవు. సేవకులు లేరు. ఆర్భాటంలేదు. నిర్లిప్త హృదయంతో వినమ్రుడై వెళ్ళి రైక్వుని చెంత నుంచున్నాడు మహారాజు. తనను కటాక్షించి ఆత్మబోధకావించమని వేడుకున్నాడు.

మహారాజును చూశాడు రైక్వుడు. ఇప్పుడు రాజుముఖంలో నిర్మలత్వం కనిపిస్తోంది. రాజు ఆత్మజ్ఞానం పొందటానికి అర్హుడైనాడని గుర్తించాడు. పరిపూర్ణ హృదయంతో శిష్యునిగా స్వీకరించాడు. జానశ్రుతి మహారాజుకు రైక్వుడు ఈ విధంగా జ్ఞానోపదేశం చెయ్యటం మొదలుపెట్టాడు.

"రాజా ! ఆత్మను అనేక మంది అనేక విధాలుగా భావన చేస్తారు. ఆత్మ అనేది దేని వల్లా సృష్టించబడలేదు. సర్వసృష్టికీ అదేకారణం. ఈ సృష్టిలో అన్ని వస్తువులూ ఆత్మకు సంబంధించినవే. ఆత్మ అన్ని విషయాలకూ మూలకారణం. అన్నింటికీ ఆత్మే అధిష్ఠానం.

నువు చేసే దానాలకు ఎంతగానో గర్వపడిపోతున్నావు. అది చాలా అవివేకం. దానాలు చెయ్యి. గర్వంతోనూ దర్పంతోనూ కాదు. ఇదంతా నీ ప్రయోజకత్వం అనుకోవద్దు. దీనివల్ల అహంకారం జనిస్తుంది. ఆత్మ వినాశనానికి దారితీస్తుంది. నువు ఇవ్వగలిగింది దానంగా ఇవ్వుకాని కీర్తికాంక్షతోకాదు. సర్వవ్యాపి అయిన సర్వేశ్వరుడు నీకందించిన దానిని, ఆత్మస్వరూపులైన అందరికీ ఇస్తున్నానని భావించి ఇవ్వు. అది నీకర్తవ్యంగా భావించు. దాని వల్ల ఆత్మానుభూతి కలుగుతుంది" అన్నాడు.

ఆ మాటలు విన్న రాజు ఆనంద పరవశుడైనాడు. వేయి పాడిఆవుల్ని, విలువైన కానుకలను, అమూల్యమైన హారాలను, రథాలను, గుర్రాలను కానుకగా ఇచ్చి తన కుమార్తెనిచ్చి వివాహం చేశాడు.

ఈసారి రాజు ఇచ్చినకానుకలేవీ కాదనలేదు రైక్వుడు. అన్నీ స్వీకరించాడు. సంతృప్తాంతరంగుడైన రాజు తనపట్టణానికి వెళ్ళిపోయాడు. తరువాత కాలంలో మహావృష సామ్రాజ్యంలో రైక్వుడు ఉండే పల్లె "రైక్వపర్ణ"గా ప్రసిద్ధిపొందింది. అంటూ జానశ్రుతి రైక్వులగాథను వివరించాడు రత్నాకరుడు.

## 35. బ్రహ్మచారి (ఛాందోగ్యోపనిషత్తు - 10)

"శిష్యులారా ! ఉపాసన చేసేటప్పుడు దేవత యొక్క బాహ్యరూపాన్నే కాకుండా, ఆంతర్యం కుడా తెలుసుకుని ఆరాధన సాగించాలి. లేకపోతే ఆ ఉపాసన సత్ఫలితాన్ని ఇవ్వదు. దీనికి నిదర్శనంగా ఒక కథ చెబుతాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

పూర్వకాలంలో అరణ్యంలో ఒక ఆశ్రమం ఉండేది. అందులో ఇద్దరు ఋషులు ఉండే వారు. శౌనకుడు, అభిప్రతారి అని వారి పేర్లు. వాయుదేవుడు వారి ఆరాధ్య దైవం. ఒకరోజు మధ్యాహ్నం వారు భోజనం చేయబోయే సమయంలో తలుపు తట్టిన చప్పుడయింది. "భవతీ! భిక్షాం దేహి" అని వినిపించింది. ఎవరో బ్రహ్మచారి భిక్షాటనకు వచ్చాడు. "ఇది సమయంకాదు. వెళ్ళు" లోపల నుంచి సమాధానం. భిక్షుకుడికి లేదనటం విచిత్రం ఏమీకాదు. కాని ఋష్యాశ్రమంలో తిరస్కారానికి ఆశ్చర్యపోయాడు బ్రహ్మచారి. ఈ ఆశ్రమవాసులను తేలికగా వదలకూడదు అనుకున్నాడు. వెంటనే లోపలున్న వారినుద్దేశించి "ఆర్యా! తమరు ఏ దేవతనుపాసిస్తారు"? అని ప్రశ్నించాడు బ్రహ్మచారి.

"నువు చాలా మొండివాడిలా ఉన్నావయ్యా ! మా ఉపాసనాదైవం వాయువు. ఆయననే ప్రాణం అని కుడా అంటారు."అన్నాడు ఆశ్రమం లోపల నుంచి ఒక ఋషి.

"స్వామీ ! ఈ ప్రపంచం అంతా ప్రాణం వల్ల రూపం దాల్చింది. సృష్టి అంతా తిరిగి ప్రాణంలోనే లయం అయిపోతుంది. ఈ విషయం తమకు తెలుసుగదా ! ప్రాణమనేది కనుపించే వస్తువులయందు, కనుపించని వాటి యందు (వ్యక్తావ్యక్తముల యందు) కుడా ఉన్నది కదా!" అన్నాడు బ్రహ్మచారి.

'ఎందుకు తెలియదయ్యా ! నువు చెప్పేదంతా మాకు తెలిసిందే. క్రొత్త ఏమీకాదు' అన్నాడు లోపలి ఋషి.

"అయితే సరే ! ప్రస్తుతం అన్నం తినబోతున్నారు కదా ! మరి ఆ అన్నం ఎవరి కోసం తయారు చేశారు? ఎవరికి నివేదన చేస్తారు ?" తిరిగి ప్రశ్నించాడు బ్రహ్మచారి.

"ఆమాత్రం తెలియదా ! మేము ఆరాధించే వాయుదేవుడికి సమర్పించటానికి" చాలా తేలిక భావంతో సమాధానం చెప్పాడు ఋషి.

"అయితే వినండి. ప్రాణమనేది విశ్వమంతా వ్యాపించి ఉన్నది. ఆ ప్రాణానికి నైవేద్యంగా మీరు అన్నం వండారు. ఈ ప్రపంచంలో నేను కుడా ఒక భాగమే. అంటే నాలోకుడా ప్రాణమున్నది. మీరు ఉపాసించే పరబ్రహ్మ ప్రాణ రూపంలో మీలో ఉన్నది. అదే నాలో కూడా ఉన్నది. అలాంటప్పుడు ఆకలితో ఉన్న బ్రహ్మచారి రూపంలో మీ ఉపాసనాదైవమైన వాయుదేవుడే మిమ్మల్ని భిక్ష అడుగుతుంటే మీరు ఎందుకు లేదంటున్నారు?" అని ప్రశ్నించాడు బ్రహ్మచారి.

ఈ వివరణకు ఆశ్రమంలోని ఋషులు చాలా సంతోషించారు. "సత్యం బ్రహ్మచారీ, నువు చెప్పింది ముమ్మాటికీ సత్యం"అన్నారు.

"ఋషీశ్వరులారా ! నాకు భిక్షపెట్టకుండా పొమ్మంటే, నాలో ఉన్న ప్రాణాన్ని అంటే మీ ఆరాధ్యదైవాన్ని తిరస్కరించినట్లేగదా! మీరు ఎవరికోసం అన్నం వండారో ఆ దేవునికే ఆహారం ఇవ్వననటం న్యాయమేనా?" అన్నాడు బ్రహ్మచారి.

ఈ మాటలకు ఋషీశ్వరులు చాలా సిగ్గుపడ్డారు. వెంటనే లేచి గౌరవంగా ఆ బ్రహ్మచారిని లోపలికి తీసుకుని వచ్చారు. దేవత యొక్క బాహ్యరూపాన్నే కాకుండా, ఆంతర్యం తెలుసుకుని ఆరాధించాలి అని అర్థం చేసుకున్నవారై బ్రహ్మచారికి భోజనం పెట్టి పంపారు. అంటూ బ్రహ్మచారి కథను పూర్తిచేశాడు రత్నాకరుడు.



## 36. సత్యకామజాబాలి (ఛాందోగ్యోపనిషత్తు - 11)

"శిష్యులారా! పరబ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోవటానికి అర్హత ఉండాలి. అది ఎవరికిపడితే వారికి చెప్పేది కాదు. ఎన్ని సంవత్సరాలు గురువుగారిని సేవించినా అర్హత సంపాదించనిదే అది చెప్పబడదు. దీనికి నిదర్శనంగా సత్యకామ జాబాలి కథ చెబుతాను వినండి"? అంటూ మొదలుపెట్టాడు రత్నాకరుడు.

'జాబాలి' అనే పేరుగల స్త్రీ ఒక దాసి. యవ్వనంలో ఉండగా అనేక గృహాలలో పనిచేసింది. అప్పుడు ఆమెకు ఒక కుమారుడు కుడా కలిగాడు. కాలక్రమేణా జాబాలి కుమారుడు పెరిగి పెద్దవాడయ్యాడు. కుమారుడు విద్యాభ్యాసం పూర్తిచేసి బ్రహ్మజ్ఞాన సముపార్జన చెయ్యాలనుకున్నాడు. ఆరోజుల్లో గౌతమ మహర్షి వేదవేదాంగ విదుడు. బ్రహ్మజ్ఞానవేత్త. జాబాలి కుమారుడు మహర్షి వద్దకు వెళ్ళి నమస్కరించి విద్యను బోధించమని అడిగాడు. అమాటవిన్న గౌతముడు విద్యార్థిని చూసి, నీ తండ్రి ఎవరు ? గోత్రము ఏమిటి ? అని అడిగాడు. ఆ విషయాలు తనకు తెలియవని, కన్నతల్లిని అడిగి తెలుసుకుని వస్తానని చెప్పి ఇంటికి వెళ్ళి "అమ్మ ! నేను బ్రహ్మచర్యదీక్ష తీసుకోవాలను కుంటున్నాను. మన గోత్రం ఏమిటి ? నా తండ్రి ఎవరు ? ఈ వివరాలు నాకు తెలియ చెయ్యవలసింది" అన్నాడు.

అందు జాబాలి "నాయనా ! నేను యవ్వనంలో ఉండగా అనేక ఇళ్ళ దాసిగా పనిచేశాను. అనేకచోట్ల తిరిగాను,అనేకమందిని సేవించాను. నిన్ను కన్నాను. కాని నీ తండ్రి ఎవరోనాకు తెలియదు. అలాగే గోత్రం కుడా తెలియదు. కాని ఒక్కటి మాత్రం నిజం. నీపేరు సత్యకాముడు. నాపేరు జాబాలి. గురువర్యులకు ఇదే మాట చెప్పు". అన్నది.

"మాటలు విన్న సత్యకాముడు గౌతముడి దగ్గరకు వెళ్ళి తల్లి చెప్పిన మాటలు యధాతథంగా వివరించాడు. ఆ మాటలు విన్న గౌతముడు చాలా ఆనందించాడు.ఉన్నది ఉన్నట్లుగా చెప్పినందుకు సత్యకాముడుని, జాబిలినీ కూడా పరిపరివిధాల ప్రసంశించి సంప్రదాయ బద్ధంగా సత్యకాముడికి బ్రహ్మవిద్యా దీక్ష ఇచ్చాడు. సత్యకాముడు బ్రహ్మచర్య దీక్ష స్వీకరించి ఆశ్రమవాసి అయ్యాడు.

ఆశ్రమంలో చాలా రోజులు గడిపాడు సత్యకాముడు. ఒకరోజు గౌతమ మహర్షి సత్యకాముణ్ణి పిలిచి నాలుగు వందలు చిక్కిపోయిన, వట్టిపోయిన ఆవులను,ఆబోతులను అప్పచెప్పి "సత్యకామా! వీటిన్నిటినీ తోలుకువెళ్ళి జాగ్రత్తగాకాపాడు. వీటి సంఖ్యవేయి అయ్యే వరకూ తిరిగిరాకు" అన్నాడు.

గురువు దగ్గర విద్య నభ్యసించటానికి మూడు మార్గాలున్నాయి. అవి.

1. గురువుకు సేవచేసి విద్యను నేర్చుకోవటము.

2. గురువుకు తగినంత ధనమిచ్చి విద్యను నేర్చుకోవటము.

3. తనకు వచ్చిన విద్యను గురువుకు నేర్పి, అతని దగ్గర నుండి విద్యను పొందటము.

వీటిలో మొదటి మార్గాన్ని అనుసరిస్తున్నాడు సత్యకాముడు. గురువుగారు చెప్పిన పని ఎంత కష్టమైనదైనా సరే చేసి, గురువును తృప్తిపరచటం. దీని ప్రకారం సత్యకాముడు గురువుగారి ఆజ్ఞప్రకారము గొల్లవానివలె పశువులను తోలుకుని అరణ్యానికి వెళ్ళాడు. ఆవులను మేపుతూ అరణ్యంలోనే కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

ఇలా చాలా ఏళ్ళు గడిచినాయి. సత్యకాముడు బ్రహ్మజ్ఞానం కోసం పరితపిస్తూనే ఉన్నాడు. అరణ్యంలో కనిపించే ప్రతివస్తువూ, ప్రతిదృశ్యమూ అతడికి ఏదో ఒక పాఠం చెబుతూనే ఉంది• పశువుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఒకనాడు సత్యకాముడు అరణ్యంలో చెట్టుక్రింద దీర్ఘాలోచనలో నిమగ్నుడై ఉన్న సమయంలో ఒక ముసలి ఆబోతు అతడి దగ్గరకు వచ్చి, "సత్యకామా ! నువు గురువుగారి దగ్గరకు తిరిగి వెళ్ళే సమయం ఆసన్నమైంది. నీ కర్మ కూడా పరిపక్వమైంది. బ్రహ్మజ్ఞానాన్ని గురించి చెబుతాను వినవలసినది. బ్రహ్మతత్త్వ విజ్ఞానము, నాలుగు పాదాలుగా ఉంటుంది. అందులో ఒక పాదాన్ని నీకు వినిపిస్తాను". అంది. సరే అన్నాడు సత్యకాముడు.

ముసలి ఆబోతు మళ్ళీ చెప్పటం మొదలు పెట్టింది." సత్యకామా ! ఈ విశాల విశ్వంలో నాలుగు దిక్కులూ, బ్రహ్మతత్త్వంలో ఒక భాగము. రెండవ భాగాన్ని అగ్ని దేవుడు ఉపదేశిస్తాడు".

సత్యకాముడు గౌతముని ఆశ్రమానికి తిరిగి ప్రయాణం కట్టాడు. త్రోవలో సంధ్యా సమయం అయింది. చీకట్లు ఆవరిస్తున్నాయి. సత్యకాముడు నిప్పు అంటించి దాని ఎదురుగా కూర్చున్నాడు. అప్పుడు ఆ అగ్ని నుంచి సందేశం వినవచ్చింది. "ఓ సత్యకామా!

బ్రహ్మతత్వాన్ని గురించిన రెండో పాదం వివరిస్తున్నాను. భూమి, ఆకాశము,సముద్రాలు, నదులు, పర్వతాలు అన్నీ బ్రహ్మ పదార్థంలోని అంతర్భాగాలే. మూడవ పాదాన్ని ఒక హంస వివరిస్తుంది".

ఈ మాటలు విన్న సత్యకాముడు బ్రహ్మతత్త్వాన్ని గురించి ఆలోచిస్తూ ముందుకు సాగిపోతున్నాడు. మూడవనాడు సాయంత్రం మళ్ళీ నిప్పు అంటించాడు. ఆ సమయంలో ఒక హంస ఎగిరి వచ్చి అతని సమీపంలో వాలి ఇలా చెప్పటం మొదలు పెట్టింది. "కుమారా! బ్రహ్మతత్త్వంలో మూడోపాదాన్ని నీకు వివరిస్తున్నాను. అగ్ని, సూర్యుడు, చంద్రుడు, విద్యుల్లతలు అన్నీ పరబ్రహ్మలోని భాగాలే" నాల్గవ రోజు సాయంత్రం ప్రార్థనా సమయంలో ఒక నీటి పక్షి వచ్చి సత్యకాముడి దగ్గరవాలి, తన సందేశాన్ని వినిపించటం మొదలుపెట్టింది. "సత్యకామా ! బ్రహ్మతత్వాన్ని గురించిన నాల్గవ పాదాన్ని నీకు వివరిస్తున్నాను జాగ్రత్తగా వినవలసినది. ప్రాణంబ్రహ్మ, దృష్టి బ్రహ్మ, శ్రవణం బ్రహ్మ, మనస్సు బ్రహ్మ".

సత్యకాముడు గౌతమ మహర్షి ఆశ్రమం చేరుకొని, మహర్షికి నమస్కరించాడు. గౌతముడు శిష్యుని ముఖం చూడగానే ఆనందంతో "సత్యకామా ! నీ ముఖం బ్రహ్మజ్ఞాని వలె వర్చస్సుతో ప్రకాశిస్తున్నది. నీకు బ్రహ్మతత్త్వం ఎవరు చెప్పారు ?" అన్నాడు. దానికి సత్యకాముడు "స్వామీ,మానవేతరములైన జీవరాశుల వల్ల బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోగలిగాను. మీరు కుడా అనుగ్రహించండి. గురువర్యా ! గురూపదేశం లేకపోతే విద్య ఫలించదు" అన్నాడు. ఆమాటలకు గౌతముడు చాలా సంతోషించి సత్యకాముడుకి సర్వవిజ్ఞానాన్నీ ఉపదేశించాడు.

ఈ రకంగా పరబ్రహ్మ నాలుగు పాదాలుగా ఉంటుంది. వీటిలో

| | | |
|---|---|---|
| మొదటి పాదాన్ని ఉపాసించినవాడు | - | మరణానంతరము ఉత్తమలోకాలకు పోతాడు. |
| రెండవ పాదాన్ని ఉపాసించినవాడు | - | అనంత గుణసంపన్నుడౌతాడు. |
| మూడవ పాదాన్ని ఉపాసించినవాడు | - | తేజోవంతుడై తేజో లోకాలకు పోతాడు. |
| నాల్గవ పాదాన్ని ఉపాసించినవాడు | - | ఈ లోకంలో మంచి ఆశ్రయం పొంది మరణానంతరము కోరిన లోకాలకు పోతాడు. అంటూ సత్యకామ జాబాలి కథ పూర్తిచేశాడు రత్నాకరుడు. |

# 37. ఉపకోశలుడు (ఛాందోగ్యపనిషత్తు - 12)

"ఎన్నో కష్టాలుపడి బ్రహ్మజ్ఞానము సంపాదించిన సత్యకామజాబాలి కూడా శిష్యులను పూర్తిగా పరీక్షించిన తరువాతనే ఆ విద్యను ఉపదేశించాడు. అంతేకాని అర్హత లేనివారికి మాత్రం చెప్పలేదు. దీనికి నిదర్శనంగా ఉపకోశలుడి కథ చెబుతాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

సత్యకామ జాబాలి విద్యాభ్యాసం పూర్తి చేసుకుని గృహస్థాశ్రమం స్వీకరించి గురుకులాన్ని స్థాపించాడు. అతడి దగ్గర ఉపకోశలుడు శిష్యరికం చేస్తున్నాడు. ఈ రకంగా పన్నెండు సంవత్సరాలు గడిచినాయి. దీక్షతో గురువుగారికి సపర్యలు చేస్తున్నాడు. అయినా గురువు గారి కటాక్ష వీక్షణాలు అతడి మీద ప్రసరించలేదు. ఉపకోశలుడితో పాటు అనేకమంది శిష్యులు సత్యకాముడి దగ్గరకు వచ్చారు. వారి అర్హతలను బట్టి వారందరికీ ఉపదేశం చేసి పంపించేశాడు సత్యకాముడు. కాని ఉపకోశలుణ్ణి మాత్రం పట్టించుకోలేదు. అతడు ఆశ్రమం వదలి వెళ్ళటానికి గురువుగారి దగ్గర నుంచి అంగీకారం ఇంకారాలేదు. గురుపత్ని కుడా ఉపకోశలుణ్ణి కనికరించమని గురువుగారిని వేడుకుంది. మౌనం వహించాడు కాని మాట్లాడలేదు గురువుగారు.

ఒకరోజు ఏదోపనిమీద గ్రామాంతరం వెడుతూ ఉపకోశలుణ్ణి పిలిచి ఆశ్రమ ప్రాంగణంలోని అగ్నులను జాగ్రత్తగా చూస్తుండమని చెప్పాడు. ఉపకోశలుడు విచారంలో మునిగి పోయాడు. ఆహార పానీయాలు కూడా విసర్జించాడు. చివరకు రోగగ్రస్తుడు కుడా అయినాడు. అదిచూసి గురుపత్ని చాలా బాధపడింది. పుత్రవాత్సల్యంతో ఆహారం తీసుకోమని బ్రతిమాలింది. దానికి ఉపకోశలుడు "తల్లీ! నా హృదయం ఇంకా పవిత్రం కాలేదు. అందుకే గురువుగారు నన్ను ఇంకా పరీక్షిస్తున్నారు. నా హృదయంలో ఇంకా అనేకమైన దుఃసంకల్పాలుండి ఉంటాయి. నేను అన్నం ముట్టను" అన్నాడు. అతని బాధకు ఆశ్రమంలోని అగ్నులు కుడా చలించిపోయాయి. ఆ తరువాత తమలో తాము" ఈ బ్రహ్మచారి అనేక సంవత్సరాలుగా దీక్షనవలంభిస్తున్నాడు. తపస్సు ఆచరిస్తున్నాడు. మనలను ఆరాధిస్తున్నాడు. శాస్త్రోక్తంగా తృప్తి పరుస్తున్నాడు. గురువుగారు అతడికి ఉపదేశం చెయ్యటం లేదు. పదండి మనమే ఉపదేశం చేద్దాం" ఇలా అనుకుని ఉపకోశలుని దగ్గరకు బయలుదేరాయి. ఉపకోశలుడికి ఒక సందేశమిచ్చాయి. "ఉపకోశలా! ప్రాణమే బ్రహ్మ. ఆకాశమే బ్రహ్మ. ఆనందమే బ్రహ్మ'

అది విన్న ఉపకోశలుడు "నాకు గతంలో ప్రాణము బ్రహ్మ అని తెలుసు కాని ఆనందము, ఆకాశము బ్రహ్మ మయమని తెలియదు" అన్నాడు. అప్పుడు అగ్నులు హృదయాకాశాన్ని గురించి వివరిస్తూ హృదయమందే బ్రహ్మతత్త్వముంటుంది. ఆనందం ఆ తత్త్వము యొక్క నిజస్వరూపము" అన్నాయి. అప్పుడు వాటిలో ఒక అగ్ని "భూమి సూర్యుడు, చంద్రుడు ఆ పరబ్రహ్మ యొక్క రూపాంతరాలే. సూర్యునిలో ఉన్న బ్రహ్మతత్త్వం, నాలో ఉన్న బ్రహ్మతత్త్వం ఒక్కటే. తూర్పు, పడమర, ఉత్తర దక్షిణాలు, నక్షత్రాలు, నీరు, నింగిలలో ఉన్న తత్త్వము, నాలో ఉన్న తత్త్వము ఒక్కటే. ఆకాశంలోని మెరుపులో ఏతత్త్వమైతే ఉన్నదో అదే నాలోనూ ఉన్నది. చరాచర జగత్తు అంతా వ్యాపించింది. ఆ తత్త్వమే బ్రహ్మ తత్త్వము. ఈ తత్త్వాన్ని అర్ధం చేసుకుని బాధలను దూరం చేసుకో". అన్నది.

ఆ తరువాత గృహస్థులు ఆరాధించే గార్హ్యపత్యాగ్ని ఒక రూపాన్ని పొంది అంతటా వ్యాపించి బ్రహ్మతత్త్వాన్ని పొంది అతనికి కనిపించింది. ఆ సమయంలో సూర్యుడు, చంద్రుడు, ఆకాశము, నక్షత్రాలు, విద్యుల్లతలు ఒకటేమిటి ? జగత్తు అంతా అతడికి అగ్ని రూపమై, బ్రహ్మరూపమై సాక్షాత్కరించింది.

గ్రామాంతరం వెళ్ళిన సత్యకాముడు తిరిగి ఆశ్రమానికి వచ్చి అలవాటు ప్రకారం ఉపకోశలుణ్ణి పిలిచాడు. చెంతకు చేరిన శిష్యుని ముఖం చూడగానే ఆశ్చర్యపోయాడు. అతడి ముఖం బ్రహ్మతేజస్సును వెదజల్లుతున్నది. అప్పుడు "ఉపకోశలా ! నీ ముఖం బ్రహ్మను భూతిని పొందిన వాడికిలాగా ప్రకాశవంతంగా ఉన్నది. బ్రహ్మతత్త్వాన్ని గురించి నీకెవరు చెప్పారు?" అన్నాడు. జరిగిన విషయుమంతా వివరించాడు ఉపకోశలుడు. పరమానందభరితుడైన సత్యకాముడు తనకు తెలిసిన బ్రహ్మజ్ఞానం అంతా ఉపకోశలుడికి వివరించాడు. అతడికి అగ్ని బ్రహ్మరూపమై సాక్షాత్కరించింది.

పరబ్రహ్మోపాసనలో భాగంగా చేసే యజ్ఞాలలో బ్రహ్మవల్లగాని, ఋత్విక్కుల వల్లగాని ఏదైనా పొరపాటు జరిగితే ఆ దోషాన్ని పోగొట్టుకోవటానికి వ్యాహృతులను ఉపాసన చెయ్యాలి. భూః, భువః సువః అనేవి వ్యాహృతులు.

ప్రజాపతి లోకాలను ఉద్దేశించి వాటి సారాన్ని గ్రహించాలనే తలంపుతో తపస్సు చేశాడు. ఆ తరువాత లోకాలనుండి రసాన్ని అంటే సారాన్ని తీశాడు.

పృథివి నుండి - అగ్ని అనే రసాన్ని

అంతరిక్షం నుండి - వాయువు అనే రసాన్ని

ద్యులోకం నుండి - ఆదిత్యుడు అనే రసాన్ని

సారంగా గ్రహించాడు. ఆ తరువాత ప్రజాపతి అగ్ని, వాయువు, ఆదిత్యులను గూర్చి తపస్సు చేశాడు. వారి నుండి వేదాలనే రసాన్ని పిండాడు. అంటే

అగ్ని నుండి - ఋగ్వేదాన్ని

వాయువు నుండి - యజుర్వేదాన్ని

ఆదిత్యుని నుండి - సామవేదాన్ని

సారంగా గ్రహించాడు. ఆ తరువాత ప్రజాపతి మూడు వేదాలను గూర్చి తపస్సు చేశాడు. అదే త్రయీవిద్య. దానినుండి మళ్ళీసారాన్ని తీశాడు. అంటే

ఋగ్వేదం నుంచి - భూలోకము

యజుర్వేదము నుంచి - భువర్లోకము

సామవేదము నుంచి - సువర్లోకము

రసం రూపంలో గ్రహించాడు. భూః భువః సువః అనేవి వ్యాహృతులు. ఇవి వేదాలనుండి, దేవతల నుండి లోకాలనుండి లభించినాయి. అందుచేత యజ్ఞం చేసేటప్పుడు ఋగ్వేద సంబంధమైన పొరపాట్లు జరిగితే 'భూఃస్వాహా' అంటూ గార్హపత్యాగ్నిలో హోమం చెయ్యాలి. యజుర్వేద సంబంధమైన పొరపాట్లు జరిగితే 'భువఃస్వాహా' అంటూ దక్షిణాగ్నిలో హోమం చెయ్యాలి. సామవేద సంబంధమైన పొరపాట్లు జరిగితే "సువః స్వాహా" అంటూ ఆహవనీయాగ్నిలో హోమం చెయ్యాలి.

ఈ రకంగా చేస్తే వేదసంబంధమైన హాని తొలగిపోతుంది. మూడు వేదాల విజ్ఞానం తెలిసినవాడే బ్రహ్మ పదానికి అర్హుడు. అంటూ ఉపకోశలుడి కథను, యజ్ఞాలలో వేద సంబంధమైన పొరపాట్లు సరిదిద్దే విధానాన్ని వివరిస్తూ నాల్గవ అధ్యాయాన్ని ముగిచాడు. రత్నాకరుడు.

# 38. ఎవరు గొప్ప ? (ఛాందోగ్యోపనిషత్తు - 13)

"ఎవరైనా వయసులో పెద్దవాడైతే జ్యేష్ఠుడని, మంచి గుణాలు కలవాడైతే శ్రేష్ఠుడని అంటారు. ఈ రెండు ఒకరిలోనే ఉండవచ్చు. శరీరంలో ఉండే ఇంద్రియాలన్నింటిలోకి ప్రాణమే జ్యేష్టము, శ్రేష్టము అయినది. ఇందులో అనుమానం లేదు. దీనికి సంబంధించిన ఒక కథ చెబుతాను వినండి" అంటూ ఐదవ అధ్యాయం ప్రారంభించాడు రత్నాకరుడు.

పూర్వకాలంలో ఒకసారి ఇంద్రియాలన్నీ తమలోతాము పోట్లాడుకోవటం మొదలుపెట్టాయి. దీనికి కారణం తమలో ఎవరు గొప్ప అనే విషయం తేలకపోవటమే. ఆ వాదన ఎంతకీ తెగలేదు. చివరకు అన్నీ కలిసి ఒక నిర్ణయానికి వచ్చి తమకు జన్మనిచ్చిన ప్రజాపతి దగ్గరకుపోయి "ప్రజాపతీ ! మాలో శ్రేష్ఠులెవరో మీరు తేల్చి చెప్పండి" అన్నాయి.

ప్రజాపతి ఒక క్షణం ఆలోచించి "మీలో ఎవరు శ్రేష్ఠులో తేల్చుకునే ఉపాయం ఒకటి చెబుతాను వినండి. మీలో ఏది లేకపోతే ఈ శరీరం పనికి రాకుండా, పనిచెయ్యకుండా పోతుందో అది అన్నింటికన్న శ్రేష్ఠమైనదిగా గుర్తించండి. ఈ విషయం తేలాలంటే ఒక్కొక్క ఇంద్రియము ఒక సంవత్సరం పాటు ఈ శరీరాన్ని విడిచి వెళ్ళండి" అన్నాడు. ప్రజాపతి సలహా ఇంద్రియాలకన్నింటికీ నచ్చింది.

ముందుగా వాక్కు శరీరం నుంచి నిష్క్రమించింది. అది ఒక సంవత్సరం పాటు శరీరానికి దూరంగా ఉండి తరువాత తిరిగి వచ్చి మిగిలిన ఇంద్రియాలను అడిగింది "నేను లేనప్పుడు మీరెలా జీవించి ఉండగలిగారు"

"నువు వెళ్ళి పోవటం వల్ల శరీరానికి పెద్ద నష్టం ఏదీ జరగలేదు. కేవలం వాక్కు మాత్రం మూగబోయింది. అంతేగాని మిగిలిన శరీరం యధాతథంగా పని చేసింది. ఉచ్ఛ్వాసనిశ్వాసలు మామూలుగానే జరిగాయి. కళ్ళు చూస్తూనే ఉన్నాయి. చెవులు వింటూనే ఉన్నాయి. ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. ఆ రకంగా మిగిలిన పనులన్నీ జరిగాయి. పసిపిల్లవాడికి మాటలు రావు. అయినా వాడు బ్రతకటం లేదా ? మూగవాడు జీవించటం లేదా ? అలాగే శరీరం జీవించే ఉన్నది." అన్నాయి మిగిలిన అవయవాలు. ఆ మాటలు విన్న వాక్కు శరీరంలో ప్రవేశించింది.

తరువాత శరీరం నుంచి దృష్టి నిష్క్రమించి ఒక సంవత్సరం తరువాత తిరిగి వచ్చి మిగిలిన అవయవాలను అడిగింది "నేను లేనప్పుడు మీరంతా ఎలా ఉన్నారు?" అని.

అప్పుడవి "నువు లేకపోతే చెప్పుకోతగ్గ ఇబ్బందేం కలగలేదు. గ్రుడ్డివాడు బ్రతకటం లేదా ? అలాగే ఈ శరీరం తిరిగింది. కేవలం చూపు మాత్రం లేదు. అంతేకాని శరీరంలోని మిగిలిన వ్యాపారాలన్నీ సజావుగానే సాగినాయి. ఊపిరి ఆడుతూనే ఉంది. నోరుతింటూనే ఉంది. మాట్లాడుతూనే ఉన్నది. ఆలోచనలు బాగానే ఉన్నాయి." అన్నాయి. మారుమాటాడ కుండా దృష్టి శరీరంలో ప్రవేశించింది.

ఆ తరువాత శ్రవణశక్తి శరీరాన్ని విడిచి వెళ్ళిపోయి ఒక సంవత్సరం తరువాత తిరిగి వచ్చి నేను లేకపోతే ఎలా ఉన్నది ? అని అడిగింది.

దానికి మిగిలిన ఇంద్రియాలు "ఓ శ్రవణేంద్రియమా ! నీవులేని శరీరం చెవిటిదయింది. అంతేకాని కన్ను చూస్తోంది. నోరు మాట్లాడుతోంది. ఈ రకంగా మిగిలిన ఇంద్రియాలన్నీ వాటిపని అవిచేస్తూనే ఉన్నాయి. కాబట్టి మేమంతా ఈ శరీరంలో సుఖంగానే ఉన్నాము" అన్నాయి. శ్రవణశక్తి శరీరంలో ప్రవేశించింది.

ఆ తరువాత మనస్సు శరీరం నుంచి నిష్క్రమించి ఒక సంవత్సరం తరువాత తిరిగి వచ్చి "నేను లేకపోతే వెలితిగా లేదా?" అని అడిగింది.

దానికి మిగిలిన ఇంద్రియాలు "ఓ మనసా ! నీవు సంకల్ప వికల్పాలకు మూలమైన దానవు. నువు లేకపోతే శరీరానికి సంకల్పం ఉండదు. ఆలోచనాశక్తి ఉండదు. ఆలోచన లేదన్న మాటేగాని శ్వాస ఆడుతుంది. కాళ్ళు చేతులు వాటి పనిచేస్తాయి. నోరు తింటుంది. మాట్లాడుతుంది. ఈ రకంగా మిగిలిన ఇంద్రియాలు వాటి పని అవి చేస్తూనే ఉంటాయి. పసిపిల్లవాడు మనస్సు లేకుండా బ్రతకటం లేదా ? అలాగే శరీరం నువ్వు లేకుండా జీవించే ఉన్నది. మిగిలిన కార్యములన్నీ యధాతధంగా జరుగుతూనే ఉన్నాయి." అన్నాయి. మారు మాట్లాడకుండా మనస్సు శరీరంలో ప్రవేశించింది.

ఆఖరుకు ప్రాణం బయటకు పోవటానికి వస్తూఉంది. అప్పుడు ఇంద్రియాలతో తనకున్న బంధనాలన్నిటినీ త్రెంచిపారేస్తున్నట్లనిపించింది. శరీరానికి ఊపిరి అందటం కష్టమవుతున్నది. కళ్ళు కనిపించటం మానివేసింది. చెవులు వినిపించటం మానివేశాయి. నోరు మాట్లాడటం కష్టమయింది. అలాగే కాళ్ళు చేతులు కదలటం మానివేశాయి. శరీరం గాలిలో తేలిపోతున్నట్లయింది. దాంతో ఇంద్రియాలకు భయంపట్టుకుంది. అప్పుడు అవన్నీ ప్రాణం చుట్టూచేరి" ప్రాణమా ! నువ్వు మాత్రం శరీరం నుంచి బయటకు వెళ్ళకు. ఇక్కడే

ఉండూనువ్వు శరీరం నుంచి బయటకు వెళ్ళిపోతే శరీరం చచ్చిపోతుంది. అప్పుడు మేమంతా ఉపయోగం లేకుండా పోతాము. మాపని సున్నా అవుతుంది. మా అందరిలోకీ శ్రేష్టుడివినువ్వే. ఈ మాట మేమందరం అంగీకరిస్తున్నాం. నువ్వు ఇక్కడే ఉండి మమ్మల్ని జీవింపచెయ్యి" అని వేడుకున్నాయి.

ఈ రకంగా ఇంద్రియాలన్నీ ప్రాణం లేకపోతే తమ ఉనికి లేదని ఒప్పుకున్నాయి. అందుకనే వాక్కు, చక్షువు, శ్రోత్రము, మనస్సు అనే పేర్లతో గాక, అవన్నీ ప్రాణవంతములైతేనే పనిచేస్తాయి. అందుకే అవన్నీ ప్రాణాలనే సంకేతంతో పిలువబడతాయి. అంటే ప్రాణం కాకుండా వాటికి స్వేచ్ఛ లేదు. అసలు ప్రాణమే ఇన్ని రూపాలుగా మారింది. అందుచేతనే ఇంద్రియాలన్నింటిలోకీ ప్రాణమే గొప్పది.

ఈ రకంగా ప్రాణం శరీరాన్ని విడిచిపోకుండా ఉండి మిగిలిన ఇంద్రియాలతో "మీ మాట ప్రకారము నేను ఇక్కడే ఉంటాను. మరి నాకు అన్నము ఏది ?" అని అడిగింది. "కుక్కలు, పిల్లులు, పక్షులు మొదలైన జీవ జంతువుల ఆహారమే నీకు ఆహారము" అన్నాయి. ఇది ఏవిధంగా అంటే శరీరంలో ముఖ్యమైన ప్రాణం వల్లనే మిగిలిన ఇంద్రియాలు పనిచేస్తున్నాయి. కాబట్టి అన్నింటి ఆహారము ప్రాణానికి ఆహారమవుతోంది. విరాట్ప్రాణానికి విరాట్ అన్నమే ఆహారము. ఈ విషయము తెలిసినవాడికి తినరానిది ఏదీ ఉండదు.

ప్రాణం మళ్ళీ అడిగింది" మరి నాకు ఆచ్ఛాదనకు వస్త్రం ఏదీ ?"దానికి ఇంద్రియాలు "జలమే నీకు ఆచ్ఛాదన" అన్నాయి. విద్వాంసులు భోజనానికి ముందు, తరువాత కుడా ప్రాణాన్ని జలంతో ఆచ్ఛాదిస్తున్నారు. భోజన సమయంలోచేసే ఆపోసనా, ఉత్తరాపోసనలే ప్రాణానికి వస్త్రం. ఈ విషయం తెలుసుకున్నవాడు వస్త్రాన్ని పొంది నగ్నత్వం లేనివాడవుతున్నాడు.

పూర్వకాలంలో సత్యకామజాబిలి ఈ విషయాన్ని వ్యాఘ్రపాదుని కుమారుడైన గోశ్రుతి అనేవాడికి చెప్పాడు. అంటూ ప్రాణవిజ్ఞానాన్ని ముగించాడు రత్నాకరుడు.

## 39. పంచాగ్ని విద్య (ఛాందోగ్యోపనిషత్తు - 14)

"శిష్యులారా ! పూర్వకాలంలో బ్రహ్మజ్ఞానాన్ని గురించి కొంత పరిజ్ఞానం క్షత్రియుల దగ్గర మాత్రమే ఉండేది. దాన్ని మొదటిసారిగా పాంచాల దేశాన్ని పాలించే ప్రవాహణుడు బ్రాహ్మణులకు చెప్పాడు. మీకు ఆ కథ వివరిస్తాను. వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

పూర్వకాలంలో పాంచాల దేశాన్ని ప్రవాహణుడు అనే రాజు పాలిస్తుండేవాడు. ఆరోజుల్లో ఒకసారి శ్వేతకేతువు అనే బ్రాహ్మణ బాలకుడు అమిత దర్పంతో రాజాస్థానంలో అడుగుపెట్టాడు. శ్వేతకేతువు విద్యావంతుడు, తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. అతనికి తెలిసింది ఎంతైనా, లోకంలోని విద్యనంతా అభ్యసించానని, విజ్ఞానమంతా తనసొంతమని అపోహ చెందాడు.

రాజాస్థానంలో ప్రవేశించే సమయానికి అక్కడ వేదాంత చర్చలు జరుగుతున్నాయి. పండితులంతా సభతీర్చారు. ప్రశ్నలు అడుగుతున్నారు. సమాధానాలు చెబుతున్నారు. యజ్ఞాయాగాదులు జరిగేటప్పుడు, ఉత్సవాలు, వేడుకల సందర్భంగా ఇలాంటి సభలు జరగటం ఆచారంగా ఉండేది. ఆ కారణంగానే ఇప్పుడుకూడా అధ్యాత్మిక చర్చలు జరుగుతున్నాయి.

శ్వేతకేతువు రాజాస్థానంలోకి ప్రవేశించాడు. ఆ సమయంలో రాజైన ప్రవాహణుడు అక్కడే ఉన్నాడు. లోపలికి వస్తున్న శ్వేతకేతును చూసి రాజు అడుగుతున్నాడు. "కుమారా! నీవు విద్యాభ్యాసం పూర్తి చేశావనుకుంటాను" "అవును మహారాజా ! మా తండ్రిగారి దగ్గరే చదువుంతా పూర్తిగా చేశాను" అన్నాడు శ్వేతకేతు. అతను చెప్పిన సమాధానంలో డాబు, దర్పము కనిపించినాయి. సర్వశాస్త్రపారంగతుణ్ణి అని గర్వం కుడా తొంగిచూసింది. దాంతో ప్రవాహణుడికి శ్వేతకేతువును పరీక్షించాలనిపించింది. ఇక ప్రశ్నించటం మొదలు పెట్టాడు.

"బ్రాహ్మణ బాలకా ! మనుష్యులు మరణించిన తరువాత ఎక్కడికి వెడతారు?"

"నాకు తెలియదు" అన్నాడు శ్వేతకేతు.

"మరణించిన తరువాత ఈ లోకానికి ఏ విధంగా తిరిగి వస్తారు?"

"నాకు తెలియదు"

'మృతి చెందినవారు ప్రయాణం చేసే దేవయాన, పితృయాన మార్గాలను వివరించు'

"నాకు తెలియదు".

"ప్రకృతి పరిణామక్రమంలో పురుషుడిగా ఆకారం దాల్చే ఉదంతము ఏది?"

నాకు తెలియదు"

"శ్వేతకేతూ ! ఇన్ని ప్రశ్నలు అడిగాను. ఏ ఒక్కదానికీ సమాధానం చెప్పలేదు. కాని విద్యాభ్యాసం మాత్రం పూర్తయిందని చెప్పావు. దీన్నిబట్టి చూస్తే ముఖ్యమైన విషయాలను గురించిన పరిజ్ఞానం నీకు శూన్యమనిపిస్తోంది". అన్నాడు రాజు.

ఆ మాటలకు సిగ్గుపడ్డాడు శ్వేతకేతువు-విద్యాభ్యాసం పూర్తయిందని ఇంత వరకు అనుకున్నది భ్రమ అని తెలిసిపోయింది. సరాసరి తండ్రి వద్దకు వచ్చి నాన్నగారూ ! నేను నేర్చుకోవలసిన విద్య అంతా పూర్తయిపోయింది అని చెప్పారు. అది నిజమే అని నేను కుడా అనుకున్నాను. కాని పాంచాల దేశాధీశుడు ఐదు ప్రశ్నలడిగితే ఒక్క దానికి కుడా సమాధానం చెప్పలేక తెల్లమొగం వేశాను. విద్యాభ్యాసం పూర్తయిందని మీరు ఎందుకు చెప్పారో నాకు అర్థం కావటం లేదు" అన్నాడు. తనకు సభలో ఎదురైన పరిస్థితినంతా వివరించాడు.

రాజుకు శ్వేతకేతువుకు జరిగిన సంభాషణ అంతా విన్నటువంటివాడై 'నాయనా ! మహారాజు వేసిన ప్రశ్నలకు సమాధానం నాక్కూడా తెలియదు. తెలిస్తే నీకెందుకు చెప్పను?' అన్నాడు శ్వేతకేతు తండ్రి అయిన అరుణుడు.

ఆ తరువాత కుమారునితోపాటుగా రాజు అడిగిన విషయాలను గురించి తెలుసుకోవాలనిపించింది అరుణునికి. తండ్రి కొడుకులిద్దరూ పాంచాలదేశానికి బయలుదేరారు. రాజప్రాసాదం చేరుకుని, రాజదర్శనం కోసం నిరీక్షిస్తూ అక్కడే ఉన్నారు. ఆ మరునాడు రాజదర్శనం లభించింది. వినయ విధేయతలతో రాజకు నమస్కరించారు.

పాంచాల దేశాధీశుడైన ప్రవాహణుడు శ్వేతకేతువును, అతని తండ్రి అరుణుని సగౌరవంగా ఆదరించి "బ్రాహ్మణోత్తమా ! ఏమాశించి నావద్దకు వచ్చారు ? ధనరాసులు కావాలా ? సంపదకావాలా ? మీకు ఏంకావాలో చెప్పండి." అన్నాడు.

ఆ మాటలు విన్న అరుణి "మహారాజా ! నీ ధనం కోసం గాని, గోధనం కోసం గాని ఇక్కడకు రాలేదు. నీవద్దనున్న జ్ఞానధనం కోసం వచ్చాను. అదే నీవు నాకు చేయవలసిన దానం. నా కుమారుణ్ణి అడిగిన ప్రశ్నలేవో నాతో చర్చించి సమాధానాలు చెప్పి నా సందేహాలు తీర్చు. నాకు జ్ఞానాన్ని ప్రసాదించు. అదే నేను కోరేది" అన్నాడు.

బ్రాహ్మణుడి మాటలకు చాలా ఆనందించి మహారాజు వారిని "కొంత కాలం మీరిక్కడే ఉండండి" అని అభ్యర్థించాడు. రాజుకోరిక మేరకు తండ్రీ కొడుకులు కొంత కాలం రాజాస్థానంలోనే ఉన్నారు.

ఒకరోజు మహారాజు తండ్రీకుమారుల వద్దకు వచ్చి "బ్రాహ్మణ శ్రేష్ఠులారా ! ఇంతవరకు ఈ జ్ఞానం సంప్రదాయ సిద్ధంగా క్షత్రియుల దగ్గరే పరంపరగా ఉంటూ వచ్చింది. మొట్టమొదటిసారిగా బ్రాహ్మణులైన మీకు వివరిస్తున్నాను" అంటూ ప్రారంభించాడు.

బ్రాహ్మణ వరేణ్యా ! నీ కుమారుణ్ణి అడిగిన ఆఖరు ప్రశ్నకు ముందుగా సమాధానం చెబుతాను. యజ్ఞాలు ఐదు రకాలు. యజ్ఞ విధానం ఈ విధంగా ఉంటుంది. స్వర్గమే అగ్ని. ఆ యజ్ఞానికి హవిస్సు సూర్యుడు. యజ్ఞ ఫలం జీవన ప్రదాత్రి అయిన సోమరసం. ఈ సోమరసం మేఘాల వరకు ప్రయాణిస్తుంది. మేఘాల ద్వారా భూలోకంలో వర్షిస్తుంది. దానివల్ల అన్నం ఉత్పత్తి అవుతుంది. అన్నం మానవుడికి లభిస్తుంది. అది అతనిలో రేతస్సుగా మారుతుంది. ఆ శక్తి స్త్రీలో ప్రవేశిస్తుంది. అప్పుడామె గర్భం దాలుస్తుంది. బిడ్డను ప్రసవిస్తుంది. ఈ రకంగా ఐదు యజ్ఞాల దశలు దాటి ప్రాణం పొందు ఆ యజ్ఞఫలమైన సోమరసం పురుషుడుగా మారుతుంది.

ఉద్దాలక అరుణీ! ఇప్పుడు మిగిలిన నాలుగు ప్రశ్నలకు సమాధానం చెబుతాను విను. మానవుడు నాలుగు భూతాల సమ్మిశ్ర స్వరూపుడు. అతడు మరణించిన తరువాత ఆ నాలుగు భూతాలు ఆయా భూతాలలో కలిసిపోతాయి. మానవుని యోగ్యత అనేది అతడు చేసిన కర్మల మీద ఆధారపడి ఉంటుంది. అతడు గనక ఆత్మానుభవం పొందితే వెలుగు బాటలో ప్రయాణం చేస్తాడు. అదే దేవయానము. ఆ బాటలో ప్రయాణం చేసి పుణ్యఫలాన్ని అనుభవించి మోక్షాన్ని పొందుతాడు. ఇట్టి మానవుడికి పునర్జన్మ ఉండదు. అతడికి శాశ్వతమైన ఆనందం లభిస్తుంది.

అలా కాకుండా ఐహికమైన కోరికలు తీర్చుకోటానికే జీవిస్తూ పుణ్యకర్మలను ఆచరిస్తూ జీవనయానం సాగిస్తే పితృయానం గుండా స్వర్గానికి చేరతాడు. అక్కడ అతని పుణ్యఫలం పూర్తిగా అనుభవించి మళ్ళీ ఈ లోకంలో జన్మిస్తాడు.

మానవుడు తన జీవిత రహస్యాన్ని తెలుసుకోలేక పాపాలు చేస్తుంటాడు. త్రాగుడు, జూదము, వ్యభిచారము, దొంగతనము మొదలైన పనులు చేస్తాడు. అటువంటివాడు అటు అమృతత్వాన్ని, ఇటు స్వర్గాన్నీ కుడా పోగొట్టుకుంటాడు. ఇటువంటివారు నీచమైన జన్మలు ఎత్తుతారు.

కొంత మంది అతిప్రయత్నము మీద బ్రహ్మలోకాన్ని పొందుతారు. బ్రహ్మలోకం పొందినవారికి పునర్జన్మలేదు-అయితే ఎక్కువమంది పుణ్యకార్యాలు చేసి స్వర్గము పొందుతారు. ఎంతమంది అక్కడికి చేరినా స్వర్గము మాత్రం క్రిక్కిరిసిపోదు.

సంస్కారవంతులు, సదాచార సంపన్నులు ఉత్తమ యోనిని పొందుతారు. అంటే బ్రహ్మ క్షత్రియ వైశ్యాది యోనులు పొందుతారు. సంస్కారహీనులు కుక్కలుగా, పందులుగా, ఛండాలురుగా నీచయోనులందు జన్మిస్తారు. పాపాత్ములు పైన చెప్పిన అర్చిరాది రెండు మార్గాలలోనూ పోరు. వారు శీఘ్రంగా పుడుతూ చస్తూ ఉంటారు. వీరిది మూడవ మార్గం. అందుకనే ఇన్ని జీవులు నిత్యం చస్తున్నా స్వర్గము మొదలైన పరలోకాలు నిండవు. చచ్చిన వారంతా అక్కడికి పోరు. మరణకాలంలో కుడా పాపాత్ములు నీచమైన చావు చస్తారు. అటువంటి వారి జీవితాన్ని అందరూ అసహ్యించుకుంటారు.

బ్రాహ్మణుల బంగారం దొంగిలించేవారు, బ్రాహ్మణుడై పుట్టి మదిరపానం చేసేవాడు, గురుపత్నీ సంగమము చేసేవాడు, బ్రహ్మహత్య చేసేవాడు ఈనలుగురూ పతితులు. వీరితో సహవాసం చేసేవాడు కుడా పతితుడే. ఇంతకన్నా నీచపు పనులు చేసేవారు క్రిమికీటకాలుగా జన్మిస్తారు.

శిష్యులారా ! ప్రవాహణుడు చెప్పిన ఈవిద్యను పంచాగ్ని విద్య' అంటారు. ఈ విద్యను తెలుసుకున్నవాడు పైన చెప్పిన పతితులతో సహవాసము చేసినప్పటికీ అతడికి ఆపాపము అంటదు. అని చెబుతూ పంచాగ్నివిద్యను పూర్తి చేశాడు రత్నాకరుడు.

## 40 వైశ్వానరాత్మ (ఛాందోగ్యోపనిషత్తు-15)

"ప్రియశిష్యులరా ! వైశ్వానర విద్య గ్రహించకుండా చేసిన హోమం అంతా బూడిదలో పోసిన ఆజ్యమవుతుందే కాని ఉపయోగం ఉండదు. దీనికి ఉదాహరణగా ఒక కథ చెబుతాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

పూర్వకాలంలో ఉపమన్యుని కుమారుడు - ప్రాచీనశీలుడు, పులుషుని కుమారుడు సత్యయజ్ఞుడు, భల్లవుని కుమారుడు ఇంద్రద్యుమ్నుడు, శర్కరాక్షుని కుమారుడు జనుడు, అశ్వతరాశ్యుని కుమారుడు బుడిలుడు. వీరైదు గురుమంచి మిత్రులు, సదాచార సంపన్నులు, ఉత్తమ గృహస్థులు, పరమశ్రోత్రీయులు . ఒక రోజున వీరంతా ఒకచోట చేరి 'ఆత్మ అంటే ఏమిటి ? బ్రహ్మతత్త్వం అంటే ఏమిటి ?' అని చర్చ సాగించారు. ఆ అంశం ఎంతకీ తేలలేదు. ఆ రోజుల్లో అరుణమహర్షి కుమారుడు ఉద్దాలకుడికి ఈ విషయాలు తెలుసునని ప్రతీతి. అందుచేత వీరందరూ అతని వద్దకు వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. అనుకున్నదే తడవుగా ఉద్దాలకుడి దగ్గరకు బయలుదేరివెళ్ళి ఆయనకు నమస్కరించి వైశ్వానరాత్మను గూర్చి ఉపదేశం చెయ్యమని వేడుకున్నారు. ఆ విషయం విన్న ఉద్దాలకుడు "వీరంతా వైశ్వానరాత్మను గురించి తెలుసుకోవటానికి నా దగ్గరకు వచ్చారు. కాని వీరి అనుమానాలు తీర్చేశక్తి సామర్థ్యాలు నాకులేవు. వీరి సందేహాలు నేను తీర్చలేక పోయినా, వీరికి వైశ్వానరాత్మను గరించి వివరించగల మంచి గురువును చూపవలసిన బాధ్యత నాకున్నది. అని ఆలోచించినవాడై వారితో "ఆత్మ స్వరూపులారా ! వైశ్వానరాత్మను గురించి క్షుణ్ణంగా తెలిసినవాడు అశ్వపతిమహారాజు. ఆయన కేకయదేశపురాజు. మీతోపాటు నేను కుడా వస్తాను. మనమంతా అతని వద్దకుపోయి సందేహ నివృత్తి చేసుకుందాం" అన్నాడు. వారందరూ కలిసి కేకయదేశం బయలుదేరారు.

అశ్వపతి మహారాజు వీరందరినీ సాదరంగా ఆహ్వానించి అందరినీ సత్కరించాడు. మరునాడు ఉదయం వారిని పిలిచి "బ్రాహ్మణులారా ! నా రాజ్యంలో దొంగలులేరు. ధనముండి దాన ధర్మాలు చెయ్యని వారు లేరు. మద్యం త్రాగి అల్లరి చేసే త్రాగుబోతులూ లేరు. అగ్నిహోత్ర విధులు నిర్వహించని బ్రహ్మచారులుగాని, గృహస్థులు గాని లేనేలేరు. అందరూ విద్యాంసులే. రాజ్యమంతా ఎన్నిసార్లు వెదికినా విద్వాంసుడు కానివాడంటూ దొరకడు. ఇప్పుడు నేను యజ్ఞం నిర్వహిస్తున్నాను. అందులో ఋత్విక్కులకిచ్చే దక్షిణలే మీక్కూడా ఇస్తాను. ఇక్కడే ఉండి మీరుకూడా యజ్ఞంలో పాల్గొనండి" అన్నాడు.

ఆ మాటలకు బ్రాహ్మణులు రాజు చెప్పిన దానికి ఒప్పుకుని "రాజా ! వైశ్వానరాత్మను గురించి తెలుసుకోవటానికి నీ దగ్గరకు వచ్చాము. అది తెలుసుకోకుండా ఇక్కడ నుంచి వెళ్ళము" అన్నారు.

ఆ మాటలకు అశ్వపతి మహారాజు సంతోషించాడు. వారి అధ్యాత్మిక జిజ్ఞాసను కొనియాడాడు. తరువాత రేపుఉదయాన్నే ఈ విషయం గురించి చర్చిద్దాం విశ్రాంతి తీసుకోండి" అన్నాడు.

మరునాడు తెల్లవారకుండానే వారి పనులు ముగించుకుని, చేత సమిధలు పట్టుకుని వినయంగా రాజు వద్దకు వెళ్ళారు.

అప్పుడు రాజు ఔపమన్యుని కుమారుడైన ప్రాచీన శీలుణ్ణి పిలిచి "నీవు వైశ్వానరాత్మను ఏవిధంగా ఉపాసన చేస్తున్నావు?" అన్నాడు.

"రాజా ! నేను ద్యులోకాన్ని వైశ్వానరాత్మగా భావించి ఉపాసన చేస్తున్నాను" అన్నాడు ప్రాచీనశీలుడు. దానికి అశ్వపతి మహారాజు" నువు ఉపాసించేది "సుతేజ" అనే పేరుతో ప్రసిద్ధి చెందిన వైశ్వానరాత్మ. ఈ ఉపాసన వల్ల నీ కులంవారు తరతరాలుగా కర్మ నిష్టపరతంత్రులౌతారు. సుతేజమనే ఈ ఆత్మ వైశ్వానరాత్మలో నాల్గవ భాగం మాత్రమే. అది వైశ్వానరాత్మకు శిరోభాగమువంటిది. నువు ఈ కొంచెం భాగాన్నే మొత్తము అనుకొని ఉపాసన చేస్తే నీ తలతెగి క్రింద పడిపోతుంది. నువు ఇక్కడికి వచ్చి ఈ విషయం తెలుసుకోవటం మంచిదయింది" అన్నాడు. తరువాత రాజు అదే ప్రశ్న సత్యయజ్ఞుని అడిగాడు.

"నేను వైశ్వానరాత్మను ఆదిత్యరూపంలో ఉపాసిస్తాను" అన్నాడు సత్యయజ్ఞుడు. దానికి రాజు ఈ విధంగా చెప్పాడు. సత్యయజ్ఞా! నువ్వు ఉపాసించేది నిశ్చయంగా వైశ్వానరాత్మే. ఈ ఉపాసనవల్ల నీ వంశంలో చాలా మందికి విశ్వరూప సాధన చాలా తేలికగా వీలవుతుంది. నువు ఉపాసించే ఆదిత్యుడు వైశ్వానరాత్మకు నేత్రం. వైశ్వానరాత్మలో అది నాల్గవ భాగం మాత్రమే. ఈ విషయం తెలియకుండా ఉపాసన చేసే సాధకుడు అంధుడవుతాడు". తరువాత అశ్వపతి జనుణ్ణి కుడా పై ప్రశ్నే అడిగాడు. దానికి జనుడు "నేను ఆకాశాన్ని వైశ్యానరాత్మగా ఉపాసిస్తాను" అన్నాడు.

ఆమాటలు విన్న మహారాజు "నువు ఉపాసించే ఆకాశము వైశ్వానరాత్మ యొక్క మధ్యభాగము. దీన్ని ఉపాసించటం వల్లనే నీవశంలోనివారు అంతులేని ధనాన్ని పొందుతారు. ప్రియమైన వస్తుదర్శనం చేసుకుంటారు. కాని ఇది వైశ్వానరాత్మలో ఒక భాగమని తెలియకుండా గనక ఉపాసనచేస్తే సాధకుని మధ్యభాగం నాశనమైపోతుంది." అన్నాడు.

ఆ తరువాత బుడిలుడిని అదే ప్రశ్న అడిగారు. దానికి బుడిలుడు "రాజా! నేను జలాన్ని వైశ్వానరాత్మగా భావిస్తున్నాను" అన్నాడు. ఆ మాటలు విన్నరాజు "నువ్వు ఉపాసించేది ధనసంజ్ఞగల వైశ్వానరాత్మ. దీన్ని ఉపాసించినవారు ధనవంతులవుతారు. బ్రహ్మతేజస్సు పొందుతారు. కాని ఇదే వైశ్వానరాత్మ పూర్తిరూపమని ఉపాసనచేస్తే, సాధకుని మూత్రకోశం బద్దలైపోతుంది" అన్నాడు.

తరువాత గౌతముణ్ణి "నువ్వు ఆ ఏ ఆత్మను ఉపాసన చేస్తావు?" అని అడిగాడు. దానికి గౌతముడు "రాజా ! నేను పృధివిని వైశ్వానరాత్మగా ఉపాసిస్తాను" అన్నాడు. ఆ మాటలువిన్నరాజు ఈ విధంగా అన్నాడు. "కుమారా ! నీవుపాసించే భూమి వైశ్వానరాత్మకు పాదాలు. అంతేకాని అదే పూర్ణరూపంకాదు. దీని ఉపాసనవల్ల సంతానము, పశుసంపద కలుగుతాయి. కాని ఇదే పరిపూర్ణమని ఉపాసన చేసినవాడి పాదాలు శిధిలమైపోతాయి"

ఓ బ్రాహ్మణ కుమారులారా ! సంపూర్ణ వైశ్వానరాత్మను నేనే అని భావించేవాడు వైశ్వానరావేత్త అయి అనభక్షణ చేస్తాడు. అంటే సమస్త లోకాల్లోనూ, ప్రాణాల్లోనూ, ఆత్మల్లోనూ తానే ఉండి అన్నీ భక్షణ చేస్తాడు. ఆ వైశ్వానరునికి శిరస్సు - ద్యులోకం; నేత్రాలు - ఆదిత్యుడు; ప్రాణం - వాయువు; శరీరమధ్యభాగం - ఆకాశం; మూత్రకోశం - జలం; పాదాలు - పృధివి. వక్ష స్థలమే - వేదిక; రోమాలు - దర్భలు, హృదయం - గార్హపత్యాగ్ని, మనస్సు - దక్షిణాగ్ని, నోరు - ఆవాహనీయాగ్ని.

ఈ సిద్ధాంతం ప్రకారం వైశ్వానరోపాసకుడు భోజనసమయంలో ముందుగా వడ్డించిన అన్నాన్ని హవనం చెయ్యాలి. ప్రాణాహుతులివ్వాలి. మొదటి ఆహుతి ప్రాణాయస్వాహా అంటే ప్రాణం తృప్తి పొందుతుంది. దీని వల్ల నేత్రము, ఆదిత్యుడు, ద్యులోకము, దేవతలు తృప్తి పొందుతారు. అందువల్ల భోక్తసంతానము, పశువులు, తేజస్సు, బ్రహ్మవర్చస్సు పొందుతారు.

రెండవ ప్రాణాహుతి 'వ్యానాయ స్వాహ'. దీని వల్ల వ్యాన వాయువు తృప్తి పొందుతుంది. దీనివల్ల శ్రోత్రము, చంద్రుడు, దిక్కులు, దిక్కులకు అధిష్ఠాన దేవతలు తృప్తి పొందుతారు. అందువల్ల భోక్త సంతానము, పశువులు, శరీర తేజస్సు, బ్రహ్మవర్చస్సు పొందుతాడు.

మూడవ ఆహుతి 'అపానాయస్వాహా!' దీనివల్ల అపానవాయువు తృప్తి పొందుతుంది. దీనివల్ల అగ్ని, పృథివి, పృథివికి అధిష్ఠాన దేవతలు తృప్తి పొందుతారు. భోక్తకు సంతానము, పశువులు, తేజస్సు, బ్రహ్మవర్చస్సు లభిస్తాయి.

నాల్గవ ఆహుతి 'సమానాయ స్వాహ'. దీనివల్ల సమాన వాయువు తృప్తి పొందుతుంది. దానివల్ల మనస్సు, పర్జన్యుడు, విద్యుత్తు, వీరి అధిష్ఠాన దేవతలు తృప్తి చెందుతారు. భోక్తకు ఇందాకటి ఫలమే వస్తుంది.

ఐదవ ఆహుతి 'ఉదానాయస్వాహా' దీనివల్ల ఉదాన వాయువు తృప్తి చెందుతుంది. దాని వలన చర్మము, వాయువు, ఆకాశము, వాటి అధిష్ఠాన దేవతలు తృప్తి చెందుతారు. సాధకుడికి ఇందాకటి ఫలమే వస్తుంది.

వైశ్వానర విద్యను తెలుసుకోకుండా అగ్నిహోత్రం చేస్తే, నిప్పులేని బూడిదలో ఆజ్యం పోసినట్లు అదంతా వ్యర్థమే. ఈ విద్యను తెలుసుకుని అగ్నికార్యం చేసేవాడి పాపాలన్నీ క్షణంలో కాలి బూడిద అయిపోతాయి." ఈవిధంగా అశ్వపతి మహారాజు వైశ్వానరాత్మను గురించి జిజ్ఞాసులకు వివరించాడని చెబుతూ ఐదవ అధ్యాయం ముగించాడు రత్నాకరుడు.



## 41. ఆత్మజ్ఞానం (ఛాందోగ్యోపనిషత్తు -16)

"ప్రియశిష్యులారా ! ఆత్మ అంటే ఎక్కడో లేదు. నీలోనే ఉన్నది. నీ తత్త్వమే ఆత్మ. ఈ విషయాన్ని ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు వివరించాడు. దానిని మీకు నేను చెబుతాను వినండి" అంటూ ఆరవ అధ్యాయాన్ని ప్రారంభించాడు రత్నాకరుడు.

ఉద్దాలక అరుణి మహర్షి కుమారుడు శ్వేతకేతువు. కుమారుడికి పన్నెండు సంవత్సరాలు నిండగానే తండ్రి అతణ్ణి పిలిచి "నాయనా శ్వేతకేతూ ! గురుకుల ఆశ్రమానికి వెళ్ళి బ్రహ్మచర్య దీక్షతో అక్కడ నివసించు. మనవంశంలో పుట్టినవారెవరూ బ్రహ్మజ్ఞానం లేనివారు కాదు. కాబట్టి నువుకూడా వెళ్ళి విద్యావంతుడవుకా" అన్నాడు.

తండ్రి మాటమీద పన్నెండు సంవత్సరాల పాటు గురుకులంలో ఉండి వేదాధ్యయనం చేసి, వేదానికి అర్థం తెలుసుకున్నాడు. అయితే సర్వంతనకే తెలుసుననే అహంకారంతో, గర్వంతో, దర్పంతో ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ విధంగా దుడుకు స్వభావంతో వచ్చిన కుమారుని అవివేకాన్ని, ఆత్మవంచనను, గుర్తించినవాడై ఉద్దాలకుడు "నాయనా శ్వేతకేతూ! శ్రవణ గోచరం కాని తత్త్వం ఇంద్రియ గోచరమయ్యే విధానము గురించి మీ గురువుగారిని ఎప్పుడైనా అడిగావా ?" అన్నాడు.

"ఏమిటా విషయం?" అన్నాడు శ్వేతకేతు, "నాయనా ! మట్టిని గురించి తెలిస్తే మట్టితో చేసేవివిధ రకాల వస్తువులకు పేర్లలో తేడా ఉన్నా వాటిని గురించి తెలుస్తుంది. బంగారం గురించి క్షుణ్ణంగా తెలిస్తే దానితో తయారు చేసిన నగలకు ఏ పేరుపెట్టినా వాటిలో ఉన్నది బంగారమే అని తెలుస్తుంది.

అలాగే ఏ విషయం తెలుసుకున్నందువల్ల అన్ని విషయాలు మనకు బోధపడతాయో దానిని గురించి తెలుసుకోవాలి. ప్రతి విషయంలోనూ అంతర్గతంగా ఉండే తత్త్వం ఏదో తెలుసుకున్నావనుకో అప్పుడు మిగిలినదంతా పదాలగారడీ అని తెలుస్తుంది" అన్నాడు ఉద్దాలకుడు. దానికి శ్వేతకేతువు "నాన్నగారూ! మీరు చెప్పిన విషయాలు మా గురువర్యులకు తెలియదనుకుంటాను. ఒకవేళ వారికి తెలిస్తే తప్పకుండా నాకు చెప్పేవారే. కాబట్టి పరమోత్కృష్టమైన ఆ విద్యను మీరే నాకు బోధించి నన్ను కృతార్థుణ్ణి చెయ్యండి" అన్నాడు.

"సరే ! నీకా తత్త్వాన్ని చెబుతాను. వినవలసినది" అంటూ ప్రారంభించాడు ఉద్దాలకుడు.

"శ్వేతకేతూ ! సృష్టికి పూర్వం ఈ ప్రపంచం నామరూపాలతో కూడిలేదు. అప్పుడు కేవలం అద్వితీయమైన 'సత్తు' మాత్రమే ఉండేది. నామరూపాలు, పదార్థాలు ఏవీలేవు.సత్తు అంటే - ఉనికి, సత్యం అని అర్థం. అసత్తు అంటే లేనిది, అసత్యం అని అర్థం. అన్నింటి కన్నా పూర్వమైనది, రెండుకానిది, మొదటగా ఉన్నది ఏకైకమై పరబ్రహ్మ ఆ తత్వం అనేకం కావాలనుకుంది. రకరకాల రూపాలతో వస్తువులుగా, జీవులుగా రూపుదాల్చింది. ద్రవ, ఘన, వాయు పదార్థాలుగా మార్పుచెంది అనేక రూపాలతో సృష్టి ఆకారం పొందింది. ఈ రకంగా మొదటగా ఉన్న పరబ్రహ్మలో నుంచే ఇవన్నీ వచ్చినాయి.

స్థావర జంగమాత్మకమైన జీవులన్నీ పుట్టుకరీత్యా అనేక విధాలుగా ఉన్నాయి.

1. అండజములు - గ్రుడ్డు నుండి పుట్టేవి (పక్షులు, పాములు)
2. జీవజములు - జీవుల వల్లపుట్టేవి (మనుష్యులు, పశువులు)
3. ఉద్భిజములు - విత్తనాల వల్ల భూమి నుంచి పుట్టేవి. (చెట్లు, చేమలు)
4. స్వేదజములు - చెమట వల్ల పుట్టేవి.
5. ఊష్మజాలు - వెచ్చదనం వల్ల పుట్టేవి. (క్రిమికీటకాలు)

జీవరాశులను చెప్పేటప్పుడు పై మూడు రకాలు మాత్రమే చెప్పాలి. అవే ముఖ్యమైనవి.

తాను అనేకం కావాలనుకున్న 'సత్తు' ముందుగా అగ్నిని సృష్టించింది. అగ్ని నుండి జలము, జలమునుండి భూమి ఉద్భవించాయి. వీటివల్లనే అన్నం పుట్టింది. అప్పుడు సత్తు అగ్ని జలము అన్నములలో ప్రవేశించాలనుకుంది అంటే ఈ మూడింటిలోనూ వ్యక్తమయి అనేక రూపాలు పొందింది.

ఆ మాటలువిన్న శ్వేతకేతు "నాన్నగారూ ! మీరు చెప్పిన విషయం చాలా బాగుంది. కాని చిన్న అనుమానం. నిద్రపోతున్నప్పుడు మనిషి ఎక్కడికిపోతాడు?" అన్నాడు.

"నాయనా ! నిద్రపోతున్నప్పుడు మనిషి తాత్కాలికంగా ఆత్మతో తాదాత్మ్యం చెందుతాడు. తేనెటీగలు తోటంతా మంకరందాన్ని స్వీకరించి తేనెగా తయారు చేస్తాయి. ఈ తేనె ఆ పువ్వుల నుండి స్వీకరించినదే. కాని ఏ చుక్క ఏ పూవునుండి తీసిందో మాత్రం

చెప్పలేము. అలాగే జీవరాశులు విడివిడిగా ఉన్నప్పటికీ ఆత్మలోనే లీనమై ఉంటాయి. అది నిద్ర సమయం లేదా మరణం ఏదైనా కావచ్చు. గాఢనిద్రలో గతం తెలియదు. వర్తమానం అసలే తెలియదు. అంతా అజ్ఞానం. అందువల్ల యదార్థమనేది తెలియదు. యదార్థాన్ని గుర్తించటం కష్టం.

మానవుడు నిద్రించేప్పుడు ఆత్మలో తాత్కాలికంగా లీనమౌతాడు. మరణకాలంలో వాక్కు మనస్సులో లీనమవుతుంది. మనస్సు ప్రాణంలో లీనమవుతుంది. ప్రాణం తేజస్సులో కలిసిపోతుంది. చివరకు అది పరమశక్తిలో కలిసిపోతుంది. ఆశక్తి అతి సూక్ష్మమైనది. కాని విశ్వమంతా వ్యాపించిఉంది. అదే సత్యం. అదే నిత్యం.అదే ఆత్మ. అదే నీవు 'తత్త్వమసి'.

జీవి అనేది ఏ రూపంలో ఉన్నప్పటికీ అంటే పులి, సింహము, మనిషి, ఏదైనాకాని అనంత చైతన్య సముద్రంలో కలిసిపోయిన తరువాత తనరూపాన్ని పోగొట్టుకుంటుంది. జీవులు వాటి రూపాలు, నామాలు పోగొట్టుకుంటాయి. అవి అన్నీ ఏతత్త్వంలో కలసిపోతాయో అదే బ్రహ్మ. అది అద్వితీయమైనది. సూక్ష్మమైనది. సర్వవ్యాపకమైనది. అదే నీవు. శ్వేతకేతూ! అదేనీవు.

నదులు తూర్పు నుంచి పడమరకు ప్రవహించినా, పడమర నుంచి తూర్పుకు ప్రవహించినా అన్నీ సముద్రంలోనే కలుస్తాయి. నీరు ఒక సముద్రంలోంచి ఇంకో సముద్రంలోకి చేరుతుంది. సూర్యరశ్మికి నీరు ఆవిరి అయి మేఘంగా మారుతుంది. ఆ మేఘాలు వర్షించి జలాన్నిస్తాయి. ఆ జలం కొండలమీదనుంచి ప్రవహించి నదుల్లో కలుస్తుంది. ఆ నదులన్నీ చాలా దూరం ప్రవహించి సముద్రాల్లో కలుస్తాయి. సముద్రంలో కలిసే వరకూ గంగ, గోదావరి, కృష్ణ అని రకరకాల పేర్లతో ఆ నదులను పిలుస్తారు. కాని అవి సముద్రంలో కలిసిన తరువాత ఏ నీరు ఏ నదిదో తెలియదుకదా ! అలాగే విడివిడిగా రకరకాలుగా ఉండే ఈ జీవరాశులు పరబ్రహ్మలో కలిసిపోయినప్పుడు వాటిని విడదీయటం కష్టం. జీవాత్మలన్నీ పరమాత్మలోని భాగాలే.

"నాయనా శ్వేతకేతూ ఒక మర్రి పండును తీసుకునిరా !". అన్నాడు ఉద్దాలకుడు.

మర్రిపండు తెచ్చాడు శ్వేతకేతు.

"దాన్ని పగులకొట్టు" అన్నాడు తండ్రి

పగులకొట్టాడు కుమారుడు.

"అక్కడ ఏం కనిపిస్తోంది?" అడిగాడు తండ్రి.

"చిన్న చిన్న గింజలు కనిపిస్తున్నాయి".

"ఒక గింజను తీసుకుని పగులకొట్టు"

గింజను పగులకొట్టాడు శ్వేతకేతు.

"ఏముందక్కడ?" ప్రశ్నించాడు ఉద్దాలకుడు.

"ఏమీ కనిపించటం లేదు" అన్నాడు శ్వేతకేతు.

ఇంత పెద్ద మర్రి చెట్టు శూన్యంలో నుండిరాదు కదా. ఆ గింజలో ఏమి లేదని చెప్పావు. కాని అందులో ఇంతపెద్ద మ్రాను, కొమ్మలు, రెమ్మలతో ఉన్న ఈ చెట్టుకు కారణమైన, నీకు కనిపించని జీవమున్నదన్నమాట. అదే విధంగా బయటకు కనిపించకుండా సూక్ష్మాతి సూక్ష్మంగా ఉన్న ఆత్మ సర్వత్రా వ్యాపించిఉంది. అన్నింటికీ ఆధారమైనది ఉండికుడా మనకంటికి కనిపించదు. నీకు ఒక్క విషయం చెబుతావిను. "కొస్త ఉప్పు తీసుకొని దాన్ని నీళ్ళలో కలుపు,రేపు ఉదయం మళ్ళీరా అన్నాడు ఉద్దాలకుడు. తండ్రి ఆజ్ఞప్రకారం నీళ్ళలో ఉప్పుకలిపాడు శ్వేతకేతు. అది పూర్తిగా కలిసిపోయింది. మర్నాడు ఉద్దాలకుడు అన్నాడు.

"శ్వేతకేతూ ! నిన్న నీళ్ళలో కలిపిన ఉప్పును తీసుకునిరా !" ఆ ఉప్పు నీళ్ళలో బాగా కలిసిపోయింది. అందుచేత విడదీయటానికి వీలులేదు. అదేమాట చెప్పాడు శ్వేతకేతు.

"అయితే సరే. ఆ నీళ్ళను ఒకసారి రుచిచూడు". అన్నాడు ఉద్దాలకుడు.

"తండ్రీ ! ఆ నీళ్ళు చాలా ఉప్పగా ఉన్నాయి." అన్నాడు శ్వేతకేతువు.

"కుమారా ! ఇది విను. ఉప్పునీళ్ళలో కలిసిపోయినట్లు ఆత్మ అన్ని వస్తువులలోనూ కలిసిపోయి ఉంటుంది. ఆ ఆత్మయే నీవు."

ఆత్మని గురించి తండ్రి చెప్పినమాటలు పూర్తిగా అర్థం చేసుకున్నవాడై కుమారుడు తండ్రిని అడుగుతున్నాడు. "తండ్రీ ! ఆత్మానుభవంపొందే మార్గం నాకు వివరించండి" మీరు చెప్పే విషయాలు వినటానికి తేలికగానే ఉన్నాయి. కాని అర్థం చేసుకోవటం, అనుభవంలోకి తేవటం మాత్రం చాలా కష్టం. దీని అనుభవం పొందటం ఎలా?" అని అడిగాడు శ్వేతకేతువు.

"శ్వేతకేతూ! ఆత్మజ్ఞానం పొందటం ఎలాగో చెబుతాను విను. ఒక మనిషి కళ్ళకు గంతలు, చేతులుకట్టి గుర్తు తెలియని అరణ్యం మధ్యలో అతన్ని వదలి వేశామనుకో. అప్పుడతడేం చేస్తాడు. అతడికి దారి తెలియదు. దిక్కు తెలియదు. తననెవరో బంధించారు. కళ్ళు కనిపించటం లేదు. ఆగంతలు విప్పుకోటానికి చేతులు లేవు. అవికుడా కట్టేశారు. ఇప్పుడు అతడు భయపడతాడు. దారి తెన్నూ లేకుండా తిరుగుతాడు. రక్షించండి అని అరుస్తాడు. భయంతో ఏడుస్తాడు. అప్పుడు ఎవరోవచ్చికట్లు ఊడదీస్తారు. అతడికి కళ్ళు కనిపిస్తాయి. త్రోవతెలుస్తుంది. కనిపించిన వాళ్ళందరినీ తనింటికి దారి అడుగుతూ, వెతుక్కుంటూ ఇల్లు చేరతాడు. అదే విధంగా అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్న మానవుడు తన లక్ష్యమైన అధ్యాత్మిక సౌధంకోసం ప్రయత్నించి చేరుకోవాలి, జిజ్ఞాసతో మనం వేసే ప్రతి అడుగుకూ గమ్యం ఆత్మయే. ఆ ఆత్మయే నీవు. శ్వేతకేతూ నీవే ఆత్మ. 'తత్త్వమసి'.

ఆత్మ అంటే ఎంతో దూరంలో అందని ఆకాశంలో లేదు. అది నీలోనే ఉంది. నీతత్త్వమే ఆత్మతత్త్వం. నిన్ను నీవు తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం". అంటూ ఉద్దాలకుడు ఆత్మజ్ఞానాన్ని తన కుమారుడైన శ్వేతకేతువుకు వివరించాడని చెప్పి రత్నాకరుడు తన శిష్యులకు వివరించాడు.



# 42. షోడశ కళాప్రపూర్ణుడు (ఛాందోగ్యోపనిషత్తు - 17)

'ప్రియశిష్యులారా ! పురుషుడికి పదహారు కళలున్నాయి. వాటిని వివరిస్తాను వినండి' అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానం వివరిస్తూ ఈ విధంగా చెప్పాడు. "కుమారా ! పురుషుడికి పదహారు కళలున్నాయి. అందుకనే అతన్ని షోడశ కళాప్రపూర్ణుడంటారు. మనస్సు అనేది అన్నము అనే విషయం నీకు ప్రత్యక్షంగా అనుభవంలోకిరావాలి• అలా రావాలంటే నువ్వు పదిహేను రోజులపాటు అన్నం తినటం మానేసి కేవలం నీరు మాత్రం త్రాగు. అన్నం తినక పోయినప్పటికీ నీరు త్రాగటంవల్ల నీ ప్రాణం నశించదు.

మనం తిన్న ఆహారంలోని సూక్ష్మాంశాలే మనస్సుకు శక్తి ఇస్తాయి. అన్నం తినటం వల్ల వచ్చిన ఆశక్తి పదహారు భాగాలుగా విభజింపబడి మానసికశక్తి పెరుగుతుంది. అంటే అన్నం వల్ల పోషించబడే మానసిక శక్తి పదహారు భాగాలుగా విభజింపబడ్డది. శరీరము, ఇంద్రియాలు మొదలైనవాటి సమిష్టి రూపమే పదహారు కళలు గల పురుషుడు. ఆ కళలు.

| | | | |
|---|---|---|---|
| 1. ప్రాణము | 5. అగ్ని | 9. మనస్సు | 13. వేదమంత్రాలు |
| 2. శ్రద్ధ | 6. జలం | 10. అన్నము | 14. కర్మలు |
| 3. ఆకాశము | 7. భూమి | 11. బలము | 15 లోకాలు |
| 4. వాయువు | 8. ఇంద్రియాలు | 12 తపస్సు | 16 ప్రాణుల పేర్లు |

ఈ పదహారు కళలు ఉన్నవాడు మంచి ఋషి, శ్రోత, వక్త అవుతాడు. అన్ని కర్మలు చెయ్యటానికి అర్హుడు, సమర్థుడు అవుతాడు.

తండ్రి ఆజ్ఞమేరకు పదిహేను రోజులపాటు అన్నం మానేశాడు శ్వేతకేతు. ఆ తరువాత రోజున తండ్రి కుమారుని వేదమంత్రాలు చదవమన్నాడు. దానికి "నాకు ఆ మంత్రాలు గుర్తు రావటం లేదు" అన్నాడు శ్వేతకేతు.

అప్పుడు ఉద్దాలకుడు ఈ విధంగా చెప్పాడు. "కుమారా ! కట్టెలు బాగా వేసి మండించిన మంట ఇచ్చే వేడిని అందులోని ఒక నిప్పుకణిక ఇవ్వలేదు కదా ! అలాగే ఉపవాసం వల్ల పదిహేను కళలు క్షీణించిపోగా ఒక్క కళ మాత్రం మిగిలింది. అందుకనే ఆ ఒక్క కళ ద్వారా వేదాలను గుర్తు చేసుకోలేక పోతున్నావు. ఇప్పుడు వెళ్ళి భోజనం చెయ్యి" అన్నాడు.

శ్వేతకేతు భోజనం చేసివచ్చాడు. తండ్రి అతణ్ణి వేదమంత్రాలు చదవమన్నాడు. శ్వేతకేతు వేదం చదివి దాని అర్థాన్ని కుడా వివరించాడు.


అప్పుడు ఉద్దాలకుడు. "కుమారా ! చాలాకట్టెలు వేసి మండించిన నిప్పులోని ఒక నిప్పుకణాన్ని మళ్ళీ పుల్లలతో ప్రజ్వరిల్లజేస్తే అది గతంలోని అగ్ని కన్న ఎక్కువ శక్తి కలది అవుతుంది. అంటే కొద్దిగా ఉన్న నీలోని అగ్ని మళ్ళీ ఆహారం తీసుకోవటం ద్వారా ప్రజ్వరిల్లి ఎక్కువ శక్తివంతమవుతుంది. అందుకే అన్నం తిన్న తరువాత నీకు వేదమంత్రాలన్నీ మళ్ళీ గుర్తు వచ్చినాయి. నాయనా.

మనస్సు - అన్నానికి వికారం

ప్రాణం - జలానికి వికారం

వాక్కు - అగ్నికి వికారం

ఈ విషయాలు బాగా తెలుసుకో. వీటిలో అన్నం చేతనే మనస్సుకు పదహారు కళలు వస్తాయి. అతడే షోడశకళా ప్రపూర్ణుడు. అంటూ ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు వివరించాడని రత్నాకరుడు తన శిష్యులకు చెప్పాడు.



## 43. సుషుప్తి (ఛాందోగ్యోపనిషత్తు - 18)

"శిష్యులారా ! అరుణుని కుమారుడైన ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు సుషుప్తిని గురించి వివరించాడు. ఆ విషయం చెబుతాను వినండి", అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

కుమారా ! మానవుడు గాఢ నిద్రలో ఉన్నప్పుడు అతడు 'సుషుప్తి'లో ఉన్నాడంటారు. ఆ సమయంలో జీవుడు పరమసత్తను పొందుతాడు. అంటే తన నిజస్వరూపాన్ని పొందుతాడు. తన ఆత్మను తాను పొందుతాడు. కాబట్టి అతన్ని గురించి చెప్పేటప్పుడు అతడు నిద్రిస్తున్నాడంటారు.

అద్దంలో చూసినప్పుడు మన రూపం ప్రతిబింబిస్తుంది. కాని అద్దం తియ్యగానే అది మాయమై పోతుంది. మన నిజరూపం మాత్రమే మిగులుతుంది. అదే విధంగా సుషుప్తావస్థలో మనస్సు, ఇంద్రియాలు పనిచేయటం మానేస్తాయి. అప్పుడు మిగిలేది ఆత్మ మాత్రమే. ఆ ఆత్మ నిజరూపంలో మిగులుతుంది. ప్రతిబింబం లాంటి జీవభావం పోయి మిగిలేది ఆత్మభావం ఒక్కటే. ఆ స్థితిలో ఆత్మను "స్వపితి" అంటారు. తన ఆత్మ తనలోనే ఉన్నాడని, అతడు నిద్రిస్తున్నాడని అంటారు. ఇంద్రియాలన్నీ అలసట చెంది ఒక్కొక్కటే మనస్సులో లీనమై పోతాయి. మనస్సు ప్రాణంలో లీనమై పోతుంది. అంటే సుషుప్తావస్థలో ఒక్క ప్రాణం మాత్రమే మేల్కొని ఉంటుంది. ఆ ప్రాణమే ఇంద్రియాల యొక్క, మనస్సు యొక్క అలసటను తీరుస్తుంది.

ఒక పక్షిని తెచ్చి త్రాడుతో బంధించారనుకో, అది అవకాశమున్నంతవరకూ అన్ని దిక్కులలోనూ పరుగెత్తి ఎక్కడా విశ్రాంతి దొరకక, తనను కట్టివేసిన చోటికే వస్తుంది. అలాగే ఈ మనసుకూడా దిక్కుల చివరవరకూ పోయి ఎక్కడా విశ్రాంతి స్థానం దొరకక చివరకు ప్రాణ రూపంలో మనకు వశమయ్యే ఆ పరదేవతనే ఆశ్రయిస్తుంది. దీనికి కారణము ప్రాణమనే బంధనం చేత ఈ మనస్సు బంధించబడి ఉండటమే. మనస్సుకు బంధన స్థానమైన ప్రాణమే పరదేవత. మనస్సే జీవాత్మ. అని 'సుషుప్తిని' తన శిష్యులకు వివరిస్తూ ఛాందోగ్యోపనిషత్తులోని ఆరవ అధ్యాయాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 44. భూమావిద్య (ఛాందోగ్యోపనిషత్తు-19)

"నాయనలారా ! గుణాలున్నా ఎన్ని విషయాలు తెలిసినా, ఆత్మజ్ఞానం లేకపోతే, ఆత్మానుభూతి కలగకపోతే లక్ష్యాన్ని చేరలేడు. ఆత్మజ్ఞానం తప్ప మోక్షానికి వేరే సాధనం లేదు. నారదుడు గొప్ప మహర్షి. ధర్మాల నాచరించాడు. జ్ఞాన సముపార్జన చేశాడు. గాని ఆత్మానుభూతి కలుగలేదు. ఆత్మానుభూతి కోసం సనత్కుమారుని వద్ద శిష్యరికం చేశాడు. ఆ విషయాన్ని మీకు వివరిస్తాను వినండి" అంటూ భూమావిద్యను ప్రారంభించాడు రత్నాకరుడు.

ఒకసారి నారదమహర్షి సనత్కుమారుని వద్దకువెళ్ళి తనకు ఆత్మానుభూతిని కలుగజేయమని కోరాడు. దానికి సనత్కుమారుడు. 'గతంలో ఏ ఏ విద్యలు అభ్యసించావు?' అన్నాడు.

"స్వామీ ! వేదవేదాంగాలు చదివాను. ఎన్నో కళలు నేర్చుకున్నాను. శాస్త్రాలు అభ్యసించాను. సంగీత సాధన చేశాను. కాని నాకు మనశ్శాంతి లభించలేదు. ఆత్మజ్ఞానం కలుగలేదు. ఆత్మజ్ఞానం వల్ల సర్వ దుఃఖాలు నశిస్తాయని విన్నాను. కాబట్టి ఆత్మజ్ఞానాన్ని ఉపదేసించి నాకు దుఃఖ విమోచనం కలుగచేయండి" అన్నాడు నారదుడు.

అప్పుడు సనత్కుమారుడు "నారదా ! నువ్వు ఇంతవరకు అభ్యసించినది కష్ట సాధ్యమైన 'పరావిద్య' కాదు. నీకు ఎన్నో సిద్ధాంతాలు తెలుసు. కాని వాటి ఆచరణలేదు. వాటి ఆంతర్యం నీకు తెలియదు. నీకు తెలిసినదంతా 'అపరావిద్య'. అదంతా పదాల గారడి. కాబట్టి వాటన్నిటినీ వదలిపెట్టి విశ్వమంతా వ్యాపించి ఉన్న ఆత్మతత్త్వాన్ని తెలుసుకో. అదే పరావిద్య. అది సాధించాలంటే మానసిక పవిత్రత కావాలి. మనస్సు మలినరహితమైతేనే ఆత్మానుభవం కలుగుతుంది. అంతఃకరణ నిర్మలమవుతుంది. అప్పుడు సత్యదర్శనమవుతుంది. సత్యం అప్పుడు బాలభానునివలె పసిడికాంతులతో హృదయాంతరాళాల్లో ప్రకాశిస్తుంది. అదే పరావిద్య. దానివల్లనే శాశ్వతమైన ఆనందం లభిస్తుంది.

నారదా ! నువ్వు తెలుసుకున్నదంతా పదాలు మాత్రమే. అది పారిభాషిక పరిజ్ఞానము. ఆ పదజాలం ఏం సాధించగలదో అదే నీకు లభిస్తుంది. అంతకన్నా నీకేమీ దొరకదు.

ఇంత వరకు నీవు తెలుసుకున్నది నామమాత్రమైనది. నువ్వు చదివిన వేదస్త్రాలన్నిటికీ పేరు ఉన్నది. ఋగ్వేదము అనేది ఒక పేరు. అలాగే మిగిలిన వేదాలు, పురాణాలు అన్నీ పేర్లే.

వ్యాకరణం, శ్రాద్ధకల్పం, తర్కం, జ్యోతిషం, నీతి శాస్త్రం, నిరుక్తం, ధనుర్వేదం, సర్పశాస్త్రం, సంగీతం. ఇవన్నీ పేర్లే కాబట్టి ఒక ప్రతిమలో విష్ణురూపాన్ని భావించి ఉపాసించినట్లు వీటి నామాలన్నీ పరబ్రహ్మ స్వరూపమనే బుద్ధితో ఉపాసించు. నామాన్ని పరమాత్మగా ఉపాసించేవాడు నామం వ్యాపించి ఉన్నంత మేర స్వేచ్ఛగా సంచరించగలుగుతాడు. అంటే ఆ ఉపాసకుడు విశ్వమంతా సంచరించగలుగుతాడు" అన్నాడు.

అది విన్న నారదుడు "నామం కన్నా గొప్పది ఏది?" అని ప్రశ్నించాడు. నామం కన్నా గొప్పది వాక్కు. వాక్శక్తి కనక లేకపోతే పదాలు లేవు-వేదాలులేవు-వేదాలలో చెప్పబడిన సత్యాసత్యాలు లేవు. శుభాశుభములు లేవు. వాక్కే బ్రహ్మగా ఉపాసించేవాడు వాక్కు వ్యాపించి ఉన్నంత మేర అంటె శబ్దం, స్వరం వ్యాపించి ఉన్నంత మేర స్వేచ్ఛగా సంచరించ గలుగుతాడు.

అది విన్ననారదుడు "దేవా ! వాక్కు కన్న శ్రేష్ఠమైనదేమైనా ఉన్నదా ?" అన్నాడు.

"ఉన్నది మహర్షీ! వాక్ శక్తి కన్న గొప్పది మనస్సు. ఒక మనిషి వేదాలు నేర్చుకుంటాడు. మనస్సులోంచి వచ్చిన ఆలోచన మూలంగా వేదమంత్రాలను సంతగా చెప్పుకుంటాడు. ఆలోచనే రాకపోతే ఆ పని చెయ్యడు. ఏ పని చెయ్యాలన్నా ఆలోచన రావాలి. అందుచేతనే ఆలోచన చేసే మనస్సు వాక్కు కన్న గొప్పది. మనస్సే బ్రహ్మ అని ఉపాసన చేసేవాడు మనస్సు పొందగలిగినంత మేర స్వేచ్ఛగా విహరించగలుగుతాడు" అన్నాడు సనత్కుమారుడు.

అది విన్న నారదుడు "స్వామీ ! మనస్సుకన్న శ్రేష్టమైనది ఏది ?" అన్నాడు.

"ఆలోచించే మనస్సుకన్న గొప్పది సంకల్పం. అసలు సంకల్పమనేది కలగకపోతే జరిగేది ఏమీలేదు. సంకల్పమంటూ చేస్తే, దాన్నిక్రియ అనుసరిస్తుంది. ఈ సంకల్పమే సమస్త క్రియాకలాకల్పాన్ని కట్టిపెట్టి ఉంచుతుంది. మనస్సు, వాక్కు, నామం, మంత్రం, కర్మ మొదలైనవన్నీ సంకల్పంలోనే లయమవుతాయి. కాబట్టి సంకల్పమే బ్రహ్మ అని ఉపాసన చేసేవాడు భగవంతుడిచేత సంకల్పించబడిన లోకాలన్నీ పొందుతాడు. అన్నాడు సనత్కుమారుడు.

"అలాగయితే సంకల్పం కన్న గొప్పది ఏదైనా ఉన్నదా?" అన్నాడు నారదుడు.

"సంకల్పం కన్న గొప్పది చిత్తం. చిత్తం వలన అన్నిపనులను గురించిన ఆలోచన ప్రవర్తిల్లుతుంది. చిత్తంవల్లనే సంకల్పం కలుగుతుంది. ఇది ఆలోచనా ప్రేరకమైన చిత్తప్రకియను అనుసరిస్తుంది. వాక్కు వస్తుంది. పదాలు ఆకారం దాలుస్తాయి. ఒక మనిషి యొక్క చిత్తం

చిన్నాభిన్నమైపోతే. అతనికి స్పృహ తప్పుతుంది. అప్పుడు ఏ పనీ చెయ్యలేడు ఈ చిత్తమే బ్రహ్మ అని ఉపాసన చేసేవాడు శోకహీనుడై శోకరహితమైన లోకాలు పొందుతాడు." అన్నాడు సనత్కుమారుడు.

"స్వామీ! చిత్తం కన్న శ్రేష్ఠమైనది ఏమైనా ఉన్నదా?" అన్నాడు నారదుడు.

"ధ్యానం అనేది చిత్తం కన్నా గొప్పది. ధ్యానంతో చిత్తానికి స్థాయి, స్థిరత్వము ఏర్పడతాయి. ఈభూమి, ఆకాశం, పర్వతాలు అన్నీ ధ్యాన నిష్ఠలో ఉన్నట్లు, క్రమం తప్పకుండా, స్థిరత్వం కోల్పోకుండా నిలిచి ఉన్నాయి. ఆ ధ్యానస్థితే లేకపోతే ఏదీ స్థిరంగా నిలబడలేదు. ధ్యానమే బ్రహ్మ అనే భావనతో ఉపాసన చేసేవాడు ధ్యానానికి ఎంత వరకు వ్యాప్తి ఉంటుందో అంతవరకు స్వేచ్ఛగా సంచరిస్తాడు." అన్నాడు సనత్కుమారుడు.

"దేవా ! ధ్యానాన్నిమించినది ఇంకా ఏదైనా ఉన్నదా?" అన్నాడు నారదుడు.

"ధ్యానంకన్న గొప్పది విజ్ఞానం, శుభాశుభాలు, సత్యాసత్యాలు, పురాణాలు, ఇహపరాలు, అన్నీ విజ్ఞానం వల్లనే గ్రహింపుకు వస్తాయి. విజ్ఞానమే బ్రహ్మ అని ఉపాసించేవాడు జ్ఞానంతో కూడిన లోకాలు పొందుతాడు." అన్నాడు సనత్కుమారుడు.

నారదుడు "స్వామీ ! ఇంతకన్న శ్రేష్ఠమైనదేమయినా ఉందా ?" అన్నాడు.

"ఉన్నది. విజ్ఞానం కన్న మించినది బలం. ఒక బలవంతుడు తన విజ్ఞాన విశేషాలతో వందమందిలోనైనా భయాన్ని రేకెత్తించగలడు. ఒక బలవంతుడు విద్యావంతుడైనప్పుడు, మేధావిగా, ఋషిగా, కర్మిష్ఠిగామారినప్పుడు అందరిలోకీ అతనిదే పై చేయి అవుతుంది. మర్త్యలోకంలోగాని, స్వర్గలోకంలోగాని వాటిని సాధించి పెట్టేది భౌతికబలం. భూమ్యాకాశాలను, పర్వతాలను పశుపక్ష్యాదులను, దేవసమూహాలనూ, అందరినీ నిలబెట్ట గలిగేది భౌతికశక్తే కాబట్టి బలమే బ్రహ్మ అని తెలుసుకుని ఉపాసన చేసేవాడు బలానికి వ్యాప్తి ఉన్నంత మేర స్వేచ్ఛగా విహరిస్తాడు" అన్నాడు సనత్కుమారుడు.

"దేవా ! ఇంత కంటె శ్రేష్ఠమైనదేదైనా ఉన్నాదా ?" అన్నాడు నారదుడు.

"శారీరక బలం కన్న మించినది అన్నం. మనిషి కొన్ని రోజులపాటు అన్నం తినకుండా మాడితే చచ్చిపోతాడు. కొంతకాలం బ్రతికినా నీరసంతో మాట పడిపోతుంది. నడవలేడు. చూడలేడు. ఏ పనీచెయ్యలేడు. వినే శక్తి కుడా పోతుంది. ఆలోచనా శక్తి హరించుకుపోతుంది. ఆహారం తీసుకోవటం ప్రారంభిస్తే తిరిగి అన్ని శక్తులూ పొందుతాడు. మునుపటిలాగా పనిచేయగలుగుతాడు". అన్నమే బ్రహ్మ అని ఉపాసన చేసినవాడు అన్నం ఉన్నంత మేర స్వేచ్ఛగా సంచరించగలుగుతాడు. అన్నాడు సనత్కుమారుడు.

"స్వామీ ! అన్నం కంటె శ్రేష్ఠమైనదేమైనా ఉన్నాదా'? అన్నాడు నారదుడు.

"నారదా ! మేఘాలు వర్షించకపోతే పంటలు పండవు. ఆహారం దొరకదు. నీరు లేకపోతే అన్ని జీవరాశులు మొగంవాచి చావుకు సిద్ధమవుతాయి. తొలకరిలో వర్షాలు కురవటం ప్రారంభం కావటంతో జీవులన్నీ ఆనందంతో చిందులు వేస్తాయి. జలమే బ్రహ్మ అని ఉపాసన చేసేవాడు తాను కోరిన వస్తువులన్నీ పొంది తృప్తి చెందుతాడు. జలం ఉన్నంతమేర స్వేచ్ఛగా తిరుగుతాడు" అన్నాడు. సనత్కుమారుడు.

"స్వామీ! జలంకన్న శ్రేష్ఠమైనదేది?" అన్నాడు నారదుడు.

"జలం కన్న శ్రేష్ఠమైనది తేజస్సు. ఆ తేజస్సే లేకపోతే భూమిమీద నదులలోను, సముద్రాలలోను నీరు ఆవిరి అవదు. నీరు ఆవిరి కాకపోతే మేఘాలు వర్షించవు. కాబట్టి తేజస్సే బ్రహ్మ అని ఉపాసించేవాడు తాను తేజస్వియై, తేజోసంపన్నమైన లోకాలు పొందుతాడు. అన్నాడు సనత్కుమారుడు.

"స్వామీ ! తేజస్సు కన్న గొప్పది ఏది ?" అని అడిగాడు నారదుడు.

"తేజస్సుకన్న గొప్పది ఆకాశం. ఆకాశం అంటూ ఉంది కాబట్టే అన్ని వస్తువులూ అందులో ఇముడుతున్నాయి. సూర్యుడు, చంద్రుడు, భూమి, గ్రహగోళాలు, నక్షత్రాలు, మొదలైన తేజోమండలమంతా ఆకాశంలోనే చోటు చేసుకుని ఉన్నాయి. ఆకాశం శబ్ద తరంగాలకాధారం శబ్దాన్ని మన చెవులుగ్రహించటానికి కారణం ఆకాశం. కాబట్టి ఆకాశమే బ్రహ్మగా ఉపాసించేవాడు విశాలమైన, దుఃఖము లేని, ప్రకాశవంతమైన లోకాలు పొందుతాడు. ఆకాశం వ్యాపించినంతమేర స్వేచ్ఛగా మనగలుగుతాడు." అన్నాడు సనత్కుమారుడు.

"ఇంతకన్న శ్రేష్ఠమైనది ఏమైనా ఉన్నదా?" అన్నాడు నారదుడు.

"అంతఃకరణ యొక్క ధర్మమైన స్మరణ ఇంతకన్న శ్రేష్ఠమైనది ఈ స్మరణయే జ్ఞాపకశక్తి. ఇది లేకపోతే మానవుడు వినవలసిన దానిని వినలేడు. మాట్లాడవలసిన దానిని మాట్లాడలేడు. ఆలోచించనూలేడు. స్మరణయే బ్రహ్మ అని భావించి ఉపాసన చేసేవాడు స్మరణశక్తి వెళ్ళగలిగినంత మేర స్వేచ్ఛగా సంచరించగలుగుతాడు". అన్నాడు సనత్కుమారుడు.

"ఇంతకన్న గొప్పది ఏది?" అన్నాడు నారదుడు.

"ఆశ ! ఆశతో స్మరణ శక్తి ఎక్కువ అవుతుంది. మానవుడు ఆశతోనే వేదమంత్రాలు చదువుతాడు. ఫలితాన్ని పొందుతాడు. ఆ ఫలితమే పుత్రులు, పశువులు, ధనము మొదలైననవి. ఆశనే బ్రహ్మగా ఉపాసించేవారి కోరికలన్నీ నెరవేరతాయి. అతని ప్రార్థనలు వ్యర్థం కావు" అన్నాడు సనత్కుమారుడు.

"అంతకన్న శ్రేష్ఠమైనదేది?" అన్నాడు నారదుడు.

"ఆశకన్న శ్రేష్ఠమైనది ప్రాణం. బండి చక్రంలోని కుండలో ఆకులన్నీ ఉన్నట్లుగా, సమస్త ప్రపంచమూ శరీరంలోని ముఖ్యప్రాణంలో అమరిఉన్నది. ఈ ముఖ్యప్రాణమే జీవాత్మ. ఈ ప్రాణమే తనశక్తి అయిన ప్రాణం ద్వారా నడుస్తోంది. అంటే ప్రాణమే ప్రాణానికి ప్రాణం ఇస్తోంది. ఇచ్చేది, ఇవ్వబడేది కుడా ప్రాణమే కాబట్టి ఈ ప్రాణమే తల్లి, తండ్రి, గురువు వీరందరిలో ఉన్నది ప్రాణమే. ప్రాణంపోయిన తరువాత వారిక ఆపేర్లతో పిలువబడరు. చరాచర జగత్తు అంతా ప్రాణమయమే" అన్నాడు. సనత్కుమారుడు.

"ప్రాణం కన్న శ్రేష్ఠమైనదేది?" అన్నాడు నారుదుడు.

"ప్రాణంకన్న శ్రేష్ఠమైనది ఆత్మవిజ్ఞానం. ఆత్మయే సర్వానికి అధిష్ఠానమని గుర్తించు. మానవుడు అనేకమైన పనులు తలబెడతాడు. వాటివల్ల అతడికి ఆనందం లభిస్తుందనే భావిస్తాడు. ఆనందం దొరకదు అనుకుంటే మనిషి ఏ పనీ చెయ్యడు. ఈ ఆనందం అనేది కలిమిలో ఉంది కాని లేమిలో లేదు. ఉనికిలో ఉంది కాని శూన్యంలోలేదు. వాంఛలో ఆనందం లేదు. వాంఛాపూర్తిలో ఆనందం ఉంది. జగత్తులోని ఏ వస్తువూ అపరిమితానందం ఇవ్వలేదు. అపరిమిత ఆత్మానందమే పరిపూర్ణానందాన్ని ప్రసాదిస్తుంది. అపరిమితానందము ఒక్కతురీయావస్త ద్వారానే సాధ్యము. అది ఇంద్రియాల పరిధికి దాటినస్థితి. ఆత్మకు భిన్నంగా ఉన్న దాన్ని చూడటం, వినటం, తెలుసుకోవటం ప్రారంభించాలని ప్రయత్నించటమే దుఃఖానికి నాంది. ఆత్మ స్వతఃప్రజ్ఞవల్లే నిలబడి ఉంటుంది. తత్త్వవేత్త అయినవాడు మృత్యువును చూడడు. రోగాన్ని కూడా చూడడు. అతడికి జరామృత్యువులులేవు. విద్వాంసుడు అంటే జ్ఞానియైనవాడు అన్నిటినీ ఆత్మభావంతో చూస్తాడు. అందుకనే అతడు అన్నింటినీ పొందుతాడు. ఆత్మజ్ఞానం పొందటంలో ఉన్న ఆనందం ఇల్లుకట్టినా, పాడిపంటలు సమృద్ధిగా ఉన్నా, ధన ధాన్యాదులు సంపాదించినా రాదు.

ఆత్మ సర్వవ్యాపకమైనది. ఊర్ధ్వలోకాలలో, అధోలోకాలలో కుడా అది వ్యాపించి ఉంది. ఆత్మానందం అనిర్వచనీయం. ఆత్మజ్ఞాని తనకు తానే ప్రభువు. తనను నియంత్రించే శక్తి తానే.

ఆత్మానుభూతి పొందాలంటే మనస్సు పరిశుభ్రం కావాలి. పవిత్రమూ, పరిశుభ్రమూ అయిన ఆహారం తీసుకున్నప్పుడే మనస్సు పరిశుభ్రమవుతుంది. పరిశుభ్రమైన వెన్నెలతో ప్రకాశించే వ్యక్తికే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. అతడే జీవన్ముక్తుడు" అని సనత్కుమారుడు నారదునికి భూమావిద్యను ఉపదేశించాడని చెబుతూ రత్నాకరుడు ఛాందోగ్యోపనిషత్తులో ఏడవ అధ్యాయాన్ని ముగించాడు.

# 45. హృత్పద్మం (ఛాందోగ్యోపనిషత్తు - 20)

"ప్రియశిష్యులారా ! పరబ్రహ్మ ఎక్కడో ఉండడు. ఈ శరీరంలోనే ఉంటాడు. అందుచేతనే శరీరాన్ని బ్రహ్మపురం అంటారు. రాజ్యానికి సేవకులు, అధికారులు ఉన్నట్లే శరీరానికి ఇంద్రియాలు, మనస్సు ఉన్నాయి. హృదయస్థానంలో ఒక పద్మమున్నది. దాన్నే హృదయ కమలం అంటారు. ఆ కమలం మధ్య భాగంలో సూక్ష్మమైన ఆకాశం ఉన్నది. అదే దహరాకాశము. బ్రహ్మపురంలోని హృదయ కమలంలో ఉండే దహరాకాశంలో పరబ్రహ్మను వెతకాలి. దాన్ని గురించి తెలుసుకునే ప్రయత్నం చెయ్యాలి. అరిషడ్వర్గాలను జయించినవాడికే అది సాధ్యమవుతుంది. హృత్పద్మంలో ఉండే పరబ్రహ్మను గురించి వివరిస్తాను వినండి' అంటూ ఛాందోగ్యోపనిషత్తులోని ఎనిమిదవ అధ్యాయాన్ని ప్రారంభించాడు రత్నాకరుడు.

భౌతికమైన ఆకాశం మనకళ్ళకు కనిపించేది. అది బయట ఎంతఉన్నదో హృదయంలో ఉన్న ఆకాశం కూడా అంతే ఉంటుంది. ఈ హృదయాకాశంలో ద్యులోకము, పృధివి రెండూ ఇమిడి ఉన్నాయి. అలాగే అగ్ని, వాయువు కూడా ఉన్నాయి. సూర్యచంద్రులు, నక్షత్రాలు విద్యుత్తుకూడా అందులోనే ఉంటాయి. ఆత్మలోకంలో ఆత్మీయ పదార్థంగా ఉన్నది, లేనిదీ, భవిష్యత్తులో ఉండనిదీ అన్నీ ఈ హృదయాకాశంలో ఇమిడి ఉంటాయి.

శరీరం వార్ధక్యాన్ని పొందినప్పుడు అంతరాకాశంలో ఉన్న బ్రహ్మ జీర్ణంకాదు. శరీరాన్ని ఆయుధాలతో నరికి చంపివేసినా లోపల ఉన్న ఆత్మ నాశనంకాదు. ఆత్మవధించబడదు. ఈ బ్రహ్మపురంలో సమస్త కోరికలు ఉన్నాయి. ఆత్మకి ధర్మాధర్మాలతో సంబంధంలేదు. ముసలితనం లేదు. ఆకలి లేదు. శోకం లేదు. దాహం లేదు. ఆత్మ సత్యకామము, సత్య సంకల్పము అయినది. సాంసారిక పురుషులకులాగా ఆత్మకు అసత్యకామన, అసత్య సంకల్పాలు ఉండవు.

లోకంలోని ప్రజలు రాజులను సేవిస్తూ, ధనధాన్యాలు సంపాదిస్తారు. ఇవన్నీ నశించి పోయేవే. అంటే కామ్యకర్మల ద్వారా పొందినవన్నీ నశించిపోతాయి. యజ్ఞయాగాదుల వల్ల పొందిన స్వర్గ సుఖాలు కూడా, కాలం తీరగానే నష్టమైపోతాయి. భూలోకం కర్మాధికారం గల లోకం. ఆత్మను గురించి తెలుసుకోకుండానే మరణించిన వారికి అన్ని లోకాల్లోనూ విహరించే

అధికారం ఉండదు. బ్రతికి ఉండగా ఎవరైతే ఆత్మజ్ఞానం పొందుతారో, వారే సమస్త లోకాల్లోనూ చరించగలుగుతారు. అంటే సత్యకాముడై ఆత్మను తెలుసుకుని శరీర త్యాగం చేసినవాడు, తానే పరబ్రహ్మ అని తెలిసినవాడు సమస్త లోకాల్లోనూ విహరించగలుగుతాడు.

సత్యకాముడై దహరాకాశంలో బ్రహ్మను సేవించినవాడు మరణానంతరము పితృలోకాన్ని కోరితే పితృగణం ప్రత్యక్షమవుతుంది. వారితో పితృలోకాలకు పోయి పితృలోక అనుభవాలతో సంపన్నుడై మహిమాన్వితుడౌతాడు.

అతడు మాతృలోకాలు కోరితే, మాతృగణాలతో మాతృలోకాలకుపోయి అక్కడి సుఖాలనుభవిస్తాడు. భ్రాతృ లోకాలు కోరితే, భ్రాతృ గణాలతో భ్రాతృ లోకాలకు పోయి అక్కడి సుఖం అనుభవిస్తాడు. భగినీలోకాలు (సోదరి) కోరితే భగినీ లోకాలకు పోయి సుఖిస్తాడు. మిత్ర లోకాలు కోరితే, మిత్రులంతా ప్రత్యక్షమవుతారు. వారితో ఆ లోకాలు పోయి సుఖిస్తాడు. గంధమాల్యలోకాలు (పూలదండలు, సుగంధ ద్రవ్యాలు పుష్కలంగా గల లోకం) కోరితే ఆ లోకవాసులు ప్రత్యక్ష మవుతారు. వారితో కలిసి ఆ లోకంలో సుఖిస్తాడు.

అన్నపాన లోకాలు కోరితే ఆ లోకవాసులు ప్రత్యక్షమవుతారు. వారితో కలసి ఆలోకంలో సుఖిస్తాడు.

గీతావాద్య సంబంధమైన లోకాలు కోరితే ఆ లోకవాసులు ప్రత్యక్షమవుతారు. వారితో కలసి అక్కడ సుఖాలను అనుభవిస్తాడు.

స్త్రీలోకాన్ని కోరితే ఆ లోకవాసులైన స్త్రీలు ప్రత్యక్షమవుతారు. వారితో కలసి ఆ లోకంలో సుఖిస్తాడు.

ఈ రకంగా అతడు ఏ లోకాలు కోరితే ఆలోకవాసులు ప్రత్యక్షమవుతారు. వారితో కలిసి ఆ లోకాలలో సుఖిస్తాడు. అంటూ హృదయ పద్మాన్ని గురించి వివరించాడు రత్నాకరుడు.

## 46. ప్రజాపతి (ఛాందోగ్యోపనిషత్తు -21)

"శిష్యులారా ! పూర్వకాలంలో ప్రజాపతి ఇంద్రుడికి ఆత్మతత్త్వాన్ని వివరించాడు. ఇప్పుడు దాన్ని మీకు వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

పూర్వకాలంలో ఒకసారి ప్రజాపతి ఆత్మతత్త్వాన్ని గురించి ఒక ప్రకటన చేశాడు.

"ఆత్మకు పాపం అంటదు. ముసలితనం రాదు. మృత్యువు దాన్ని కబళించదు. శోకం తాకదు. దానికి ఆకలి దప్పికలు లేవు. మానవుడు సత్యకాముడు, సత్య సంకల్పుడు అయి ఆత్మజిజ్ఞాసను అలవరచుకోవాలి. ఆత్మకోసం అన్వేషించినవాడు, ఆత్మను అనుభవించినవాడు ఆత్మస్వరూపాన్ని పొందుతాడు. పూర్ణస్థితి అతనికి వస్తుందన్నమాట."

దేవతలు, రాక్షసులుకుడా ఆమాటలు విన్నారు. "ఆత్మను గురించి మనం కుడా అన్వేషిద్దాం. ఆత్మవల్ల అన్ని కోరికలు తీరతాయని బ్రహ్మచెప్పాడు కదా!" అని వారు భావించారు.

దేవతలరాజు ఇంద్రుడు, రాక్షసుల రాజు విరోచనుడు ఇద్దరూ ఆత్మజ్ఞానం సంపాదిద్దామని చేతితో దర్భలుపట్టుకుని బ్రహ్మవద్దకు వెళ్ళారు. బ్రహ్మ వీరిద్దరినీ ముప్పైరెండు సంవత్సరాలు, బ్రహ్మచర్యదీక్ష వహించమని చెప్పాడు. దీక్ష పూర్తి చేశారిద్దరూ.

"వత్సలారా ! మీరు నాకోసం దేనికి వచ్చారు?" అన్నాడు బ్రహ్మ.

"భగవాన్ ! ఆత్మ తత్త్వాన్ని గురించి చెప్పిన విషయాలు విన్నాం. ఆత్మను గురించి ప్రత్యక్షంగా తమ నోటి మీదుగా వినాలని వచ్చాం" అన్నారు. ఇంద్ర విరోచనులు.

"మనుష్యుల కనుపాపలలో మెదలుతూ కనుపించే పురుషుడే ఆత్మ. ఆత్మ అభయం. అమృతమయం. అదే బ్రహ్మం" అన్నాడు బ్రహ్మ.

అది విన్నవారు "భగవాన్ ! నీటిలోకనుపించే ప్రతిబింబం, అద్దంలో కనిపించే ప్రతిబింబం. ఈ రెంటింలో ఏది ఆత్మరూపం?" అని అడిగారు.

"నేను మొదటగా కళ్ళలో మెరిసే ఏ పురుషుని వర్ణన చేశానో వీటన్నింటిలోనూ ప్రతి ఫలించేది ఆ పురుషుడే.ఒకసారి నీళ్ళలోను, అద్దంలోను మీ రూపాలు చూసుకుని మీ అనుభవాలు నాకు చెప్పండి" అన్నాడు బ్రహ్మ. ఇంద్ర విరోచను లిద్దరూ అలాగే చేసి ప్రజాపతి దగ్గరకు వెళ్ళారు. ప్రజాపతి వీరిని చూసి "మీరు ఏం చూశారు?" అన్నాడు

"నఖశిఖ పర్యంతము కేశపాశాలతో మా శరీరాల ప్రతిరూపమే మాకు నీళ్ళలోనూ, అద్దంలోనూ కూడా కనిపించింది" అన్నారు వారు.

"నాయనలారా ! శరీరాలు శుభ్రపరచుకుని, మంచి వస్త్రాలు ఆభరణాలు ధరించి నీటిలో మీ ముఖాన్ని చూసుకోండి. తరువాత ఏంచూశారో నాకు చెప్పండి" అన్నాడు బ్రహ్మ 'అలాగే' అని చెప్పి ఇద్దరూ వెళ్ళిపోయారు. మరునాడు తిరిగి వచ్చి "స్వామీ ! ఈ చక్కని వస్త్రాలతో ఆభరణాలతో అలంకరించిన మా శరీరాలే నీటిలో కనిపించాయి." అన్నారు.

"అభయమూ, అమృతమయమూ అయిన ఆత్మ అదే, అదే బ్రహ్మము" అన్నాడు ప్రజాపతి

అదివిన్న ఇంద్ర విరోచనులు ఆత్మను గురించి తమకు అంతా తెలిసిందనుకుని తిరిగి వెళ్ళి పోయారు. అలా వెళ్ళిపోతున్నవారిని చూసి" అసలు ఆత్మజ్ఞానం లభించకుండానే వారు తెలిసింది అనుకుని వెళ్ళిపోతున్నారు. వారు దేవతలైనా, రాక్షసులైనా శరీరాన్నే ఆత్మ అని భావించటం పతన హేతువు". అనుకున్నాడు.

విరోచనుడు ఆత్మని గురించిన ఈ సిద్ధాంతంతోనే తృప్తి చెంది, రాక్షస జాతికంతటికీ ఈ సిద్ధాంతాన్నే బోధించాడు. అసలైన పరమ సత్యం తనకు లభించిందని తృప్తి చెందాడు. దేహమే ఆత్మ అని ప్రచారం చేశాడు.

ఇంద్రుడు దేవలోకానికి బయలుదేరాడు. దారిలో తాను నేర్చుకున్న దానిలో ఏదో లోపం కనిపించింది. తను నేర్చుకున్న సిద్ధాంతాన్ని ఒకసారి సమీక్షించుకున్నాడు. విషయాన్ని విమర్శచేసి చూశాడు. బాగా అలంకరించుకుంటే అలంకరించినట్లు, మంచి వస్త్రాలు ధరిస్తే ధరించినట్లు, కుంటివాడైతే కుంటి వాడిలాగా, గ్రుడ్డివాడైతే గ్రుడ్డివాడిలాగా శరీర ప్రతిబింబం కనిపిస్తుంది. మరణానంతరం శరీరం లేనప్పుడు ఆత్మ ఏమౌతుంది. మృత్యువువాత పడే ఈ శరీరాన్ని అమృతమయమగు ఆత్మ అనటంలో అర్థంలేదు. ఇంద్రుడి సంశయాలు తీరలేదు. సంతృప్తి లభించలేదు. వెనక్కి తిరిగి ప్రజాపతి దగ్గరకు వెళ్ళి నుంచున్నాడు.

తిరిగి వచ్చిన ఇంద్రుణ్ణి చూసి ప్రజాపతి "ఇంద్రా ! నువు విరోచనుడితో వెళ్ళి పోయావు కదా ! మళ్ళీ ఎందుకు తిరిగి వచ్చావు ?" అని అడిగాడు.

ఇంద్రుడు తన అనుమానాలన్నీ వివరించాడు "ప్రభూ ! శరీరంలోగాని, శరీరచ్ఛాయలో గాని నాకు ఏమీ విశేషం కనబడలేదు. అందుకని గతంలో నేర్చుకున్నది తృప్తిని కలిగించలేదు. ఆత్మజ్ఞానాన్ని మీవద్ద అభ్యసించాలని మళ్ళీవచ్చాను" అన్నాడు.

ఇంద్రుడి జిజ్ఞాసకు ఆనందించాడు బ్రహ్మ. ఇంద్రుణ్ణి మళ్ళీ ముప్పై రెండు సంవత్సరాలు బ్రహ్మచర్యదీక్ష పాటించమన్నాడు. ఇంద్రుడు దీక్షతో బ్రహ్మవద్దనే గడిపాడు. దీక్ష పూర్తి అయిన తరువాత ప్రజాపతి ఇంద్రుడితో "స్వప్న ప్రపంచంలో ప్రభువులాగా స్వేచ్ఛగా విహరించే చైతన్యమే ఆత్మ" అన్నాడు.

ఈ మాటతో ఇంద్రుడు తృప్తిపడి తిరిగి వెళ్ళి పోవటానికి బయలుదేరాడు. అలా వెడుతుంటే త్రోవలో మళ్ళీ అనుమానం వచ్చింది. "స్వప్నాలు అనుభవించే చైతన్యమే ఆత్మ ఎలా అవుతుంది. మనకు ఒక్కొక్కసారి కలలో ఎవరో పీడిస్తున్నట్లు వినిపిస్తుంది. మనం దుఃఖిస్తాము. పాపరహితము, అభయము అయిన ఆత్మ ఈ రకంగా దుఃఖించటంలో అర్థం లేదు. ఇది సత్యంకాదు." అనిపించింది. మళ్ళీ తిరిగి వచ్చాడు ఇంద్రుడు. ప్రజాపతి ఆదేశం మేరకు మళ్ళీ కొన్ని సంవత్సరాలు బ్రహ్మచర్య దీక్ష గడిపాడు. అప్పుడు ప్రజాపతి ఇంద్రుడితో ఈ విధంగా చెప్పాడు. "గాఢసుషుప్తిలో సంతృప్తిగా ఆనందాన్ని అనుభవించేదే ఆత్మ."

ఇంద్రుడు ఈమాట నిజమే అని నమ్మి దేవలోకానికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో ఇంద్రుడికి మళ్ళీ అనుమానం వచ్చింది. గాఢనిద్ర అనుభవిస్తున్నదే ఆత్మ అనుకుంటే ఆత్మ తనను తాను తెలుసుకోలేని స్థితిలో ఉంటుందన్నమాట. తనను గురించి తాను తెలుసుకోలేని అవ్యక్తతత్త్వం ప్రకాశవంతమైన ఆత్మ ఎలా అవుతుంది? ఈ అనుమానంతో ఇంద్రుడు తిరిగి ప్రజాపతి దగ్గరకు వచ్చాడు. ఈ సారి ప్రజాపతి ఇంద్రుణ్ణి కేవలం ఐదు సంవత్సరాలు తన దగ్గర బ్రహ్మచర్య దీక్షతో ఉండమన్నాడు.

గడువు పూర్తయింతరువాత ఇంద్రుడి పట్టుదలకు మెచ్చి ఆత్మతత్త్వాన్ని పూర్తిగా వివరించాడు.

ఇంద్రా ! నీ పట్టుదలకు మెచ్చాను. ఆత్మానుభవం పొందటానికి నువు పూర్తిగా అర్హుడవు. శరీరం అశాశ్వతమైనది. ఆఖరుక్షణాలు ఆసన్నంకాగానే శరీరాన్ని మృత్యువు కబళిస్తుంది. శాశ్వతమైన ఆత్మకు అశాశ్వతమైన శరీరమే ఆవాసం. శరీరం ఉన్నంతకాలంలో ఆత్మకు సుఖదుఃఖాలు, గుణదోషాలు అంటినట్లూ, వాటితో సతమతమవుతున్నట్లు కనిపిస్తుంది. ఆత్మ శరీరంతో సంబంధం ఏర్పరచుకోవటం వల్లనే జీవులకు సుఖదుఃఖాలు ఏర్పడతాయి. శరీరం ఆత్మనుండి విడివడితే ఈ బంధంనుండి విముక్తి లభిస్తుంది.

భౌతిక విషయాలనుండి విముక్తి పొంది ఆత్మను మనస్సుకు, ఇంద్రియాలకు విలక్షణమైనదిగా గ్రహించి, తేజోమయమని భావించి అనుభవజ్ఞుడు ఆనందిస్తాడు. ఆత్మజ్ఞానం పొందినవాడు ముక్తి సామ్రాజ్యంలో విహరిస్తాడు.

శాస్త్రోక్తంగా గురుకుల వాసం చేసి గురుకులం నుండి సమావర్తనం పూర్తి చేసి, పెండ్లాడి, గృహస్థుడయి పవిత్రమైనచోట స్వాధ్యయనం చేస్తూ పుత్రుల్ని, శిష్యుల్ని ధర్మ పరాయణులుగా తీర్చిదిద్దుతూ ఇంద్రియాలను అదుపుచేసి అంటే జితేంద్రియుడై శాస్త్ర విరుద్ధమైన జీవహింసచేయకుండా జీవితాన్ని గడిపేవాడు చివరకు బ్రహ్మలోకం పొందుతాడు. అక్కడ నుండి మళ్ళీ తిరిగిరాడు. ఈ విధంగా అర్చిరాది మార్గం ద్వారా బ్రహ్మలోకానికి పోయిన ఉపాసకుడు బ్రహ్మలోకమున్నంత వరకు అక్కడ దివ్య భోగాలను అనుభవించి తరువాత పరబ్రహ్మలో లీనమవుతాడు. అతడికి పునరావృత్తి ఉండదు."

ఈ రకంగా ప్రజాపతి ఆత్మజ్ఞాన్ని దేవేంద్రుడికి వివరించాడు. అని చెబుతూ ఛాందోగ్యోపనిషత్తు పూర్తిచేశాడు రత్నాకరుడు.

# 47. అశ్వమేధము (బృహదారణ్యకోపనిషత్తు-1)

"శిష్యులారా ! ఇప్పుడు 'బృహదారణ్యకోపనిషత్తు'ను గురించి చెబుతాను వినండి. ఇది శుక్ల యజుశ్శాఖకు చెందినది. ఇందులో మొత్తం ఎనిమిది అధ్యాయాలున్నాయి.

వాటిలో

| | | |
|---|---|---|
| మొదటి నాలుగు అధ్యాయాలు | - | మధుకాండ |
| ఐదు, ఆరు అధ్యాయాలు | - | యాజ్ఞవల్క్యకాండ |
| ఏడు, ఎనిమిది అధ్యాయాలు | - | ఖిలకాండ |

అనబడతాయి. ఐతే ఇందులోని మొదటి రెండు అధ్యాయాలు ఉపాసనకు సంబంధించినవి. అందుకని వాటిని వదలివేసి మూడవ అధ్యాయం దగ్గర నుంచే ఉపనిషత్తుగా గ్రహించారు. కాబట్టి ఇప్పుడు ఈ ఉపనిషత్తుకు ఆరు అధ్యాయాలు మాత్రమే ఉన్నాయి. వీటికి ఆదిశంకరులు భాష్యం వ్రాశారు. ఆనందగిరి టీకను, సురేశ్వరులు, విద్యారణ్యులు వార్తికాన్ని వ్రాశారు.

మిగిలిన ఉపనిషత్తులకన్న గ్రంధపరిమాణంలోను, విషయ పరిజ్ఞానంలోనూ కుడా బృహదారణ్యకం గొప్పది. మిగిలిన ఉపనిషత్తులలోని విషయము ఇందులోనే ఉంది. ఈ ఉపనిషత్తులోని మూడు భాగాల్లోని

| | | |
|---|---|---|
| మొదటిదైన మధుకాండలో | - | ఉపదేశము |
| రెండవదైన యాజ్ఞవల్క్యకాండలో | - | ఉపపత్తి (ముక్తి) |
| మూడవదైన ఖిలకాండలో | - | ఉపాసన చెప్పబడ్డాయి. |

ఇంతవరకు చెప్పిన విషయాలను మళ్ళీ చెప్పకుండా ముఖ్యమైన విషయాలను చెబుతూ ఈ ఉపనిషత్తును వివరిస్తాను. అంటూ బృహదారణ్యకోపనిషత్తును ప్రారంభించాడు రత్నాకరుడు.

కర్మలలోప్రధానమైనది, అత్యంత ఫలప్రదమైనది అశ్వమేధం. ఇది రాజులు మాత్రమే చెయ్యగలిగిన యాగం. రాజుల లాగా శక్తి సామర్థ్యాలు లేని సామాన్యులకు ఆయాగ ఫలితం రావాలంటే ఎలా ? దానికి మార్గం ఉపాసన. కాబట్టి ఆ యాగంలో ప్రధానమైన అశ్వాన్ని ప్రజాపతిగా భావించి ఉపాసన చేస్తే అశ్వమేధ ఫలం వస్తుంది. అందుకనే అశ్వమేధాశ్వ

వర్ణనతోనే ఈ ఉపనిషత్తు ప్రారంభమవుతుంది. దీనిలోని మొదటి, రెండవ అధ్యాయాల్లో 'అశ్వప్రజాపతి'ని నిరూపిస్తున్నారు. అంటే యాగాశ్వంలో ప్రజాపతిని భావించి ఉపాసన చెయ్యాలన్నమాట. ఆ విషయాన్ని ఇప్పుడు మీకు వివరిస్తాను వినండి," అంటూ బృహదారణ్యకోపనిషత్తులోని మొదటి అధ్యాయాన్ని ప్రారంభించాడు రత్నాకరుడు.

| | | |
|---|---|---|
| యాగాశ్వం యొక్క శిరోభాగం | - | బ్రాహ్మీముహూర్తం. అంటే సూర్యోదయానికి 45 నిమిషాలు ముందు. |
| సూర్యుడు | - | నేత్రాలు |
| వాయువు | - | ప్రాణం |
| వైశ్వానరాగ్ని | - | నోరు |
| సంవత్సరం | - | శరీరం |
| ద్యులోకం | - | వీపు |
| అంతరిక్షం | - | ఉదరం |
| భూమి | - | పాదాలు |
| దిక్కులు | - | పార్శ్వ భాగాలు |
| మూలలు | - | పార్శ్వ భాగంలోని ఎముకలు |
| ఋతువులు | - | అంగాలు |
| మాసాలు, పక్షాలు | - | సంధులు |
| నక్షత్రాలు | - | ఎముకలు |
| మేఘాలు | - | మాంసం |
| ఇసుక | - | సగం జీర్ణమైన అన్నం |
| నదులు | - | నాడులు |
| పర్వతాలు | - | యకృత్ |
| క్లోమాలు | - | మాంస ఖండాలు |
| ఓషధులు, వనస్పతులు | - | వెంట్రుకలు |
| మధ్యాహ్న కాలం వరకు పైకి పోయే సూర్యుడు | - | నాభికి పైభాగం |

మధ్యాహ్నం నుండి క్రిందికి

| | | |
|---|---|---|
| దిగే సూర్యుడు | - | నాభికి క్రింది భాగం |
| మెరుపు | - | ఆవలింత |
| మేఘగర్జన | - | శరీరాన్ని విదల్చటం |
| వర్షం | - | మూత్రం |
| వాక్కు | - | సకిలింపు |

ఈ రకంగా యాగాశ్వంలో కాలము, లోకాలు, దేవతలు అన్నీ ఆరోపించబడ్డాయి. అశ్వానికి ముందు భాగంలో ఉంచే స్వర్ణపాత్ర పగలు. దానికి జన్మస్థానం తూర్పు సముద్రం. అశ్వానికి వెనుక ఉంచే వెండి పాత్ర రాత్రి. దాని జన్మస్థానం పశ్చిమ సముద్రం. ఈ గుర్రమే.

| | | |
|---|---|---|
| హయమై | - | దేవతలను మోసింది |
| వాజియై | - | గంధర్వుల్ని మోసింది |
| అశ్వమై | - | మానవుల్ని మోసింది |

సముద్రమే అంటే పరమాత్మయే దీన్ని బంధించి ఉంచేచోటు. పరమాత్మయే దీని ఉత్పత్తి స్థానం.

మనస్సు మొదలైన వాని పుట్టుకకు పూర్వం ఈ విశ్వంలో నామరూపాలుగా విభక్తమైనది ఏదీలేదు. కార్యమూ కారణమూలేవు. అంతా ఆకలి రూపంలో ఉన్న మృత్యుదేవత చేత ఆవరించబడి ఉండేది. ఆకలి కలగగానే దాన్ని తీర్చుకోటానికి దేనినో ఒక దాన్ని చంపుతారు. కాబట్టి ఆకలే మృత్యువు. ఆ సమయంలో హిరణ్యగర్భుడు మనస్సుతో కూడిన వాడుగా ఉండాలనుకొని మనస్సును సృష్టించాడు. అర్చన చేస్తూ ఆచరణ ప్రారంభించాడు. అతడు చేసిన అర్చన వల్ల జలం పుట్టింది. పూజ చేస్తుండగా నాకు జలం లభించింది. కాబట్టి ఇదే 'అర్కా'నికి 'అర్కత్వం' అనుకున్నాడు. అశ్వమేధంలో ఉపయోగించే విరాట్ అగ్నికి 'అర్క' మని పేరు ఈ విధంగా వచ్చింది. ఈరకంగా అర్కానికి అర్కత్వం తెలుసుకున్నవాడు నిశ్చయంగా జలాన్ని, సుఖాన్ని పొందుతాడు.

జలమే అర్కము. ఆ జలంలో సారభూతమైన నురుగులాంటిది. నేతి ముద్దలాగా, స్థూల భాగంగా ఘనీభవించి భూమిగా మారింది. అంటే జలంలోంచి భూమి పుట్టింది. ఈ రకంగా భూమి ఉద్భవించేప్పటికి ప్రజాపతి అలసిపోయాడు. అలసిపోయిన అతని శరీరం నుంచి సారవంతమైన తేజోరసం (అగ్ని) పుట్టింది. ఈ విధంగా జలం నుంచి విరాట్స్వరూపమైన అగ్ని పుట్టింది.

ప్రజాపతి తనను తాను మూడు భాగాలు విభజిచుకున్నాడు. అగ్ని వాయువులతో పాటు ఆదిత్యుని  కూడా గ్రహించాడు. విరాట్ స్వరూపం నుండి పుట్టిన హిరణ్యాగర్భుని (అగ్ని) యొక్క అవయవాలు.

| | | |
|---|---|---|
| తూర్పు దిక్కు | - | శిరస్సు |
| ఈశాన్యము, ఆగ్నేయము | - | భుజాలు |
| పశ్చిమ దిక్కు | - | పుచ్ఛం |
| వాయువ్యము, నైరుతి | - | తొడలు |
| దక్షిణ, ఉత్తర దిక్కులు | - | పార్శ్వాలు |
| ద్యులోకం | - | పృష్ఠము (వీపు) |
| అంతరిక్షం | - | ఉదరం |
| పృథివి | - | హృదయం |

అగ్ని స్వరూపంలో ఉండే ప్రథమ ప్రజాపతి జలంలో ఉంటాడు. ఈ విధంగా అగ్ని జలంలో ఉన్నట్లు తెలుసుకున్న వాడు ఎక్కడికి వెళ్ళినా స్థిరమైన విశ్రాంతి స్థానం లభిస్తుంది. ఇది అనుషంగిక ఫలం. అగ్ని జలంలో విశ్రమించటమనే గుణాన్ని ఉపాసించినందువల్ల వచ్చే ఫలం. అంతేగాని ఆ గుణాలు గల ప్రజాపతిని ఉపాసించటం వల్ల వచ్చే ఫలం కాదు.

ఆ హిరణ్యాగర్భుడు తనకు రెండవ శరీరం కావాలని కోరుకున్నాడు. అలా అనుకొని, ఆకలి రూపంలో ఉన్న మృత్యుప్రజాపతి తన మనస్సులో వేదత్రయాన్ని గురించి ఆలోచించాడు. అంటే విహితమైన సృష్టి క్రమాన్ని గురించి ఆలోచించాడు. ఆవిధంగా ఆలోచించటంవల్ల కలిగిన వీర్యమే సంవత్సరమైనది. అంతకు పూర్వం సంవత్సరమనేది లేదు. సంవత్సరమనే మృత్యురూపుడైన ప్రజాపతి, గర్భస్థుడై ఉన్నటి ప్రజాపతిని సంవత్సరకాలం గర్భంలో మోశాడు. సంవత్సర కాలం తరువాత ఆ ప్రజాపతిని సృష్టించాడు. ఆ విధంగా మొట్టమొదటి సారిగా శరీరం ధరించిన ఆ బాలుని మ్రింగటానికి మృత్యు రూపుడైన ప్రజాపతి నోరు తెరిచాడు. స్వాభావికమైన అవిద్యకారణంగా భయపడిన ఆ బాలు 'బాణ్' అనే శబ్దం చేశాడు. ఆ శబ్దమే వాక్కు అయింది. ఆ కేక విని మృత్యు ప్రజాపతి "ఈ బాలుణ్ణి తింటే నాకు లభించేది చాలా తక్కువ ఆహారం". అని తలచి ఆ బాలుణ్ణి తినలేదు. ఆ వాక్కు ద్వారా

వేదాలు, ఛందస్సు, యజ్ఞం, ప్రజలు, పశువులు వీటిన్నింటినీ సృష్టించాడు. అతడు సృష్టించిన వస్తువులన్నింటినీ తాను తిందామనుకున్నాడు - తింటున్నాడు. అందుకనే అతడికి మృత్యురూప ప్రజాపతి అని పేరు వచ్చింది. ఈ విధంగా మృత్యుదేవత యొక్క తినటమనే స్వభావాన్ని తెలుసుకున్నవాడు అన్నింటికి తానుభోక్త అవుతాడు. ఇవన్నీ అతనికి అన్నమవుతాయి.

ప్రజాపతి మళ్ళీ తాను గొప్పదైన అశ్వమేధంలాటి యజ్ఞాల ద్వారా యజనం చెయ్యాలనుకున్నాడు. తపస్సు చేశాడు తపస్సు చేసి అలసిపోయిన అతని శరీరం నుంచి (మృత్యు ప్రజాపతి శరీరంనుంచి) యశస్సు, బలము దూరమైనాయి. చక్షురాది ఇంద్రియాలు, ప్రాణం ఇవే అతని యశస్సు బలము. ఇంద్రియాలే యశస్సు. ప్రాణమే - వీర్యం. ఈ రెండు దూరమైపోగానే శరీరం ఉబ్బిపోవటం ప్రారంభమైంది. ఇంత జరిగినా మనస్సు మాత్రం శరీరంలోనే ఉన్నది.

"నా యీ శరీరం యజ్ఞానికి యోగ్యమైనదిగా కావాలి. నేను ఈ శరీరంతో శరీరధురిని కావాలి. యశస్సు, బలము లేక శరీరం ఉబ్బిపోయింది.

"నా యీ శరీరం యజ్ఞానికి యోగ్యమైనదిగా కావాలి. నేను ఈ శరీరంతో శరీరధారిని కావాలి. యశస్సు బలము లేక శరీరం ఉబ్బిపోయింది. కాబట్టి నేను కొత్త శరీరం ధరించాలి' అనుకున్నాడు. యజ్ఞానికి తగిన అశ్వం అయినాడు. అందుకనే ఆ యజ్ఞానికి అశ్వమేధమనే పేరు వచ్చింది. అలా అశ్వరూపంలో ఒక సంవత్సరం ఉండి తరువాత దానిని తన కోసమే బలి ఇచ్చాడు. ఇతరమైన గ్రామ్య, అరణ్యక పశువుల్ని ఇతర దేవతల కోసం పంపాడు. ఈ మండుతున్న సూర్యుడే అశ్వమేధము. ఈ శరీరమే సంవత్సరం. భూమిమీది అగ్నియే అర్కం. ప్రపంచాలన్నీ అవయవాలు కాబట్టి అగ్ని, సూర్యుడు ఈ రెండూ అర్కము, అశ్వమేధమయినాయి. ఈ రెండూ కలిస్తే ఆ మృత్యుప్రజాపతి.

ఈ అర్కానికి భూః భువః సువః అనే లోకాలు అవయవాలు. ఈ యాగానికి ఫలం అదిత్యుడు. అగ్ని ఆదిత్యుడు. ఈ రెండింటి తాదాత్మ్యం వల్ల అయిన ఒకే దేవత మృత్యుప్రజాపతి. కాబట్టి 'నేనే అశ్వమేధ రూపమైన మృత్యువుని అశ్వము - అగ్ని ఈ రెండింటి వల్ల సిద్ధించిన దేవతా స్వరూపమే నాది" అని ఉపాసించేవాడికి అశ్వమేధాన్ని ప్రజాపతిగా భావించి ఉపాసన చేసేవాడికి పునర్జన్మ ఉండదు. అతడు దేవతలలో ఒకడౌతాడు' అంటూ అశ్వమేధాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 48. ముఖ్యప్రాణోపాసన (బృహదారణ్యకోపనిషత్తు-2)

"శిష్యులారా ! దేవతలు ముఖ్య ప్రాణాన్ని ఉపాసన చేసి తద్వారా అసురుల మీద విజయం సాధించారు. మీకా విషయం చెబుతాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

దేవదానవులిద్దరూ ప్రజాపతి పుత్రులే. కాని వారిలో దేవతల సంఖ్య తక్కువ. అసురుల సంఖ్య ఎక్కువ. వారి వారి ప్రవృత్తిని బట్టే దేవాసురులని విభాగం జరిగింది. దేవతలు మంచి చెడులకు, ధర్మా ధర్మాలకు, న్యాయా న్యాయాలకు ప్రతీకలు. అందుచేత మంచి, ధర్మము, న్యాయము కలవారంతా దేవతలయ్యారు. అవి లేనివారు అసురులు. వీరిద్దరి మధ్య ఎప్పుడూ యుద్ధం జరుగుతూనే ఉంటుంది. ఆ యుద్ధంలో తాత్కాలికంగా అధర్మం జయించినా, చివరకు ధర్మానికే విజయం లభించేది. ప్రతీసారి అసురులను జయించటం కష్టమయ్యేది. అందుకని దేవతలు ఉద్గీతను ఉపాసించి తద్వారా అసురుల మీద విజయం సాధించాలనుకున్నారు. యజ్ఞంలో సామవేద పారాయణ చేసేవాణ్ణి ఉద్గాత అంటారు.

ఈ విధంగా ఆలోచించిన దేవతలు ముందుగా వాగింద్రియంతో నువ్వు మా కోసం ఉద్గాత చేసే పని చెయ్యమన్నారు. జ్యోతిష్టోమ యాగంలో ఉద్గాత 12 మంత్రాలు చదవాలి. అదే అతడి పని. వాగింద్రియం అందుకు సరేనంది. దేవతల కోసం ఉద్గానం చేసింది. అందులో ఉన్న భోగాన్ని దేవతల కోసం కాగా, అందులోని స్పష్టమైన, నిర్దుష్టమైన ఉచ్చారణను తన కోసం గానం చేసింది. ఈ ఉద్గానం వల్ల దేవతలు తమను జయిస్తారని భయపడ్డ రాక్షసులు పాపంతో వాగింద్రియాన్ని హింసించారు. అందువల్ల వాక్కు తన శక్తిని కోల్పోయింది. మన నోటి వెంట వచ్చే వాటిలో అపశబ్దాలు, అబద్ధాలు, నిషిద్ధమైన మాటలు ఈ కారణంగానే వస్తాయి. అనరాని మాటలు ఉచ్చరించటమే పాపం. అందుచేత వాక్కులో ఉద్గాన మహాత్మ్యం తగ్గిపోయింది.

తరువాత దేవతలు ముక్కును ఆశ్రయించి నువ్వు మా కోసం ఉద్గానం చెయ్యి' అన్నారు. సరేనంది ముక్కు. దేవతల కోసం ఉద్గానం చేసింది. అందులోని సామాన్య భోగాన్ని దేవతల కోసం కాగా చక్కటి ఘ్రాణశక్తిని తన కోసం ఉపయోగించుకుంది. అసురులకీ విషయం తెలిసింది. ఈ ఉద్గానం ద్వారా దేవతలు తమను జయిస్తారేమో అని భయపడి ఘ్రాణశక్తిని పాపంతో కొట్టారు. దాని ఫలితంగానే ముక్కు అనర్హమైన వాటిని పీల్చటం మొదలుపెట్టింది.

తరువాత దేవతలు చక్షురింద్రియంతో నువ్వు మా కోసం ఉద్గానం చెయ్యాలి అన్నారు. సరేనంది చక్షువు. ఉద్గానం చేసింది. అందులోని సామాన్య భోగాన్ని దేవతలకిచ్చి మంచి

దృశ్యశక్తిని తన కోసం ఉంచుకుంది. దీని ద్వారా దేవతలు తమను జయిస్తారేమో అని భయపడి అసురులు చక్షువును పాపంతో కొట్టారు. దాని ఫలితంగానే చక్షువు చూడకూడని దృశ్యాలు చూస్తున్నది.

ఆ తరువాత దేవతలు శ్రోత్రేంద్రియంతో నువ్వు మా కోసం ఉద్గానం చెయ్యాలి అన్నారు. సరేనంది. శ్రోత్రం ఉద్గానం చేసింది. అందులోని సామాన్య భోగాన్ని దేవతలకిచ్చి మంచి శ్రవణాన్ని తన కోసం ఉంచుకుంది. దీనిద్వారా దేవతలు తమను జయిస్తారేమోనని భయపడి అసురులు పాపంతో శ్రోత్రేంద్రియాన్ని కొట్టారు. దాని ఫలితంగా శ్రోత్రం వినరాని మాటలు వింటున్నది.

తరువాత దేవతలు మనస్సును నువ్వు మా కోసం ఉద్గానం చెయ్యాలి అన్నారు. సరేనంది మనస్సు. ఉద్గానం చేసింది. అందులోని సామాన్య భోగాలను దేవతలకిచ్చి శుభసంకల్పాన్ని తన కోసం ఉంచుకుంది. దీని ద్వారా దేవతలు తమను గెలుస్తారేమో అని భయపడి అసురులు మనస్సును పాపంతో కొట్టారు. దాని ఫలితంగానే మనస్సు చేయకూడని ఆలోచనలు చేస్తున్నది.

తరువాత దేవతలు ప్రాణాన్ని ఆశ్రయించి నువ్వు మా కోసం ఉద్గానం చెయ్యాలి అన్నారు. సరే అంది ప్రాణం. తనను శరణు వేడిన దేవతల కోసం ఉద్గానం చేసింది. దీని ద్వారా దేవతలు తమను గెలుస్తారేమో అనే భయంతో అసురులు ప్రాణాన్ని పాపంతో కొట్టాలనుకున్నారు. కాని రాతికి తగిలిన మట్టి బెడ్డలాగా పొడిపొడి అయిపోయారు. ప్రాణాన్ని ఢీ కొన్న అసురులు అనేక విధాలుగా ధ్వంసమైపోయారు. అప్పటినుండి దేవతలకు ఊరట కలిగింది. అసురులు దేవతల చేతిలో పరాభూతులైనారు. ఈ విషయాన్ని తెలుసుకున్నవాడు తాను ప్రజాపతి రూపం పొందుతాడు. అతనిని ద్వేషించే వారంతా అతని చేతిలో పరాభవం పొందుతారు.

ఈ విధంగా దైవత్వాన్ని సాధించిన ప్రాణము నోటిలో ఉన్నది. అస్యము అంటే నోరు. అందుకే ప్రాణము అయాస్యమయింది.

దోష భూయిష్టమైన ఇతర అవయవాలకు ఆత్మత్వం సిద్ధించలేదు. ముఖ్యప్రాణం పాపరహితమైంది. అందుకే దానికి ఆత్మత్వం సిద్ధించింది. కాబట్టి మిగిలిన ఇంద్రియాలు ముఖ్యప్రాణాన్ని ఆత్మరూపంలో ఆశ్రయించాయి. పవిత్రమైన ప్రాణానికి మృత్యువు ఎప్పుడూ దూరంగానే ఉంటుంది. మృత్యువు ప్రాణాలు తీసింది అనుకోవటం అంతా భ్రమ, ప్రాణం పోయిన తరువాతనే మృత్యువు అసన్నమవుతుంది. ఇక్కడ అజ్ఞానంవల్ల విషయ వాసనలమీద

ఉండే మమకారమే పాపం. ఈ విషయం తెలుసుకున్న వాడికి మృత్యువు దూరంగా ఉంటుంది.

ప్రాణదేవత వాగాది దేవతల యొక్క పాపరూపమైన మృత్యువును దిగంతాలకు తీసుకుపోయి అక్కడ నిర్జనమైన ప్రదేశంలో ఆ పాపాన్ని పారేసింది. అందుచేతనే పాప రూపంలో ఉండే మృత్యువు తనను చేరకుండా ఉండాలంటే ఇతరుల సంసర్గానికి పోరాదు. అలాగే సీమోల్లంఘన చేయరాదు. హద్దు మీరరాదు.

ప్రాణ దేవత వాగాది ఇంద్రియాలకు సంక్రమించిన పాపరూపమైన మృత్యువును పోగొట్టి మళ్ళీవాటికి ఆదిదైవికమైన దైవత్వాన్ని కలుగచేసింది. ఇంద్రియాలను మృత్యువు నుండి తరింపచేసింది.

వాక్కు మృత్యువు నుంచి తరించటంచేత అగ్ని అయి దేదీప్యమానంగా వెలుగొందింది. ఘ్రాణశక్తి వాయువైంది. చక్షువు ఆదిత్య రూపం పొందింది. శ్రోత్రం దిక్కులైంది. మనస్సు చంద్రుడైంది. ఈ రకంగా ఇంద్రియాలకు దేహంతోగల సంబంధం ఆదిదైవికంగా మారింది. ఈ రకంగా ప్రాణాన్ని ఉపాసన చేసేవాడిని ప్రాణదేవత మృత్యువు నుండి తరింపచేస్తుంది.

తరువాత ప్రాణం తనకు ఆహారం కావటానికి తగిన భక్ష్యాలను ఆగానం చేసింది. అప్పుడు ఇంద్రియాలన్నీ 'ఆ అన్నంలో మాకు కూడా భాగం ఇవ్వు' అన్నాయి. ఆ మాట విన్న ప్రాణం 'మీరంతా అన్ని వైపులనుండి నాలో ప్రవేశించండి' అన్నది. ఇంద్రియాలన్నీ ప్రాణంలో ప్రవేశించాయి. అందుకనే ప్రాణంద్వారా అన్నం తినేటప్పుడు ఇంద్రియాలన్నీ తృప్తి చెందుతాయి. ఈ విధంగా చుట్టాలంతా చేరి ఉన్నవాడు, స్వజనులను భరించేవాడు శ్రేష్ఠుడు వారందరికి నాయకుడు అవుతాడు. స్వజనుల్ని పోషించేవాడు అందరికీ అధిపతి అవుతాడు.

ఈ ప్రాణం అన్ని అవయవాలకు రసం (సారం) కాబట్టి 'అంగిరసం' అయింది. అలాగే ఏ ఆధారము లేకుండా నోటిలో (ఆకాశంలో) ఉన్నందున 'అయాస్య' మయింది. ప్రాణం ఏ అవయవంనుంచైనా తప్పుకుంటే ఆ అవయవం నిర్జీవం అవుతోంది.

ప్రాణమే బ్రహ్మణస్పతి. ఎందుకంటే ప్రాణమే యజుస్సులకు పతి.వాక్కే బ్రహ్మ, లేక యజుస్సు, ఆ యజుస్సుకు పతికాబట్టే బ్రహ్మణస్పతి అయింది. ప్రాణమే సామము. సామశబ్దవాచ్యమైన ముఖ్యప్రాణం యొక్క సంపదను తెలుసుకున్నవాడు ధన సంపన్నుడౌతాడు. ఈ విధంగా ప్రాణాన్ని గురించి తెలుసుకుని ఉపాసన చేసినవాడు సమస్త లోకాలు, భోగాలు పొందుతాడు'' అని చెప్పి ప్రాణోపాసనను పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 49. హిరణ్యగర్భోపాసన (బృహదారణ్యకోపనిషత్తు - 3)

"శిష్యులారా ! ఇప్పటిదాగా 'ప్రాణోపాసన' గురించి వివరించాను. ఇక ఇప్పుడు హిరణ్య గర్భోపాసన వివరిస్తాను వినండి" అంటూ మొదలుపెట్టాడు రత్నాకరుడు.

ఈ సృష్టికి పూర్వం మానవాకారంలో ఉన్న విరాడాత్మ మాత్రమే ఉన్నది. అతనికన్న భిన్నమైనదేదీ లేదు సర్వాత్మ భావంలో తనను మాత్రమే చూసుకున్నాడు. అంతటా నేనే ఉన్నాను అనుకున్నాడు. ఈ ప్రజాపతిని ఉపాసించేవారు శత్రు నాశనం చెయ్యగలుగుతారు.

పురుషాకారంలో ఉన్న ప్రజాపతి తాను ఒక్కడే అయి ఉండికూడా భయభ్రాంతు డయ్యాడు కాని తాను తప్ప ఇంకెవరూ లేరనే ఆలోచనతో ఆభయాన్ని పోగొట్టుకున్నాడు. అయితే ఒంటరిగా ఉన్న ప్రజాపతి ఒంటరి తనంలోని ఆనందాన్ని అనుభవించలేక పోయాడు. అందుచేత ప్రజాపతి స్త్రీని కోరాడు. అలా కోరిన వెంటనే స్త్రీ పురుషులు పరస్పరాలింగనం చేసుకున్నట్లుగా రూపుదాల్చాడు. తన శరీరాన్ని రెండు భాగాలుగా చేశాడు. అవే పతిపత్ని. అందుచేతనే లౌకిక శరీరం రెండు దళాలున్న ధాన్యపు గింజలోని ఒక, దళంలాంటిది. ఒక పప్పుబద్దలాంటిది. రెండు దళాలు స్త్రీ పురుషులకు ప్రతి రూపాలు. ఒంటరిగా ఉన్న పురుషుడు ఒక పప్పుబద్ద లేదా దళం లాంటివాడు. అందుచేతనే వివాహమైతేనేగాని పురుషునికి పరిపూర్ణత్వం లభించదు. తరువాత మైధున క్రియవల్ల మానవుల ఉత్పత్తి జరుగుతోంది.

ప్రజాపతి వల్ల కలిగిన 'శతరూప' కుమార్తెలతో రమించటం నిషిద్ధం గదా ! తన నుండి పుట్టిన నాతో ఈ ప్రజాపతి ఏ విధంగా రమిస్తాడు? ఎందుకయినా మంచిది అనుకుని తాను ఆవుగా మారింది. ఇది చూచిన పురుషుడు తాను వృషభమై సంభోగించాడు. అందువల్ల గోసంతతి వృద్ధిచెందింది. తరువాత శతరూపం ఆడ గుర్రమైంది. పురుషుడు మగ గుర్రమై సంభోగించాడు. గుర్రపు జాతి వర్ధిల్లింది. తరువాత ఆమె ఆడ గాడిద అయింది. మనువు మగగాడిద అయి రమించాడు. గాడిదలు పుట్టినాయి. శతరూప గొర్రె అయింది. మనువు గొర్రె పోతు అయినాడు. ఈ రకంగా శతరూప అనేక రూపాలు దాల్చింది. మనువు కుడా అన్ని రూపాలు దాల్చాడు. చీమ మొదలు ఏనుగు వరకు సమస్త జీవరాశులు సృష్టించబడ్డాయి.

ఈ రకంగా సృష్టిచేసిన తరువాత ప్రజాపతి ఈ సృష్టిఅంతా తానే అని తెలుసుకున్నాడు. అందుచేత సృష్టిఅనేది ప్రజాపతికి మారుపేరయింది. ఈ విషయం తెలుసుకున్నవాడు ప్రజాపతిలాగానే తానుకుడా స్రష్ట అవుతాడు.

ఆ తరువాత ప్రజాపతి నోటిలో రెండు చేతులతోనూ బాగా రాపిడి చేశాడు. అగ్ని పుట్టింది. యోని అంటే ఉత్పత్తి స్థానం. వాక్కుకు యోని నోరు. అగ్నికి యోని నోరు. అగ్నిని సృష్టించటం వల్లనే నోటిని, చేతులను దాహరాగ్నులు అంటారు. అగ్ని ఇంద్రుడు మొదలైన దేవతలంతా ప్రజాపతి చేతనే సృష్టించబడ్డారు. ప్రజాపతి సమస్త దేవతా స్వరూపుడు. పిమ్మట ప్రజాపతి వీర్యాన్ని సృష్టించాడు. పల్చగా ఉండే ఆ ద్రవమే 'సోమము' అన్నము - అన్నాదము, అన్నము - భోక్త ఇదంతా ప్రజాపతి చేసిన అతిసృష్టి. ఈ రకంగా ప్రజాపతి తనకు మించిన దేవతలను సృష్టించాడు. తాను మరణధర్ముడైనా అమరణ ధర్ములైన వారిని సృష్టించాడు. అందుచేతనే ఇది అతిసృష్టి. ఈ విధంగా ప్రజాపతిని తెలుసుకుని ఉపాసన చేసినవాడు జగత్స్రష్ట అవుతాడు.

మొట్టమొదటగా జగత్తంతా అవ్యక్తంగా ఉండేది. తరువాత ఆ జగత్తే నామరూపాలతో కూడి వ్యక్తమయింది. అందుచేతనే ఇప్పుడు మనం జీవరాశుల పుట్టుకను నామరూపాలతో గుర్తిస్తున్నాము. ఈ విధంగా పురుషుడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. ప్రాణక్రియకు కారణమైనందున ప్రాణము, నోటికి కారణమైనందున వాక్కు, దృష్టికి కారణమైనందున నేత్రం, శ్రవణానికి కారణమైనందున శ్రోత్రం, ఆలోచనకు కారణమైనందున మనస్సు అవుతున్నాడు. ఇవన్నీ అతడు చేసే పనులు కాబట్టి వీటిని వేరువేరుగా ఉపాసించేవారు అతని గురించి తెలుసుకోలేరు. ఒక్కొక్క పరిస్థితిలో ఒక్కొక్క విశేషణంతో కూడి ఉంటాడు. అందుచేతనే అతడే ఆత్మ అని ప్రజాపతిని ఉపాసించాలి. వేరువేరుగా ఉన్నా నామరూపాలన్నీ ఆత్మలోనే కలసిపోతాయి. జీవులన్నీ పొందవలసినది ఆత్మనే. ఆత్మను గురించి తెలుసుకున్నట్లయితే, జగత్తును గురించి తెలుసుకోగలగుతాడు. ఆత్మను ఆయా ఇంద్రియాల ద్వారా గుర్తించినవాడు కీర్తిని, కోరినవారి సమాగమాన్ని పొందుతాడు. అందుకే ఆత్మను ప్రియతమైనదిగా భావించాలి. అలాకాకుండా అనాత్మ పదార్థాలను ప్రియమైనవిగా భావించేవాడి ఆత్మ పతనమై పోతుంది. ఎవరైతే ఆత్మతత్త్వాన్ని ఉపాసిస్తారో వారికి లౌకిక పదార్థాలు అప్రియమవుతాయి.

సృష్టికి పూర్వం నామరూపాత్మకంగా కనిపించే ఈ విశ్వమంతా పరబ్రహ్మస్వరూపమే. అతడు అనంతుడు. అతణ్ణి గురించి తెలుసుకున్న దేవతలు కుడా బ్రహ్మస్వరూపులైనారు. అలాగే ఋషులలోను, మునులలోను కూడా బ్రహ్మను గురించి తెలుసుకున్నవారు బ్రహ్మస్వరూపులే అయినారు. ఈ తత్త్వాన్ని తెలుసుకున్నవాడు సర్వ స్వరూపుడవుతాడు.

అటువంటి తత్త్వవేత్తను దేవతలు కుడా అధిగమించలేరు. తను వేరు, తను పూజించే దైవం వేరు అని భావించి తనకన్న వేరైన దేవతలను ఉపాసించేవాడు పరబ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోలేడు. అతడు గంధపు చెక్కలు మోసే గాడిదతో సమానమైనవాడు. ఇటువంటి వారు హవిస్సు, నివేదన దేవతల కర్పించి వారిని పోషిస్తుంటారు. మానవుడు తత్త్వజ్ఞాని అయితే ఇటువంటి హవిస్సులు, నివేదనలు దేవతలకు అందవు. అందుచేత మానవుడు తత్త్వజ్ఞాని కావటం వారికి ఇష్టం ఉండదు. అందుకనే మానవులకు అనేక రకాలయిన వరాలిచ్చి వారిని మాయలో ముంచి ఉంచుతారు.

నామరూపాత్మకమైన సృష్టికి ఆరంభంలో ఉన్నది పరబ్రహ్మ స్వరూపము. అంటే విరాట్ స్వరూపంలో ఉన్న అగ్ని. అదే బ్రాహ్మణ రూపం. అంతవరకు క్షత్రియాది ఇతర వర్ణాలు లేవు. క్షత్రియులు లేకపోవటం వల్ల పాలనావ్యవహారాలు కష్టమైనాయి. అప్పుడా విరాట్ బ్రహ్మ "నేను బ్రాహ్మణుడను, ఇవి నావిధులు'' అని తలచి క్షత్రియ రూపాన్ని సృష్టించాడు. దేవతలలో ఇంద్రుడు, సోముడు, వరుణుడు, రుద్రుడు, మేఘుడు, యముడు, మృత్యువు, ఈశానుడు వీరంతా క్షత్రియులు. విరాట్ ప్రజాపతి క్షత్రియుల్ని ప్రత్యేక ప్రయోజనం కోసం సృష్టించాడు. వారు బ్రాహ్మణులకు రక్షకులు. అందుచేతనే దేవక్షత్రియుల్ని సృష్టించాడు. ఈ క్షత్రియుల్ని మించినవారులేరు. కాబట్టే రాజసూయంలో బ్రాహ్మణులే క్షత్రియుల్ని పూజిస్తారు. ఆ క్షత్రియుల్లోనే బ్రహ్మ నామరూపాత్మకమైన తన కీర్తిని స్థాపిస్తున్నాడు. బ్రహ్మ ఈ క్షత్రియులకు యోని - అంటే ఉత్పత్తి స్థానము. అందుకనే క్షత్రియుడు ఈ గొప్పతనాన్ని పొందినా రాజసూయం పూర్తయిన తరువాత మళ్ళీ తన జన్మకు కారణమైన బ్రాహ్మణులనే ఆశ్రయిస్తాడు. బ్రాహ్మణుణ్ణి గనక క్షత్రియుడు పీడిస్తే, తన ఉత్పత్తి స్థానాన్ని తాను నాశనం చేసుకున్నవాడవుతాడు.

క్షత్రియుల్ని సృష్టించిన తరువాతకూడా బ్రహ్మ తనపనిలో తాను కృతకృత్యుడు కాలేదు. సంపాదనను, ధనాన్ని కూడబెట్టేవాడు లేకపోవటంవల్ల తనపనిలో సమర్థుడు కాలేకపోయాడు. అందుచేత బ్రహ్మ వైశ్యజాతిని సృష్టించాడు. వసువులు, రుద్రులు, ఆదిత్యులు, విశ్వేదేవులు, మరుత్తులు మొదలైన దేవతలను గణాలుగా సృష్టించాడు. వైశ్యులంతా గణాలుగా, సమూహాలుగా సృష్టించబడ్డారు. చేస్తారు. వీరిలో వసువులు ఎనిమిది మంది, రుద్రులు పదకొండుమంది, ఆదిత్యులు పన్నెండు మంది, విశ్వదేవులు పదముగ్గురు, మరుద్గణాలు నలభై తొమ్మిది మంది. వీరు దేవవైశ్యులు.

సేవకులు లేకపోవటంవల్ల బ్రహ్మ తన పనిలో సమర్థుడు కాలేకపోయాడు. అందుచేత శూద్రులను సృష్టించాడు. పూషుడు శూద్రవర్ణుడు. భూమియే పూష . పూషా దేవతయే (భూమి) అందర్నీ పోషిస్తోంది.

ఈ విధంగా నాలుగు వర్ణాల వారిని సృష్టించిన బ్రహ్మ అగ్ని రూపంలో దేవతలలోను, మనుష్యులలో బ్రాహ్మణుడుగా, క్షత్రియ రూపంలో క్షత్రియుడుగా, వైశ్యరూపంలో వైశ్యుడుగా ఉన్నాడు. కాబట్టి బ్రాహ్మణునిలో అగ్నిరూపం, బ్రాహ్మణరూపం రెండూ ఉన్నాయి. అందుకనే అగ్నిలో హవనం చేసి, బ్రాహ్మణునికి దానమిచ్చి పరలోక ప్రాప్తిని కోరుకుంటారు. అధ్యయనంలేని వేదము, అనుష్ఠానంలేని కర్మ పురుషుణ్ణి కాపాడవు. ఆత్మజ్ఞానం లేని పురుషుడు పుణ్యకర్మలు చేసినా ఏమీ ఫలితం ఉండదు. ఆత్మజ్ఞానం లేనిదే శోక నివృత్తికాదు. ఆత్మ వల్లనే మానవుడు తనకు కావలసినవన్నీ సృష్టించుకోగలుగుతాడు.

కర్మాధికారి, అజ్ఞాని అయినవాని ఆత్మ జీవరాసులన్నింటికీ భోగ వస్తువు అవుతుంది. అతడు చేసే హోమము, యజ్ఞం వల్ల దేవతలు ఆనందిస్తారు. అతడు చదివే వేదం వల్ల ఋషులు ఆనందిస్తారు. అతడు చేసే పిండప్రదానం వల్ల పితృదేవతలు ఆనందిస్తారు. ఆశ్రయము ఇవ్వటం వల్ల, భోజనం పెట్టటం వల్ల మానవులకు, గడ్డి, నీరు ఇవ్వటం వల్ల పశువులకు ఆనందం కలుగచేస్తాడు. ఇతని ఇంటిలో ఉండే పిల్లులు, కుక్కలు, చీమలు అన్నీ సుఖపడతాయి. దేవ, ఋషి, పితృ గణాలన్నీ ఇతని క్షేమం కోరతాయి. ఇటువంటి కర్మాధికారులు ఆత్మజ్ఞానం సంపాదించటం దేవతలకు ఇష్టముండదు.

ఈ విధంగా నాలుగు వర్ణముల వారిని, జగత్తును సృష్టించిన హిరణ్యగర్భ ప్రజాపతిని ఉపాసన చేసినవాడు సర్వలోకాలు, సర్వసుఖాలు పొందుతాడు''. అని చెబుతూ హిరణ్యగర్భోపాసన గురించి వివరించాడు. రత్నాకరుడు.

## 50. ఏడు విధాల అన్నాలు (బృహదారణ్యకోపనిషత్తు - 4)

"శిష్యులారా ! ఇంత వరకు అవిద్యతో కూడిన, వర్ణాశ్రమాభిమాని అయిన పురుషుడు కర్మలద్వారా దేవతలకు, సమస్త జీవులకు ఏ విధంగా భోగ్యమవుతున్నాడో చెప్పడం జరిగింది. ఇప్పుడు కర్మద్వారా ఏడువిధాల అన్నాలను సృష్టించినట్లు చెప్పబడింది. మీకు ఆవిషయం వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ప్రజాపతి విజ్ఞానం ద్వారా, కర్మల ద్వారా ఏడురకాల అన్నాలను సృష్టించాడు. వాటిలో యవాది రూపమైన అన్నం సాధారణమైనది. అదే అన్ని ప్రాణులకు అవసరమైనది. యోగ్యమైనది. ప్రజాపతి హుతము, ప్రహృతము అనే రెండు విధాలయిన అన్నాలను దేవతల కోసం ఇచ్చాడు. మూడు విధాలయిన అన్నాలు తన కోసం ఉంచుకున్నాడు. పాలు అనే అన్నాన్ని పశువులకు ఇచ్చాడు. ప్రాణులతో అన్నం ఎల్లప్పుడూ భక్షింపబడుతూ ఉంటుంది. అయినప్పటికీ అన్నం తరిగిపోదు. ఈ విషయం తెలుసుకుని అన్నాన్ని ఉపాసించేవాడు. దేవభావాన్ని, అమృతత్వాన్ని పొందుతాడు.

ప్రజాపతి జ్ఞానం ద్వారా, కర్మల ద్వారా సప్తాన్నాలను సృష్టించాడు. అందులో ఒక అన్నం మనమంతా తినేది. అది ధ్యానం రూపంలో ఉంటుంది. ఈ అన్నం అన్ని ప్రాణులలోనూ కలసి ఉంటుంది. కాబట్టి సాధారణమైన అన్నాన్ని ఉపాసించేవాడు పాప విముక్తుడౌతాడు.

ప్రజాపతి హుతము, ప్రహృతము అనే రెండు రకాల అన్నాలను దేవతలకోసం విభజించి ఇచ్చాడు. అందుకనే గృహస్థులు బలి (నైవేద్యముగా ఇచ్చేది) హవనము (దేవతల కోసం హోమం చేసేది) ఇస్తుంటారు. దేవతలకు ఇచ్చే ఈ రెండు రకాల అన్నాలను దర్శము, పూర్ణమాసము అనే యజ్ఞాలు అంటారు.

పాలు అనే అన్నాన్ని సృష్టించి పశువులకు ఇచ్చాడు ప్రజాపతి. పశువులతో పాటుగా మానవుడుకూడా ముందుగా పాలుత్రాగే బ్రతుకుతున్నాడు. అందుకే పుట్టిన వెంటనే శిశువుకు, దూడకుకూడా పాలే ఇస్తారు. పాలతో హవనం చేసేవాడు అపమృత్యువును జయిస్తాడు. ఈ విధంగా ఉపాసన చేసినవాడు దేవతలకు పూర్తిగా భక్ష్యప్రదానం



2

చేసినవాడవుతాడు. ఈ రకంగా అందరిచేతా భక్షించబడుతున్నప్పటికీ, అన్నం పూర్తిగా నాశనం కాదు. పురుషుడు అవసరమైనప్పుడల్లా అన్నాన్ని ఉత్పత్తి చేస్తాడు. ఈ రకంగా అన్నానికున్న 'అవినాశత్వాన్ని' అంటే నాశనం లేకపోవటాన్ని తెలుసుకున్న పురుషుడు కుడా 'అవినాశి' నాశనం లేని వాడవుతున్నాడు. పురుషుడు జ్ఞానంద్వారా, కర్మద్వారా అన్నాన్ని సృష్టిస్తాడు. ఈ విధంగా ఎప్పటికప్పుడు సృష్టించకపోతే అన్నం నాశనమైపోతుంది. ఈ విషయము తెలుసుకున్నవాడు ముఖముద్వారా అన్న భక్షణ చేస్తాడు. తద్వారా దైవత్వాన్ని, అమృతాన్ని, అమృతత్వాన్ని పొందుతాడు.

ఆ తరువాత ప్రజాపతి మనస్సు, వాక్కు, ప్రాణము అనే మూడు విధాల అన్నాలను తన కోసం సృష్టించుకున్నాడు. మనస్సుతోనే వినటము, చూడటము జరుగుతుంది. కోరిక, సంకల్పము, సంశయము, శ్రద్ధ, అశ్రద్ధ, లజ్జ, బుద్ధి, భయం ఇవన్నీ మనస్సు యొక్క కల్పాలే. అందుచేతనే కంటితో చూడనివాటిని కుడా మనస్సుతో తెలుసుకోగలుగుతున్నాము. అదే విధంగా ఏవిధమైన శబ్దమైనా వాక్కే. వాక్కు ఒక వస్తువును ఫలానా అని నిర్ణయిస్తుంది. కాని తాను మాత్రం కనుపించదు. ఇక ప్రాణము ఐదు రకాలు. 1) ప్రాణము, 2) అపానము 3) వ్యానము 4) ఉదానము 5) సమానము. శరీరము మనస్సు, వాక్కు, ప్రాణముల వల్లనే గుర్తించబడుతోంది. ఈ మూడు మూడు లోకాలు, మూడు వేదాలు, దేవపితృమానవులు.

వాక్కు - భూలోకము, ఋగ్వేదము, దేవతా స్వరూపము తల్లి.

మనస్సు - భూవర్లోకము (అంతరిక్షము), యజుర్వేదము, పితృదేవత తండ్రి

ప్రాణము - సువర్లోకము (స్వర్గము) సామవేదము, మానవులు సంతానము.

తెలిసినది, తెలుసుకోవలసినది కుడా ఈ మూడే. వాక్కే విజ్ఞాతమై ఈ విషయం తెలుసుకున్న వారిని రక్షిస్తుంది. మనస్సు సంశయాత్మకమైనది. ఈ విషయం తెలుసుకున్న వారిని మనస్సే రక్షిస్తుంది. మనకు తెలియనిదంతా ప్రాణస్వరూపమే. ప్రాణాన్ని గురించి తెలుసుకున్నవారిని ప్రాణమే కాపాడి రక్షిస్తుంది.


ప్రజాపతికి అన్న స్వరూపమైన వాక్కుకు భూమియే శరీరం, బాహ్యాధారం. ప్రజాపతికి రెండు విధాలైన వాక్కు ఉంది. 1) ప్రకాశక రూపం. 2) అప్రకాశక రూపం. భూమి అగ్ని, ఈ రెండూ కుడా హిరణ్యగర్భుని వాగింద్రియమే. వాక్కు వ్యాపించినంత వరకు భూమి, భూమి ఉన్నంత మేర అగ్ని వ్యాపించి ఉంటుంది.

అన్న స్వరూపమైన మనస్సుకు ఆధారం (శరీరం) ద్యులోకం. సూర్యుడు జ్యోతి స్వరూపం. మనస్సు వ్యాపించినంత మేర ద్యులోకము, ద్యులోకం వ్యాపించినంతమేర సూర్యుడు వ్యాపించి ఉంటారు.

ప్రాణానికి ఆధారం జలం. చంద్రుడు జ్యోతి రూపుడు. ప్రాణం విస్తరించినంత మేర జలం, జలం విస్తరించినంత మేర చంద్రుడు విస్తరించి ఉంటారు.

ఈ రకంగా వాక్కు, మనస్సు, ప్రాణము రూపంగా కలిగి ఉన్న ప్రజాపతికి పదహారు దళాలున్నాయి. వీటిలో పదిహేను తిథులు కాగా పదహారవది నిత్యమైన కళ. సంవత్సర రూపుడైన ప్రజాపతి పదహారవ కళతో అన్ని జీవులందు ప్రవేశించి, మరునాడు ఉదయం రెండవ కళతో కూడినవాడై ఉద్భవిస్తాడు. అందుచేతనే అమావాస్య నాటి రాత్రి ఏ జీవినీ చంపరాదు.

ఈ రకంగా మూడు రకాల అన్నాలు గల ప్రజాపతిని గురించి తెలుసుకున్న వారికి ధనమే పదిహేను కళలు. శరీరమే పదహారవ కళ. అతడు చంద్రునిలాగా ఆవులు, గుర్రాలు, మొదలైన సంపదతో వృద్ధిచెందుతాడు. అంటూ ప్రజాపతి సృష్టించిన ఏడురకాల అన్నాలను గురించి వివరించి బృహదారణ్యకోపనిషత్తులోని మొదటి అధ్యాయాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.



# 51. బాలాకి (బృహదారణ్యకోపనిషత్తు - 5)

'శిష్యులారా ! కొంచెం తెలిసినంత మాత్రం చేతనే అంతా తెలుసునని అనుకోకూడదు. గార్గ్యగోత్రంలో పుట్టిన బాలాకి అనేవాడు బ్రహ్మోపదేశం చేస్తానని కాశీరాజు దగ్గరకు వెళ్ళి, చివరకు ఆయన దగ్గరే బ్రహ్మోపదేశం పొంది వచ్చాడు. మీకు ఆకథ చెబుతాను వినవలసినది.' అంటూ చెప్పటం ప్రారంభించాడు రత్నాకరుడు.

పూర్వకాలంలో కాశీ నగరాన్ని 'అజాత శత్రువు' అనే రాజు పాలిస్తూండేవాడు. అతడు బ్రహ్మవేత్త. గార్గ్యవంశంలో పుట్టిన బాలాకి అనేవాడు వాచాలుడు, గర్విష్టి. అతడు ఒకసారి కాశీరాజు దగ్గరకు వెళ్ళి "రాజా ! నీకు బ్రహ్మోపదేశం చేస్తాను" అన్నాడు. ఆ మాటలువిన్న కాశీరాజు ఆ బ్రాహ్మణుడికి వేయి గోవులు దానమిచ్చి "ఓ వేదవిదుడా ! బ్రహ్మవేత్తలు, అధ్యాత్మిక చింతనాపరులు అందరూ జనకుని పేరేతలుస్తున్నారు. అతని దగ్గరకే పోతున్నారు. నీ ప్రభావం వల్ల నేనుకూడా బ్రహ్మవేత్తనై జనకునితో సమానమైన వాడనిపించుకుంటాను. కాబట్టి నాకు బ్రహ్మోపదేశం చెయ్యవలసినది" అన్నాడు. బాలాకి చెప్పటం మొదలుపెట్టాడు. ఇతణ్ణే "గార్గ్యుడు" అనికూడా అంటారు.

"రాజా ! సూర్యునిలో ఉన్న పురుషుడే బ్రహ్మ. అతన్నే నేను ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

ఆ మాటలు విన్నరాజు సూర్యుని గురించి నాకు తెలుసును. అతణ్ణి అన్ని భూతాలకు మకుటాయమానంగా కాంతివంతంగా నేను ఉపాసన చేస్తాను. అంతేకాని అతను బ్రహ్మకాదు. ఈ రకంగా సూర్యుని ఉపాసించే వారు రాజవుతారు" అన్నాడు.

"చంద్రునిలో ఉన్న పురుషుని బ్రహ్మగా నేను ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

"చంద్రుడు గొప్పవాడు. తెల్లని వస్త్రాలు ధరించిన సోమరాజు. అంతేకాని చంద్రుడు బ్రహ్మకాదు. ఈరకంగా చంద్రుని ఉపాసన చేసేవారికి అన్నం లోటురాదు." అన్నాడు కాశీరాజు.

"విద్యుత్తులో పుట్టిన పురుషుణ్ణి బ్రహ్మగా ఉపాసన చేస్తాను" అన్నాడు బాలాకి.

"ఆవిద్యుత్తును మహాశక్తివంతమైన దాన్నిగా నేను ఉపాసిస్తాను. అంతేకాని విద్యుత్తు మాత్రం బ్రహ్మకాదు. ఈ రకంగా అతణ్ణి ఉపాసించేవారు సంతానము పొంది తేజోవంతులు, శక్తివంతులు అవుతారు''' అన్నాడు కాశీరాజు.

"ఆకాశంలో ఉన్న పురుషుణ్ణి బ్రహ్మగా ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

"నేను ఆకాశాన్ని పూర్ణమైన దానిగా, నిశ్చలమైనదానిగా భావించి ఉపాసిస్తాను. ఈ విధంగా ఆకాశాన్ని ఉపాసించేవారు సంతానము, పశువులతో సుఖంగా ఉంటారు." అన్నాడు కాశీరాజు.

"నేను వాయువులో ఉన్న పురుషుణ్ణి బ్రహ్మగా ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

"నేను వాయురూపంలో, ఓటమి ఎరుగని సేన చేస్తున్నాను. ఈ విధంగా ఉపాసించే వారు శత్రువులను జయిస్తారు" అన్నాడు రాజు.

"నేను జలంలో ఉండే పురుషుణ్ణి బ్రహ్మగా ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

"జలాన్ని ప్రతిరూపంగా భావించి నేను ఉపాసన చేస్తాను. ఈ విధమైన ఉపాసన చేసిన వారికి అన్నీ వారు కోరిన వస్తువులే లభిస్తాయి." అన్నాడు రాజు.

"అద్దంలో ఉండే పురుషుణ్ణి బ్రహ్మగా భావించి ఉపాసన చేస్తాను." అన్నాడు బాలాకి.

"నేను అద్దంలో ఉండే పురుషుణ్ణి కాంతివంతుడుగా భావించి ఉపాసిస్తాను. ఆ రకంగా ఉపాసించినవాడు దీప్తిమంతుడౌతాడు. అతని సంతానంకూడా దీప్తివంతమవుతుంది. అన్నాడు అజాతశత్రువు.

"మనం నడిచేటప్పుడు వెనుకనుంచి వచ్చే శబ్దాన్ని నేను బ్రహ్మగా భావించి ఉపాసన చేస్తాను" అన్నాడు బాలాకి.

"ఆ విషయం నాకు తెలుసు. నేను ఆ శబ్దాన్ని వాయువు లేక ప్రాణంగా ఉపాసిస్తాను. ఈ రకంగా ఉపాసించేవాడు పూర్ణాయుర్దాయాన్ని పొందుతాడు." అన్నాడు రాజు.

"నేను దిక్కులందుండే పురుషుని బ్రహ్మగా ఉపాసిస్తాను. అన్నాడు బాలాకి.

"ఆ విషయం నాకు తెలుసు. నేనా పురుషుణ్ణి రెండవవాడు కలవానినిగా వేరు చేయబడని వానిగా భావించి ఉపాసిస్తాను. దిక్కులందుండే పురుషుణ్ణి ఈ రకంగా ఉపాసించేవాడు స్నేహితులు, అనుచరులు కలవాడవుతాడు" అన్నాడు రాజు.

"నేను నీడలో ఉండే పురుషుణ్ణి బ్రహ్మగా ఉపాసిస్తాను" అన్నాడు బాలాకి.

"ఆ విషయం నాకు తెలుసు. ఆ ఛాయలో ఉండే పురుషుణ్ణి మృత్యువుగా భావించి నేను ఉపాసిస్తాను. ఈ రకంగా ఉపాసించేవాడు పూర్ణాయుర్దాయుడౌతాడు" అన్నాడు రాజు.

"బుద్ధిలో ఉన్న పురుషుణ్ణి నేను బ్రహ్మగా భావించి ఉపాసన చేస్తాను" అన్నాడు బాలాకి.

"ఆ విషయం నాకు తెలుసు. అతన్ని నేను ఆత్మగల వానిగా ఉపాసిస్తాను. ఈ రకంగా ఉపాసన చేసేవాడు ఆత్మవంతుడౌతాడు. బుద్ధిమంతుడౌతాడు'' అన్నాడు రాజు.

గార్గ్యుడికి ఇంతకన్న విషయం తెలియదు. అందుకని మాట్లాడకుండా ఊరుకున్నాడు. అప్పుడు ఆ బ్రాహ్మణ్ణి చూసి'' "నీకు తెలిసిన బ్రహ్మజ్ఞానం ఇంతేనా ? ఇంకేమైనా ఉన్నదా?' అన్నాడు రాజు.

"ఇంతే ! ఇంకేంలేదు'' అని సమాధానమిచ్చాడు బాలాకి.

"ఈ కొంచెం తెలిసినంత మాత్రం చేత బ్రహ్మజ్ఞానం తెలిసినట్లుకాదు'' అన్నాడు రాజు.

ఆమాటలు విన్న గార్గ్యుడు "రాజా ! నీవే శరణు. నాకు బ్రహ్మోపదేశం చెయ్యి'' అన్నాడు.

అప్పుడు అజాతశత్రువు గార్గ్యుణ్ణి నిద్రపోతున్న ఒక మనిషి దగ్గరకు తీసుకుపోయి "ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడా ! నిద్రలే'' అన్నాడు. అతడు లేవలేదు. చేతితో తట్టిలేపాడు. నిద్రిస్తున్నవాడు లేచి కూర్చున్నాడు.

అప్పుడు రాజు గార్గ్యునితో,"చేతితో తట్టి లేపటానికి పూర్వం పురుషుడు నిద్రిస్తున్నాడు. పిలిచినా లేవలేదు. అప్పుడతడు ఎక్కడ ఉన్నాడు? ఇప్పుడు ఎక్కడ నుంచి వచ్చాడు ?

జీవుడు నిద్రిస్తుండగా ఇంద్రియాల యొక్క విషయాలన్నింటినీ అనగా వాక్కు మొదలైన ప్రాణాల విజ్ఞానాన్ని పూర్తిగా గ్రహించి హృదయాకాశంలో నిద్రిస్తున్నాడు. హృదయాకాశము పరమాత్మ ఉండే చోటు. నిద్రావస్థలో ఉన్నప్పుడు పురుషుడు శరీరము, ఇంద్రియాలను తనలో లీనం చేసుకుంటాడు. ప్రాణాలన్నింటినీ తనలోకి ఆకర్షించుకుంటాడు. వాక్కు, చక్షువు, శ్రోత్రము మొ॥ ఇంద్రియాలు మనస్సుతోసహా లోపలకు ఆకర్షింపబడతాయి. ఆ స్థితిలో క్రియ అనేది ఉండదు. క్రియాఫలం ఉండదు. కాబట్టి ఆత్మ తన నిజస్థితిలో ఉంటుంది.

ఆత్మ స్వప్నావస్థలో ఉన్నప్పుడు దాని కర్మఫలాలు ప్రారంభమవుతాయి. స్వప్న స్థితిలో ఆత్మ మహారాజులాగా ఉంటుంది. గొప్ప బ్రాహ్మణునిలా ఉంటుంది. దేవతలవలె ఉచ్చస్థితులు, అసురులవలె నీచస్థితులు కూడా పొందుతుంది. రాజుగారు తన దేశంలో స్వేచ్ఛగా తిరిగినట్లుగానే, ఆత్మస్వప్నంలో ప్రాణాన్ని, ఇంద్రియాలను గ్రహించి తన దేహంలో యధేచ్ఛగా తిరుగుతుంది. అదే సుషుప్తావస్థలో ఆనందంతో కూడిన స్థితిని పొందుతుంది.

అగ్ని నుండి చిన్న చిన్న రవ్వలు పైకి లేచినట్లుగానే ఆత్మ నుండి అన్ని ప్రాణాలు, ఇంద్రియాలు, లోకాలు, దేవగణాలు, భూతగణాలు, పుడుతున్నాయి. ఇదే ఆత్మకు సంబంధించిన విషయాన్ని వివరించే రహస్యోపనిషత్తు'' అంటూ అజాత శత్రువు అనే రాజు గార్గ్యవంశంలోని బాలాకికి ఆత్మతత్త్వాన్ని ఉపదేశించాడని రత్నాకరుడు తన శిష్యులకు చెప్పాడు.

# 52. ప్రాణం (బృహదారణ్యకోపనిషత్తు - 6)

"శిష్యులారా ! ఇప్పటిదాకా బాలాకికి కాశీరాజాయిన అజాతశత్రువు ఉపదేసించిన బ్రహ్మజ్ఞానం గురించి చెప్పాను. ఇప్పుడు ప్రాణాన్ని గురించి వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ప్రాణమే సత్యం. ప్రపంచం అనేది ఆ సత్యానికి సత్యం - ఆ ప్రాణమనే సత్యానికి చెందినదే ఈ ప్రపంచం అనే సత్యం.

ఆధానము - నివాసము, ప్రత్యాధానము - తిరుగుతూ ఉండే చోటు, దాని కట్టుకొయ్య, పగ్గం మొదలైన వాటితో సహా ఆ కోడెదూడను తెలుసుకున్నవాడు తనకు విరోధులైన ఏడుగురు జ్ఞాతులను వధించగలడు. ఇప్పుడు

| | | |
|---|---|---|
| శరీరంలో ఉండే ప్రాణమే | - | కోడెదూడ |
| శరీరమే | - | దాన్ని కట్టివేసే పాక |
| శరీరంలోని శిరస్సే | - | ప్రత్యాధానము |
| అన్నపానాదుల వల్ల కలిగే శక్తి | - | కట్టుకొయ్య |
| ఆహారమే | - | దాని పగ్గం. |

జ్ఞాతులు రెండు విధాలుగా ఉంటారు. 1) విరోధులు 2) హితులు. విరోధులైన వారు ఏడుగురు. ఇవేతలలో ఉండే ఇంద్రియాలు. చెవులు -2, కనులు - 2, ముక్కు రంధ్రాలు - 2, నోరు - 1 మొత్తం ఏడు. ఈ ఇంద్రియాలన్నీ ఆత్మవైపు చూడవు. వీటికి ఎప్పుడూ విషయవాంఛలందే ఆసక్తి. అందుచేత విరోధులను వధించటమంటే ఇంద్రియనిగ్రహం సాధించటం.

సంచరించే చోట ఉండే కోడెదూడ యొక్క కంటిలో ఉండి ఎప్పుడూ కాపాడుతూ ఉండే ఏడుగురు దేవతలు ప్రాణమనే కోడెను ఎల్లకాలము స్తుతి చేస్తూఉంటారు. వారు.

1. కనులలో ఉండే ఎర్రని గీరల ద్వారా - రుద్రుడు
2. పొగ మొదలైన కారణాల వల్ల కంటిలో కనుపించే నీటి ద్వారా- మేఘుడు
3. కనుపాపద్వారా - ఆదిత్యుడు

4. నల్లగ్రుడ్డు ద్వారా - అగ్ని

5. తెల్లగ్రుడ్డు ద్వారా - ఇంద్రుడు

6. కంటి క్రింది రెప్పద్వారా - భూమి

7. పై రెప్పద్వారా - ద్యులోకము

ప్రాణాన్నికాపాడుతుంటాయి. ఈ విషయాలు తెలుసుకున్న వాడికి అన్నలోపం ఉండదు.

ఒక గిన్నె ఉన్నది. దాని మూతి క్రింది వైపున తెరిచి ఉంది. పై భాగం ఉబ్బెత్తుగా ఉంది. అనేక విధాలయిన జ్ఞానము దానిలో ఉంది. దాని ప్రక్కనే ఏడుగురు ఋషులు, వేదాల ద్వారా వాదము చేసే ఎనిమిదవదయిన వాక్కు ఉన్నాయి. ఆ గిన్నె - శిరస్సుక్రింది భాగంలో తెరచి ఉన్నదే నోరు. పైన ఉబ్బెత్తుగా ఉన్నది పుర్రె. సోమపాత్రలో రసం ఉన్నట్లుగా శిరస్సులో అనేక విధాలయిన జ్ఞానం ఉన్నది. దాని ప్రక్కన ఉన్న ఏడుగురు ఋషులే కనులు, ముక్కులు, చెవులు, నోరు ఎనిమిదవది వాక్కు. వేదాలను పఠించేది నోరే. ఇక్కడ నోరు రెండు రకాలుగా విభజించబడింది. 1) మాట్లాడేది 2) రుచి చూసేది.

ఇక తలలో ఉన్న సప్త ఋషులను చెబుతాను వినండి. శిరస్సులో ఉన్న కనులు, ముక్కులు, చెవులు, నోరు ఇవే సప్త ఋషులు. వీటిలో

| | | |
|---|---|---|
| కుడిచెవి | - | గౌతముడు |
| ఎడమ చెవి | - | భరద్వాజుడు |
| దక్షిణ నేత్రం | - | విశ్వామిత్రుడు |
| వామనేత్రం | - | జమదగ్ని |
| కుడివైపునాసిక | - | వసిష్ఠుడు |
| ఎడమ వైపునాసిక | - | కశ్యపుడు |
| వాక్కు | - | అత్రి |

ఈ విధంగా ప్రాణము యొక్క యదార్థ స్వరూపాన్ని గ్రహించినవాడు అన్నిటిని భక్షించేవాడౌతాడు. అన్నీ అతనికి భోజ్యపదార్థాలవుతాయి. కాని అతడు మాత్రం ఎప్పుడూ భోజ్యంకాడు". అంటూ ప్రాణాన్ని గురించి వివరించాడు రత్నాకరుడు.

## 53. మూర్తము - అమూర్తము (బృహదారణ్యకోపనిషత్తు - 7)

"ఆత్మస్వరూపులారా ! ఇంతవరకు ప్రాణాన్ని గురించి వివరించటం జరిగింది. ఇప్పుడు మూర్తామూర్తాలను గురించి వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఇంద్రియాలకు, శరీరానికి కారణభూతమైన పంచభూతాలను - సత్యం అంటారు. విజ్ఞులు నేతి, నేతి ఇదికాదు, ఇదికాదు అంటూ బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నించారు. పంచభూతాలతో కూడినటువంటి స్థూల, సూక్ష్మ శరీరాలతో సంబంధం ఉన్న బ్రహ్మకు రెండు రూపాలున్నాయి. మూర్తము, అమూర్తము. అవే స్థూలము, సూక్ష్మము మర్త్యరూపము - అమృత రూపము అంటే నశించేది, నశించనిది; చావు ఉన్నది, చావులేనిది. స్థావరం, స్థిరంగా ఉండేది. జంగమం - కదిలేది. సత్తు - నిర్వచించటానికి వీలైనది,త్యత్తు - నిర్విచించటానికి వీలుకానిది.

పంచభూతాలలో పృధివి, జలము, అగ్ని ఈ మూడు మూర్తములు. స్థూలమైనవి. స్థావరమైనవి. నాశనమయి పోయేవి. ఇవి చక్షురాది ఇంద్రియాలకు గోచరిస్తాయి. వీటిని నిర్వచించటానికి వీలవుతుంది. వీటి సారమే ఆకాశంలో ప్రకాశించే సూర్యుడు. ఈ సూర్యుని వల్లనే ఈ మూడు విభజించబడుతున్నాయి.

పంచభూతాలలో మిగిలిన రెండు వాయువు, ఆకాశము అమూర్తాలు. అస్థిరములు, నాశనం లేనివి, నిర్వచించటానికి వీలుకానివి. వీటిసారమే సూర్యునిలో ఉండే పురుషుడు. ఇదే అధిదైవత విషయం.

ప్రాణంకన్న భిన్నమైనది, దేహంలో ఉన్న ఆకాశంకన్న భిన్నమైనది, వాయువు, ఆకాశము కాకుండా మిగిలిన మూడు భూతముల చేత నిర్మించబడిన శరీరం అంతా మూర్తము, మర్త్యము, స్థావరము. అది నాశనమవుతుంది. వీటిసారమే కనులు అంటే పృధివి, జలము, అగ్నిల యొక్కసారమే నేత్రగోళములు.

ప్రాణములు, శరీరములో ఉన్న ఆకాశం, అదే దహరాకాశం. ఈ రెండూ అమూర్తాలు. శాశ్వతమైనవి, నాశనం లేనివి. అనంతమైన అనిర్వచనీయమైన అమూర్తానికి కుడికంటిలో ఉన్న పురుషుడే సారభూతమైనవాడు.

లింగశరీరరూపమైన పురుషుని వాసనామయస్వరూపం పసుపులో ముంచిన వస్త్రంలాగా తెల్లని ఉన్ని గుడ్డలాగా, వర్షాకాలంలో కనుపించే ఎర్రని ఆర్ద్ర పురుగులాగా, అగ్ని జ్వాలలాగా, తెల్లని పద్మంలాగా, మెరుపుకాంతిలాగా ఉంటుంది. ఈ విషయం తెలుసుకున్నవాడి సంపద విద్యుత్ప్రకాశంలాగా ఒక్కసారిగా అంతటా వ్యాపిస్తుంది. బ్రహ్మను గురించి ఇంతకన్న వర్ణించటం కష్టం. నేతినేతి విషయత్వ రూపంలో మనకు లభించేది బ్రహ్మమేనా? అని ప్రశించుకుంటూ, ఇది కాదు అని తెలుసుకుంటూ, ఇలా పోగాపోగా చివరకు మిగిలేదే బ్రహ్మము. కనిపించే వస్తువులను విషయాలను నిషేధిస్తూ పోతే మిగిలేదే బ్రహ్మ. బ్రహ్మనే దానిపేరు సత్యానికి సత్యం - ప్రాణసత్యం. బ్రహ్మమనేది ఆసత్యానికి. సత్యం. ప్రాణానికి కూడా సత్యమై ఉన్నది. బ్రహ్మయొక్క సత్యత్వమే సమస్త ప్రపంచంతో తాదాత్మ్యం చెంది గోచరిస్తోంది." అంటూ పరబ్రహ్మ యొక్క స్థూల సూక్ష్మ రూపాల గురించి వివరించాడు రత్నాకరుడు.

## 54. మైత్రేయి (బృహదారణ్యకోపనిషత్తు - 8)

"శిష్యులారా ! యాజ్ఞవల్క్యుడికి మైత్రేయి, కాత్యాయని అని ఇద్దరు భార్యలు. కాత్యాయని సామాన్య గృహిణి. కాగా మైత్రేయి అధ్యాత్మిక చర్చలలో పాల్గొనేది. ఒకరోజు యాజ్ఞవల్క్యుడు తన భార్యలతో "నేను సంసారాన్ని వదిలిపెట్టి సన్యాసాశ్రమం స్వీకరించాలనుకుంటున్నాను. అందుచేత నా ఆస్తిని మీ ఇద్దరికీ సమానంగా పంచి ఇచ్చేస్తాను" అన్నాడు. ఆ మాటలు విన్న మైత్రేయి "స్వామీ ! ప్రపంచంలో ఉన్న ధనధాన్యాలన్నీ నా ముందు కుప్పగా పోసినా నాకు ఆనందం లభించదు. అమరత్వం సిద్ధించదు. తమరు ఇస్తాననే సిరిసంపదలు అన్నీ అశాశ్వతాలు. వీటివల్ల జీవితంలో కొంత వరకు సుఖం అనుభవించవచ్చు. కాని అవేవీ శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేవు. మోక్షాన్ని ప్రసాదించలేని ఈ ధన ధాన్యాల వల్ల నాకేమిటి ప్రయోజనం ? కాబట్టి మోక్షకారకమైన బ్రహ్మవిద్యను నాకు ఉపదేశించండి" అన్నది. ఆ మాటలకు ఆనందభరితుడైన యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి బ్రహ్మోపదేశం చేశాడు. ఆ విషయాన్ని మీకు వివరిస్తాను వినండి" అంటూ యాజ్ఞవల్క్యుడు చెప్పిన విషయాన్ని వివరించటం ప్రారంభించాడు రత్నాకరుడు.

"మైత్రేయీ ! ఆత్మ ప్రయోజనం కోసమే ఒకరికొకరు ప్రియులౌతారు. భార్య భర్తను ప్రేమిస్తోంది అంటే ఈ ప్రేమ భర్తకోసం కాదు. కేవలం భార్య ప్రయోజనం కోసమే. అలాగే భర్తకూడా తన ప్రయోజనం కోసమే భార్యను ప్రేమిస్తాడు. తల్లితండ్రులు పుత్రులను తమ ప్రయోజనం కోసమే ప్రేమిస్తున్నారు. అంతేకాని పుత్రుల ప్రయోజనం కోసం కాదు. అదే విధంగా ధనాన్ని మన ప్రయోజనం అంటే ఆత్మ ప్రయోజనం కోసమే ప్రేమిస్తున్నాము. ఈ విధంగా లోకాలను, క్షత్రియులను, పంచభూతాలను ఒకటేమిటి ? లోకం దేన్నయినాసరే ఆత్మ ప్రయోజనం కోసమే ప్రేమిస్తున్నాము. కాబట్టి ఈఆత్మ ఒక్కటే దర్శనీయమైనది, తెలుసుకోతగినది. ముందుగా దీన్ని గురించి గురువు ద్వారా వినాలి. శాస్త్రాలు చదవాలి. ఇతరులతో తర్కించాలి. ఆత్మతత్త్వాన్ని గూర్చి దర్శనం, శ్రవణం, మననం, విజ్ఞానం ద్వారా అన్నీ తెలుస్తాయి. రజ్జుసర్పభ్రాంతి కలిగినప్పుడు, అది కేవలం త్రాడు అని తెలిస్తే అది సర్పమనే భ్రాంతి తొలగిపోతుంది. విజ్ఞానం కలగగానే ఆత్మస్వరూపం గోచరిస్తుంది.

బ్రాహ్మణ జాతిని ఎవరైనా ఆత్మకన్న భిన్నమైనదిగా భావిస్తే వాళ్ళను ఆజాతి నిర్లక్ష్యం చేసి దూరంగా త్రోసివేస్తుంది. పురుషార్థాల నుండి భ్రష్టుల్ని చేస్తుంది. అదే విధంగా

క్షత్రియజాతిని ఎవరైనా ఆత్మకన్న భిన్నమైనదిగా భావిస్తే వాళ్ళని ఆ జాతి త్రోసివేస్తుంది. దేవతలను ఆత్మ కన్న భిన్నంగా భావించిన వారిని దేవతలు తృణీకరిస్తారు. ఈ విధంగా బ్రాహ్మణ జాతి, క్షత్రియజాతి, లోకాలు, దేవతలు, పంచభూతాలు ఒకటేమిటి ? కంటికి కనుపించే ప్రతిదీ ఆత్మస్వరూపమే. ఆత్మకన్న భిన్నమైనది ఏదీలేదు. అన్నీ ఆత్మ నుండే పుడుతూ, ఆత్మలోనే లీనం అవుతున్నాయి.

ఏది లేకుండా ఒక వస్తువును మనం గ్రహించలేమో, అది దాని యొక్క తత్త్వము, ధర్మము అవుతుంది. ఒక నగారాను కర్రతో కొట్టినప్పుడు దానినుంచి వచ్చే స్వరాలు దాని యొక్క సామాన్య స్వరానికి భిన్నం కావు. ఎన్ని రకాల శబ్దాలు వచ్చినా అవి సామాన్య స్వరంతో కలిసిపోతాయి. వాటికి ప్రత్యేకమైన అస్తిత్వం ఉండదు. ముందుగా సామాన్య స్వరం గ్రహిస్తే తరువాత విశేష శబ్దం పట్టుబడుతుంది. అలాగే ముందు చిదాత్మనుగ్రహిస్తే, తరువాత దానిలోని కల్పితమైన నామరూపాత్మకమైన జగత్తు పట్టుబడుతుంది. కన్ను ముందుగా వెలుగును గ్రహించిన తరువాతనే నీలము, ఎరుపు, నలుపు రంగులను చూడగలము. అదే విధానంగా చిదాత్మను దర్శించిన తరువాతనే నామరూపాత్మకమైన జగత్తును చూడగలము.

శంఖాన్ని ఊదినప్పుడు వెలువడే ప్రత్యేకమైన శబ్దాలను గ్రహించగలిగితే దాని నుండి వెలువడిన శబ్దాలు వాటంతటవే పట్టుబడతాయి. కాబట్టి ముందు సామాన్య శబ్దం పట్టుపడాలి. తడిసిన కట్టెను నిప్పులో వేసినట్లైతే రకరకాల పొగలు వస్తాయి. తరువాత రవ్వలు వస్తాయి. ఈ రవ్వలు ఆ అగ్ని కన్న వేరైనవి కావు. అలాగే వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, మంత్రాలు, కళలు, సూత్రాలు ఇవన్నీ పరమాత్మ యొక్క స్వరూపాలు. ప్రయత్నం లేకుండానే ఇవన్నీ విజ్ఞానఘనుడైన పరమాత్మ నుంచి ఉత్పన్నమైనాయి. రవ్వలు, జ్వాలలు రావటానికి ముందు అంతా అగ్నిమయమే. అలాగే నామరూపాత్మక స్థితికి ముందు జగత్తంతా ప్రజ్ఞానఘనుని స్వరూపమే.

అన్ని నదులకు గమ్యస్థానం సముద్రమే. సముద్రంలోచేరగానే నదులు తమ అస్తిత్వాన్ని కోల్పోతాయి. అలాగే

| | | |
|---|---|---|
| అన్ని రకాల స్పర్శలకు గమ్యస్థానం | - | చర్మము. |
| అన్ని రకాల వాసనలకు ప్రళయస్థానం | - | నాసిక |
| అన్ని రుచులకు ప్రళయ స్థానం | - | నాలుక |
| అన్ని శబ్దాలకు ప్రళయ స్థానం | - | చెవులు |

| | | |
|---|---|---|
| అన్ని ఆలోచనలకు ప్రళయ స్థానం | - | మనస్సు |
| అన్ని విద్యలకు ప్రళయ స్థానం | - | హృదయం |
| అన్ని కర్మలకు ప్రళయ స్థానం | - | చేతులు |
| అన్ని సుఖాలకు ప్రళయ స్థానం | - | జననేంద్రియము |
| అన్ని నడకలకు గమ్యస్థానం | - | కాళ్ళు |

ఈ విధంగా విషయాలకు గమ్యస్థానం - ఇంద్రియాలు. ఈ రకంగా కార్యాలన్నీ కారణాలలో కలిసిపోయి ఇవన్నీ ప్రజ్ఞాన ఘనుడిలో చేరిపోతాయి.

నీళ్ళలో ఉప్పు వేస్తే అది కరుగుతుంది. అంటే ఆ ఉప్పు నీరంతా వ్యాపించి ఉంటుంది. అదే విధంగా అద్భుతమైన శక్తి గల పరమాత్మ అనంతుడు, అవ్యయుడు, విజ్ఞాన ఘనుడు. అతడు దేహాది ఉపాధులతోబాటుగా కలిసిపోయి, అవి నాశనమయినప్పుడు తాను కూడా నాశనమయినట్లు కనిపిస్తాడు. దేహంనుండి విడివడిన తరువాత విశేషసంజ్ఞలు ఏమీ ఉండవు.

లోకంలో ఉన్నదంతా ఆత్మే. ఆత్మయే అందరిలోనూ సమానంగా ఉన్నది. ఆత్మనుండే అన్నీ పుట్టినాయి. మళ్ళీ ఆత్మలోనే లయం అవుతాయి. అందుచేతనే ఆత్మను గురించి తెలుసుకుంటే మిగిలిన విషయాలన్నీ తెలుసుకున్నట్లే.

ఈ జగత్తులోని ప్రతి వస్తువు, ప్రతి ప్రాణి ఒకదానికొకటి ఉపకార్య, ఉపకారిక స్వభావాలు కలిగి ఉంటాయి.

పిపీలికాదిబ్రహ్మపర్యంతము సృష్టియే జగత్తు. తేనెటీగలు అసంఖ్యాకంగా చేరితేనెతుట్టెను నిర్మించినట్లుగా సమస్తభూతాలు చేరి ఈ పృథివిని నిర్మించాయి. సమస్త భూతాలకు ఈ భూమియే మధువు. తేనేతుట్టె తేనెటీగలకు ఆశ్రయం అయినట్లుగా భూతాలన్నింటికీ భూమి ఆశ్రయం, ఆహారం అవుతోంది. అందుకే భూమిని కూడా మధువు అంటారు. ఈ పృథివిలో చిన్మాత్రుడు, ప్రకాశమయుడు, అమృతమయుడు అయిన పురుషుడే ఈ అధ్యాత్మ శరీరంలోని తేజోమయుడైన, అమరణ ధర్ముడైన పురుషుడు కూడా ! ఇద్దరూ ఒకటే. అదే ఆత్మ. ఈ ఆత్మ జ్ఞానమే అమృతత్త్వానికి సాధనం. వీటన్నింటిలో ఉన్న ఏకత్వమే బ్రహ్మ. అదే సర్వస్వరూపం. పృథివి అనేది శరీరానికి ప్రతీక. ఈ బ్రహ్మజ్ఞానమే సమస్తమూ తాను అవటానికి సాధనం.

అదేవిధంగా జలం సమస్త భూతాలకు, ప్రాణాలకు మధువు. భూతాలు జలానికి మధువు. జలాన్ని రేతస్సు అంటారు. జలంలో ఉన్న ప్రకాశమయుడు, అమృత స్వరూపుడే ఈ శరీరాల్లో బీజంగా ఉన్న ప్రకాశమయుడు, అమృతమయుడు. అదే ఆత్మ. ఈ రెంటిలో ఉన్న ఏకత్వమే బ్రహ్మ. ఈ బ్రహ్మజ్ఞానమే సర్వమూ తాను అవటానికి సాధనం.

జీవులన్నింటికీ అగ్ని మధువు లాంటిది. అలాగే అగ్నికి ఈ ప్రాణులన్నీ మధువులాంటివి. అగ్నిలో ఉన్న తేజోమయుడైన పురుషుడే శరీరంలో వాగ్రూపంలో ఉన్న పురుషుడు. ఈ ఇద్దరూ ఒకటే. ఇదే బ్రహ్మ. అదే అమృతము.

వాయువు జీవరాశులన్నింటికీ మధువువంటిది. ఈ జీవరాశులు వాయువుకు మధువువంటివి. వాయువులో ఉన్న తేజోమయుడు, అమృతమయుడు అయిన పురుషుడు శరీరంలో ప్రాణరూపంలో ఉండే తేజోమయుడైన పురుషుడు ఇద్దరూ ఒకటే. అదే ఆత్మ. అదే అమృతం.

సూర్యుడు అన్ని భూతాలకు మధువు. అన్ని భూతాలు ఆదిత్యునికి మధువులాంటివి. ఆదిత్యునిలో ఉన్న ప్రకాశవంతుడైన పురుషుడే శరీరంలోని కనులలో ఉండే తేజోమయుడైన పురుషుడు. వీరిద్దరూ ఒకటే. అదే ఆత్మ. అదే అమృతం. అదే బ్రహ్మ.

దిక్కులన్నీ సమస్థ భూతాలకు మధువు వంటివి. అలాగే సమస్థ భూతాలు దిక్కులన్నింటికి మధువు వంటివి. ఈ దిక్కులలో ఉన్న తేజోమయుడైన పురుషుడే శరీరంలో ఉండే శ్రోత్రపురుషుడు. శ్రవణ సమయంలో ఉండే పురుషుడు. ఈ ఇద్దరూ ఒకటే. అతడే ఆత్మ అతడే బ్రహ్మ, సర్వరూపుడు.

చంద్రుడు సమస్త భూతాలకు, మధువు వంటివాడు. అలాగే సమస్త భూతాలూ చంద్రునికి మధువులాంటివి. చంద్రునిలో ఉన్న తేజోమయుడైన పురుషుడు. శరీరంలో ఉన్న మనస్సంబంధమైన అమృతమయుడైన పురుషుడు, ఇద్దరూ ఒకటే. అదే అమృతం. అదే బ్రహ్మ. అదే సర్వరూపం.

విద్యుత్తు సమస్త జీవకోటికి మధువు. అలాగే సమస్త జీవరాసులు విద్యుత్తుకు మధువు. విద్యుత్తులో ఉండే ప్రకాశవంతమైన పురుషుడూ, శరీరంలో ఉండే తేజోమయుడైన అమృతమయుడు ఇద్దరూ ఒకటే. అతడే ఆత్మ. అతడే అమృతమయుడు, అతడే బ్రహ్మ.

సమస్త భూతాలకు మేఘం మధువు. అలాగే సమస్త భూతాలు మేఘానికి మధువు. మేఘంలో ఉన్న తేజోమయుడైన పురుషుడు, శరీరంలో శబ్దము, స్వరము రూపంలో ఉన్న పురుషుడు, ఇద్దరూ ఒకటే. అదే ఆత్మ. అదే అమృతం. అతడే బ్రహ్మ.

సమస్త భూతాలకు ఆకాశం మధువు. అలాగే సమస్త జీవులు ఆకాశానికి మధువు. ఆకాశంలో ఉండే తేజోమయుడైన పురుషుడు శరీరంలోని హృదయాకాశంలో ఉండే తేజోయుడైన పురుషుడు ఇద్దరూ ఒకటే. అదే ఆత్మ. అమృతమయమైనది. అదే బ్రహ్మ.

ధర్మమనే పేరుతో వ్యవహరింపబడి మనం ఆచరించదగ్గది అయిన ధర్మము ఈ భూతాలన్నింటికి మధువు. ఈ భూతాలన్నీ ఆ ధర్మానికి మధువు లాంటివి. ధర్మంలో ఉండే తేజోమయుడైన పురుషుడు, శరీరంలో ఉండే తేజోమయుడైన పురుషుడు ఇద్దరూ ఒకటే. అతడే ఆత్మ. అతడే అమృతుడు. అతడే బ్రహ్మ.

సత్యమనేది సమస్త భూతాలకు మధువు. అలాగే సమస్త భూతాలు సత్యానికి మధువు. సత్యంలో ఉండే తేజోమయుడైన పురుషుడు శరీరంలో ఉండే తేజోమయుడైన పురుషుడు ఇద్దరూ ఒకటే. అతడే ఆత్మ. అతడే అమృతుడు. అతడే బ్రహ్మ.

మనుష్యాది జాతులన్నీ భూతాలకు మధువు. భూతాలన్నీ మనుష్యాది జాతులకు మధువు. భూతాలు ఉన్న తేజోమయుడైన పురుషుడే శరీరానికి సంబంధించిన తేజోమయుడైన పురుషుడు. అతడే ఆత్మ. అతడే బ్రహ్మ.

విజ్ఞానమయుడైన ఆత్మయే సమస్త భూతాలకు అధిపతి. సమస్త భూతాలకు రాజు. సమస్త దేవతలు, సమస్త లోకాలు, సమస్త ప్రాణులు, అన్నీ పరమాత్మలో ఇమిడి ఉన్నాయి. ఆ ఆత్మయే పరబ్రహ్మ.

ఇదే మధువిజ్ఞానము. పూర్వకాలంలో దీనిని దధ్య మహర్షి తన శిష్యులయిన అశ్వనీ దేవతలకు వివరించాడు". అని యాజ్ఞవల్క్యుడు తన భార్య మైత్రేయికి బ్రహ్మతత్వాన్ని వివరించాడని తన శిష్యులకు వివరిస్తూ బృహదారణ్యకోపనిషత్తులోని రెండవ అధ్యాయం పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 55. యాజ్ఞవల్క్యుడు (బృహదారణ్యకోపనిషత్తు - 9)

"బృహదారణ్యకోపనిషత్తులోని మూడు, నాలుగు అధ్యాయాలను యాజ్ఞవల్క్యకాండ లేక మునికాండ అంటారు. విదేహనగర రాజసభలో పండితులందరినీ గెల్చి యాజ్ఞ్యవల్క్యుడు గోధనాన్ని తోలుకుపోయిన విధానాన్ని మీకు వివరిస్తాను వినవలసినది" అంటూ మూడవ అధ్యాయాన్ని ప్రారంభించాడు రత్నాకరుడు.

పూర్వకాలంలో విదేహ దేశాన్ని పాలిస్తున్నాడు జనక మహారాజు. ఆయన ఒకసారి గొప్ప యాగం చేశాడు. మామూలుగా యజ్ఞయాగాదులలో భూరి దక్షిణలివ్వటం పరిపాటి. ఆ యజ్ఞంలో ఒక భాగంగా అధ్యాత్మిక ప్రపంచంలో గొప్పవాడెవరో తెలుసుకోవాలి అనుకున్నాడు జనకుడు. గోశాలలో ఉన్న బాగా బలిసిన ఒక వేయి గోవులకు ప్రతిదాని గిట్టలకూ, కొమ్ములకూ బంగారు తొడుగులు వేయించి పట్టువస్త్రాలు కప్పి సభలోని బ్రాహ్మణులనుద్దేశించి "బ్రాహ్మణ శ్రేష్ఠులారా ! మీలో అందరికన్న గొప్ప బ్రహ్మవేత్త అయినవాడు ఈ గోవుల్ని తీసుకుపోవచ్చు" అన్నాడు.

ఆ పని చెయ్యటానికి అక్కడ ఉన్న వారెవరికీ ధైర్యం చాలలేదు. పరిస్థితి గమనించిన యాజ్ఞవల్క్యుడు తన శిష్యుణ్ణి పిలిచి 'ఈ గో సంపదను ఆశ్రమానికి తోలుకుపోవలసినది' అన్నాడు. ఈ మాట విన్న మిగిలిన పండితులంతా ఆశ్చర్యపోయారు. కోపగించారు. యాజ్ఞవల్క్యుడు తమకన్న ఏ రకంగా గొప్పవాడు ? ఏ రకంగా బ్రహ్మనిష్టుడు ? అనుకుని ఆతని విజ్ఞానాన్ని పరీక్షించాలని తీర్మానించుకున్నారు. అక్కడ జరిగే యాగంలో హోత 'అశ్వలుడు" హోత అంటే యజ్ఞంలో ఋగ్వేద మంత్రాలు చదివి దేవతలను తృప్తిపరచేవాడు. అందరికంటే ముందుగా యాజ్ఞవల్క్యుణ్ణి పరీక్షించటానికి ముందుకు వచ్చినవాడు అశ్వలుడు. మొదటగా అశ్వలుడు ప్రశ్నించాడు "యాజ్ఞవల్క్యా ! నువు గొప్ప బ్రహ్మవేత్తవన్నమాట నిజమేనా ?"

"బ్రహ్మవేత్తలందరికీ నమస్కారం. నాకు ప్రస్తుతం గో సంపద కావాలి" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"యాజ్ఞవల్క్యా ! లోకంలో అన్నీ మృత్యు దేవతకు లోబడినవే కదా ! మరి ఆ మృత్యువు దేనికి లోబడి ఉంటుంది?"

"అగ్నికి, అగ్నియే హోత అనే పేరుతో పిలువబడే ఋత్విక్కు. అంటే వాక్కు ద్వారా మృత్యువును జయించవచ్చు. వాక్కే యజ్ఞంలో హోత. వాక్కుకు అధిదేవత అగ్ని.హోతను అగ్ని రూపంలో చూడటమే మృత్యువు నుండి ముక్తుడవటం. అగ్నియే ముక్తి. అజ్ఞాన పాశం నుండి విముక్తి పొందటం అతిముక్తి" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"చరాచర జగత్తంతా రాత్రింబవళ్ళ చేత వ్యాప్తమై ఉన్నది. అన్నీ రాత్రింబవళ్ళకు లోబడే ఉన్నాయి. మరి ఏ సాధనం వల్ల యజమాని అహోరాత్రాల పట్టునుంచి తప్పించుకోగలుగుతాడు?" అడిగాడు అశ్వలుడు.

"అధ్వర్యుడనే ఋత్విక్కు ద్వారా ! అంటే నేత్రం ద్వారా లేదా సూర్యుని ద్వారా. దృష్టికి అధిదేవత సూర్యుడు. సూర్యుడే ముక్తి. అంటే అధ్వర్యుని ఆదిత్య రూపంలో ఉపాసిస్తే, ఆ రకంగా ఉపాసింపబడే అధ్వర్యుడే ముక్తి. అతడే అతిముక్తి" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"ఈ ప్రపంచమంతా చంద్రుని కృష్ణ, శుక్ల పక్షాల వల్ల వ్యాప్తమై ఉన్నది కదా ! యజమాని ఈ వ్యాప్తిని ఏ విధంగా దాటగలుగుతాడు ?" అన్నాడు అశ్వలుడు.

'ప్రాణం ద్వారా ! అంటే వాయువు ద్వారా తరించగలుగుతాడు. వాయువే ఉద్గాత. యజ్ఞంలో సామవేదాన్ని పఠించేవాడు ఉద్గాత. కాబట్టి ప్రాణమే ముక్తి, అదే అతిముక్తి కూడా' 'అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"ఆకాశం ఆధారం లేకుండా ఉంది గదా ! మరి యజమాని ఏ ఆధారంతో స్వర్గానికి పోతాడు ?" అని ప్రశ్నించాడు అశ్వలుడు.

"బ్రహ్మ అనే ఋత్విక్కు ద్వారా స్వర్గానికి పోతాడు. యాగపర్యవేక్షకుడే బ్రహ్మ. మనస్సు రూపంలో ఉండే చంద్రుని ద్వారా స్వర్గానికి పోతాడు. మనస్సే యజ్ఞంలోని బ్రహ్మ. మనస్సు చంద్రుడు. కాబట్టి మనస్సే ముక్తి, అతిముక్తి కూడా" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"యజ్ఞంలో హోత తనవంతు ఎన్ని ఋక్కులు పఠిస్తాడు? అవి ఏవి" ? ప్రశ్నించాడు అశ్వలుడు.

"మూడు ఋక్కులు. అవి 1) పురోను వాక్యాలు 2) యజ్యాలు 3) శస్యాలు.

1. **పురోనువాక్యాలు** : యజ్ఞానికి ముందు ప్రవక్తమయ్యే ఋక్కులు.

2. **యజ్యాలు** : యాగ సమయంలో ప్రవక్తమయ్యే ఋక్కులు.

3. **శస్యాలు** : దేవతలను ప్రశంసించటం కోసం స్తుతి రూపమైన ఋక్కులు" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"యజ్ఞంలో అధ్వర్యుడు ఎన్ని విధాలయిన ఆహుతుల్ని హవనం చేస్తాడో వివరించవలసినది", అన్నాడు అశ్వలుడు.

"మూడు రకాల ఆహుతులు.

**1) ప్రజ్వలిత ఆహుతులు** : నేయి, సమిధలు ఆహుతులుగా ఇచ్చినప్పుడు, అవి బాగా ప్రజ్వలిస్తాయి. వాటివల్ల యజమాని దేవలోకం పొందుతాడు.

**2) నాదమయి ఆహుతులు** : నేయి, సమిధలు హోమం చేసినప్పుడు పెద్ద శబ్దాలు వస్తాయి. వీటివల్ల యజమాని పితృలోకం పొందుతాడు.

**3) నిమ్నస్థానీయాహుతులు** : పాలు, సోమరసం, హోమం చేసినప్పుడు అగ్ని జ్వాలలు పృథివిలో లీనమవుతాయి. వీటివల్ల యజమాని మనుష్యలోకాన్ని జయిస్తాడు." అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"బ్రహ్మ అనే ఋత్విక్కు దక్షిణ దిక్కునకూర్చుని ఎంతమంది దేవతల ద్వారా ఈ యాగాన్ని రక్షిస్తున్నాడు?" అడిగాడు అశ్వలుడు.

"ఒకే దేవతద్వారా"

"ఆ దేవత ఎవరు ?"

"మనస్సే ఆ దేవత, మనస్సు అనంతమైనది. విశ్వదేవతలు కూడా అనంతమైనవారు. కాబట్టి అనంతమైన విశ్వదేవతల వలన రక్షిస్తున్నాడు. దీనివల్ల యజమాని అనంత లోకాలు జయిస్తాడు." అని సమాధానం చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. అంతటితో తన పని అయిపోయిందన్నట్లుగా కూర్చుండిపోయాడు అశ్వలుడు.

ఇక జరాత్కారువు వంశానికి చెందినవాడు, ఋతభాగుని కుమారుడు అయిన 'ఆర్తభాగుడు' ప్రశ్నించటం ప్రారంభించాడు.

"యాజ్ఞవల్క్య ! గ్రహాలు ఎన్ని ? అతిగ్రహాలు ఎన్ని" అడిగాడు ఆర్తభాగుడు.

"గ్రహము అంటే గ్రహించేది, ఇంద్రియము. విషయాలను గ్రహించేవి కాబట్టి గ్రహాలు. అతిగ్రహము అంటే గ్రహముకన్న పెద్దది; గొప్పది. కాబట్టి విషయాలే అతిగ్రహాలు.

1. ప్రాణము (ముక్కు) గ్రహము, వాసన గంధము అతిగ్రహము, గ్రహము అనేది అతిగ్రహము యొక్క అధీనంలో ఉంటుంది. వాసన అనేది అపానము అంటే లోపలికి పీల్చేగాలి. దాని ద్వారానే మనకు వాసన తెలుస్తోంది. అందుకనే ప్రాణము గ్రహము, అపానము అతిగ్రహము. అదే విధంగా ....

2. వాగింద్రియము గ్రహము, నామము అతిగ్రహము.

3. నాలుక గ్రహము, రుచి అతిగ్రహము.

4. కన్ను గ్రహము, రంగు, రూపము అతిగ్రహము.

5. చెవి గ్రహము, శబ్దము అతిగ్రహము.

6. మనస్సు గ్రహము, కోరిక అతిగ్రహము.

7. చేతులు గ్రహము, కర్మ అతిగ్రహము.

8. చర్మము గ్రహము, స్పర్శ అతిగ్రహము.

ఈ రకంగా గ్రహాలు ఎనిమిది, అతిగ్రహాలు ఎనిమిది." అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"కనిపించే జగత్తు అంతా మృత్యువుకు అన్నం కదా ? మరి మృత్యువు ఏ దేవతలకు ఆహారమవుతుంది?" అని ప్రశ్నించాడు ఆర్తభాగుడు.

"అగ్నే మృత్యువు. అగ్ని రూపంలో ఉన్న మృత్యువు జలానికి అన్నమవుతోంది. అంటే జలము అగ్నిని ఆర్పివేస్తుంది." అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"యాజ్ఞవల్క్యా ! మానవుడు చనిపోయినప్పుడు, బ్రహ్మవేత్త యొక్క ఇంద్రియాలు (ప్రాణాలు) అతనినుండి పైకి పోతాయా ? పోవా ?" అని అడిగాడు ఆర్తభాగుడు.

"అలా జరగదు. తత్త్వజ్ఞాని యొక్క ప్రాణాలు పరమాత్మలో లీనమవుతాయి. సామాన్య మానవుడిలాగానే బ్రహ్మవేత్త మరణిస్తాడు. కాని అతడికి పునర్జన్మ ఉండదు." అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"పురుషుడు చనిపోయినపుడు అతణ్ణి వదలకుండా ఉండేది ఏది?" మళ్ళీ అడిగాడు ఆర్తభాగుడు.

"పేరు. అన్నీ లీనమైపోయినా, జాతి సంసర్గం కారణంగా నామం మాత్రం లీనం కాదు. నామమనేది నిత్యము, అనంతము. నామాన్ని ఆశ్రయించి ఉన్న విశ్వేదేవులు కూడా అనంతంగానే ఉన్నారు. వీరిని ఉపాసించిన వారు అనంతంగానే ఉన్నారు. వీరిని ఉపాసించిన వారు అనంత లోకాలు పొందుతారు" అన్నాడు యాజ్ఞవల్క్యుడు. చివరిసారిగా అడుగుతున్నాడు ఆర్తభాగుడు. "యాజ్ఞవల్క్యా ! మానవుడు చనిపోయిన తరువాత అతని యొక్క

వాక్కు - అగ్నిలో లీనమైపోతుంది.

ప్రాణం - వాయువులో లీనమైపోతుంది.

| | | |
|---|---|---|
| నేత్రాలు | - | ఆదిత్యునిలో లీనమైపోతాయి. |
| శ్రోత్రాలు | - | దిక్కులయందు లీనమైపోతాయి. |
| మనస్సు | - | చంద్రునిలో లీనమైపోతుంది |
| శరీరం | - | భూమిలో లీనమైపోతుంది |
| హృదయాకాశం | - | భూతాకాశంలో లీనమైపోతుంది |
| కేశాలు | - | వనస్పతులలో లీనమైపోతాయి. |
| శుక్రశోణితాలు | - | జలంలో కలిసిపోతాయి కదా! |

అటువంటి స్థితిలో పురుషుడు ఎక్కడ ఉంటాడు? అంటే ఇంద్రియాలన్నీ వాటి వాటి కారణాల్లో లీనమైపోగా మిగిలిన పురుషుడు ఏమౌతాడు ? దేని ఆధారంగా అతడు మళ్ళీ శరీరం ధరిస్తాడు?"

"కర్మ. కర్మవల్ల మానవుడు పాప పుణ్యాలు పొందుతాడు. పుణ్యకర్మల వల్ల పుణ్యాత్ముడు, పాపకర్మల వలన పాపాత్ముడు అవుతాడు. ఆ కర్మ ఆధారంగానే వేరొక శరీరము, ఇంద్రియాలు ధరిస్తాడు. అంతేకాని కర్మవల్ల మోక్షం సిద్ధించదు" అన్నాడు యాజ్ఞవల్క్యుడు దీంతో 'ఇంక అడిగేది ఏమీ లేదు.' అన్నాడు ఆర్తభాగుడు.

ఆ తరువాత లహ్యుని మనుమడైన 'భుజ్యుడు' ప్రశ్నించటం మొదలు పెట్టాడు.

"యాజ్ఞవల్క్యా! పరీక్షిత్ వంశజులు ఎక్కడున్నారు ? అశ్వమేధం చేసినవారు ఎక్కడికి పోతారు?" అడిగాడు భుజ్యుడు.

"సూర్యుని రథం ఒక రోజులో 32 సార్లు తిరిగితే బ్రహ్మాండం విస్తీర్ణమవుతుంది. దీనికి రెట్టింపు భూమి ఉంది. భూమికి రెట్టింపు సముద్రం (జలం) ఉంది. ఈ లోకం 32 దేవ రథాహ్న్యాలు ఉన్నది. 'దేవరథాహ్న్యము' అంటే సూర్యుని రథం యొక్క నడకను బట్టి కొలిస్తే ఒక రోజులో కొలిచే విస్తీర్ణము రథాహ్న్యము.

లోకాలోక పర్వతం నుండి నాలుగు వైపులా ఆవరించి, సముద్రంతో కూడి ఉన్న ఈ లోకము 32 దేవరథాహ్న్యాలు ఉన్నది. ప్రాణులు తమ కర్మ స్వరూపాన్ని అనుభవించేది విరాట్పురుషుని రూపంలో ఉండే ఈ లోకంలోనే. దీనిపైన ప్రాణులు లేని నిరాలోకమున్నది. ఆ లోకానికి నాలుగువైపులా, ఆ లోకానికి రెట్టింపు విస్తీర్ణం గల భూమి వ్యాపించి ఉంది. దీని చుట్టూ రెట్టింపు నీరున్నది. దీనినే పౌరాణికులు 'ఘనోద'మంటారు. ఇంకా చెప్పాలంటే బ్రహ్మాండం రెండుభాగాలుగా ఉంది. దిగువ ఉన్న సగం విరాట్స్వరూపం, దీన్నే ఈ

లోకమంటారు. ఇక్కడ జీవులు తమ కర్మ ఫలము అనుభవిస్తాయి. ఈ లోకానికి పైన ఆ లోకమున్నది. ఇది కేవలం వర్షపు నీటితో తడిసి ఉంటుంది. ఇక్కడ ప్రాణులుండవు. ఇదే నిరాలోకం. ఈ రెండూ కలిస్తేనే బ్రహ్మాండము అవుతుంది.

ఈ రెండు భాగాల (లోకాల) మధ్యన అతిసన్ననైన రంధ్రమున్నది. పరమేశ్వరుడు పరీక్షిత్తులను వాయువుకు ఇవ్వగా, వాయువు వారిని తన స్వరూపంలో వాయుభూతంగా చేసి, ఆ రంధ్రం గుండా అశ్వమేధం చేసిన వారుండే చోటికి పంపుతాడు. ఈ విధంగా ఉండే వాయువును ఉపాసించే వారికి ఇక జన్మ ఉండదు." అన్నాడు యాజ్ఞవల్క్యుడు. దీంతో మౌనం వహించాడు భుజ్యుడు.

తరువాత చక్రుని కుమారుడైన 'ఉషస్తి' అనేవాడు "అందరిలోనూ అంతరాత్మగా ఉండే పరబ్రహ్మను గురించి వివరించు" అన్నాడు.

"శరీరంలో ఉన్న నీ ఆత్మయే సర్వాంతర్యామియైన బ్రహ్మ" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"సర్వాంతర్వర్తి ఎటువంటివాడు ? శరీరంలో ఉన్న దేనిని సర్వాంతరాత్మ అంటున్నావు? పైనున్నది స్థూలదేహము. లోపలున్నది లింగశరీరము. నువ్వు దేనిని సర్వాంతర్యామి అంటున్నావు ? వివరించు" అన్నాడు ఉషస్తి.

"నోటితోను, ముక్కుతోను ఊపిరిపీల్చే (ప్రాణక్రియ) విజ్ఞానమయుడైన ఆత్మయే సర్వాంతర్వర్తి. అపానక్రియ ఆచరించే వాడే సర్వాంతర్వర్తియైన ఆత్మ. వ్యానక్రియ ఆచరించటమంటే శరీరమంతా ప్రాణవాయువు నింపటం చేసేవాడే సర్వాంతర్వర్తి. ఉదాన క్రియ అంటే గాలి బయటకు వదలి వెయ్యటం ఆచరించే ఆత్మయే సర్వాంతర్వర్తి." అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"ఆర్యా! ప్రాణక్రియ లాచరించేది ఆత్మ అంటున్నావు. అలా కాకుండా సర్వాంతరాత్మను స్పష్టంగా తెలియచెయ్యి" అన్నాడు ఉషస్తి.

"నీ ఆత్మయే సాక్షాత్తూ పరబ్రహ్మ" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"ఇంకా స్పష్టంగా చెప్పవలసినది" అని అడిగాడు ఉషస్తి.

"నీ దృష్టికి కూడా దృష్టి అయినవాడు అయిన ఆత్మను నీ కనులతో చూడలేవు. నీ శ్రోత్రానికి శ్రోత్రమయిన ఆత్మను నీ చెవులతో వినలేవు. మనస్సుకు సాక్షి అయిన వానిని గూర్చి ఆలోచించలేవు. బుద్ధికి వేత్త అయిన వానిని గూర్చి తెలుసుకోలేవు. అటువంటి నీ ఆత్మయే సర్వాంతర్వర్తి. అటువంటి ఆత్మ లేకపోతే నీ శరీరం నాశనమైపోతుంది." అన్నాడు యాజ్ఞవల్క్యుడు! ఇది విన్న ఉషస్తి ఇక మాట్లాడలేదు.

కుషీతకుని కుమారుడు కహోలుడు లేచి "ఇంత వరకు వ్యష్టిగా ఆత్మను వివరించావు. ఇక సమిష్టిగా ఆత్మను వివరించు" అన్నాడు.

"ఆకలి, దప్పిక, సుఖము, దుఃఖము, మోహము, ముసలితనము, మరణము మొదలైన వాటికి అతీతమైనది ఆత్మ. ఈ ఆత్మను సాక్షాత్కరింపచేసు కోవాలంటే ఏషణత్రయాయాన్ని వదలివెయ్యాలి. భిక్షాటన చేస్తూ బ్రహ్మచర్యం పాటించాలి. అందుచేత బ్రాహ్మణుడైనవాడు ఆత్మజ్ఞానాన్ని సంపాదించి, ఆ బలంతో స్థిరంగాను, దృఢంగాను ఉండటానికి యత్నించాలి. అజ్ఞానులది ఇంద్రియ బలం. జ్ఞానులది ఆత్మబలం. ఈ రకంగా పూర్తి జ్ఞానాన్ని పొందినవాడు బ్రాహ్మణత్వాన్ని పొంది కృతకృత్యుడౌతాడు. దీనికి భిన్నమైనది మాయ. ఆత్మ మాత్రమే నిత్యమైనది." అంటూ వివరించాడు యాజ్ఞవల్క్యుడు.

అరుణుని కుమారుడైన ఉద్దాలకుడు ఈ విధంగా అన్నాడు.

"యాజ్ఞవల్క్యా ! నేను విద్యాభ్యాసం చేసే సమయంలో మద్ర దేశంలో 'పంచతలుని' ఇంట్లో ఉండేవాడిని. అప్పుడు అతని భార్యను ఒక గంధర్వుడు ఆవహించి ఈ జన్మ, దీని తరువాత జన్మలు, బ్రహ్మ మొదలు స్తంభం పర్యంతము సమస్త భూతాలు ఏ సూత్రం ద్వారా గ్రుచ్చబడి ఉన్నాయో వాటన్నిటినీ వివరించాడు. ఆ సూత్రాత్మను నీ వెరుగుదువా ! ఆ సూత్రాత్మను, సర్వాంతర్యామిని తెలియకుండానే గోసంపదలను తోలుకుపోతే, నీ తల తెగి క్రింద పడుతుంది." ఆ మాటలు విన్న యాజ్ఞవల్క్యుడు "ఆ సూత్రాత్మ, సర్వాంతర్యామి గురించి నాకు తెలుసు" అని వాటిని వివరించటం ప్రారంభించాడు.

"ఈ విధంగా అన్నింటినీ బంధించిన సూత్రం వాయువు తప్ప ఇంకేమీ కాదు. దీని ద్వారానే ఈ లోకం, పరలోకం సమస్త భూతాలు గ్రుచ్చబడి ఉన్నాయి. వాయువు ఆకాశంలాగా సూక్ష్మత్వం కలిగి ఉంది. ఇదే పృథివ్యాధి భూతాలను ధరిస్తుంది. వాయువు నుంచే కర్మవాసనలతో కూడి 17 అవయవాలు కలిగిన లింగదేహం పుట్టింది. పంచభూతాలు 5, ఇంద్రియాలు 10, ప్రాణము, మనస్సు ఇవే ఆ అవయవాలు. సముద్రపు అలలలాగా ఉండే 49 మరుద్గణాలను కలిగి ఉన్నది. అటువంటి వాయువే వీటన్నింటికీ సూత్రం. మానవుడు చనిపోగానే అతని శరీరంలోని వాయువు పోతుంది. అందుచేతనే అవయవాలు శిధిలమై పోతాయి." అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"అయితే అంతర్యామిగా ఉండే నియామకుని గురించి చెప్పవలసినది" అన్నాడు ఉద్దాలకుడు.

"ఎవడు భూమిపైన, భూమిలోపల ఉంటాడో, తనలో ఉన్నప్పటికీ ఎవనిని భూమి ఎరుగదో, ఎవని శరీరమే భూమియో, లోపల ఉంటూనే ఎవడు భూమిని నియమిస్తుంటాడో అతడే నీ ఆత్మ. నీ అంతర్యామి.

ప్రాణులు భూమిపైన ఉంటాయి. భూమిలో తాదాత్మ్యం చెందిన దేవతల లోపల ఉంటాయి. ప్రతి మానవుడి శరీరము భూమియే. అవయవాలు భూమియే. కాని తనలో ఉన్న వాడిని ఈ శరీరము అవయవాలు ఎరుగవు. శరీరాన్ని, అవయవాలను నియంత్రించేది లోపల ఉన్న ఆత్మ.

నీటిలో నివసించేవాడు, నీటిలో ఉన్నప్పటికీ ఆ నీరు అతన్ని ఎరుగదు. ఆ నీరే అతని శరీరం.

అగ్నిలో ఉంటాడు. అగ్ని అతన్నెరుగదు. కాని అగ్నిలో ఉంటూ అగ్నిని నియంత్రిస్తాడు. అతడే నీలో ఉన్న అంతర్యామి అయిన ఆత్మ.

అంతరిక్షంలో ఉంటాడు. కాని అంతరిక్షం అతన్నెరుగదు. అతడి శరీరమే అంతరిక్షం. అంతరిక్షంలో ఉంటూ, అంతరిక్షాన్ని నియంత్రిస్తాడు. అతడే నీలో ఉన్న అంతర్యామి అయిన ఆత్మ.

వాయువులో ఉండి వాయువును నియంత్రిస్తాడు. కాని వాయువు అతన్నెరుగదు. అతడే నీలో ఉన్న అంతర్యామి అయిన ఆత్మ.

ద్యులోకంలో ఉంటాడు. అదే అతని శరీరం. ద్యులోకం అతన్నెరుగదు. అక్కడే ఉంటూ ద్యులోకాన్ని నియంత్రిస్తాడు. అతడే నీ అంతర్యామి అయిన ఆత్మ.

ఆదిత్య లోకంలో ఉంటాడు. ఆదిత్య లోకం అతన్నెరుగదు. ఆదిత్య లోకమే అతని శరీరం. ఆదిత్య లోకంలో ఉంటూ, ఆదిత్య లోకాన్ని నియంత్రిస్తాడు. అతడే నీ అంతర్యామి. ఆత్మ.

దిగంతరాళాల్లో ఉంటాడు. అయినా దిక్కులకు అతనెవరో తెలియదు. అక్కడ ఉంటూ దిక్కులను శాసిస్తాడు. అతడే నీ అంతర్యామి. ఆత్మ

చంద్రునిలోను, నక్షత్రాలలోనూ ఉంటాడు. కాని అవి అతన్నెరుగవు. అక్కడ ఉంటూనే వాటిని శాసిస్తాడు. అతడే నీ అంతర్యామి, ఆత్మ.

ఆకాశంలో ఉంటాడు. కాని ఆకాశం అతన్నెరుగదు. ఆకాశమే అతని శరీరం ఆకాశంలో ఉంటూ, ఆకాశాన్ని శాసిస్తాడు. అతడే నీ ఆత్మ.

అంధకారంలో ఉంటాడు. కాని అంధకారం అతణ్ణి ఎరుగదు. అంధకారమే అతని శరీరం. అంధకారంలో ఉంటూనే, అంధకారాన్ని శాసిస్తాడు. అతడే నీ ఆత్మ.

తేజస్సులో ఉంటాడు. సమస్త భూతాల్లో ఉంటాడు, ఇంద్రియాల్లో ఉంటాడు. బుద్ధిలో ఉంటాడు, కాని ఇవేవీ అతన్ని ఎరగవు. వాటిలో ఉంటూ, వాటినే శాసిస్తాడు. అతడే నీ ఆత్మ.

అతడు కనుపించడు, కాని చూస్తాడు. వినిపించడు కాని వింటాడు. అతడు తెలియబడడు. అర్థం కాడు. కాని అతనికి అన్నీ తెలుసు. అతడే నీ ఆత్మ. అంతర్యామి శాశ్వతుడు. అతడు తప్ప అన్నీ నాశనమయి పోయేవే". ఈ మాటలు విన్న ఉద్దాలకుడు ఓటమిని అంగీకరించాడు.

ఇప్పుడు వాచక్నునికి కుమార్తె గార్గి అడుగుతున్నది. "కనుపించే పార్థివమైన ధాతు సముదాయమంతా జలంచే వ్యాప్తమై ఉన్నది కదా ? మరి జలం దేనిచేత వ్యాప్తమై ఉన్నది?'

యాజ్ఞవల్క్యుడు : వాయువులో

గార్గి : మరి వాయువు దేనిలో వ్యాప్తమైంది ?

యాజ్ఞవల్క్యుడు : అంతరిక్షంలో

గార్గి : అంతరిక్షం దేనిలో వ్యాప్తమైంది ?

యాజ్ఞవల్క్యుడు : గంధర్వలోకంలో

గార్గి : గంధర్వలోకం దేనిలో వ్యాప్తమైంది ?

యాజ్ఞవల్క్యుడు : ఆదిత్యలోకంలో

గార్గి : ఆదిత్యలోకం దేనిలో వ్యాప్తమైంది ?

యాజ్ఞవల్క్యుడు : చంద్రలోకంలో

గార్గి : చంద్రలోకం దేనిలో వ్యాప్తమైంది ?

యాజ్ఞవల్క్యుడు : నక్షత్రలోకంలో

గార్గి : నక్షత్రలోకం దేనిలో వ్యాప్తమైంది ?

యాజ్ఞవల్క్యుడు : దేవలోకంలో

గార్గి : దేవలోకం దేనిలో వ్యాప్తమైంది ?

యాజ్ఞవల్క్యుడు : ప్రజాపతిలోకంలో

గార్గి : ప్రజాపతి లోకం దేనిలో వ్యాప్తమైంది ?

యాజ్ఞవల్క్యుడు : బ్రహ్మలోకంలో

గార్గి : బ్రహ్మలోకం దేనిలో వ్యాప్తమైంది ?

యాజ్ఞవల్క్యుడు : గార్గీ! కేవలము ఊహించి అనుమానంతో ప్రశిస్తున్నావు. అలా ప్రశ్నిస్తే నీ తల తెగి క్రింద పడుతుంది.

ఆ మాటలకు నిరుత్తర అయిపోయింది గార్గి. ఆ తరువాత కొంత సేపటికి "ఓ బ్రాహ్మణులారా ! మీరు అనుమతిస్తే నేను రెండు ప్రశ్నలు అడుగుతాను. వీటికి సమాధానం చెప్పగలిగితే అతణ్ణి గెలవటం సాధ్యం కాదు." అన్నది. సభ అనుమతించిన తరువాత గార్గి అడుగుతోంది.

"యాజ్ఞవల్క్యా ! ద్యులోకానికి పైన, భూలోకానికి క్రింద, బ్రహ్మాండము యొక్క మధ్యలో ఉన్నట్టి, భూతవర్తమాన భవిష్యత్తులుగా పేర్కొనబడినటువంటి ఈ ప్రపంచమంతా దేనిలో వ్యాపించి ఉన్నది ?నక్షత్రాలకు పైగా, భూమికి క్రిందగా ఈ రెంటికీ మధ్యన, భూత భవిష్యద్వర్తమానాలలో ఏముంటుందో కాస్త వివరించండి"

సభలోని పండితులంతా ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. యాజ్ఞవల్క్యుడు ఏం సమాధానం చెబుతాడో అని అందరికీ ఆతురతగా ఉంది. "గార్గీ ! సర్వ వ్యాపకమైనది ఆకాశం. గతంలోనూ, వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ కూడా ఉండే తత్త్వం ఆకాశం మాత్రమే" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

గార్గి రెండో ప్రశ్న వేస్తోంది. "మహానుభావా ! ఆకాశం కన్నా సూక్ష్మమైనది, దానిలో కూడా వ్యాపించి ఉన్నది ఏమిటి?"

ఆమె ప్రశ్నలకు సభలోని వారంతా ఆశ్చర్యపోయారు. యాజ్ఞవల్క్యుడు మాత్రం ప్రశాంత చిత్తంతో పరబ్రహ్మ. చరాచర జగత్తు యొక్క సృష్టికీ, స్థితికీ కారణము అదే. సర్వవ్యాపకమైనది, సర్వాంతర్యామి అయినది ఆ బ్రహ్మమే. అది ఆదిమధ్యాంతరహితమైన ఏకైక పరమ సత్యం. మనుష్యుని ఆత్మలోని బాధలకు అతీతంగా, పరమ సత్యంగా, పరమాత్మగా భాసిస్తూ ఉండేది ఆ బ్రహ్మమే." అన్నాడు.

గార్గి అడుగుతానన్న రెండు ప్రశ్నలు అయిపోయాయి. వాటికి సమాధానాలిచ్చాడు యాజ్ఞవల్క్యుడు. దాంతో ఇక మారుమాట్లాడకుండా తన ఓటమిని అంగీకరించింది గార్గి.

ఆఖరుగా శకలుని కుమారుడు 'శాకల్యుడు' లేచి ప్రశ్నించటం మొదలుపెట్టాడు.

| | | |
|---|---|---|
| శాకల్యుడు | : | "దేవతలెంతమంది ?" |
| యాజ్ఞవల్క్యుడు | : | "3306 మంది" ? |
| శాకల్యుడు | : | దేవతలెంతమంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | ముప్పై ముగ్గురు |
| శాకల్యుడు | : | దేవతలెంతమంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | ఆరుగురు |
| శాకల్యుడు | : | దేవతలెంత మంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | ముగ్గురు |
| శాకల్యుడు | : | దేవతలెంతమంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | ఇద్దరు |
| శాకల్యుడు | : | దేవతలెంత మంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | ఒకటిన్నర |
| శాకల్యుడు | : | దేవతలేంతమంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | ఒక్కడు |
| శాకల్యుడు | : | 3306 మంది ఎవరు ? |
| యాజ్ఞవల్క్యుడు | : | ఆ సంఖ్య వారి మహిమలకు చెందినది. అంటే దేవవిభూతులు. యదార్థానికి దేవతలు ముప్పది ముగ్గురే. |
| శాకల్యుడు | : | ముప్పదిముగ్గురెవరు ? |
| యాజ్ఞవల్క్యుడు | : | అష్టవసువులు 8, ఏకాదశ రుద్రులు 11, ద్వాదశాదిత్యులు 12, ఇంద్రుడు, ప్రజాపతి. |
| శాకల్యుడు | : | అష్టవసువులు ఎవరు ? |
| యాజ్ఞవల్క్యుడు | : | అగ్ని, పృథివి, వాయువు, అంతరిక్షం, ఆదిత్యుడు, ద్యులోకము, చంద్రుడు, నక్షత్రాలు. వీటిలోనే జగత్తు అంతా వ్యాపించి ఉన్నది. కర్మఫలాన్ని బట్టి దేహంగా ఇవి పరిణమిస్తాయి. |

| | | |
|---|---|---|
| శాకల్యుడు | : | రుద్రులు ఎవరు ? |
| యాజ్ఞవల్క్యుడు | : | కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, మనస్సు ప్రాణి యొక్క కర్మ పరిసమాప్తమైనప్పుడు వీరు శరీరం నుండి ఉత్క్రమిస్తారు. ఈ రకంగా శరీరాన్ని వదలి బంధువులను రోదింపచేస్తారు కాబట్టి ఇవి రుద్రశబ్దం చేత పిలువబడతాయి. |
| శాకల్యుడు | : | ఆదిత్యులెవరు ? |
| యాజ్ఞవల్క్యుడు | : | పన్నెండు నెలలతో కూడిన సంవత్సరమే ఆదిత్యుడు. ప్రాణులయొక్క ఆయుర్దాయాన్ని 'అదదానా' అంటే గ్రహిస్తుంది. కాబట్టి ఇవి ఆదిత్యులనబడ్డాయి. |
| శాకల్యుడు | : | ఇంద్రుడు, ప్రజాపతి ఎవరు ? |
| యాజ్ఞవల్క్యుడు | : | మేఘమే ఇంద్రుడు. మేఘదేవత ఇంద్రుడే. యజ్ఞమే ప్రజాపతి. |
| శాకల్యుడు | : | విద్యుత్తు అంటే ఎవరు ? |
| యాజ్ఞవల్క్యుడు | : | 'అశని', ప్రాణులను హింసించేది. అదేశక్తి లేక జలము. ఇది ఇంద్రుని క్రూర కర్మ. |
| శాకల్యుడు | : | యజ్ఞం అంటే ఏది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | యజ్ఞానికి రూపం లేదు కాబట్టి యజ్ఞానికి సాధనమైన పశుగణమే యజ్ఞం. |
| శాకల్యుడు | : | ఆరుగురు దేవతలు ఎవరు ? |
| యాజ్ఞవల్క్యుడు | : | అగ్ని, పృథివి, వాయువు, అంతరిక్షం, ఆదిత్యుడు, ద్యులోకం. ఈ ఆరింటివిస్తారమే మిగిలిన దేవతలు. మిగిలిన దేవతల రూపాలన్నీ వీటిలోనే ఉన్నాయి. |
| శాకల్యుడు | : | ముగ్గురు దేవతలు ఎవరు ? |

యాజ్ఞవల్క్యుడు : ఈ మూడు లోకాలే ముగ్గురు దేవతలు. అంటే అగ్ని, పృథివి రెండూ కలిసి ఒక దేవత వాయువు, అంతరిక్షం రెండూ కలిసి ఒక దేవత.ఆదిత్యుడు, ద్యులోకము రెండూ కలిసి ఒక దేవత. ఈ మూడింటిలోనే సమస్త దేవగణాలు అంతర్భూతమై ఉన్నాయి.

శాకల్యుడు : ఆ ఇద్దరు దేవతలు ఎవరు ?

యాజ్ఞవల్క్యుడు : అన్నము, ప్రాణము. ఈ రెంటిలోనే సమస్త దేవతలు అంతర్భావం చెంది ఉన్నారు.

శాకల్యుడు : ఒకటిన్నర దేవత ఎవరు ?

యాజ్ఞవల్క్యుడు : వీచే వాయువే ఒకటిన్నర దేవత.

శాకల్యుడు : వాయువు ఒకటిన్నర ఎలా అయింది ?

యాజ్ఞవల్క్యుడు : వాయువు వల్ల సమస్త జగత్తు కీర్తిని పొందుతోంది. అందువల్ల వాయువు ఒకటి, దానివల్ల జగత్తుకు లభించే వృద్ధి సగం.

శాకల్యుడు : ఒక దేవుడెవరు ?

యాజ్ఞవల్క్యుడు : ప్రాణం ! ఈ ప్రాణమే బ్రహ్మస్వరూపం. ఈ ప్రాణమే బహుధావర్తించి వేరు వేరు దేవతలుగా భాసిస్తున్నారు.

శాకల్యుడు : శరీర పురుషునిలోని దేవత ఎవరు ?

యాజ్ఞవల్క్యుడు : శుక్రశోణితముల వలన కలిగిన పార్థివ శరీరాన్ని శరీర పురుషుడు అంటారు. అంటే అన్న రసంతో వచ్చినవాడు. శరీర పురుషుని లోపల దేవత అమృతుడు.

శాకల్యుడు : కామమయుడైన వానికి దేవత ఎవరు ?

యాజ్ఞవల్క్యుడు : స్త్రీ, స్త్రీ వల్లనే కామానికి ఉద్దీపనం కలుగుతుంది.

శాకల్యుడు : మరి పురుషునికి దేవత ఎవరు ?

యాజ్ఞవల్క్యుడు : సత్యము. పురుషుడు అంటే ఆదిత్యుడు, సత్యము అంటే చక్షువు. శారీరకమైన చక్షువు ద్వారానే ఆదిత్య దర్శనం జరుగుతుంది.

| | |
|---|---|
| శాకల్యుడు | : యాజ్ఞవల్క్యా! దిక్కులను, వాటి దేవతలను గూర్చి అడుగుతాను. తూర్పు దిక్కున ఏ దేవతతో తాదాత్మ్యం చెందుతున్నావు? |
| యాజ్ఞవల్క్యుడు | : సూర్యునితో |
| శాకల్యుడు | : సూర్యుడు దేనియందు ప్రతిష్టితుడైనాడు ? |
| యాజ్ఞవల్క్యుడు | : నేత్రమందు. |
| శాకల్యుడు | : నేత్రం దేనియందు ప్రతిష్ఠితమై ఉన్నది ? |
| యాజ్ఞవల్క్యుడు | : రూపమందు. |
| శాకల్యుడు | : రూపం దేని మీద ఆధారపడి ఉంది. |
| యాజ్ఞవల్క్యుడు | : హృదయం మీద. |
| శాకల్యుడు | : దక్షిణ దిక్కున ఏ దేవతతో కలసి ఉంటున్నావు ? |
| యాజ్ఞవల్క్యుడు | : యమునితో. |
| శాకల్యుడు | : యముడు దేని మీద ఆధారపడి ఉన్నాడు ? |
| యాజ్ఞవల్క్యుడు | : యజ్ఞం మీద. |
| శాకల్యుడు | : యజ్ఞం దేని మీద ఆధారపడింది ? |
| యాజ్ఞవల్క్యుడు | : దక్షిణ మీద. |
| శాకల్యుడు | : దక్షిణ దేనియందు ప్రతిష్ఠితమై ఉంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : భక్తితో కూడిన శ్రద్ధ మీద. |
| శాకల్యుడు | : శ్రద్ధ దేని మీద ఆధారపడి ఉంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : హృదయం మీద. |
| శాకల్యుడు | : పశ్చిమదిక్కున ఏ దేవతతో తాదాత్మ్యం చెందుతున్నావు ? |
| యాజ్ఞవల్క్యుడు | : వరుణునితో |
| శాకల్యుడు | : వరుణుడు దేనిమీద ఆధారపడి ఉన్నాడు ? |
| యాజ్ఞవల్క్యుడు | : జలం మీద |
| శాకల్యుడు | : జలం దేనిమీద ఆధారపడి ఉంది ? |

| | | |
|---|---|---|
| యాజ్ఞవల్క్యుడు | : | వీర్యం మీద |
| శాకల్యుడు | : | వీర్యం దేని మీద ఆధారడి ఉంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | హృదయం మీద. వీర్యం హృదయంలోనే ప్రతిష్టితమై ఉంది. |
| శాకల్యుడు | : | ఉత్తర దిక్కున ఏ దేవత యందు తాదాత్మ్యం చెందుతున్నావు? |
| యాజ్ఞవల్క్యుడు | : | సోమ దేవతతో. |
| శాకల్యుడు | : | సోమదేవత దేనియందు ప్రతిష్ఠితమై ఉంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | దీక్ష మీద, దీక్ష తీసుకున్న యజమాని సోమలతను తీసుకుని, సోమంతో యజ్ఞం చేసి ఉత్తర దిశను పొందుతాడు. |
| శాకల్యుడు | : | దీక్ష దేని మీద ఆధారపడి ఉంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | సత్యం మీద. దీక్ష వహించినవాడు సత్యం పలుకకపోతే కార్యం పాడైపోతుంది. |
| శాకల్యుడు | : | సత్యం దేనియందు ప్రతిష్ఠితమై ఉంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | హృదయంలో. |
| శాకల్యుడు | : | ఊర్ధ్వ దిక్కున ఏ దేవతతో తాదాత్మ్యం చెందుతున్నావు. |
| యాజ్ఞవల్క్యుడు | : | అగ్ని దేవతతో. |
| శాకల్యుడు | : | అగ్ని దేవత దేని మీద ఆధారపడి ఉంటుంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | వాక్కు మీద. |
| శాకల్యుడు | : | వాక్కు దేని మీద ఆధారపడి ఉంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | హృదయం మీద. |
| శాకల్యుడు | : | హృదయం దేనిమీద ఆధారపడి ఉంది ? |
| యాజ్ఞవల్క్యుడు | : | ఈ శరీరం, నామరూపాలు కర్మమయమైనందున హృదయ రూపమైన ఆత్మయందు ప్రతిష్ఠితమై ఉంటాయి. |
| శాకల్యుడు | : | దేహము, ఆత్మ దేనియందు ప్రతిష్ఠితమై ఉంటాయి ? |

యాజ్ఞవల్క్యుడు : ప్రాణవృత్తి మీద

శాకల్యుడు : ప్రాణం దేనిమీద ఆధారపడి ఉంటుంది ?

యాజ్ఞవల్క్యుడు : వ్యానం మీద.

శాకల్యుడు : వ్యానం దేనిమీద ఆధారపడి ఉంటుంది ?

యాజ్ఞవల్క్యుడు : ఉదానం మీద.

శాకల్యుడు : ఉదానం దేని మీద ఆధారపడి ఉంటుంది ?

యాజ్ఞవల్క్యుడు : సమానం మీద.

ఆత్మ నేది అగ్రాహ్యం. పట్టుకోవటానికి వీలు లేనిది. శరీరం లేనిది. నాశనం కానిది. రూపం లేనిది. ఉపనిషత్తులలో చెప్పబడిన అటువంటి ఆత్మను గురించి అడుగుతున్నాను శాకల్యా ! నువు చెప్పు. లేకపోతే నీ తల తెగి క్రిందపడి పోతుంది".

శాకల్యుడికి ఆత్మ గురించి నిజంగానే తెలియదు. అందుచేత అతని తలతెగి క్రిందపడిపోయింది.

అది చూసిన సభాసదులంతా అవాక్కయిపోయారు. ఎవరూ మాట్లాడకపోవటంతో యాజ్ఞవల్క్యుడే గెలిచినట్లుగా ప్రకటించారు. దాంతో యాజ్ఞవల్క్యుడు గోవులను తోలుకుని ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. అంటూ మూడవ అధ్యాయాన్ని ముగించాడు రత్నాకరుడు.

# 56. ఉభయులూ అభయులు (బృహదారణ్యకోపనిషత్తు-10)

"శిష్యులారా ! జనక మహారాజు చాలా గొప్ప తత్త్వవేత్త. ఆయన చాలామంది దగ్గర చాలా విషయాలను తెలుసుకున్నాడు. ఆ విషయాలు అసంపూర్ణము అని గ్రహించినవాడై, యాజ్ఞవల్క్యుడి దగ్గర ఆతత్త్వాన్ని పూర్తిగా గ్రహించాడు. మీకు ఆ విషయాలు తెలియ చేస్తాను వినండి" అంటూ బృహదారణ్యకోపనిషత్తులో నాల్గవ అధ్యాయాన్ని ప్రారంభించాడు రత్నాకరుడు.

విద్వాంసుడైన జనక మహారాజు సభతీర్చి ఉన్నాడు. ఇంతలో యాజ్ఞవల్క్యుడు అక్కడికి వచ్చాడు. వచ్చిన మహర్షిని సాదరంగా ఆహ్వానించి "దేవా! తమ రాకకు కారణము ఏది ? ధనధాన్యాలు కావాలా ? లేక మా ప్రశ్నలు విందామని వచ్చారా?" అన్నాడు. ఆ మాటలు విన్న యాజ్ఞవల్క్యుడు "రెండింటి కోసము వచ్చాను రాజా ! నీకు ఎవరైనా గురువులు చెప్పిన విషయాలు ఏవైనా ఉంటే, వాటిని వినాలనుకుంటున్నాను" అన్నాడు.

"శిలిన పుత్రుడైన జిత్వా అనేవాడు" వాక్కే నిస్సందేహముగా 'బ్రహ్మ' అని నాతో చెప్పాడు"అన్నాడు జనకుడు. యాజ్ఞవల్క్యుడు అతడు సరిగానే చెప్పాడు. తల్లి, తండ్రి, ఆచార్యుని ద్వారా సుశిక్షితుడైనవాడు చెప్పే విధంగానే అతడు చెప్పాడు. నిస్సందేహంగా వాక్కే బ్రహ్మ. ఎందుకంటే వాక్కులేని మూగవాని వల్ల ప్రయోజనం లేదు. అయితే వాక్కు ఆయతనాన్ని గురించి, ప్రతిష్ఠ గురించి చెప్పాడా ?

జనకుడు : ఆ విషయం నాకు చెప్పలేదు.

యాజ్ఞవల్క్యుడు : అయితే ఓ రాజా ! అతడు నీకు నాల్గవవంతు మాత్రమే ఉపదేశించాడు.

జనకుడు : మహర్షీ ! మిగిలిన తత్త్వాన్ని గురించి మీరు తెలియ చెయ్యండి.

యాజ్ఞవల్క్యుడు : వాణియే వాగ్రూపమైన బ్రహ్మకు ఆయతనం. అంటే నివాసం లేదా శరీరం. అవ్యాకృతమైన అనగా వేరు చేయటానికి వీలులేని ఆకాశమే అతనికి ప్రతిష్ఠ. వాగ్దేవతోపాసన ప్రజ్ఞా రూపంలో చెయ్యాలి. ప్రజ్ఞయే బ్రహ్మయొక్క నాల్గవ భాగం. ఈ నాలుగు భాగాలు.

**నాలుగు భాగాలు :**

1. వాక్కే బ్రహ్మ
2. వాగ్బ్రహ్మకు నివాసము వాణి.
3. ఆకాశమే ప్రతిష్ఠ (ఆధారము)
4. ఉపాసనా విధి ప్రజ్ఞా రూపం.

జనకుడు : ప్రజ్ఞత అంటే ఏమిటి ?

యాజ్ఞవల్క్యుడు : రాజా ! వాణియే ప్రజ్ఞత. వాణి వల్లనే ఋగ్, యజుస్సామ అధర్వ వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, విద్యలు, ఉపనిషత్తులు, ధర్మాలు లోకాలు, సమస్త ప్రాణులు తెలియబడుతున్నాయి. కాబట్టి వాణియే పరబ్రహ్మ. ఈ విషయం తెలుసుకుని ఉపాసించేవాణ్ణి వాణి వెన్నంటి ఉంటుంది. ఉపాసకుడు కూడా దేవత అయి దేవతలో చేరతాడు.

జనకుడు : మహర్షీ ! మీరు చేసిన ఉపదేశానికి బదులుగా మీకు ఏనుగులాంటి ఆబోతుతో సహా వేయి ఆవులిస్తాను.

యాజ్ఞవల్క్యుడు : శిష్యుణ్ణి పూర్తిగా కృతార్థుడుగా చేస్తే తప్ప నేను దక్షిణ తీసుకోను. ఇంకా ఎవరైనా ఏమైనా చెప్పారా ? చెప్పు.

జనకుడు : శుల్బ ఋషి కుమారుడైన ఉదంకుడు 'ప్రాణమే బ్రహ్మ' అని చెప్పాడు.

యాజ్ఞవల్క్యుడు : ఆయన చెప్పింది నిజమే! ప్రాణంలేని వానివల్ల లోకానికి ఏ రకైన మేలు జరగదు. ప్రాణానికి ఆయతనము, ప్రతిష్ఠ చెప్పాడా ?

జనకుడు : చెప్పలేదు. దయచేసి మీరు ఆ విషయం చెప్పండి.

యాజ్ఞవల్క్యుడు : ప్రాణానికి ప్రాణమే ఆయతనం. ఆకాశమే దాని ప్రతిష్ట. ప్రాణ బ్రహ్మను ప్రియరూపంలో ఉపాసించాలి. మహారాజా ! ప్రాణమే ప్రియత్వం. ప్రాణం కోసమే అధికారం లేనివారుకుడా యజ్ఞం చేయిస్తున్నారు. అయోగ్యుడైన వాని వల్ల కుడా దానం తీసుకుంటున్నారు. ఎవరైనా చంపుతారేమో అని భయపడుతున్నారు. ఈ విషయం తెలుసుకుని ఉపాసన చేసేవానిని ప్రాణం వదిలి పెట్టదు. అన్ని భూతాలు అతన్ని అనుసరిస్తాయి. అతడు దేవతలలో కలుస్తాడు.

జనకుడు : మహర్షీ ! నీ ఉపదేశానికి బదులుగా వేయి గోవులిస్తాను.

యాజ్ఞవల్క్యుడు : రాజా ! నీ అనుమానాలు తీర్చందే వాటిని తీసుకోను. ఇంకెవరైనా ఏమైనా చెప్పారా?

జనకుడు : వృష్ణ ఋషిపుత్రుడైన 'బర్కుడు' 'నేత్రమే బ్రహ్మ' అని చెప్పాడు.

యాజ్ఞవల్క్యుడు : అతను నిజమే చెప్పాడు మహారాజా ! మరి దానికి ఆయతనం, ప్రతిష్ఠ చెప్పాడా.

జనకుడు : చెప్పలేదు.

యాజ్ఞవల్క్యుడు : కనులు లేనివాడి వల్ల, చూడలేని వానివల్ల ప్రయోజనం ఏమీలేదు. నేత్రానికి నేత్రమే ఆయతనం. ఆకాశమే ప్రతిష్ఠ. దీన్ని సత్యరూపంలో ధ్యానించాలి. నేత్రమే సత్యత్వం. కళ్ళున్నవాడు చూసింది చూసినట్లు చెబుతాడు. అది సత్యం. అందుకని నేత్రమే బ్రహ్మ. ఈ విషయం తెలుసుకుని నేత్రాన్ని సత్యరూపంలో అభేదాన్ని కల్పించుకుని ఉపాసించిన వానిని నేత్ర బ్రహ్మ వదలదు. ప్రాణులన్నీ ఆ ఉపాసకుణ్ణి అనుసరిస్తాయి. అతడు దేవత అయి దేవతలను పొందుతాడు.

జనకుడు : మహర్షీ ! నీ ఉపదేశానికి వేయి గోవులిస్తాను.

యాజ్ఞవల్క్యుడు : రాజా ! నీ అనుమానాలు పూర్తిగా తీర్చిన తరువాత దక్షిణ పుచ్చుకుంటాను. ఇంకా ఎవరు ఏం చెప్పారు ?

జనకుడు : భరద్వాజ గోత్రంలో పుట్టిన 'గర్దభీనిపీతుడు'అనే ఋషి 'శ్రోత్రమే బ్రహ్మ' అని చెప్పాడు.

యాజ్ఞవల్క్యుడు : నిజమే చెప్పాడు రాజా ! చెవిటి వానివల్ల లోకానికి ఉపయోగం లేదు. అందుకని శ్రోత్రమే బ్రహ్మ. మరి దాని ఆయతనం, ప్రతిష్ఠ చెప్పాడా ?

జనకుడు : చెప్పలేదు. మీరు వివరించండి.

యాజ్ఞవల్క్యుడు : శ్రోత్రమే ఈ బ్రహ్మకు ఆయతనం. ఆకాశం ప్రతిష్ఠ. దీన్ని అనంత రూపంలో ఉపాసించాలి. దిక్కులే అనంతమైనవి. ఎవరూ ఏ దిక్కునూ అంతు చూడలేరు. దిక్కులు అనంతమైనవి. కాబట్టి రాజా ! దిక్కులే శ్రోత్రాలు. శ్రోత్రమే పరబ్రహ్మ. ఈ విధంగా భావించాలి. ఉపాసన చేసిన వాడిని శ్రోత్రబ్రహ్మ ఎన్నడూ వదలదు. అతడు దేవత అయి దేవతలను అనుసరిస్తాడు.

జనకుడు : మహర్షీ ! మీ ఉపదేశానికి వేయి గోవులను దక్షిణగా ఇస్తాను.

యాజ్ఞవల్క్యుడు : రాజా ! నిన్ను కృతార్థునిచేస్తే తప్ప దక్షిణ తీసుకోను. ఇంకా ఎవరైనా ఏమైనా చెప్పారా ?

జనకుడు : జాబాలి కుమారుడు సత్యకాముడు 'మనస్సే బ్రహ్మ' అని చెప్పాడు.

యాజ్ఞవల్క్యుడు : నిజమే ! మనస్సు లేక పోతే ప్రయోజనం ఏమీలేదు. అందుచేతనే మనస్సే బ్రహ్మ. మరి దాని ఆయతనం, ప్రతిష్ఠ సంగతి ఏమిటి ?

జనకుడు : నాకు చెప్పలేదు. మీరే వాటిని చెప్పి నన్ను ధన్యుణ్ణి చెయ్యండి.

యాజ్ఞవల్క్యుడు : రాజా ! మనోబ్రహ్మకు మనస్సే ఆయతనం. ఆకాశమే ప్రతిష్ఠ. మనోబ్రహ్మను ఆనందస్వరూపునిగా ఉపాసించాలి. ఆనందమనేది ఆయనకు చతుర్థపాదం. మనస్సే ఆనంద గుణం. పురుషుడు మనస్సుతోనే స్త్రీని కోరతాడు. ఆ స్త్రీ యందు తనలాంటి కుమారుని కంటాడు. అతడు ఆనందానిచ్చేవాడు. అందుకనే రాజా ! మనస్సు అనేదే పరబ్రహ్మ. ఈ విధంగా తెలుసుకుని మనో బ్రహ్మోపాసన చేసిన వాడిని మనోబ్రహ్మ ఎన్నడూ వదలదు. అతడు దేవత అయి దైవత్వాన్ని పొందుతాడు.

జనకుడు : మహర్షీ ! నీ ఉపదేశానికి బదులుగా వేయి గోవులిస్తాను.

యాజ్ఞవల్క్యుడు : ముందు నీ అనుమానాలు పూర్తిగా తీర్చుకో రాజా ! ఇంకా ఎవరైనా ఏమైనా చెప్పారా ?

జనకుడు : శకలుని కుమారుడైన వాకల్యుడు "హృదయమే బ్రహ్మ" అని చెప్పాడు.

యాజ్ఞవల్క్యుడు : నిజమే ! హృదయం లేనివానివల్ల ప్రయోజనం లేదు. అందుచేత హృదయమే బ్రహ్మ. మరి దాని ఆతనము, ప్రతిష్ఠ చెప్పాడా ?

జనకుడు : చెప్పలేదు. మీరే ఆ విషయాలు వివరించండి.

యాజ్ఞవల్క్యుడు : రాజా ! హృదయ బ్రహ్మకు హృదయమే ఆయతనం, ఆకాశమే ప్రతిష్ఠ దీన్ని 'స్థితి' రూపంలో ఉపాసించాలి. హృదయమే స్థితి, సమస్త భూతాలకు ఆయతనం, సమస్త భూతాలు హృదయంలోనే ఉన్నాయి. ఆ విధంగా ఉండటమే స్థితి - స్థిరత్వం, హృదయమే పరబ్రహ్మ. ఈ విధంగా

భావించి హృదయబ్రహ్మను ఉపాసించేవాడిని హృదయబ్రహ్మ ఎన్నడూ వదలిపెట్టడు. సమస్త ప్రాణులు అతని వద్దకే వెడతాయి. ఉపాసకుడు దేవత అయి దేవతలనే పొందుతాడు.

జనకుడు : ఆ మాటలు విన్న జనక మహారాజు సింహాసనం నుండి దిగి యాజ్ఞవల్క్యుని సమీపించి 'నాకు ఉపదేశం చెయ్యండి' అన్నాడు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు అడుగుతున్నాడు "రాజా ! "ఈ దేహాన్ని వదలిపెట్టిన తరువాత ఎక్కడికి పోతావో తెలుసా?".

"నాకు తెలియదు మహాత్మా ! దయచేసి ఆ విషయం వివరించండి" అన్నాడు జనకుడు.

"రాజా ! కుడి కంటిలో ఉండే పురుషుడికి 'ఇన్ధ'డని పేరు. ఇతన్నే ఇంద్రుడని కుడా అంటారు. ఇది అతని పరోక్షనామం. దేవతలకు ప్రత్యక్షంగా కనిపించటం, పిలవబడటం ఇష్టముండదు.

ఎడమ కంటిలోని పురుషుడు, కుడికంటిలోని పురుషుని భార్య - పేరు విరాట్. హృదయం లోపల ఉన్న ఆకాశమే ఈ భార్యా భర్తలు కలుసుకునే ప్రదేశం. హృదయంలోని ఎర్రని మాంసపు ముద్దయే వీరికి అన్నం. హృదయం మీద కప్పబడి ఉండే సన్నని పొరయే కప్పుకునే వస్త్రం. హృదయం నుండి పైకి వ్యాపించి ఉండే నాడియే వీరిద్దరు నడిచే మార్గం.హృదయంలో కేశముల కన్న సన్నగా ఉండేనాడులు కొన్ని వేలున్నాయి. ఈనాడుల ద్వారానే అన్నం సూక్ష్మమైన రసం రూపంలో శరీరమంతా వ్యాపిస్తుంది. మనం తిన్న ఆహారం జీర్ణమయి మిగిలిన భాగము బయటకు పోతుంది. జీర్ణమైన ఆహారం రసం రూపంలో శరీరంలోని అన్ని భాగాలకు చేరుతుంది. ఈ రసమే హృదయంలో లోహిత పిండంగా మారి లింగశరీరాభిమాని అయిన ఇంద్రునికి ఆహారమవుతుంది. ఈ ఆహారం హితా అనే నాడుల ద్వారా ఇంద్ర, ఇంద్రాణులకు ఆహారమవుతుంది. లింగశరీరాభిమాని అయిన ఇంద్రుడే తైజసుడు.

వైశ్వానరాత్మ కంటె తైజసాత్మ మిక్కిలి సూక్ష్మమైన ఆహారాన్ని గ్రహిస్తుంది. ఆత్మ జాగ్రదవస్థలో వైశ్వానరుడుగా, స్వప్నావస్థలో తైజసుడుగా ఉంటుంది.

ఈ పిశ్వానికి భిన్నమైన వైశ్వానర రూపం నుండి, సూత్రాభిన్నమైన తైజసరూపాన్ని, తద్వారా హృదయాత్మను, దాని నుండి ప్రాణాత్మను పొందిన విద్వాంసుడికి, ఋషికి.

| | | |
|---|---|---|
| తూర్పు దిక్కున ఉండే ప్రాణం | - | పూర్వ ప్రాణం |
| దక్షిణ దిక్కున ఉండే ప్రాణం | - | దక్షిణ ప్రాణం |
| పశ్చిమ దిక్కున ఉండే ప్రాణం | - | పశ్చిమ ప్రాణం |
| ఉత్తర దిక్కున ఉండే ప్రాణం | - | ఉత్తర ప్రాణం |
| అధోదిశలో ఉండే ప్రాణం | - | నిమ్న ప్రాణం |
| సమస్త దిక్కులు, దేవతలు | - | సమస్త ప్రాణాలు |

రాజా ! ఈ దేహాన్ని వదలిన తరువాత మానవుడు ఆత్మభావాన్ని తురీయ భావాన్ని పొందుతాడు. ఆత్మ గ్రహించటానికి వీలులేనిది. నాశనం లేనిది. దేనితోనూ సంపర్కం లేనిది, బంధనాలు లేనటువంటిది. అది హింసింపబడదు. పీడింపబడదు.ఆత్మ నేతినేతి అంటే ఇది కాదు, ఇది కాదు అనే మాటలతో వర్ణింపబడుతూ ఉంటుంది. అది గ్రహింపుకు అందేది కాదు.

ఓ జనకరాజా ! వీటన్నింటి జ్ఞానం వల్ల నీకు నిర్భయ స్థితి ఏర్పడింది. నువ్వు ఇప్పుడు అభయుడవు. అంటే భయం లేనివాడ వయ్యావు". అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"మహాత్మా ! మమ్ములను అభయులుగా మార్చిన మిమ్ములను కుడా అభయస్థితి అలంకరించుగాక! మీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. విదేహరాజ్యము, ఈ దేహము తమ సేవకొరకే ఉన్నాయి. ఆజ్ఞాపించండి." అన్నాడు జనకుడు.

ఈ విధంగా గురుశిష్యులు ఉభయులూ అభయులయ్యారు అంటూ నాల్గవ అధ్యాయంలోని మొదటి రెండు బ్రాహ్మణాలను పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 57. వెలుగులకు వెలుగు (బృహదారణ్యకోపనిషత్తు-11)

"శిష్యులారా ! ఆత్మ ఎలా ఉంటుంది ? జాగ్ర స్వప్న సుషుప్తులలో దాని ఉనికి ఏమిటి? అనే విషయాలను యాజ్ఞవల్క్యుడి ద్వారా తెలుసుకున్నాడు జనక మహారాజు. ఆ విషయాలను మీకు వివరిస్తాను వినండి" అంటూ నాల్గవ అధ్యాయంలో మూడవ బ్రాహ్మణాన్ని ప్రారంభించాడు రత్నాకరుడు.

ఒకసారి యాజ్ఞవల్క్యుడు విదేహాధిపతి అయిన జనకుని ఆస్థానానికి వెళ్ళాడు. గురువుగారిని చూడగానే ఎదురేగి స్వాగత సత్కారాలు అందించి కుశల ప్రశ్నలు అయిన తరువాత జనక మహారాజు అంటున్నాడు.

"గురుదేవా ! నాకు చిన్న అనుమానం వచ్చింది. అది తీర్చి పుణ్యం కట్టుకోండి". ఆ మాటవినగానే అదేమిటో చెప్పమన్నాడు యాజ్ఞవల్క్యుడు.

జనకుడు : మహర్షి ! మానవుడు ఏ వెలుగు వల్ల తన నిత్యకృత్యం సాగిస్తున్నాడు.

యాజ్ఞవల్క్యుడు : సూర్యుని వెలుతురు వల్ల. ఆ వెలుతురు వల్లనే మానవుడు పనిపాటలు నిర్వహించుకుంటాడు. దూరతీరాలకు వెడతాడు. పనులు పూర్తి చేసుకొని తిరిగివస్తాడు. ఆ వెలుగులో వెళ్ళానుకున్నచోటికి వెడతాడు. చేయదలచుకున్న పని చేసుకుంటాడు.

జనకుడు : మహర్షి ! మరి సూర్యాస్తమయమైతే పనులు ఏవిధంగా జరుగుతాయి.

యాజ్ఞవల్క్యుడు : సూర్యుడు అస్తమించిన తరువాత చంద్రుని యొక్క కాంతులలో ఈ పనులన్నీ జరుగుతాయి.

జనకుడు : సూర్యచంద్రు లిద్దరూ అస్తమించినప్పుడు ఏం జరుగుతుంది మహాత్మా!

యాజ్ఞవల్క్యుడు : రాజా ! సూర్యచంద్రులు ఇద్దరూ లేనప్పుడు అన్ని వ్యవహారాలు దీపం లేదా అగ్ని వెలుగులో జరుగుతాయి.

జనకుడు : మహానుభావా ! మరి ఆ అగ్నికుడా లేకపోతే ? సూర్యుడస్తమిస్తాడు. చంద్రకాంతి ఉండదు. అగ్ని ఆరిపోతుంది. అప్పుడు మానవుడు ఏ రకంగా పనులు చేస్తాడు ?

యాజ్ఞవల్క్యుడు : రాజా ! ఆ వెలుగుల స్థానంలో వాక్కు వ్యవహారానికి సహకరిస్తుంది. చీకటిలో ఏమీ కనిపించదు. కాని ఏదో ధ్వని వినిపిస్తే మానవుడు ధ్వని వినిపించిన వైపుకు సాగిపోతాడు.

జనకుడు : మరి ఆవాక్కు కుడా ఆగిపోతే ? అంటే ధ్వని కుడా ఏ మాత్రం వినిపించదు. అప్పుడు ఏం జరుగుతుంది ?

యాజ్ఞవల్క్యుడు : జనక మహారాజా ! శబ్దాలన్నీ సద్దుమణిగిన తరువాత ఏం జరుగుతుంది? అని కదా అడుగుతున్నావు. జాగ్రత్తగా విను. ఈ వెలుగులకన్నిటికీ అవతలఆత్మజ్యోతి ఉన్నది. ఆ ఆత్మ ప్రకాశములకు ప్రకాశం. కాంతులకు కాంతి. అటువంటి ఆత్మ వల్లనే మానవుడు మనుగడ సాగిస్తాడు.

జనకుడు : స్వామీ ! ఆత్మ అంటే ఏమిటి ? మీరు చెప్పిన శరీరం ఇంద్రియాలు, మనస్సు, ప్రాణాలు. వీటిలో ఆత్మజ్యోతి ఏది ?

ప్రాణాల్లో, బుద్ధి వృత్తులలో ఉండే విజ్ఞాన జ్యోతి స్వరూపమే ఆత్మ. ఇంద్రియాల మధ్య స్వయం ప్రకాశమై హృదయంలో ఉండే పురుషుడే ఆత్మ. అదే ఈ లోకంలోను పరలోకంలోనూ సంచరిస్తుంది. కదులుతున్నట్లు కనిపిస్తుంది. స్వప్నంలాగా ఉంటూ దేహేంద్రియాలను, మృత్యువునుకూడా దాటిపోతుంది. జన్మించేటప్పుడు శరీరంలో ఆత్మభావాన్ని పొంది దేహేంద్రియ రూపమైన పాపంతో కలుస్తుంది. మరణించినప్పుడు ఆ పాపాన్ని వదలిపెడుతుంది.

ఈ ఆత్మ పురుషుడికి ఈ లోకము, పరలోకము అని రెండు స్థానాలున్నాయి. ఈ రెంటి మధ్యనా ఉన్న స్వప్న జగత్తు మూడవ స్థానము. ఇక్కడ

ఈ లోకము అంటే - జాగ్రదావస్థ

మధ్య స్థానము అంటే - స్వప్నావస్థ

ఆ లోకము అంటే - సుషుప్త్యావస్థ

స్వప్నంలో ఉంటూ మిగిలిన రెండు స్థానాలనూ చూస్తాడు ఆత్మ పురుషుడు. నిద్రించేటప్పుడు ఆత్మ పురుషుడు సమస్త లోకాలలోని అనుభవాలను తీసుకుని స్థూల శరీరాన్ని వదలి, స్వప్న శరీరంలో ప్రవేశించి ఆత్మజ్యోతి రూపమైన ప్రకాశంతో స్వప్నం చూస్తాడు. ఈ స్థితిలో అతడు స్వప్నద్రష్టఅయిన పురుషుడు - తైజసుడు అని పిలవబడతాడు.

స్వప్నావస్థలో రథాలు, వాటికి కట్టే గుఱ్ఱాలు, అవి నడిచే మార్గాలు ఏవీ ఉండవు. కాని ఆ పురుషుడు వాటిని తానే రచించుకుంటాడు. అప్పుడు ఆనందం, మోదం, ప్రమోదం ఏవీ ఉండకపోయినా తానే వాటిని కల్పించుకుంటాడు. ఇక్కడ

కోరుకున్నది లభించినప్పుడు గలిగే సంతోషము - మోదము

మోదము ఎక్కువగా కలిగితే - ప్రమోదము.

ప్రమోదము కన్న ఎక్కువైన సంతోషము - ఆనందము.

స్వప్నము ద్వారా శరీరాన్ని చేష్టలు లేని దానినిగా చేసి, తాను నిద్రపోకుండా, నిద్రపోయే వాటన్నింటినీ అన్ని వైపుల నుంచి చూస్తుంది. మళ్ళీ పూర్తిగా ఇంద్రియ సహితమైన శరీరాన్ని ధరించి జాగ్రదవస్థలోకి వస్తుంది. ఈ రకంగా ఇహపరలోకాల్లో కుడా ఆత్మ ఒంటరిగానే ప్రయాణిస్తుంది.

శరీరాన్ని రక్షించే బాధ్యత ప్రాణానికి అప్పగించి, తాను మాత్రం బయట ఇష్టం వచ్చినట్లు విహరిస్తుంది. కోరికలు తీర్చుకుంటుంది. స్వప్నావస్థలో ఉచ్చనీచ భావాలు అనేకం పొందుతుంది. స్త్రీలతో రమిస్తుంది. మిత్రులతో ఆనందిస్తుంది. భయంకరమైన విషయాలు చూసి భయపడుతుంది.

ఆత్మను ఎవరూ చూడలేరు. కాని ఆత్మ క్రీడాసామాగ్రిని అంతా చూస్తూనే ఉన్నారు. స్వప్నాలు అంతా చూస్తారు. కాని స్వప్నద్రష్టను మాత్రం చూడలేరు. స్వప్నావస్థలో పురుషుడు స్వయంజ్యోతి అవుతాడు.

ఈ రకంగా స్వప్నంలో విహరించిన ఆత్మ మళ్ళీ యధాస్థానానికి తిరిగి వస్తుంది. అంతే కాని తాను చూసిన వాటితో బంధింపబడదు.

సుషుప్తిలో అతడు అన్ని దుఃఖాలను అధిగమిస్తాడు. ఇదే గాఢనిద్రావస్థ

పురుషుడు జాగరిత స్థానంలో రమిస్తూ, పాపపుణ్యాలను చూస్తూ, వచ్చిన మార్గం గుండానే జాగ్రదవస్థలోకి వెడతాడు. అలాంటప్పుడు స్వప్నస్థానంలోని దోషాలు అతనికి అంటవు.

సుషుప్తావస్థలో తల్లి, తండ్రి అనే సంబంధాలు ఉండవు. అయినవారు కాని వారవుతారు. ఆస్థితిలో పురుషునికి పాప పుణ్యాలతో సంబంధం ఉండదు. ఏ భేదభావమూ ఉండదు. అప్పుడు హృదయంలో ఉండే సమస్తకోశాలకూ అతీతుడౌతాడు.

ఆ స్థితిలో ఏ పురుషుడు చూడటం లేదో అతడు నిస్సందేహంగా చూస్తూ, చూడటం లేదు. అతడికి దృష్టిలోపం లేదు. కాని ఆ సమయంలో చూసేందుకు వేరు వస్తువేదీ లేదు. అంతేకానీ యధార్థంగా చూడకపోవడం కాదు. జాగ్రస్వప్నాలలో చూసేందుకు విషయముంది. కాని సుషుప్తిలో అటువంటి విషయం లేదు. అందుకని చూడటం లేదు అనుకుంటాము.

ఆ స్థితిలో వాసన చూడటం లేదు. అంటే అతని వాసన చూసే శక్తి నశించిందని కాదు. గతంలో వివరించినట్లుగానే వాసన చూస్తూనే వాసన చూడటం లేదు.

సుషుప్తిలో పురుషుడు రుచి చూడటం లేదు. అంటే ఆస్థితిలో అతడు తప్ప రుచి చూడటానికి వేరే వస్తువంటూ ఏదీ లేదు.

అదే విధంగా సుషుప్తిలో ఆత్మ పురుషుడు ఎవరితోనూ మాట్లాడలేడు, వినలేడు, మననం చెయ్యలేడు. దీనికి కారణము అతడు అద్వితీయస్థితిలో ఉండటమే.

జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ ఆత్మకన్న భిన్నమైన వస్తువులుంటాయి. అందుచేతనే ఆ స్థితిలో ఇతరులతో మాట్లాడటము, చూడటము, వినటము వంటి పనులు చేస్తాడు. సుషుప్తావస్థలో జీవాత్మయైన ద్రష్ట ఒకడే. అంటే అద్వితీయుడుగా ఉంటాడు. ఓ రాజా ! అదే బ్రహ్మలోకము. అదే పురుషుని పరమ గతి, పరమ సంపత్తి, పరమ లోకం, పరమానందం. జీవులు అనుభవించే ఆనందం పైన చెప్పిన ఆనందంతో పోలిస్తే అతి స్వల్పం.

మానవులలో శరీర సౌష్టవము, భోగసామాగ్రి, కలవాడు పొందే ఆనందం మానుషానందము. దీనికి వందరెట్లు పితృ దేవతానందం. దానికి వందరెట్లు ఎక్కువది గంధర్వలోకానందం. దానికి వందరెట్లు అజాన దేవతల ఆనందం. అజాన దేవతలంటే పుట్టుకతోనే దేవతలుగా పుట్టినవారు. వీరి ఆనందానికి వందరెట్లుండేది ప్రజాపతి ఆనందం. దీనికి వందరెట్లు హిరణ్యగర్భుని ఆనందం. ఆప్తకాముడు, శ్రోత్రియుడు, కోరికలు లేనివాడు, విద్వాంసుడు అయినవాని ఆనందం కూడా ఇదే. ఇదే బ్రహ్మనందము. ఇదే బ్రహ్మలోకము.

ఈ శరీరంలోని ఆత్మ ఊర్ధ్వశ్వాసతో లింగ శరీరంలోని మర్మస్థానాలు విడిచి పోతాడు.

ఇంద్రియాలతో కూడినట్టి, అవిద్యాజన్యమైనట్టి ఈ దేహం వృద్ధాప్యం కారణంగా కృశించిపోతుంది. అప్పుడు చెట్టు నుండి పండు రాలిపోయినట్లుగా శరీరంలోని పురుషుడు

ఈ అవయవాలను వదిలించుకుని, కర్మానుసారము మరొకయోనిలో జన్మించటం కోసం వెళ్ళిపోతాడు. ప్రాణము అవయవాలు ఉంటేనేగాని కర్మఫలం అనుభవించలేడు. అందుకని ఇంకో శరీరం చేరతాడు. వేరొక శరీరాన్ని పొందటానికి వచ్చే ఆత్మను చూసి సమస్త భూతాలు 'ఇదిగో పరమాత్మ వస్తున్నాడు' అనుకుంటూ సభాస్థలి చేరే రాజుగారి కోసం ఎదురుచూసే సేవకులలాగా ఎదురు చూస్తుంటాయి. ఎగశ్వాస ప్రారంభంకాగానే చివరి దశలో ప్రాణాలు, ఇంద్రియాలు ఆత్మకు ముందుగా నడుస్తూ పోతాయి".

అంటూ వెలుగులకే వెలుగు, కాంతులకు కాంతి అయి, ఈ వెలుగులకావల ఉన్నటువంటి వెలుగును గురించి యాజ్ఞవల్క్యుడు జనక మహారాజుకు వివరించాడంతా రత్నాకరుడు బృహదారణ్యకంలోని నాల్గవ అధ్యాయంలోని మూడవ అరణ్యాకాన్ని పూర్తిచేశాడు.

## 58. బ్రహ్మవేత్త (బృహదారణ్యకోపనిషత్తు - 12)

"శిష్యులారా ! జనక మహారాజు అంజలిఘటించినవాడై యాజ్ఞవల్క్యుని సమీపించి, దేవా 'బ్రహ్మవేత్త' అంటే ఎవరు ? మానవుడు ఈ జన్మచాలించిన తరువాత మోక్షము ఏ విధంగా పొందుతాడు ? ఈ విషయాలు నాకు వివరించండి. అని అడిగాడు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు చెప్పిన విషయాలను మీకు వివరిస్తాను వినండి" అంటూ బృహదారణ్యకోపనిషత్తులోని నాల్గవ అధ్యాయంలోని నాల్గవ బ్రాహ్మణాన్ని వివరించటం మొదలు పెట్టాడు రత్నాకరుడు.

ఆత్మ ఎప్పుడూ దుర్బలం కాదు. కాని దుర్బలమైనట్లు కనిపిస్తుంది. ఆ స్థితిలో వివేకాన్ని కోల్పోతాడు మానవుడు. అంటే ఏమీ తెలుసుకోలేని స్థితికి చేరతాడు. అదే స్పృహకోల్పోవటము. అప్పుడు వాక్కు మొదలైన ప్రాణాలన్నీ ఆత్మకు ఎదురుగా నిలబడతాయి. అప్పుడు ఇంద్రియాలు తమ తేజస్సును ఉపసంహరించుకుంటాయి. కంటికి అధిదేవత అయిన ఆదిత్యుడు అన్ని వైపుల నుండి వేరైపోతాడు. అంటే కళ్ళను అనుగ్రహించటం మానివేసి ఆదిత్యరూపం పొందుతాడు. అప్పుడు మానవుడికి కంటిచూపు పోతుంది. అంటే నేత్రం లింగాత్మతో ఏకంకాగానే కంటి చూపుపోతుంది. ఘ్రాణేంద్రియం లింగాత్మతో ఏకంకాగానే వాసనచూసే శక్తిపోతుంది. ఊపిరి అందదు. రసేంద్రియం ఆత్మతో ఏకంకాగానే రుచిచూసే శక్తి పోతుంది. గొంతు మ్రింగుడుపడదు. వాగింద్రియం ఆత్మతో ఏకంకాగానే మాటపోతుంది. శ్రోత్రేంద్రియం ఆత్మతో ఏకంకాగానే వినిపించదు. మనస్సు ఆత్మతో ఏకంకాగానే ఆలోచనాశక్తి పోతుంది. త్వగింద్రియం ఆత్మతో ఏకంకాగానే స్పర్శజ్ఞానం పోతుంది. బుద్ధి కుడా ఆత్మతో ఏకంకాగానే అతడికి ఏమీ తెలియదు.

అప్పుడు జీవాత్మ శరీరంనుంచి బయటకు పోవటానికి మార్గం కనిపిస్తుంది. ఆ స్థితిలో ఆత్మ శిరస్సు ద్వారాగాని, మిగిలిన అవయవాల ద్వారా గాని బయటకు పోతుంది. దాంతో పాటే ప్రాణం కుడా బయటకు పోతుంది. ప్రాణం శరీరం నుంచి బయటకు రాగానే ఇంద్రియాలన్నీ శక్తి హీనమవుతాయి. ఆ స్థితిలో జీవుడు మంచి విజ్ఞానవంతుడుగా ఉంటాడు. విజ్ఞానంతో కూడిన ప్రదేశానికి పోతాడు. అతనితోపాటు అతని జ్ఞానము, అతడు చేసిన కర్మ, పూర్వ జన్మ సంస్కారము అతని వెంట వెడతాయి.

గొంగళిపురుగు ఒక ఆకును పూర్తిగా అనుభవించి, దాన్ని నిస్సారం చేసి వేరొక ఆకుమీద ఆశ్రయం సంపాదించి అంటే ఇంకొక ఆకును పట్టుకుని శరీరాన్ని కుంచించి వేస్తుంది. అందువల్ల మొదటి ఆకు నుండి పూర్తిగా ఇవతలకు వచ్చేస్తుంది. అలాగే ఆత్మ తానున్న శరీరాన్ని చంపి, వేరొక శరీరాన్ని ఆశ్రయంగా పొందుతుంది.

బంగారం కరిగించి కొత్త ఆభరణము తయారు చేసినట్లుగా, ప్రస్తుతం ఉన్న శరీరాన్ని పాడుచేసి గంధర్వ, దేవ, బ్రహ్మలోకాలు పొందటానికి అనువైన శరీరాన్ని ఆత్మ ఏర్పాటు చేసుకుంటుంది. ఇది అతను చేసిన కర్మల మీద ఆధారపడి ఉంటుంది. ఉత్తమ కర్మలు చేసినవారు ఉత్తమ జన్మ ఎత్తుతారు. కాగా పాపకర్మలు చేసిన వారు పశువులు పక్షులు, కుక్కలు, పిల్లులు చివరకు పిశాచాలుగా కుడా జీవిస్తారు.

ఆత్మే బ్రహ్మవిజ్ఞానము. ఈ బ్రహ్మము మనోమయము, ప్రాణమయము, చక్షుర్మయము, శ్రోత్రమయము, పృథివీమయము, జలమయము, వాయుమయము, ఆకాశమయము, తేజోమయము, ధర్మమయము, అధర్మమయము, క్రోధమయము, అక్రోధమయము. ఈ విధంగా సృష్టిలో కనుపించే ప్రతివస్తువు బ్రహ్మమయమే. ఆత్మపురుషుడు దేనితో తాదాత్మ్యం చెందితే దానిలాగే కనిపిస్తాడు. పుణ్యకర్మలతో తాదాత్మ్యుడైతే పుణ్యాత్ముడు. పాపకర్మలతో తాదాత్మ్యం చెందితే పాపాత్ముడు.

జీవుడుచేసిన కర్మకు తగిన ఫలాన్ని పొంది, మళ్ళీ కర్మ చెయ్యటానికి భూలోకానికి వస్తాడు. భూలోకం కర్మభూమి, ఇతరలోకాల్లో కర్మను చెయ్యలేరు. కోరికలున్న వాడు అతడు చేసిన శుభాశుభాలను బట్టి ఫలితము పొందుతాడు.

కోరికలు లేనివాడు నిష్కాముడు. అకాముడు, ఆప్తకాముడు, ఆత్మకాముడు అనబడతాడు. అతడు తత్త్వజ్ఞాని. అతని ప్రాణాలు శరీరం నుంచి ఉత్క్రమించవు. అంటే బయటకు పోవు. అతనికి కర్మశేషం లేదు కాబట్టి మరుజన్మ ఉండదు. ఆతడు తత్త్వవేత్త, బ్రహ్మజ్ఞాని. బ్రహ్మ స్వరూపాన్ని పొంది బ్రహ్మమే అవుతాడు.

సామాన్యుడి దృష్టిలో తత్త్వజ్ఞాని ప్రాణాలు ఉత్క్రమణ చేసినట్లు ఉంటుంది. కాని అది నిజంకాదు. హృదయంలోని కోరికలు పూర్తిగా నాశనమయ్యేదాకా అతడు మరణిస్తూనే ఉంటాడు. కోరికలు పోయిన తరువాత అమరుడౌతాడు. ప్రస్తుతమున్న శరీరంతోనే అతడు బ్రహ్మను పొందుతాడు. తత్త్వవేత్త పాము కుబుసాన్ని విడిచినట్లుగా కోరికలను విడిచేస్తాడు.

అప్పుడు అతనికి శరీరమున్నా లేనట్లే లెక్క. శ్వాస తీసుకున్నా లేనట్లే లెక్క. సంసారం అతన్ని బంధించదు. దీనికంతకూ కారణం కోరికలు లేకపోవటం. అదే ముక్తి. శరీరం మీద కోరికలు లేనికారణంగా అది చచ్చినట్లే కోరికలు లేవు. కర్మ శేషం లేదు. కాబట్టి మళ్ళీ జన్మలేదు. అదే జీవన్ముక్తి .

జ్ఞాన మార్గాన్ని తెలుసుకోవటం చాలా కష్టం. అది చాలా సూక్ష్మమైనది. ఇది మోక్షానికి తీసుకుపోతుంది. జ్ఞానమార్గం ద్వారానే బ్రహ్మవేత్తలంతా జీవించి ఉండగానే ముక్తులైనారు. అంటే కోరికలు నశించి ఆప్తకాలములయినారు. కాబట్టి శరీర సంబంధం వదలి పోతుంది. ఇంక ప్రారబ్దకర్మ క్షయంకాగానే మోక్షం లభిస్తుంది. పునర్జన్మ ఉండదు.

కర్మనుపాసించే వారు అంధకారంలో ప్రవేసిస్తారు. త్రయీవిద్యనుపాసించేవారు అంటే వేదవిహిత కర్మలు చేసేవారు అంధకారంలో పడిపోతారు. ఉపనిషత్తులలో చెప్పిన జ్ఞానమార్గాన్ని వదలి కేవలం కర్మలు, వేదాధ్యయనం చేసేవారు అంథకారంలో కూరుకుపోతారు. వీరు పోయే లోకాలు సుఖం లేనివి. ఘోరమైన అంధకారంతో కూడి ఉంటాయి. కర్మిష్ఠులకు, వేదాధ్యయనపరులకు మోక్షం లభించదు. వీరికి స్వర్గం మాత్రమే లభిస్తుంది. ఆ తరువాత కర్మఫలాన్ని బట్టి జనన మరణాలు కలుగుతాయి. ఇవన్నీ సుఖ దుఃఖాలను కలుగచేస్తాయి. ఆత్మజ్ఞానమే మోక్షానికి ఏకైక సాధనం.

మానవుడు జ్ఞానం ద్వారా 'నేను నిత్యుడను, శుద్ధ బుద్ధ ముక్త స్వభావం గల బ్రహ్మను' అని తెలుసుకో గలిగితే అటువంటివాడు కోరేది ఏదీ ఉండదు. ఆత్మజ్ఞానికి కోరికలు ఉండవు కదా। అటువంటి జ్ఞాని భోగాలకోసం శరీరం వెంటపడరు. ఆత్మ దర్శియైన సాధకుణ్ణి జనన మరణాది దుఃఖాలేవీ బాధించవు.

శరీరము అనేక అనర్థాలతో కూడిన విషమస్థానం. అటువంటి శరీరంలో ప్రవేశించి ఉన్న ఆత్మను గురించి తెలుసుకున్నవాడు వివేకవంతుడు. అతడే మహాజ్ఞాని అతడు కర్మలు చెయ్యకపోయినా చేసినట్లే. లోకమంతా అతనిదే. అతడే సర్వాంతర్యామి అయిన ఆత్మ. ఈ శరీరంలో ఉంటూనే ఆత్మ తత్త్వాన్ని గురించి తెలుసుకున్నవాడు మృత్యువును జయిస్తాడు. అలా ఆత్మను గురించి తెలుసుకోలేనివాడు జనన మరణాది దుఃఖాలు పొందుతూనే ఉంటాడు.

గురువు యొక్క ఉపదేశాలు వినటం ద్వారా, శాస్త్రాలు చదవటం ద్వారా ఆత్మను గురించి తెలుసుకోవచ్చు.

పరమాత్మకు లోబడే కాలచక్రం తిరుగుతూ ఉంటుంది. అన్నింటికి వెలుగునిచ్చేవాడు ఆ పరమాత్మయే. అతడు మరణం లేనివాడు, శాశ్వతుడు. కాలనియంత అయిన ఆపరమాత్మను దేవతలు ఆయుర్దాయం కోసం ఆయుర్బ్రహ్మ రూపంలో ఉపాసిస్తారు.

పరమాత్మలో ఐదేసి చొప్పున ఐదు సమూహాలున్నాయి.

1. గంధర్వులు, పితరులు, దేవతలు, అసురులు, రాక్షసులు.
2. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర, నిషాదులు.
3. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు.
4. పంచభూతాలు.
5. జ్ఞానేంద్రియాలు.

ఇటువంటి ఆత్మయే అవినాశమైన పరబ్రహ్మ. ఇందుకు భిన్నమైనది పరబ్రహ్మకాదు. అవిద్యతో ఉన్నంతవరకు మృతుడుగానే ఉన్నాను. ఇప్పుడు అజ్ఞానం తొలగి పోయింది. కాట్టి ఈ ఆత్మను తెలుసుకో గలిగిన నేను బ్రహ్మవేత్తను. అమృతుడను.

పరమార్ధ జ్ఞానంతో, పరిశుద్ధమైన మనస్సుతో మాత్రమే గురూపదేశం పొందటం ద్వారా పరబ్రహ్మను దర్శించాలి. పరమార్ధ జ్ఞానము, పరిశుద్ధమైన మనస్సు ఈ రెండూ ముఖ్యం. ఆ తరువాతనే గురూపదేశం. పరబ్రహ్మలో అనేకత్వం లేదు. పరబ్రహ్మలో నానాత్వం చూసేవాడు ఒక మృత్యువు నుండి ఇంకొక మృత్యువుకు పోతాడు. భేద దృష్టికి కారణం అజ్ఞానం. అజ్ఞాని చావుపుట్టుకలతో సతమతమవుతాడు.

బుద్ధిమంతుడైనవాడు బ్రహ్మను గురించి మాత్రమే తెలుసుకొని, ఇతర విషయాలను వదలిపెట్టి, బ్రహ్మ మీదనే మనస్సు లగ్న చెయ్యాలి. ఇతర విషయాలను ఆలోచించకూడదు. ఎక్కువ మాట్లాడితే శ్రమ తప్ప ఇంకే ఫలము ఉండదు.

ఆత్మ పురుషుడు హృదయాకాశంలోనే ఉంటాడు. అతడే ఇంద్రియాలన్నిటికీ అదిపతి అతడు శుభకర్మలవల్ల వృద్ధిపొందడు. అశుభకర్మలవల్ల క్షీణించడు. శుభాశుభాలు అతడికి అంటవు. అతడు సర్వేశ్వరుడు. సర్వభూతాలకు అధిపతి. అట్టి బ్రహ్మను బ్రాహ్మణులు వేదాధ్యయనము, కర్మానుష్ఠానము ద్వారా తెలుసుకోవాలనుకుంటారు. ఆత్మలోకాన్ని

కోరేవారు సమస్తాన్ని త్యజించి సన్యసిస్తారు. ఏషణత్రయాన్ని విసర్జించి బిక్షాటన చేస్తూఉంటారు. ఆత్మను గురించి మహావాక్యాలలో చెప్పబడింది. ఆత్మ గ్రహించటానికి వీలుకానిది, పట్టుబడనిది. నాశనము లేనిది.దేనిచేత బంధింపబడదు.

ఆత్మజ్ఞానిని సుఖదుఃఖాలు బాధించవు. కష్ట సుఖాలకు, పాపపుణ్యాలకు, సుఖ దుఃఖాలకు అతడు అతీతుడు. అందుచేత అతడికి కర్మలు ఫలితాన్ని ఇవ్వవు. అతడు కర్మ చేసినా చెయ్యకపోయినా ఒకటే.

బ్రహ్మదర్శనం చేసిన వాడు కర్మలు చేస్తే అతడి మహిమ పెరగదు. చెయ్యక పోతే తగ్గదు. ఈ విషయాలు తెలుసుకున్నవాడికి ధర్మాధర్మాల ఫలితము అంటదు. ఈ విషయం తెలుసుకున్నవాడు ఇంద్రియ వ్యాపారాలను వదలివేసి, కోరికలు లేనివాడై తనలోనే ఆత్మదర్శనం చేసుకుంటాడు. తనలోనే అందరినీ చూస్తాడు. అతణ్ణి పాపపుణ్యాలు, ధర్మాధర్మాలు అంటవు. అతడు పాపపుణ్యాలకు అతీతుడు. అతడే సమస్త పాపాలను తపింపచేస్తాడు, భస్మం చేస్తాడు. అతడు పాపరహితుడు, వాంఛారహితుడు. అతడే బ్రహ్మవేత్త. ఓ జనక మహారాజా ! ఇదే బ్రహ్మలోకం. ఈ లోకానికి నువ్వు చేర్చబడ్డావు." అంటూ మోక్ష మార్గాన్ని, బ్రహ్మవేత్తను గురించి వివరించాడు యాజ్ఞవల్క్యుడు అంటూ నాల్గవ బ్రాహ్మణాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

యాజ్ఞవల్క్యుడు సన్యాసాశ్రమ స్వీకారం చెయ్యదలచి తన ఇద్దరు భార్యలను పిలిచి తనకున్న ఆస్థిని వారికి పంచుతున్నాడు. ఆ మాటవిన్న మైత్రేయి ఐహిక సుఖాలందించే ఈసంపద నాకువద్దు. శాశ్వత సుఖాన్నిచ్చే బ్రహ్మోపదేశం చెయ్యమన్నది. అప్పుడు యాజ్ఞవల్క్యుడు ఆమెకు బ్రహ్మోపదేశం చేశాడు. అది అంతా మీకు గతంలో వివరించాను. అదే ఐదవ బ్రాహ్మణంలో ఉన్నది. ఇక ఆరవ బ్రాహ్మణంలో గురు పరంపర చెప్పబడింది. అది కుడా గతంలోనే చెప్పాను అటూ నాల్గవ అధ్యాయాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 59. 'ద' గాధ (బృహదారణ్యకోపనిషత్తు - 13)

"శిష్యులారా! దేవదానవులందరు బ్రహ్మను చేరి మాకు ఉపదేశం చెయ్యమని అడిగారు. అప్పుడాయన 'ద' అనే అక్షరాన్ని వారికి ఉపదేశించాడు. ఆ విషయాన్ని వివరిస్తాను వినండి" అంటూ ఐదవ అధ్యాయాన్ని ప్రారంభించాడు రత్నాకరుడు.

పూర్వకాలంలో- దేవతలు, మానవులు, అసురులు - ఈ ముగ్గురూ కుడా ప్రజాపతి పుత్రులే. వారు ప్రజాపతి దగ్గరకు వెళ్ళి కొంతకాలం బ్రహ్మచర్య దీక్షవహించి నియమ నిష్ఠలతోగడిపారు. దీక్షాకాలం పూర్తయింతరువాత దేవతలు ప్రజాపతిని తమకు ఉపదేశం చెయ్యమని ప్రార్థించారు. ప్రజాపతి వారికి 'ద' అని ఉపదేశించి, ఇదే నేను మీకిచ్చే ఉపదేశం. మీరు ఈ ఉపదేశాంతర్యం అర్థం చేసుకున్నారా?" అని ప్రశ్నించాడు.

దానికి దేవతలు "ఆఁ ! మాకు అర్థమైంది. మీరు మాకు ఉపదేశించింది 'దమ్యత' - దేవతలు ఇంద్రియలోలులు కాబట్టి, మేము సంయమనంపాటించాలని మీరు అలా చెప్పారు". అన్నారు.

"సరే ! నేను మీకు చేసిన బోధ అర్థమైనట్లే". అన్నాడు ప్రజాపతి.

ఆ తరువాత మానవులాయన దగ్గరకు వెళ్ళి "మాకు ఏదైనా ఉపదేశం చెయ్యండి" అన్నారు. ప్రజాపతి వారినుద్దేశించి మళ్ళీ 'ద' అనే పదం ఉచ్ఛరించి 'మానవులారా! మీకు నేనిచ్చే ఉపదేశం ఇదే. అర్ధమయిందా?' అన్నాడు.

"బోధపడకేం! చాలా బాగా బోధపడింది. మీరు మాకిచ్చిన ఉపదేశం 'దత్త' అనికదా. మానవులకు లోభగుణం ఎక్కువగా ఉంటుంది. అందుచేత మమ్ములను దాన శీలులు కమ్మని మీరు ఆ ఉపదేశం చేశారు" అన్నారు మానవులు.

"సరే ! నా సందేశం మీకు అర్థమైనట్లే" అన్నాడు ప్రజాపతి. తరువాత అసురులు ప్రజాపతిని చేరి తమకు ఉపదేశం చెయ్యమని అడిగారు.

పూర్వం లాగానే ప్రజాపతి 'ద' అనే అక్షరాన్నే మళ్ళా ఉచ్ఛరించి. "ఇదే నేను మీకిచ్చే ఉపదేశం. బోధపడిందా?" అన్నాడు.

"అర్థమయింది. దయ అనే కదా మీ ఉపదేశార్థం. మేము రాక్షసులం. క్రూర స్వభావులం. కాబట్టి మమల్ని దయార్ద్ర హృదయులు కమ్మని ఉపదేశించారు" అన్నారు అసురులు.

"సరే ! నా సందేశం మీకు అర్థమైనట్లే" అన్నాడు ప్రజాపతి. ఆనాడు ప్రజాపతి చేసిన ఉపదేశం నేటికీ కూడా మేఘగర్జన రూపంలో చెప్పే దేవవాణి 'దదద' గమనకు వినిపిస్తోంది. దమ్యత అంటే సంయమనం కలిగి ఉండమని, దానం చెయ్యమని, దయా గుణం కలిగి ఉండమని దాని అర్థం. ఈ మూడు గుణాలు ఉన్నవాడే ఉపాసనకు అర్హుడు అంటూ వివరించాడు రత్నాకరుడు.

# 60. బ్రహ్మోపాసన (బృహదారణ్యకోపనిషత్తు - 14)

"శిష్యులారా ! దమము, దానము, దయ అనే మూడుగుణాలు ఉన్నవాడే ఉపాసనకు అర్హుడు. జ్ఞానం ద్వారానే మోక్షప్రాప్తి జరుగుతుంది అని చెప్పాను. ఇప్పుడు నిర్గుణ బ్రహ్మ యొక్క సగుణరూపాన్ని ఉపాసించటం చెబుతాను వినండి". అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

**హృదయ బ్రహ్మోపాసన** : హృదయమనేదే ప్రజాపతి. అదే బ్రహ్మ. అదే అన్నింటికి ఆత్మ. అదే సర్వము. హృదయం అనే మాటలో మూడు అక్షరాలు ఉన్నాయి. ఇందులో మొదటి అక్షరం 'హృ' అనేది. హృ అనే ధాతువుకు - 'తీసుకొనివచ్చు' అని అర్థం. ఈ విషయం తెలుసుకుని హృదయ బ్రహ్మోపాసన చేసే వారికి వారి బంధువులు (ఇంద్రియాలు) ఇతరులు బహుమతులు (బలి) తీసుకుని వస్తారు. 'ద' అనే దానికి - 'ఇచ్చుట' అని అర్థం. ఈ విషయం తెలుసుకుని ఉపాసన చేసే వారికి అతనికి సంబంధించినవారు శక్తులను బహుమతిగా ఇస్తారు.

'య' అనే దానికి - 'లోనికి వెళ్ళుట' అని అర్థం. ఇది తెలుసుకుని హృదయ బ్రహ్మోపాసన చేసేవారు స్వర్గానికి పోతారు. కేవలం హృదయమనే అక్షరాలను వల్లించినంత మాత్రాన ఉపయోగం ఉండదు. అక్షరాల అర్థాన్ని తెలుసుకొని ఉపాసన చెయ్యాలి.

**సత్య బ్రహ్మోపాసన** : హృదయ బ్రహ్మమే సత్యం కూడా! అంటే సత్యం కూడా బ్రహ్మమే. ఈ సత్యబ్రహ్మము గొప్పది; మొదట పుట్టినది. ఈ మూడూ సత్యబ్రహ్మ గుణాలు. ఈవిధంగా సత్యబ్రహ్మను భావించి ఉపాసన చేసేవాడు ఈ లోకాన్ని జయిస్తాడు. శత్రువులందర్నీ జయిస్తాడు. అతని శత్రువులు అస్తిత్వం లేనివారవుతారు.

నామరూపాలతో కూడిన ఈ సృష్టి మొదట్లో అంతా జలమయంగా ఉండేది. ఆ జలమే సత్యాన్ని సృష్టించింది. అందుచేత సత్యమే బ్రహ్మ. ఆ సత్యమే హిరణ్యగర్భుడు లేక సూత్రాత్మ. హిరణ్యగర్భుడు (ప్రజాపతి) దేవతలను సృష్టించాడు. దేవతలు కూడా సత్యబ్రహ్మనే ఉపాసిస్తారు.

పరబ్రహ్మ పేరే సత్యం. సత్యం అనే మాటలో మూడు అక్షరాలున్నాయి. 1) స 2) త్ 3) యం. వీటిలో మొదటి అక్షరం సత్యం. చివరి అక్షరం సత్యం, మధ్యలోని 'త్' మృత్యువు లేక అసత్యం. దానికి స్వతంత్ర ఉచ్చారణ లేదు. అచ్చుతో కలిస్తేనే ఉచ్చారణ. ఈ మూడింటిలోనూ రెండు సత్యం. మధ్యది అసత్యం. సత్యం బరువు ఎక్కువయి మధ్యలోని అసత్యం తేలిపోతుంది. ఈ విధంగా సత్యబ్రహ్మను తెలుసుకుని ఉపాసన చేసిన వారిని అసత్యం అంటే మృత్యువు ఏమీ చెయ్యలేదు.

సత్యమనేదే ఆదిత్యుడు. ఆదిత్యమండలంలోని పురుషుడే దక్షిణ నేత్రంలో ఉన్నాడు. వీరిద్దరూ ఒకటే. తనకిరణాల ద్వారా కాంతినిస్తున్నా ఆదిత్యుడు కళ్ళలో ఉన్నాడు. అలాగే కళ్ళలోని పురుషుడు ప్రాణాల ద్వారా ఉపకారం చేస్తూ ఆదిత్య పురుషునిలో లీనమై ఉన్నాడు.

మరణ కాలంలో ఆదిత్యుడు తన కిరణాలను ఉపసంహరించు కోవటం వలన కళ్ళు తన శక్తిని కోల్పోతాయి. ఆదిత్యమండలంలోని పురుషునికి వ్యాహృతులు.

భూ : అనేది - శిరస్సు

భువః అనేది - భుజాలు

సువః అనేది - పాదాలు

సత్యాత్మ బ్రహ్మకు రహస్యనామం ఉపనిషత్తు. 'అహః' అనేది అతని రహస్యనామం. అహర్నామమైన బ్రహ్మన్ని ఈ విధంగా వ్యాహృతుల రూపంలో తెలుసుకుని ఉపాసన చేసేవాడు పాపాలను వదలి వేస్తాడు.

**మనోమయుడు** : పరబ్రహ్మకున్న సూక్ష్మ రూపాల్లో మనోమయ రూపం ఒకటి. మనోమయుడికి ప్రకాశమే స్వరూపం, ప్రకాశ సంజ్ఞకమైన జ్యోతియే సత్యం, అదే అతని రూపం కాబట్టి 'భాసత్యః' అంటే భాస్వరుడు. ఈ పురుషుడు ధాన్యపు గింజలాగా సూక్ష్మ పరిణామంలో హృదయంలోఉన్నాడు. అతడే ఇంద్రియాలకు అధిపతి,ప్రపంచానికి శాసనకర్త. ఈ విషయాలు తెలుసుకుని ఉపాసన చేసేవాడు అన్నిటినీ శాసించగలుగుతాడు.

**విద్యుత్తే బ్రహ్మ** : కొంతమంది పండితులు, జ్ఞానులు విద్యుత్తే బ్రహ్మ అని చెబుతున్నారు. అంధకారాన్ని పారద్రోలుతుంది కాబట్టి దీన్ని విద్యుతు అన్నారు. ఇటువంటి విద్యుత్తును బ్రహ్మగా ఉపాసించినవాడు తనకు దేవత్వం లభించటానికి అడ్డుగా ఉన్న పాపాలను అధిగమించగలుగుతాడు.

**వాగ్బ్రహ్మ** : సత్యము యొక్క రూపాంతరమే వాక్కు. ఈ వాక్కును త్రయీ రూపాత్మకమైన ధేనువుగా భావించి ఉపాసించాలి. వాగ్రూపమైన ఆవుకు నాలుగు స్తనాలు అవి. 1) స్వాహాకారము 2) వషట్కారము 3) హన్త 4) స్వధాకారము. వీటిలో మొదటి రెండింటి ద్వారా దేవతలకు హవిస్సులిస్తారు. హన్త అంటూ మానవులకు అన్నదానం చేస్తారు. స్వధాకారముతో పితృతర్పణ చేస్తారు. అంటే ఈనాలుగు స్తనాల ద్వారా దేవమానవ, పితృదేవతల కోరికలు తీరుతున్నాయి. అనగా వాగ్రూపమైన ధేనువుకు వారు దూడల వంటి వారు. ప్రాణమే ఆధేనువుకు వృషభం. ప్రాణం ద్వారానే వాక్కు వస్తుంది. మనస్సు ద్వారా

ఆలోచించిన విషయంలోవాక్కు యొక్క ప్రవృత్తి ఉంటుంది. అందుకని మనస్సే దాని దూడ ఈ విషయాలు తెలుసుకుని వాగ్బ్రహ్మోపాసన చేసిన వాడికి వాగ్రూపమైన బ్రహ్మప్రాప్తి కలుగుతుంది.

**వైశ్వానరాగ్ని** : మానవ శరీరంలో ఉండేది వైశ్వానరాగ్ని. ఇది భూతాగ్ని కాదు. జఠరాగ్ని కంటికి కనిపించదు. దీనివల్లనే తిన్న అన్నము జీర్ణమవుతుంది. ఈ జఠరాగ్ని ఒకరకమైన శబ్దం చేస్తుంది. రెండు చెవుల రంధ్రాలను వ్రేళ్ళతో మూసివేసినప్పుడు ఆ శబ్దం వినిపిస్తుంది. శరీరంలో నుండి ప్రాణం పోయినప్పుడు ఈ శబ్దం రాదు.

**అన్నప్రాణాలే బ్రహ్మ** : కొంతమంది అన్నమే బ్రహ్మ అని చెబుతారు. అది నిజం కాదు. ఎందుకంటే ప్రాణం గనక లేకపోతే అన్నం కుళ్ళిపోతుంది. వాసన వేస్తుంది. అలాగే కొంతమంది ప్రాణమే బ్రహ్మ అంటారు. ఎందుకంటే అన్నం లేకపోతే ప్రాణాలు ఎండిపోతాయి. ఈ రకంగా అన్న ప్రాణాలలో ఏ ఒక్కదానికీ బ్రహ్మత్వం సరిపోదు. ఈ రెండూ కలిసి ఒకే రూపాన్ని పొందినప్పుడే బ్రహ్మత్వం పొందుతాయి. ఈ విషయాలు తెలుసుకుని ఉపాసించేవాడిలో సమస్త ప్రాణాలు ప్రవేశిస్తాయి. సమస్త భూతాలు అతడిలో రమిస్తాయి. అన్ని భూతాలకు అతడు ఆశ్రయం అవుతాడు.

**ఉక్థోపాసన** : ఉక్థమనేది స్తుతి రూపంలో ఉండే మంత్రం. ప్రాణమే ఉక్థం. ఇంద్రియాలన్నిటిలోనూ ప్రధానమైనది ప్రాణము. అలాగే స్తోత్రమంత్రాలన్నింటిలోనూ ప్రధానమైనది ఉక్థం. ప్రాణమున్నప్పుడే కర్మలు జరుగుతాయి. ఈ విషయం తెలిసి ఉపాసన చేసేవాడు ప్రాణవిదులైన వీర పుత్రుల్ని కంటాడు.

**ప్రాణోపాసన** : ప్రాణాన్ని యజుస్సు రూపంలో ఉపాసన చెయ్యాలి. ప్రాణాలుండటంచేతనే సర్వభూతాలు ఒకదానితో ఒకటి కలిసి ఉంటున్నాయి. అందుకని ప్రాణమే యజుస్సు. ఈ విషయం తెలిసి ఉపాసన చేసేవాడు అన్నిటికన్న శ్రేష్టుడౌతాడు.

సామరూపంలో ప్రాణోపాసన చెయ్యాలి. ప్రాణాలే సామం. ప్రాణాల్లోనే సమస్త భూతాలూ కలిసి ఉంటాయి. ప్రాణంవల్లనే అన్ని ప్రాణులకు ఒకటిగా కలిసే అవకాశమున్నది. సామ్యప్రాప్తి జరుగుతోంది. సామ్యప్రాప్తికి కారణం సామం. ఈ విషయం తెలిసి ఉపాసన చేసేవాడికి సాయుజ్యం సిద్ధిస్తుంది.

ప్రాణమే నక్షత్రమని భావించి ఉపాసన చెయ్యాలి. పిండదేహాన్ని ప్రాణమే శస్త్రాది బాధలనుండి కాపాడుతుంది. ప్రాణము క్షత్రము - కాపాడేది. ఈ విషయం తెలిసి ఉపాసన చేస్తే సాయుజ్యం సిద్ధిస్తుంది.

అంటూ వివిధ రకాల ఉపాసనలగురించి వివరించాడు రత్నాకరుడు.

## 61. గాయత్ర్యోపాసన (బృహదారణ్యకోపనిషత్తు - 15)

"శిష్యులారా ! ఇప్పటిదాకా మీకు అనేకమైన సోపాధిక బ్రహ్మోపాసనల గురించి చెప్పాను. ఇప్పుడు గాయత్ర్యోపాసన గురించి చెబుతాను వినండి", అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు

ఉపనిషత్తులో చెప్పిన 'భూమి, అంతరిక్షం, ద్యౌః', ఈ మూడు పదాల్లోను మొత్తం ఎనిమిది అక్షరాలున్నాయి. ద్యౌః అనే దానిలో దకార యకారాలను రెండు అక్షరాలుగా లెక్కపెట్టాలి. ఇవి మూడు లోకాల పేర్లు. గాయత్రి మంత్రంలో పాదానికి ఎనిమిది అక్షరాలు. మూడు పాదాలు ఉన్నాయి. కాబట్టి ఈ మూడు లోకాలు గాయత్రికి మొదటి పాదం. ఈ రకంగా ముల్లోకాల రూపము తెలుసుకున్నవాడు ముల్లోకాలను జయిస్తాడు. గాయత్రికి ఉన్న ఈ శక్తి ఇతర ఛందస్సులకు లేదు. ప్రాణమే గాయత్రి. అందుకే గాయత్ర్యు పాధికమైన బ్రహ్మోపాసన శ్రేష్ఠము. విప్రుని రెండవ జన్మకిదే కారణము.

ఉపనిషత్తులో చెప్పిన "ఋచః యజాంసి సామాని" అనే మూడు పదాల్లోనూ ఎనిమిది అక్షరాలున్నాయి. ఇవి గాయత్రికి రెండవ పాదం. అంటే మూడు వేదాలు రెండవ పాదమన్నమాట. ఈ రకంగా త్రయీవిద్య రెండవ పాదాన్ని చెబుతోంది. ఈ విషయం తెలుసుకున్నవాడు త్రయీవిద్యవల్ల వచ్చే ఫలితాలన్నీ పొందుతాడు.

మంత్రంలో చెప్పిన 'ప్రాణ అపాన వ్యానం' అనే పదాల్లోని ఎనిమిది అక్షరాలు గాయత్రికి మూడవ పాదం. ఇక్కడ 'వ్యా' అనే అక్షరంలో వకార యకారాలను విడిగా లెక్కించాలి. ఈ విషయం తెలుసుకున్నవాడు సమస్తాన్ని పొందుతాడు.

ఉపనిషత్ మంత్రంలో 'తురీయ దర్శితం పదం' అనేది నాల్గవ పాదము. ఇదే తురీయ పాదం. 'దర్శిత పదం' అనే పదానికి ఆదిత్య మండలాంతర్గతుడైన పురుషుడు కనిపిస్తున్నాడని అర్థం. అంటే అన్ని లోకాలకు పైన ఆధిపత్యం స్థాపించి ప్రకాశిస్తున్నాడు. ఈ రకంగా గాయత్రిలోని నాల్గవ పాదాన్ని తెలుసుకున్నవాడు కీర్తితో ప్రకాశిస్తాడు.

తురీయపదం సత్యంలో ప్రతిష్ఠితమై ఉన్నది. నేత్రమే సత్యం. ఏదైనా ఒక విషయాన్ని నేను చూశాను, నేను విన్నాను అని చెప్పినప్పుడు, చూసినదాన్నే నమ్మటం జరుగుతుంది.

అందుకే నేత్రం సత్యం. తురీయ పాదానికి ఆశ్రయమైన సత్యం బలంలో ప్రతిష్ఠితమై ఉంది. అందుకనే సత్యం కన్న బలం ప్రకాశవంతమైనది. ప్రాణమే ఆ బలం. త్రిపదా గాయత్రి ప్రాణాలు రక్షిస్తుంది. గాయత్రి ప్రాణంలో ప్రతిష్ఠితమై ఉన్నది. వాగాది ప్రాణాలు రక్షించేది గాయత్రి. గానము చేసేవాడిని, ఉపాసన చేసేవాడిని రక్షించేది గాయత్రి.

ఉపనయనంలో వటువుకు త్రిపద గాయత్రి ఉపదేసిస్తారు.

తత్సవితుర్వ రేణ్యం । భర్గో దేవస్య ధీమహి । ధియో యోనః ప్రచోదయాత్ !

ఇది త్రిపద గాయత్రి. అయితే కొంతమంది కొన్ని శాఖలవారు అనుష్టుప్ ఛందస్సులో ఉండే సావిత్రిని ఉపదేసిస్తారు. 'తత్స వితుర్వృణీమహే । వయం దేవస్య భోజనం । శ్రేష్ఠం వై సర్వ ధాతమమ్ । తురంగ భగస్య ధీమహి ।'

వాక్కే అనుష్టుప్, వాక్కే శరీరంలో ఉండే సరస్వతి, వాక్ స్వరూపమైన సరస్వతిని వటువుకు ఉపదేశిస్తున్నామని వీరి నమ్మకం.

గాయత్రి ఉపాసకుడు ఆవులు, గుర్రాలు, భూమి దానంగా తీసుకున్నా, దానివల్ల కలిగే దోషం గాయత్రిలోని ప్రథమ పాదాన్ని జపిస్తే పోతుంది.

త్రయీ విద్య (వేద్య విద్య)తో సమానంగా తీసుకున్నా ఆ దానం వల్ల వచ్చే పాపం మంత్రంలోని రెండవ పాదం చేస్తే పోతుంది. అలాగే ఉన్న ప్రాణాలన్నీ దానంగా తీసుకున్నా మూడవ పాదం జపం చేస్తే పోతుంది. అంటే గాయత్రి మంత్రం యొక్క శక్తి చాలా గొప్పది. అన్ని పాపాలను పరిహారం చేస్తుంది.

అంతరిక్షంలో నివసించే వాడెవడూ దానం స్వీకరించటానికి అర్హుడు కాదు. ఈ విషయాలు తెలుసుకుని గాయత్ర్యుపాసన చెయ్యాలి. ఆ విధంగా చేసిన వాడిని పాపాలు అంటవు.

అంటూ గాయత్రి ఉపాసన గురించి వివరిస్తూ ఐదవ అధ్యాయాన్ని పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 62. ప్రాణమే శ్రేష్ఠము (బృహదారణ్యకోపనిషత్తు - 16)

"శిష్యులారా ! ఇప్పటివరకు ఈ ఉపనిషత్తులో ఐదుఅధ్యాయాలు వివరించాను. ఇప్పుడు ఆరవ అధ్యాయాన్ని ప్రారంభిస్తాను వినండి". అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

శ్రేష్ఠమైన దానిని, జ్యేష్ఠమైన దానిని తెలుసుకున్నవాడు తనవారిలో జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అవుతాడు. మిగిలిన అన్ని ఇంద్రియాలకన్న ప్రాణమే ముందు పుట్టింది. కాబట్టి అదే జ్యేష్ఠము, శ్రేష్ఠము అయినది. ఈ విషయాన్ని తెలుసుకున్నవాడు తనవారిలోనే కాదు మిగిలిన వారిలో కూడా జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అవుతాడు.

వసిష్ఠమైన దానిని తెలుసుకున్నవాడు తనవారిలో వసిష్ఠుడవుతాడు. వసిష్ఠ - అంటే వాక్కు. అధికంగా వసించేది. ఈ విషయం తెలుసుకున్నవాడు. మంచివక్త, ధనవంతుడు అయి రాజసభలో అందర్నీ జయిస్తాడు.

ప్రతిష్ఠను గురించి తెలుసుకున్నవాడు ఈ భూమిమీద సకాలంలో ప్రతిష్టుడౌతాడు. అంతేకాదు దుర్గమ స్థానంలోను, అడవులయందు, ఎడారులయందు కూడా ఆశ్రయం పొందుతాడు. ఇక్కడ చక్షువే ప్రతిష్ఠ. చక్షువులచే తనే దేశాన్ని, భూమిని మిగిలిన వాటినీ గుర్తించగలుగుతున్నాడు. కాబట్టి ప్రతిష్ఠాగుణం కలిగిన చక్షువునుపాసించేవాడు మంచి రోజుల్లోను, చెడ్డరోజుల్లోనూ కూడా ఆశ్రయం పొందుతాడు.

సంపదను గూర్చి తెలుసుకున్నవాడు కోరిన భోగాలు, సుఖాలు పొందుతాడు. శ్రోత్రమే సంపద, శ్రోత్రం ద్వారానే వేదాలన్నీ వింటాము. శ్రోత్రమున్నవాడే వేదాధ్యయనం చెయ్యగలుగుతాడు. ఈ విషయం తెలిసి ఉపాసన చేసినవాడు భోగాలు, సంపదలు అన్నీ అనుభవించగలుగుతాడు.

మనస్సు ఆయతనం. మనస్సు యొక్క సంకల్పాన్ని బట్టి మిగిలిన ఇంద్రియాలు ఆయా పనులలో నిమగ్నమవుతాయి. ఈ విషయం తెలిసి ఉపాసన చేసినవాడు సర్వజనులకు ఆశ్రయమవుతాడు.

రేతస్సే ప్రజాపతి. ప్రజాపతిని తెలుసుకున్నవాడు మంచి సంతానము, పశువులు కలిగి ఉంటాడు. ఈ విషయం తెలిసి ఉపాసన చేసినవాడు మంచి సంతానము, పశుసంపద పొందుతాడు.

పూర్వకాలంలో ఒకసారి ఇంద్రియాలన్నీ తమలోతాము పోట్లాడుకోవటం మొదలుపెట్టాయి. దీనికి కారణం తమలో ఎవరు గొప్ప అనే విషయం తేలకపోవటమే. ఆ వాదన ఎంతకీ తెగలేదు. చివరకు అన్నీ కలిసి ఒక నిర్ణయానికి వచ్చి తమకు జన్మనిచ్చిన ప్రజాపతి దగ్గరకు పోయి "ప్రజాపతీ ! మాలో శ్రేష్ఠులెవరో మీరు తేల్చి చెప్పండి", అన్నాయి.

ప్రజాపతి ఒక క్షణం ఆలోచించి "మీలో ఎవరు శ్రేష్ఠులో తేల్చుకునే ఉపాయం ఒకటి చెబుతాను వినండి. మీలో ఏది లేకపోతే ఈ శరీరం పనికి రాకుండా, పని చెయ్యకుండా పోతుందో అది అన్నిటికన్న శ్రేష్ఠమైనదిగా గుర్తించండి. ఈ విషయం తేలాలంటే ఒక్కొక్క ఇంద్రియము ఒక సంవత్సరంపాటు ఈ శరీరాన్ని విడిచి వెళ్ళండి" అన్నాడు. ప్రజాపతి సలహా ఇంద్రియాలకన్నింటికీ నచ్చింది.

ముందుగా వాక్కు శరీరం నుంచి నిష్క్రమించింది. అది ఒక సంవత్సరంపాటు శరీరానికి దూరంగా ఉండి తరువాత తిరిగి వచ్చి మిగిలిన ఇంద్రియాలను అడిగింది. "నేను లేనప్పుడు మీరెలా జీవించి ఉండగలిగారు?"

"నువు వెళ్ళిపోవటం వల్ల శరీరానికి పెద్ద నష్టం ఏదీ జరగలేదు. కేవలం వాక్కు మాత్రం మూగబోయింది. అంతేగాని మిగిలిన శరీరం యథాతథంగా పని చేసింది. ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలు మామూలుగానే జరిగాయి. కళ్ళు చూస్తూనే ఉన్నాయి. చెవులు వింటూనే ఉన్నాయి. ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. ఆ రకంగా మిగిలిన పనులన్నీ జరిగాయి. పసిపిల్లవాడికి మాటలు రావు. అయినావాడు బ్రతకటం లేదా ? మూగవాడు జీవించటం లేదా? అలాగే శరీరం జీవించే ఉన్నది." అన్నాయి మిగిలిన అవయవాలు. ఆ మాటలు విన్న వాక్కు శరీరంలో ప్రవేశించింది.

తరువాత శరీరం నుంచి దృష్టి నిష్క్రమించి ఒక సంవత్సరం తరువాత తిరిగి వచ్చి మిగిలిన అవయవాలను అడిగింది "నేను లేనప్పుడు మీరంతా ఎలా ఉన్నారు?" అని

అప్పుడవి "నువు లేకపోతే చెప్పుకోతగ్గ ఇబ్బందేం కలగలేదు. గ్రుడ్డివాడు బ్రతకటం లేదా ? అలాగే ఈ శరీరం బ్రతికింది. కేవలం చూపుమాత్రం లేదు. అంతేకాని శరీరంలోని మిగిలిని వ్యాపారాలన్నీ సజావుగానే సాగినాయి. ఊపిరి ఆడుతూనే ఉంది. నోరు తింటూనే ఉంది. మాట్లాడుతూనే ఉన్నది. ఆలోచనలు బాగానే ఉన్నాయి" అన్నాయి. మారుమాట్లాడకుండా దృష్టి శరీరంలో ప్రవేశించింది.

ఆ తరువాత శ్రవణశక్తి శరీరాన్ని విడిచి వెళ్ళిపోయి ఒక సంవత్సరం తరువాత తిరిగి వచ్చి "నేను లేకపోతే ఎలాఉన్నది ?" అని అడిగింది.

దానికి మిగిలిన ఇంద్రియాలు "ఓ శ్రవణేంద్రియమా ! నీవు లేని శరీరం చెవిటిదయింది. అంతేకాని కన్ను చూస్తోంది. నోరు మాట్లాడుతోంది ఈ రకంగా మిగిలిన ఇంద్రియాలన్నీ వాటిపని అవి చేస్తూనే ఉన్నాయి. కాబట్టి మేమంతా ఈ శరీరంలో సుఖంగానే ఉన్నాము" అన్నాయి. శ్రవణశక్తి శరీరంలో ప్రవేశించింది.

ఆ తరువాత మనస్సు శరీరం నుంచి నిష్క్రమించి ఒక సంవత్సరం తరువాత తిరిగి వచ్చి "నేను లేకపోతే వెలితిగా లేదా?" అని అడిగింది.

దానికి మిగిలిన ఇంద్రియాలు "ఓ మనసా ! నీవు సంకల్ప వికల్పాలకు మూలమైనదానవు. నువు లేకపోతే శరీరానికి సంకల్పం ఉండదు. ఆలోచనా శక్తి ఉండదు. ఆలోచన లేదన్నమాటే గాని శ్వాస ఆడుతుంది. కాళ్ళు చేతులు వాటి పని చేస్తాయి. నోరు తింటుంది. మాట్లాడుతుంది. ఈ రకంగా మిగిలిన ఇంద్రియాలు వాటి పని అవి చేస్తూ ఉంటాయి. పసిపిల్లవాడు మనస్సు లేకుండా బ్రతకటం లేదా ? అలాగే శరీరం నువు లేకుండా జీవించే ఉన్నది. మిగిలిన కార్యములన్నీ యథాతథంగా జరుగుతూనే ఉన్నాయి," అన్నాయి. మారుమాట్లాడకుండా మనస్సు శరీరంలోకి ప్రవేశించింది.

ఆఖరుకు ప్రాణం బయటకు పోవటానికి వస్తూ ఉంది. అప్పుడు ఇంద్రియాలతో తనుకున్న బంధనాలన్నిటినీ త్రెంచి పారేస్తున్నట్లనిపించింది. శరీరానికి ఊపిరి అందటం కష్టమవుతున్నది. కళ్లు కనిపించటం మానేసాయి. చెవులు వినిపించటం మానివేసాయి. నోరు మాట్లాడటం కష్టమయింది. అలాగే కాళ్ళు చేతులు కదలటం మానేసాయి. శరీరం గాలిలో తేలిపోతున్నట్లయింది. దాంతో ఇంద్రియాలకు భయం పట్టుకుంది. అప్పుడు అవన్నీ ప్రాణం చుట్టూ చేరి 'ప్రాణమా ! నువ్వు మాత్రం శరీరం నుంచి బయటకు వెళ్ళకు, ఇక్కడే ఉండు. నువ్వు గనక శరీరం నుంచి బయటకు వెళ్ళిపోతే శరీరం చచ్చిపోతుంది. అప్పుడు మేమంతా ఉపయోగం లేకుండా పోతాము. మా పని సున్నా అవుతుంది. మా అందరిలోకీ శ్రేష్ఠుడివి నువ్వే. ఈ మాట మేమందరం అంగీకరిస్తున్నాం. నువ్వు ఇక్కడే ఉండి మమ్మల్ని జీవింపచెయ్యి' అని వేడుకున్నాయి.

ఈ రకంగా ఇంద్రియాలన్నీ ప్రాణం లేకపోతే తమ ఉనికి లేదని ఒప్పుకున్నాయి. అందుకనే వాక్కు, చక్షువు, శ్రోత్రము, మనస్సు అనే పేర్లతోగాక, అవన్నీ ప్రాణవంతములైతేనే


పని చేస్తాయి. అందుకే అవన్నీ ప్రాణాలనే సంకేతంతో పిలువబడతాయి. అంటే ప్రాణం కాకుండా వాటికి స్వేచ్ఛ లేదు. అసలు ప్రాణమే ఇన్ని రూపాలుగా మారింది. అందుచేతనే ఇంద్రియాలన్నింటిలోకీ ప్రాణమే గొప్పది.

ఈ రకంగా ఇంద్రియాల కోరిక మీద ప్రాణం శరీరాన్ని విడిచిపోకుండా ఉండి మిగిలిన ఇంద్రియాలతో 'మీ మాట ప్రకారము నేను ఇక్కడే ఉంటాను. మరి నాకు అన్నము ఏది ?' అని అడిగింది. "కుక్కలు, పిల్లులు, పక్షులు మొదలైన జీవ జంతువుల ఆహారమే నీకు ఆహారము" అన్నాయి. ఇది ఏ విధంగా అంటే శరీరంలో ముఖ్యమైన ప్రాణం వల్లనే మిగిలిన ఇంద్రియాలు పని చేస్తున్నాయి. కాబట్టి అన్నింటి ఆహారము ప్రాణానికి ఆహారమవుతోంది. విరాట్ ప్రాణానికి విరాట్ అన్నమే ఆహారము. ఈ విషయము తెలిసినవాడికి తినరానిది ఏదీ ఉండదు.

ప్రాణం మళ్ళీ అడిగింది "మరి నాకు ఆచ్ఛాదనకు వస్త్రం ఏది ?" దానికి ఇంద్రియాలు "జలమే నీకు ఆచ్ఛాదన" అన్నాయి. విద్వాంసులు భోజనానికి ముందు, తరువాత కూడా ప్రాణాన్ని జలంతో ఆచ్ఛాదిస్తున్నారు. భోజన సమయంలో చేసే ఆపోసనా, ఉత్తరాపోసనలే ప్రాణానికి వస్త్రం. ఈ విషయం తెలుసుకున్నవాడు వస్త్రాన్ని పొంది నగ్నత్వం లేనివాడవుతున్నాడు.

ఈ విధంగా ప్రాణ విజ్ఞానాన్ని తెలుసుకున్నవాడు ఎండిన చెట్టు దగ్గర కూర్చుని ప్రాణ విజ్ఞానం చెబితే ఆ చెట్టు చిగురువేస్తుంది"

పూర్వకాలంలో సత్యకామ జాబాలి ఈ విషయాన్ని వ్యాఘ్రపాదుని కుమారుడైన గోశ్రుతి అనే వాడికి చెప్పాడు. అంటూ ప్రాణవిజ్ఞానాన్ని ముగించాడు రత్నాకరుడు.



## 63. చతురోదుంబర కర్మ (బృహదారణ్యకోపనిషత్తు - 17)

"శిష్యులారా ! ఆరవ అధ్యాయంలోని రెండవ బ్రాహ్మణంలో శ్వేతకేతు - ప్రవాహణుల వృత్తాంతము వివరించబడింది. అయితే ఈ వృత్తాంతమంతా ఛాందోగ్యోపనిషత్తులో 'పంచాగ్ని విద్య'గా నేను మీకు వివరించటం జరిగింది. ఇక మూడవ బ్రాహ్మణం ప్రారంభిస్తాను.

ఇప్పటివరకు కర్మ, ఉపాసనల గురించి మీకు వివరించాను. ఉపాసన అనేది కేవలం వ్యక్తిగతమైనది. దానికి ఇతరులతోగాని, ఇతరములతోగాని పని లేదు. కాని కర్మ అలా కాదు. కర్మలనాచరించాలంటే ధనం కావాలి. ఆ ధనాన్ని న్యాయమార్గంలో మాత్రమే సంపాదించాలి. ధన ప్రాప్తి కోసం 'మంథ' అనే పేరు గల క్రతువును చేస్తారు. మంథ అంటే బాగా నూరినది మర్దన చేసినది అయిన ముద్ద. మహత్త్వం గనక సిద్ధిస్తే విత్తం దానంతట అదే వస్తుంది. అందుచేత ధనం కావలసినవారు, కర్మాధికారులయినవారు, గృహస్థులు మహత్త్వ ప్రాప్తికోసం ప్రార్థించాలి. ఆ విషయం మీకు వివరిస్తాను వినండి". అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ధనాన్ని కోరే గృహస్థు ఉత్తరాయణంలోని శుక్లపక్ష పుణ్యతిథి నుండి పన్నెండు రోజులపాటు ఈ వ్రతం చెయ్యాలి. ప్రతిరోజూ పాలు మాత్రమే ఆహారంగా తీసుకోవాలి. మేడి కర్రతో (ఉదుంబర) చేసిన పాత్రలో యవలు, గోధుమలు, ధాన్యము మొదలయిన పది రకాల ధాన్యాలు, పండ్లు, పెరుగు, తేనె, వెన్న వేసి బాగా నానబెట్టి ఆ తరువాత వాటిని బాగా నూరి ముద్దగా తయారుచెయ్యాలి. ఈ ముద్దనే మంథము అంటారు. తరువాత అగ్నిగుండంలో అగ్ని ప్రతిష్ఠాపన చేసి గృహ్యసూక్తంలో చెప్పినట్లుగా ఘృతసంస్కారం చేసి పురుష నక్షత్రాలతో (హస్త మొదలైనవి) కూడిన శుభదినాన, ఇంతకు ముందు తయారుచేసిన ముద్దను తనకు, అగ్నికి మధ్యన ఉంచి ఇక్కడ చెప్పిన మంత్రాలతో హోమం చేస్తూ ఆహుతులివ్వాలి. ఆ మంత్రార్థాలు

ఓ అగ్నిదేవా ! నీ అధీనంలో ఉండి, పురుషుల కోరికలకు విఘాతాలు కలిగించే దేవతలనుద్దేశించి ఈ ఆజ్య హోమం చేస్తున్నాను. ఆ దేవతలు తృప్తి పొంది నాకోరికలు తీర్చెదరు గాక. (స్వాహాశబ్దంతో ఆహుతి)

తృప్తి పొందిన దేవతలు భోగభాగ్యాలతో నన్ను తృప్తిపరచెదరుగాక (స్వాహా)

అందరి మృత్యువు తన చేతిలోనే ఉందని భావిస్తూ నీ ఆధీనంలో ఉండి భోగభాగ్యాలు ఇవ్వగలిగిన ఆ దేవతకు ఈ ఘృతధారను హోమం చేస్తున్నాను (స్వాహా)

జ్యేష్ఠాయస్వాహా ।

శ్రేష్ఠాయస్వాహా ।

అంటూ హోమం చేసి, స్రువంలో మిగిలిన నేతిని ముద్ద రూపంలో ఉన్న మంధంతో వెయ్యాలి. ఈ ప్రక్రియకు స్రుక్ స్రువాలు కూడా మేడికర్రతోనే చేసి ఉండాలి.

ప్రాణాయ స్వాహా, వసిష్ఠాయ స్వాహా ।

అంటూ హోమంచేసి స్రువంలో మిగిలిన నేతిని మంధంలో కారనివ్వాలి. ఈ రకంగా ప్రతిసారీ చెయ్యాలి

వాచే స్వాహా । ప్రతిష్ఠాయై స్వాహా ।

చక్షుషే స్వాహా । సంపదే స్వాహా ।

శ్రోత్రాయ స్వాహా । ఆయతనాయ స్వాహా ।

మనసే స్వాహా । ప్రజాపత్యై స్వాహా

రేతసే స్వాహా ।

అగ్నయే స్వాహా । సోమాయ స్వాహా ।

భూస్వాహా । భువస్వాహా । సువస్వాహా । భూర్భువస్సువ స్వాహా ।

బ్రహ్మణే స్వాహా ।

క్షత్రాయ స్వాహా ।

భూతాయ స్వాహా ।

ఆ తరువాత మంధాన్ని 'భ్రమదసి' అనే మంత్రంతో స్పృశించాలి. ఓ మంధమా! ప్రాణ రూపంలో నీవు అన్ని దేహాల్లోనూ ఉన్నావు. అగ్ని రూపంలో ప్రజ్వలిస్తున్నావు. బ్రహ్మ రూపంలో పరిపూర్ణుడవు. ఆకాశ రూపంలో కదలకుండా ఉన్నావు. నీకు ఎవరితోనూ విరోధం లేదు. అందుచేత విశ్వరూపమైన సభతో సమానమైనవాడవు. యజ్ఞారంభంలో చెప్పే హ్రీంకారము నీవే. వివిధ రూపాలుగల ప్రభువువి నీవే. అన్నిటికీ సమర్ధుడవు నీవే. అగ్నిరూపంలోని జ్యోతివి. అన్నిటికీ ప్రళయస్థానానివి. 'అమంసి అమంసి' అనే మంత్రాలు చదువుతూ పాత్రను పైకి ఎత్తాలి. ఆ మంత్రార్థం "ఓ మంథమా ! నీకు అన్నీ తెలుసు. సమస్తము ప్రాణమయమని నీకు తెలుసు. నేను నీ మహిమను బాగా ఎరుగుదును. ప్రాణమే రాజు, పరిపాలకుడు ప్రభువు. అటువంటి ప్రాణమే నన్ను రాజుగా, ప్రభువుగా, పరిపాలకుడిగా తనతో సమానమైన గుణాలు కలవాడుగా నన్ను చేయుగాక.తరువాత 'తత్సవితుర్వరేణ్యం' మొదలైన మంత్రాలతో మంధభక్షణ చేస్తారు. వాటి అర్థం! కోరదగినట్టి సూర్య మార్గాన్ని నేను ధ్యానిస్తున్నాను. గాలి

మెల్లగా చల్లగా, మంచి వాసనతో వీస్తోంది. నదులు తేనెలాగా తీయని ప్రవీలు కలిగి ఉన్నాయి. ఓషధులు అంటే ధాన్యాలు మా కోసం బాగా పండుగాక. భూస్వాహా ! పై మంత్రాన్ని చదివి మంథంలోని కొంతభాగం తినాలి. మేము సవితృదేవుని తేజస్సును ధ్యానం చేస్తున్నాము. మాకు రాత్రింబవళ్ళు సుఖప్రదమవుగాక! భూమిమీద ధూళికూడా మాకు ఉద్వేగం కలిగించుగాక ! భువః స్వాహా । అని మళ్ళీ కొంత భాగాన్ని తినాలి. మా బుద్ధులు ప్రేరేపించే సవిత్ర దేవత మా కోసం రసపరిపూర్ణమైన కిరణాలు, దిక్కులు, ఆవులు, ఇచ్చుగాక ! సువస్వాహా ! ఇంకొంత భాగం తినాలి. తరువాత గాయత్రీ మంత్రం పూర్తిగా చదివి ఈ సమస్తము నేనే అవుతాను. భూర్భువస్సువ స్వాహా । అని మిగిలిన మంథం పూర్తిగా తినెయ్యాలి. చేతులు కడుక్కుని అగ్నికి పడమర భాగాన తూర్పువైపు తిరిగి కూర్చుని 'ఓ సూర్యుడా! దిక్కులలో నీవు పద్మమువంటి వాడవు. మానవులలో నేను పద్మము వంటివాడను అంటే శ్రేష్ఠుడను కావాలి" అని మంత్రం చదివి నమస్కరించాలి. దీనితో ఈ కర్మపూర్తి అవుతుంది.

ఈ మంథాన్ని ఎండిపోయిన మ్రోడుమీద వేస్తే చిగురిస్తుంది. అలాగే మానవుడి కోరికలు కూడా పూర్తిగా తీరతాయి. మంథ విద్యను

యాజ్ఞవల్క్యుడు - పైంగునికి

పైంగుడు - చూలునికి

చూలుడు - జానకికి

జానకి - సత్యకామునికి

సత్యకాముడు - తన శిష్యులకు ఉపదేశించారు.

ఈ రకంగా ఈ విద్య గురుపరంపరగా వ్యాప్తిచెందింది. ఈ విద్యను పుత్రుడు, శిష్యుడు కానివారికి ఉపదేశించరాదు.

ఇందులో ఉపయోగించే ధాన్యాలు వరి, బార్లీ, నువ్వులు, మినుములు, చిరువడ్లు, అలచందలు, గోధుమలు, శెనగలు, అనుములు, కొర్రలు. వీటిని వేయించి పిండి చేసి' వాడవచ్చు.

ఈ కర్మలో ఉపయోగించే సాధనాలు స్రుక్కు, స్రువము, పాత్ర, ఇద్మము ఉదుంబర కాష్టంతోనే చెయ్యాలి. అందుచేతనే దీనిని 'చతురోదుంబర కర్మ' అంటారు. అంటూ చతురోదుంబర కర్మను పూర్తి చేశాడు రత్నాకరుడు.

## 64. తండ్రిని మించిన తనయుడు (బృహదారణ్యకోపనిషత్తు - 18)

"శిష్యులారా ! ఇంతవరకు కర్మలనుపాసించటానికి ధనం కావాలి. కాబట్టి ఆ ధనాన్ని సంపాదించేందుకు చేసే కర్మ గురించి చెప్పాను. పుత్రుని జన్మ శుభకరమై ఉండాలి. శుభ లక్షణాలు గల కుమారుడుదయిస్తే పితృదేవతలు తరిస్తారు. కాబట్టి సత్పుత్రుని పొందే విధానాన్ని వివరిస్తాను వినండి", అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

స్థావరజంగమాత్మకమైన సమస్త భూతాలకు సారభూతమైనది పృథివి. ఆ విధంగా

| | | |
|---|---|---|
| భూమికి సారభూతం | - | జలం |
| జలానికి సారభూతం | - | ఓషధులు |
| ఓషధులకు సారం | - | పుష్పాలు |
| పుష్పాలకు సారం | - | ఫలాలు |
| ఫలాలకు సారం | - | పురుషుడు |
| పురుషునికి సారం | - | వీర్యం |

సృష్టికర్త అయిన ప్రజాపతి రేతస్సును నిక్షేపించటానికి తగిన ఆధారం (భూమి) నిర్మించాలని ఆలోచించాలి. అలా ఆలోచించి స్త్రీని సృష్టించాడు. ఆ తరువాత స్త్రీ అధోభాగాన్ని సృష్టించాడు. అంటే మైథునకర్మ చేశాడు. అందుచేత ఉత్తమ సంతానాన్ని కోరే గృహస్థులు స్త్రీ అధోభాగాన్ని ఉపాసించాలి. ఈ మైథునకర్మ వాజపేయంతో పోల్చబడింది. ప్రజాపతి పురుష జననేంద్రియాన్ని రాయిలా గట్టిగా చేసి స్త్రీతో సంపర్కం చేశాడు. ఇది ఒక మహాయజ్ఞము. అందులో

| | |
|---|---|
| ఉపస్థయే | - యజ్ఞవేదిక |
| రోమాలు | - దర్భలు |
| యోనిమధ్యస్థానం | - అగ్ని |

ప్రక్కవైపున ఉండే మాంస పిండాలు - సోమఫలకాలు (యజ్ఞంలో చర్మాధిషణమనే పేరుతో పిలువబడతాయి)

ఈ విషయాలు తెలుసుకుని మైథునకర్మ చేసేవాడు స్త్రీలపుణ్యాన్ని హరించి వేస్తాడు. ఈ విషయం తెలియనివాడి పుణ్యాన్ని స్త్రీ హరించి వేస్తుంది. మైథునకర్మను పుణ్యకర్మగా

భావించకుండా ఇంద్రియలోలత్వంతో చరించేవారు నిజమైన బ్రాహ్మణులు కారు. అలాంటివారు ఇహపరలోకాల్లో భ్రష్టులౌతారు. సాధకుడు భార్య యొక్క ఋతుకాలం కోసం నిరీక్షిస్తుండగా రేతఃపతనం జరిగితే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

తన భార్య సంభోగానికి ఇష్టురాలై ఉన్నదని తెలుసుకున్న సాధకుడు యోనియందు జననేంద్రియ స్థాపన చేసి, ముఖానికి ముఖము ఆనించి, చేతితో ఉపస్థను స్పృశించి "ఓ వీర్యమా ! నీవు నా ప్రతి అవయవమందు ఉన్నావు. ముఖ్యంగా హృదయంలో ఉండే నాడినుంచి వ్యక్తమౌతున్నావు. నువు నా అవయవాలసారానివి. బాణం తగిలిన పక్షిలాగా నా భార్యయెడ పరవశమై నాకు అధీనం కావలసినది", అనే అర్థంతో ఉన్న మంత్రం చదవాలి.

రజోదర్శనం చేసిన స్త్రీ మూడు రోజులపాటు కంచుపాత్రలో తినటంగాని, తాగటంగాని చెయ్యరాదు. నాల్గవనాడు స్నానం చేసి శుభ్రమైన వస్త్రం ధరించాలి. స్నానానికి ముందుగాని, వెనకగాని శూద్రులెవరు ఆమెను తాకరాదు.

శుక్లవర్ణం కలవాడు, వేదాధ్యయనపరుడు, పూర్ణాయువు అయిన కుమారుడు కావాలంటే ఆ దంపతులు పాలతో బియ్యాన్ని ఉడికించి ఆ అన్నాన్ని నేతితో కలిపి తినాలి.

కపిలవర్ణం, రెండు వేదాలు చదివినవాడు, పూర్ణాయువు అయిన కుమారుడు కావాలంటే దంపతులు దధ్యోజనంలో నేతిని కలిపి తినాలి.

శ్యామవర్ణం, మూడు వేదాల అధ్యయనం, పూర్ణాయువు అయిన కుమారుడు కావాలంటే దంపతులు బియ్యాన్ని నీటితో ఉడికించి, నేతితో కలిపి తినాలి.

ఇంటి పనులలో మేటి, పండితురాలు, పూర్ణాయువు అయిన కుమార్తె కావాలంటే దంపతులు నువ్వులు, బియ్యము కలిపి వండి నేతితో కలిపి తినాలి.

పుత్రుడు లోకవిఖ్యాతుడు, పండితుడు, మృదుభాషి, వేదవేదాంగవేత్త, పూర్ణాయువు కావాలంటే దంపతులు ఎద్దు మాంసంతో వండిన అన్నంలో నేతిని కలిపి తినాలి.

రజోదర్శనమైన నాల్గవనాడు ఉదయం దంపినబియ్యం స్థాలీపాక విధానంలో సంస్కారం చేసి అన్నాన్ని 'అగ్నయే స్వాహా! అనుమతయే స్వాహా ! అంటూ మూడు ప్రధాన ఆహుతులిచ్చి మిగిలిన అన్నాన్ని ముందుగా భర్త భుజించాలి. తరువాత భార్య తినాలి. తరువాత చేతులు కాళ్ళు కడుక్కొని నీటితో భార్యను మార్జన చెయ్యాలి.

ఆ తరువాత భోజనం చేసి శయనించి ఇక్కడ చెప్పబడ్డ మంత్రాలు చదువుతూ భార్యను కౌగిలించుకోవాలి. ఆ మంత్రాలకు అర్థం. "ఓ దేవీ! నేను ప్రాణాన్ని, నీవు వాక్కువు నేను సామాన్ని, నీవు ఋక్కువు. నేను ఆకాశాన్ని, నీవు భూమివి. అందుచేత రేతోధారణ చేసి పుత్రుని పొందుదాం రా."

ఆ తరువాత రెండు తొడలను వేరుగా చేసి ఇక్కడ మంత్రం చదవాలి. ఆ మంత్రానికి అర్థం "ఊరువుల రూపంలో ఉండే ఆకాశమా ! ఓ భూమీ! మీరు వేరుకండి." తరువాత జననేంద్రియాలను కలిపి, ముఖంతో ముఖం కలిపి శిరస్సునుండి పాదందాకా భార్య అవయవాలను చేతులతో రాస్తూ "సర్వత్ర వ్యాపించి ఉన్న పరమాత్మ పుత్రజననంతో నీ జననేంద్రియాన్ని సార్థకం చేయుగాక! సూర్యుడు నీ ఇంద్రియాలను, పుట్టబోయే బిడ్డ అవయవాలను అందంగా ఉండేటట్లు చేయుగాక ! ప్రజాపతి నీలో తాదాత్మ్యం చెంది గర్భాన్ని గ్రహించుగాక. బ్రహ్మ నీ గర్భాన్ని పోషించుగాక," అనే అర్థం వచ్చే మంత్రం చదవాలి. తరువాత మైథునక్రియ పూర్తిఅయి పదినెలల తరువాత కోరుకున్న కుమారుడు కలుగుతాడు. ఈ రకంగా కలిగిన కుమారుడు తండ్రిని మించిన తనయుడౌతాడు. అతని వల్ల ఆ వంశానికి పేరు వస్తుంది. పితృదేవతలు తరిస్తారు.

"శిష్యులారా ! కాండ త్రయాత్మమైన వేదానికి గురుపరంపర చెబుతాను వినండి. మొదటగా ఈ విద్య స్వయంభువు అయిన బ్రహ్మనుండి పరంపరగా వచ్చి యాజ్ఞవల్క్యుని ద్వారా ప్రసిద్ధి చెందింది". అంటూ ఆరవ అధ్యాయంలోని నాలుగు, ఐదు బ్రాహ్మణాలను వివరించి బృహదారణ్యకోపనిషత్తును పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 65. కైవల్య ప్రాప్తి (కైవల్యోపనిషత్తు)

"శిష్యులారా ! ఇప్పటివరకు మీకు దశోపనిషత్తులు వివరించాను. ఉపనిషత్పరిజ్ఞాన ముఖ్యోద్దేశ్యము కైవల్యప్రాప్తి. అందుచేత ఈ పది ఉనిషత్తులలో లేకపోయినప్పటికీ 'కైవల్యోపనిషత్తును" ఇప్పుడు మీకు వివరిస్తాను వినండి." అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

ఈ ఉపనిషత్తు కృష్ణ యజుర్వేదానికి సంబంధించినది.

ఆశ్వలాయన మహర్షి పరమేష్ఠియైన ప్రజాపతి వద్దకు వచ్చి "ఓ భగవానుడా! విద్యలన్నిటిలోకి శ్రేష్ఠమైనది, సత్పురుషులచే ఉపాసించబడేది, మిక్కిలి రహస్యమైనది అయిన బ్రహ్మవిద్యను నాకు ఉపదేశించండి. మిగిలిన బ్రహ్మవేత్తల లాగా నేనుకూడా పాపాలను పోగొట్టుకుని శీఘ్రంగా పరాత్పరుణ్ణి చేరతాను" అన్నాడు. అలా అడిగిన ఆశ్వలాయనుడితో ప్రజాపతి ఈ విధంగా అంటున్నాడు.

"నాయనా పరబ్రహ్మతత్త్వాన్ని భక్తి, శ్రద్ధ, యోగము, ధ్యానము ద్వారా మాత్రమే తెలుసుకోవాలి. కర్మద్వారా గాని, సంతానం, ధనం, మొదలయిన వాటిద్వారాగాని ఎవరూ బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోలేరు. అమరత్వాన్ని పొందలేరు. అమరత్వానికి రూపమే మోక్షము. దాన్ని త్యాగంద్వారా మాత్రమే పొందాలి. త్యాగమంటే దానధర్మాలు చేయటం కాదు. మనకున్నవన్నీ వదిలెయ్యాలి. ముఖ్యంగా రాగద్వేషాలు, కామ్యకర్మలు, అహంకార మమకారాలు త్యాగం చెయ్యాలి. ఆ పరతత్త్వం ఎక్కడో లేదు. నీ హృదయ పద్మంలోనే ఉన్నది. ఇంద్రియ నిగ్రహం గల మహర్షులు మాత్రమే దాన్ని చేరగలుగుతారు. ఓ మహర్షీ ! శమదమాది నియమశీలురైనవారు పరమాత్మలో లీనం కాగలుగుతారు.

వేదాంతము వినటంవల్ల అపరోక్షజ్ఞానం కలుగుతుంది. దానివల్ల పరతత్త్వాన్ని గూర్చిన అవగాహన కలుగుతుంది. నిష్కల్మషమైన హృదయం అపరోక్ష జ్ఞానం, గలిగి నియమనిష్టలు ఆచరించేవారు సన్యాసయోగం ద్వారా బ్రహ్మలోకాన్ని పొంది కల్పాంతంలో అమరత్వం పొందుతారు. అంటే జనన మరణాల నుండి విముక్తి పొందుతారు. ఇదే క్రమముక్తి. వేదాంత ప్రవచనాలు వినటం, బ్రహ్మను గూర్చి నిశ్చయ జ్ఞానం కలగటం, తపస్సు, సన్యాస దీక్ష ఇవన్నీ ఒక క్రమాన్ని తెల్పుతాయి.

అందుచేత సన్యాసాశ్రమంలో ఉన్నవాడు పవిత్రుడై నిర్జన ప్రదేశంలో సుఖాశీనుడై మెడ, తల, శరీరము తిన్నగా నిలుపుకుని, గురువుకు నమస్కరించి బాహ్యేంద్రియాలను

నిరోధించి యోగంలో స్థిరంగా ఉండాలి. ఆ తరువాత హృదయకమలంలో ఉన్న అవాఙ్మానస గోచరుడు, ఇంద్రియాలకు అతీతుడు, శాంతుడు, అవ్యయుడు, ఆదిమధ్యాంత రహితుడు, కల్యాణ స్వరూపుడు అయిన పరమాత్మను ధ్యానం చేసినట్లైతే అర్హత గలవాడు సంసారబంధనాలనుండి విముక్తి పొందుతాడు. మునీశ్వరులందరూ అద్వితీయుడు, అవ్యయుడు, ఆదిమధ్యాంతరహితుడు, నిరాకారుడు, సర్వవ్యాపకుడు, సచ్చిదానంద రూపుడు, ప్రశాంతుడు, సర్వానికీ సాక్షీ భూతుడు అయిన పరమేశ్వరుణ్ణి ధ్యానిస్తారు. అతడే బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు, సమస్త దేవతా స్వరూపుడు, నాశరహితుడు. అతడే విష్ణువు, హిరణ్య గర్భుడు, కాలము, అగ్ని, చంద్రుడు అన్నీ అతడే. ఈ రకంగా సర్వదేవతా స్వరూపుడు అతడే. భూతభవిష్యద్వర్తమానాలలో ఉన్నవాడు, సనాతనుడు అయిన బ్రహ్మను అనుభవంలోకి తెచ్చుకున్న వాడు మృత్యువును జయిస్తాడు. ఈ రకంగా ఆత్మ, పరమాత్మ రెండూ ఒక్కటే అనే అనుభవం ఒక్కటే మోక్షానికి మార్గం.

అన్నిటినీ సమభావంతో చూసే యోగీశ్వరుడు సమస్త భూతాలలోనూ తన ఆత్మనే చూడగలుగుతాడు. తన ఆత్మలోనే సమస్తాన్ని చూడగలుగుతాడు. ఆత్మను క్రింద ఉండే అరణిగాను, ప్రణవాన్ని పైన ఉండే అరణి గాను చేసుకొని నిరంతరము ధ్యానమనే అభ్యాసం వలన కలిగిన తత్త్వజ్ఞానం ద్వారా పండితుడైనవాడు పాపాలను దహించి వేస్తాడు.

అజ్ఞాని దేహాన్నే ఆత్మగా భావిస్తాడు. స్త్రీ సుఖము, అన్న పానాదులచేత ఇంద్రియాలను తృప్తిపరుస్తూ అదే సుఖము అనుకుంటాడు.

మాయా కల్పిత సంసారంలో జీవుడే భోక్త. సుఖదుఃఖాలను అతడే అనుభవిస్తాడు. అజ్ఞానాంధకారంలో ఉన్న జీవుడు గాఢనిద్రలో ఆత్మలో లీనమై అవిద్యచేత ఆచ్ఛాదించబడిన స్వరూప సుఖాన్ని అనుభవిస్తాడు. సుషుప్తిలో నిద్రపోతున్న జీవుడు జన్మాంతరకర్మ సంబంధంచే తాను చేసిన కర్మఫలాన్ని అనుభవించటానికి మళ్ళీ మేల్కొంటాడు. ఈ రకంగా జాగ్రస్వప్న సుషుప్తులలో క్రీడిస్తూ ఉంటాడు. అతని వల్లనే ఈ జగత్తు సృష్టించబడుతోంది. ఎవనిలో స్థూలసూక్ష్మ కారణ శరీరాలు, అవస్థాత్రయము, వీటికి అభిమాని అయిన జీవుడు లయమై పోతారో, అటువంటి పరమాత్మయే ఈ విశ్వానికి మూలకారకుడు, అఖండ జ్ఞాన స్వరూపుడు.

ఆ పరమాత్మ వల్లనే ప్రాణము, మనస్సు, ఇంద్రియాలు, ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి అన్నీ పుడుతున్నాయి.

ఏ పరబ్రహ్మ అందరికీ ఆత్మ స్వరూపుడైనాడో, ఏ పరమాత్మ ఈ సృష్టికి ఆధారమైనాడో, ఏమహత్తత్త్వానికి నిత్యము సత్యము అయి ఉన్నదో, ఆ మహత్తత్త్వానివి నీవే. అవస్థాత్రయాన్ని

ప్రకాశింపచేస్తూ, వాటికి సాక్షీ భూతుడైన పరబ్రహ్మను నేనే అని తెలుసుకున్న వాడు సమస్త బంధనాలనుండి విముక్తి పొందుతాడు.

సచ్చిదానంద రూపుడను, పరమాత్మను అయిన నానుండే ఈ జగత్తు అంతా ఉద్భవించింది. నాలోనే అన్నీ ఉన్నాయి. అన్నీ నాలోనే లయమవుతున్నాయి. అద్వితీయుడైన పరబ్రహ్మను నేనే. సూక్ష్మాతి సూక్ష్మమైనవాడను నేనే. మహత్తరమైన దానికన్న మహత్తరమైనవాడను నేనే. పురాతనుడను నేనే. ఈ విశ్వానికి కారకుడను, హిరణ్మయ స్వరూపుడను, కల్యాణ స్వరూపుడను నేనే.

అవయవాలు లేని వాడను, ఊహకుకూడా అందని శక్తి స్వరూపుడను. కళ్ళు లేక పోయినా చూడగలను. చెవులు లేకపోయినా వినగలను. నేను అద్వితీయుణ్ణి. నాకు సాటి అయినవారు లేరు. నేను అనంగుడనైనా అందరినీ ఎరుగుదును. కాని నన్ను గుర్తించగలవారు లేరు. వేదాలలో తెలుసుకో తగ్గవాడను నేను. వేదాంతానికి కర్తను. వేదవేత్తను నేనే. నాకు పుణ్యాపాపాలు లేవు. జనన మరణాలు లేవు, దేహము, ఇంద్రియాలు, బుద్ధులు లేవు. పంచభూతాలు నాచేతనే నిర్మించబడ్డాయి. అంతేగాని పంచభూతాలతో నేను నిర్మించబడలేదు. నన్ను తెలుసుకున్న జీవులు బంధ విముక్తులౌతారు.

ఈ ప్రపంచంతో సంబంధం లేనట్టి, ఈ ప్రపంచానికి సాక్షిఅయినటువంటి, పరమాత్మ స్వరూపమైన, వేదాలలో ప్రతిపాదించబడిన తత్త్వాన్ని తెలుసుకున్నవాడు అగ్నిలాగా పరిశుద్ధుడౌతాడు. ఆత్మలాగా పవిత్రుడౌతాడు, సురాపానం, బ్రహ్మహత్య, సువర్ణాపహరణం మొదలైన వాటివల్ల కలిగే పాపాలనుండి విముక్తుడౌతాడు. ఆత్మజ్ఞానం పొందటం వల్ల ఆశ్రమ ధర్మాలు అతిక్రమించిన పాపం కుడా నశిస్తుంది. ఈ విధంగా ఆత్మ స్వరూపుడైన పరమాత్మతో అపరోక్షానుభూతి పొంది అర్హుడైనవాడు మోక్షాన్ని పొందుతాడు.

కాబట్టి ఓ అశ్వలాయన మహర్షీ ! జీవాత్మా, పరమాత్మ రెండు ఒక్కటే. ఆ పరబ్రహ్మ హృదయ కమలంలోనే ఉన్నాడు. సత్యశీలురై, నియమ నిష్ఠలతో కర్మలనాచరించిన జ్ఞానులు మాత్రమే అతణ్ణి దర్శించగలరు. చరాచర జగత్తు పరమేశ్వర మయమని, ఆపరమేశ్వరుడు తనలోనే ఉన్నాడని, తానే పరమేశ్వర స్వరూపుణ్ణని, పరమేశ్వరునికి తనకూ భేదం లేదని తెలుసుకున్న జ్ఞానియే పరమేశ్వరస్వరూపుడై బ్రహ్మలోకం పొంది, కల్పాంతం వరకు బ్రహ్మలోకంలో ఉండి తరువాత పరబ్రహ్మలో లీనమైపోతాడు.

ఈ విధంగా పరబ్రహ్మను గురించి, సాధకుని కైవల్యప్రాప్తి గురించి శిష్యులకు వివరించి కైవల్యోపనిషత్తును కూడా పూర్తి చేశాడు రత్నాకరుడు.

# 66. ఫలశ్రుతి

శిష్యులరా ! ఇప్పటి వరకూ మీకు 'కైవల్యోపనిషత్తు'తో సహా పదకొండు ఉపనిషత్తులను పూర్తిగా వివరించాను. అయితే ఈ విషయాలు తెలుసుకోవటం వల్ల ఫలితము ఏమిటో కూడా చెబుతాను వినండి'', అంటూ ప్రారంభించాడు రత్నాకరుడు.

మోక్షమనేది యోగం వల్ల సిద్ధించదు. సుఖం వల్ల సిద్ధించదు. కర్మవల్ల, విద్యవల్ల, ధనంవల్ల సిద్ధించదు. బ్రహ్మ ఒక్కటే అనే జ్ఞానంవల్ల మాత్రమే మోక్షం సిద్ధిస్తుంది. పరతత్త్వాన్ని తెలుసుకోలేనప్పుడు శాస్త్రాలను చదవటం, చర్చలు చేయటం వ్యర్థం. దాని వల్ల ఏమాత్రం ఫలితం ఉండదు. పరతత్త్వం గనక అర్థమయినట్లైతే, శాస్త్రాధ్యయనం నిరర్థకం. అజ్ఞానమనే సర్పంవల్ల కాటు వేయబడిన వాడికి బ్రహ్మ జ్ఞానమే ఔషధం. అంతేకాని వేదాలు, శాస్త్రాలు, మంత్రాలవల్ల ఏమీ ప్రయోజనముండదు.

మందు త్రాగితేనే రోగం తగ్గుతుంది. అంతేకాని మందుపేరును వందసార్లు చెప్పినప్పటికీ ఉపయోగం ఉండదు. అలాగే అపరోక్షానుభవంవల్ల మోక్షమొస్తుంది కాని 'బ్రహ్మ'మనే పదాన్ని పదేపదే ఉచ్చరించటం వల్ల మాత్రంరాదు. కనిపించే ప్రపంచాన్నంతటినీ మన దృష్టిలో నుంచి తుడిచివేసి ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవాలి. అంతేకాని కేవలం జపతపాలవల్ల, దానధర్మాల వల్ల, అర్చనలవల్ల మోక్షం లభించదు.

రాజు కావాలంటే శత్రుసంహారం చెయ్యాలి. అంతేకాని ఊరికే కూర్చుని నేను రాజును' అనుకుంటే రాజుకాలేడు. ముందుగా ఆత్మ స్వరూపాన్ని గురించి తెలుసుకోవాలి. అది తెలుసుకున్నవాడు బంధనాలన్నీ తెంచుకుని కైవల్యము పొందుతాడు.

ఆత్మసమస్తాన్ని చూస్తూ ఉంటుంది. కాని దానిని ఎవరూ చూడలేరు. అన్ని విషయాలను వింటూనే ఉంటుంది. కాని దానిని ఎవరూ గ్రహించలేరు. అంతెందుకు? ఈ జగత్తునంతటినీ ఆత్మే సృష్టిస్తోంది. కాని ఆత్మ మాత్రం సృష్టించబడటం లేదు.

ఆత్మ యొక్క సన్నిధి మాత్రం చేతనే దేహం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధీ, ఇవన్నీ విషయాలలో ప్రవృత్తమౌతున్నాయి.

ఆత్మకు చావు పుట్టుకలు లేవు. హెచ్చు తగ్గులులేవు. అది ఏ విధమైన మార్పులకూ లోనుకాదు. అది నిత్యమైనది. శాశ్వతమైనది. శరీరం నాశనమయిపోయినా ఆత్మమాత్రం నాశనం కాదు.

దేనిద్వారా సర్వమూ అనుభవించబడుతున్నాయో ? ఏది తానుగా అనుభవించ బడుతోందో ? అటువంటి అన్నిటికీ సాక్షి ఆత్మ. ఈ ఆత్మ తనంతటతానే అనుభవింపబడుతోంది. కాబట్టి తనకు తానే సాక్షి.

అయితే పరబ్రహ్మ, ఆత్మ రెండూ వేరుకాదు. ఈ రెండూఒక్కటే అనేదే భవబంధాలనుండి విముక్తిని పొందటానికి మార్గం. ఈ విషయం తెలిసినవాడే మోక్షం పొందుతాడు. బ్రహ్మను గురించి తెలుసుకున్న వాడు మళ్ళీ సంసార చక్రంలో పడడు. బ్రహ్మ సత్యము, జ్ఞానము, అనంత స్వరూపము కలది. అది విశుద్ధము, పరము, స్వతఃసిద్ధము, నిత్యము అయి ఉన్నది.

ఆత్మకన్న వేరైన వస్తువేదీ లేదు. జీవాత్మ, పరమాత్మ రెండూ ఒక్కటే. అలాకాదని, అనేక మంది బ్రహ్మలున్నారనుకునేవాడు జనన మరణాలతోకూడిన సంసార చక్రంలో పడి తిరుగుతుంటాడు. ముముక్షువైనవాడు వాసనాత్యాగం చెయ్యాలి. నేను కర్తను, నేను భోక్తను. అనరాదు. లోక వాసనలను, శారీరక వాసనలు వదలిపెట్టి సంసారమందున్న బంధనాలను తొలగించుకోవాలి. అప్పుడు ఆత్మసాక్షాత్కారమవుతుంది.

బ్రహ్మ అంటే ఎవరు ? జాతి, నీతి, కులము, గోత్రములకు అతీతమైనది, నామము, రూపము, గుణము, దోషము లేనిది, దేశకాల వస్తువులన్నిటికన్న భిన్నమైనది. అదే బ్రహ్మ. సాధకుడే బ్రహ్మ. సత్వగుణ ప్రధానుడైన జ్ఞానికి మాత్రమే ఆత్మసాక్షాత్కారమవుతుంది. ఐహికపరమైన కోరికలతో శరీరం శుష్కింపచేసి తపస్సు చేసినంత మాత్రం చేత ఆత్మ సాక్షాత్కారం కాదు.

జనులందరూ అధ్యాత్మికమైన ఉపన్యాసాలు వింటారు. వాటిని గురించి చర్చిస్తారు. దీనివల్ల ఉపయోగం ఉండదు.

విన్న విషయాన్ని మనస్సుకు పట్టించుకోవాలి. దాన్ని గురించి తీవ్రంగా చర్చించాలి. అ తరువాత ఆచరించాలి. జగత్తులోని ప్రతివస్తువునందు బ్రహ్మను చూడగలగాలి. అంటే జగత్తులో ఉన్న అన్ని వస్తువులూ బ్రహ్మమయమని తెలుసుకోవాలి.

ఇంద్రియాలను అదుపులో పెట్టుకుని, కోర్కెలను త్యజించిన వాడే మోక్షానికి అర్హుడు. అతడే జీవన్ముక్తుడు. అతడు కుడా సామాన్యుని లాగానే మరణించినప్పటికీ అతని ప్రాణాలు ఉత్క్రమించవు. బ్రహ్మరంధ్రం గుండా బయటకుపోయి, పరబ్రహ్మలో లీనమై పోతాయి.

కాబట్టి సాధకులారా ! కేవలము ఉపనిషత్తులను వినటంవల్ల, చదవటంవల్ల ఉపయోగం లేదు. అందులోని విషయాలను మనస్సుకు పట్టించుకోవాలి. సృష్టిలోని ప్రతివస్తువును బ్రహ్మమయంగానే చూడాలి. అప్పుడే అతడికి మోక్షం సిద్ధిస్తుంది. "అంటూ ఉపనిషత్సర్వస్వాన్ని" ముగించాడు రత్నాకరుడు.

ఉపనిషత్తులను ఆసాంతము విన్న శిష్యులిద్దరూ, గురువుగారికి ప్రదక్షిణలు చేసి, పాదాభివందన మాచరించి, ఆయనను పరిపరివిధాల పూజించి, వినమ్రులై శలవు తీసుకున్నారు.

*హరితస గోత్రీకుడు, శ్రీమతి సత్యపర్వతవర్ధనమ్మ*
*శ్రీకృష్ణమూర్తిగార్ల జ్యేష్ఠపుత్రుడు అయిన*
**క్రోవి పార్థసారథి**
*సర్వజనామోదము పొందునట్లుగా సులభశైలిలో వ్రాసిన*
*"ఉపనిషత్సర్వస్వము" అను గ్రంథము సమాప్తము.*
*ఓం తత్సత్*

## మా వద్ద లభ్యమగు గ్రంథములు

| | | |
|---|---|---|
| శ్రీ విద్యాదర్శనము | శ్రీ క్రోవి పార్థసారథి | 50-00 |
| శ్రీ విద్యారహస్యము | ,, | 60-00 |
| శ్రీ విద్యాదర్పణము | ,, | 75-00 |
| (శుభగోదయ స్తుతికి తెలుగు వ్యాఖ్యతో) | ,, | |
| శ్రీ విద్యా సర్వస్వము | ,, | 75-00 |
| (కామకలా విలాసం తెలుగు వ్యాఖ్యతో) | | |
| దేవీ కథాసుధ | ,, | 60-00 |
| (దేవి మహాత్మ్యమును వివరించే కథలు) | | |
| శ్రీ విద్యాపంచదశి | ,, | |
| (పంచదశీ మహా మంత్ర వివరణ) | | |
| సారస్వత సిద్ధకుండలినీ మహాయోగము | డా॥ పి. నరసింహాచార్యులు | 35-00 |
| కుండలినీ సిద్ధ మహాయోగము | శ్రీశ్రీశ్రీ స్వామి శివోమ్ తీర్థజీ మహారాజ్ | 60-00 |
| నిత్య పూజా విధానం | శ్రీ సూక్త, పురుష సూక్త, విధానంతో 18 అష్టోత్తరములతో | 12-00 |
| శ్రీ దేవీ భాగవత మహాపురాణం | శ్రీ రాయసం వీరేశ్వరశర్మ | 210-00 |
| (వ్యాస మూలానికి తెలుగు అనువాదం) | | |
| భాగవత మహాపురాణం 2 భాగాల సెట్టు | ,, | 400-00 |
| (వ్యాస మూలానికి తెలుగు అనువాదం) | | |
| అధ్యాత్మ రామాయణము | ,, | 100-00 |
| మంత్రాత్మక సప్తశతి | శ్రీ భాగవతుల లక్ష్మీనారాయణశాస్త్రి | 30-00 |
| చండీ నవావరణ పూజాకల్పం | ,, | 25-00 |

మావద్ద అనేక సంస్థల, ఆశ్రమముల జ్యోతిష్య, వాస్తు, వేదాంత, ఆధ్యాత్మిక, పురాణ, స్మార్త, ఆయుర్వేద, సంగీత, సంప్రదాయ గ్రంథములు లభించును. V.P.P. సౌకర్యము కలదు.

**శివకామేశ్వరి గ్రంథమాల**

D.No. 41-22/4-36, భ్రమరాంబాపురం,

కృష్ణలంక, విజయవాడ - 520 013.

అన్ని రకముల కార్యక్రమములలో పంచుకొనుటకు అనువుగా 1/16 డెమ్మీ, మల్టీకలర్ టైటిల్‌తో మంచి పేపరుతో ఈ క్రింది స్తోత్రములు కలవు.

| | |
|---|---|
| శ్రీ లక్ష్మీ స్తోత్రములు | 6-00 |
| శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము (పారాయణ ప్రతి) | 6-00 |
| శ్రీ లలితా సహస్రనామ స్తోత్రము (పారాయణ ప్రతి) | 6-00 |
| పూర్వపీఠిక, ఉత్తర పీఠిక, ఖడ్గమాల, త్రిశతి స్తోత్ర సహితము | |
| శ్రీ శివ స్తోత్రములు | 6-00 |
| శ్రీ వేంకటేశ్వర స్తోత్రములు | 6-00 |
| శ్రీ సుబ్రహ్మణ్య స్తోత్రములు | 7-00 |
| శ్రీ లక్ష్మీనారాయణ కవచం, హృదయం | 6-00 |
| శ్రీ ఆంజనేయ స్తోత్రములు | 7-00 |
| శ్రీ లక్ష్మీనృశింహ స్తోత్రములు | 6-00 |
| శ్రీ దుర్గా స్తోత్రములు | 6-00 |
| శ్రీ దేవీ స్తోత్రములు | 6-00 |
| స్తోత్ర రత్నములు | 6-00 |
| శ్రీ వరలక్ష్మీ వ్రత కల్పము | 5-00 |
| శ్రీ వినాయక వ్రత కల్పము | 5-00 |
| శ్రీ దేవీ నవరాత్రి పూజా విధానము (శ్రీ సూక్తముతో) | 8-00 |
| శ్రీ గౌరీ పూజా విధానము (ఉండ్రాళ్ళ తద్దె, అట్లతద్దె, వ్రత విధానములతో) | 6-00 |
| గోపూజా విధానము | 6-00 |

| | | | |
|---|---|---|---|
| శ్రీ లలితా సహస్రనామ స్తోత్రము | 3-00 | శ్రీ రామరక్షా స్తోత్రము | 2-00 |
| శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము | 4-00 | ఆపదుద్ధారక స్తోత్రము | 2-00 |
| బిల్వాష్టోత్తర శతనామస్తోత్రము | 3-00 | శ్రీ వేంకటేశ్వర గోవిందనామాలు | 2-00 |
| శ్రీ హనుమాన్ చాలీసా | 2-00 | కనకధారా, మహిషాసురమర్ధనీ స్తోత్రములు | 3-00 |
| శ్రీ రామదూతం శిరసా నమామి | 3-00 | శ్రీ సాయి స్తుతిః | 3-00 |

నిత్యపూజా విధానం (శ్రీ సూక్త, పురుష సూక్త విధానముతో)
18 అష్టోత్తరములు, ప్రత్యేక శివ పూజతో 12-00



13-12-1999న శ్రీవిద్యా మహాయజ్ఞము ముగింపుసభ మరియు
శ్రీవిద్యా హృదయము, శ్రీవిద్యా పంచదశి, శ్రీవిద్యా మహాయంత్రము గ్రంథముల
ఆవిష్కరణ సందర్భమున శ్రీ క్రోవి పార్థసారథిగార్కి జరిగిన కనకాభిషేక మహోత్సవం